

మార్గదర్శకులు
రూ॥ 120/-
పేజీలు: 130
ప్రతులకు:
నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ(నాగోల్),
హైదరాబాద్-68, ఫోన్: 29884454/53
Email ID: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
అబిడ్స్, బండ్లగూడ,
హిమాయత్‌నగర్ (హైదరాబాద్)
హన్మకొండ.



www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★



తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు సుగుణ మృతి

ఖమేనీ ఎక్కడున్నాడో తెలుసు కానీ ప్రస్తుతానికి చంపం : ట్రంప్

లోపలి పేజీల్లో


సంపుటి 08, సంచిక: 198 | బుధవారం | 18 -06-2025 | మహబూబ్‌నగర్ Published from: Mahabubnagar, Hyderabad, Khammam, Karimnagar పేజీలు: 12+8 | వెల రూ. 5.00



03

ఆగస్టు 15 నాటికి న్యాయబద్ధమైన దరఖాస్తులన్నీ పరిష్కారం

- మంత్రి పొంగులేటి


03

ఇన్సూరెన్స్ కంపెనీలకు.. ప్రతిపాదన ఉపసంహరించుకోవాల్సిందే

- తెలంగాణ బిల్డింగ్ అండ్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ భారీ ధర్నా


12

బనకచర్లతో ఎగువ రాష్ట్రాలకు నష్టం లేదు

- ఏపి జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు




నరమేధం ఆపాలి

# మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలి

- రాజకీయ పార్టీలు, పౌరహక్కులు, ప్రజాసంఘాల నేతలు ముక్తకంఠంతో డిమాండ్
- కేంద్ర ప్రభుత్వం దిగివచ్చేంతవరకు ఉధృత ఉద్యమాలు
- ఇండియా కూటమి ఆధ్వర్యంలో ఢిల్లీలో మహాధర్నా నిర్వహించాలని పలువురు ప్రతిపాదన

## పార్లమెంటులో లేవనెత్తుతాం : కాంగ్రెస్

ప్రజాపక్షం/హైదరాబాద్

'ఆపరేషన్ కగార్' పేరుతో మధ్య భారతంలో కొనసాగిస్తున్న మానవ హననాన్ని తక్షణమే నిలిపివేసి, మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలని, రాజకీయ పార్టీల నాయకులు, పౌర హక్కులు, ప్రజా సంఘాల నేతలు ముక్తకంఠంతో కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం దిగివచ్చేంత వరకూ ఉద్యమాలను మరింత ఉధృతం చేయడంతో పాటు ఇండియా కూటమి ఆధ్వర్యంలో ఢిల్లీలో మహాధర్నా నిర్వహించాలని పలువురు అభిప్రాయం వ్యక్తం చేశారు. కేంద్రంలోని నరేంద్ర మోదీ నేతృత్వంలోని ఎన్‌డిఎ ప్రభుత్వం తక్షణమే కాల్పుల విరమణ ప్రకటించి, మావోయిస్టు పార్టీతో బేషరతుగా శాంతి చర్చలు జరపాలని డిమాండ్ చేస్తూ, 'శాంతి చర్చల కమిటీ' ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్, ధర్నా చౌక్ వద్ద మంగళవారం మహా ధర్నా నిర్వహించారు. శాంతి చర్చల కమిటీ అధ్యక్షులు జస్టిస్ బి.చంద్రకుమార్, ఉపాధ్యక్షులు ప్రొఫెసర్ జి. హరగోపాల్, కందిమళ్ళ ప్రతాపరెడ్డి అధ్యక్షవర్గంగా వ్యవహరించారు. ఆపరేషన్ 'కగార్' పేరుతో దండకారణ్యంలో కేంద్ర ప్రభుత్వం కొనసాగిస్తున్న హత్యాకాండను తక్షణమే నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ మహాధర్నా తీర్మానం చేసింది.

మహా ధర్నాలో సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి, పశ్యపద్మ, సిపిఐ ఎంఎల్‌సి నెల్లికంటి సత్యం, కాంగ్రెస్ ఎంపి అనిల్ కుమార్ యాదవ్, సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ కేంద్ర కమిటీ సభ్యులు వేములపల్లి వెంకట్రామయ్య, సిపిఐ (ఎంఎల్) మాస్ లైన్ రాష్ట్ర నాయకులు

తరువాయి 2లో



# ఇజ్రాయెల్‌తో భారత్ తెగదెంపులు చేసుకోవాలి

- ఢిల్లీలో పాలస్తీనా సంఘీభావ ప్రదర్శనలో వామపక్షాల డిమాండ్

**న్యూఢిల్లీ:** ఇజ్రాయెల్ దురాక్రమణకు, సామూహిక హత్యాకాండకు వ్యతిరేకంగా పోరాడుతున్న పాలస్తీనా ప్రజలకు సంఘీభావం ప్రకటిస్తూ ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద వామపక్షాలు మంగళవారంనాడు ప్రదర్శన జరిపాయి. దాడులు చేస్తూ అక్కడి ప్రజలను అమానుష హింసకు గురిచేస్తున్న ఇజ్రాయెల్ చర్యలను వ్యతిరేకిస్తూ నిరసన ప్రదర్శన జరిపారు. భారత కమ్యూనిస్టుపార్టీ (సిపిఐ), సిపిఐ(ఎం), సిపిఐ(ఎంఎల్), ఫార్వర్డ్ బ్లాక్, ఆర్ ఎస్ పి, సిజిపిఐ పక్షాలన్నీ ఈ సంఘీభావ ప్రదర్శనలో పాల్గొన్నాయి. సిపిఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా, సిపిఐ(ఎం) ప్రధాన కార్యదర్శి ఎం.ఎ. బేబీ, సిపిఐ (ఎంఎల్) లిబరేషన్ ప్రధాన కార్యదర్శి దీపాంకర్ భట్టాచార్య తదితర వామపక్ష అగ్రనేతలందరూ ప్రదర్శనను ఉద్దేశించి ప్రసంగించారు. గాజాలో 620 రోజులుగా ఇజ్రాయెల్ కొనసాగిస్తున్న మారణకాండను బేషరతుగా నిలిపివేయాలని కోరుతూ ఐక్యరాజ్యసమితి ఇటీవల ఆమోదించిన తీర్మానానికి భారత ప్రభుత్వం దూరంగా ఉండిపోవడాన్ని, ఈ సమస్యపై మౌనం పాటించడాన్ని ప్రదర్శకులు నిర్ద్వంద్వంగా ఖండించారు. ఇజ్రాయెల్‌తో భారత్‌కు ఉన్న అన్నిరకాల సైనిక, వ్యూహాత్మక సంబంధాలను తక్షణం తెగతెంపులు చేసుకోవాలని ప్రదర్శనలో ప్రసంగించిన నాయకులు ముక్తకంఠంతో కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వామపక్షాలు

తరువాయి 12లో



# గో సంరక్షణకు సమగ్ర విధానం

- వివిధ రాష్ట్రాల్లోని విధానాల అధ్యయనానికి ముగ్గురు అధికారులతో కమిటీ
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశం
- గోశాలల్లో గోవుల మృత్యువాతపై ఆవేదన
- గోవుల సంరక్షణపై సమీక్ష

ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్రంలో గో సంరక్షణకు సమగ్ర విధానం రూపొందించాలని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. ఇందుకోసం వివిధ రాష్ట్రాల్లోని విధానాల అధ్యయనానికి ముగ్గురు అధికారులతో ఒక కమిటీని సిఎం నియమించారు. ఈ విషయంలో రాష్ట్ర పశు సంవర్ధక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సబ్యసాచి ఘోష్, దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజా రామయ్యర్, వ్యవసాయ శాఖ కార్యదర్శి రఘునందన్‌రావుతో కూడిన కమిటీ లోతైన అధ్యయనం చేయాలని సిఎం ఆదేశించారు. రాష్ట్రంలో గో సంరక్షణపై సిఎం రేవంత్ రెడ్డి మంగళవారం సాయంత్రం తన నివాసంలో సమీక్ష నిర్వహించారు. మన సంస్కృతిలో గోవులకు ఉన్న ప్రాధాన్యం, భక్తుల మనోభావాలను దృష్టిలో ఉంచుకోవడంతో పాటు గోవుల సంరక్షణే ప్రధానంగా విధానాల రూపకల్పన ఉండాలని సిఎం ఈ సందర్భంగా అభిప్రాయపడ్డారు. భక్తులు గోశాలలకు పెద్ద సంఖ్యలో గోవులు దానం చేస్తున్నారని, స్థలాభావం, ఇతర సమస్యలతో అవి తరచూ మృత్యువాత పడుతున్నాయని సిఎం ఆవేదన వ్యక్తం చేశారు. ఆ పరిస్థితులను

తరువాయి 2లో



# రెప్ప పాటు కూడా కరెంటు కోతల్లేవ్

- రాష్ట్రంలో విద్యుత్‌కు ఎంత ఖర్చైనా వెచ్చించేందుకు ప్రభుత్వం సిద్ధం
- అభివృద్ధి, సంక్షేమంలో జోడెద్దుల్లా దూసుకెళ్తుంది
- సబ్‌స్టేషన్ ప్రారంభోత్సవంలో ఉపముఖ్యమంత్రి భట్టి

ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి

రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం రెండు జోడెద్దుల్లా ప్రజా ప్రభుత్వం ముందుకు పోతుందని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. మంగళవారం రాష్ట్ర పరిశ్రమలు, ఐటి శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, డీసీసీ అధ్యక్షుడు, ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ అయిత ప్రకాష్ రెడ్డి, వరంగల్ ఎంపి డాక్టర్ కడియం కావ్య, భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావుతో కలిసి కొత్తపల్లిగోరి మండలం చెన్నాపూర్ గ్రామంలో నూతనంగా రూ.140 లక్షలతో నిర్మించిన సబ్ స్టేషన్ ను ప్రారంభించారు. అనంతరం మోరంచపల్లి నుండి మంజూరునగర్ వరకు పెద్ద సంఖ్యలో ద్విచక్ర వాహనాల ర్యాలీ నిర్వహించారు. అనంతరం మంజూరునగర్లో నవాబుపేట, ధర్మారావుపేట, మంజూరునగర్ గ్రామాల్లో నూతనంగా నిర్మించనున్న 33/11 కేవీ విద్యుత్ ఉపకేంద్రాలకు శంకుస్థాపనలు చేశారు. అనంతరం

తరువాయి 2లో




మూడు ఎకరాల వరకు

## రైతు భరోసా జమ

ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్ర వ్యాప్తంగా రెండవ దశ రైతు భరోసా నిధులను రాష్ట్ర ప్రభుత్వం రైతు ఖాతాల్లో మంగళవారం జమా చేసింది. 3 ఎకరాల వరకు ఉన్న రైతులందరి వారి వారి బ్యాంక్ ఖాతాలలోకి ఎకరానికి రూ.6 వేల చొప్పున రైతు భరోసా నిధులను జమ చేసినట్టు రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు తెలిపారు. 10.45 లక్షల మంది రైతులకు సంబంధించిన 25.86 లక్షల ఎకరాలకుగాను రూ.1551.89 కోట్లను జమ చేశామని వెల్లడించారు. ఎకరాలతో సంబంధం లేకుండా మిగిలిన వారందరికీ రైతు భరోసా నిధులు జమ చేయనున్నట్లు ఆయన చెప్పారు.

# బనకచర్లకు సిడబ్ల్యుసి అనుమతులివ్వకుండా కార్యాచరణ రూపొందిస్తాం

- రాష్ట్ర నీటిపారుదల శాఖమంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ప్రకటన
- నేడు ప్రాజెక్టుపై లోక్‌సభ, రాజ్యసభ సభ్యులతో ప్రత్యేక సమావేశం
- కేంద్రమంత్రులు బండి సంజయ్, కిషన్‌రెడ్డిలకు స్వయంగా ఆహ్వానం

ప్రజాపక్షం/హైదరాబాద్

'గోదావరి–బనకచర్ల ప్రాజెక్టు'పై రాష్ట్రానికి చెందిన లోకసభ, రాజ్యసభ సభ్యులతో ప్రత్యేక సమావేశాన్ని బుధవారం సాయంత్రం 4 గంటలకు రాష్ట్ర సచివాలయంలో ఏర్పాటు చేసినట్లు రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్‌కుమార్ రెడ్డి తెలిపారు. ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి పాల్గొననున్న ఈ సమావేశానికి కేంద్ర మంత్రులు జి.కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌లను అహ్వానించినట్లు ఆయన తెలిపారు. గోదావరి–బనకచర్ల ప్రాజెక్టును మరింత గట్టిగా ప్రతిఘటించడంతో పాటు కేంద్ర జలసంఘం (సిడబ్ల్యుసి) అనుమతులు ఇవ్వకుండా ఒత్తిడి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కార్యాచరణ పథకాన్ని రూపొందిస్తోందని మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి తెలిపారు. ఈ మేరకు ఆయన మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రత్యేక సమావేశానికి కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌లకు స్వయంగా



తరువాయి 2లో

# 650 మంది కాంగ్రెస్ నేతల ఫోన్లు ట్యాప్

- గత బిఆర్‌ఎస్ ప్రభుత్వంపై టిపిసిసి చీఫ్ మహేశ్‌కుమార్ మండిపాటు
- దోషులకు కఠిన శిక్షలు పడాల్సిందేనని డిమాండ్
- 15 మంది బాధితులను విచారించిన సిట్
- వాంగ్మూలాల స్వీకరణ

ప్రజాపక్షం/హైదరాబాద్:ఫోన్ ట్యాపింగ్ కేసు విచారణ జోరుగా నడుస్తోంది. ఏడాది కాలం నుంచి ఎక్కడవేసిన గొంగడి అక్కడే అన్నట్లుగా ఉన్న విచారణ వారం రోజుల నుంచి ఎడతెరిపిలేకుండా సాగుతుంది. నిందితులు కేసు నుంచి తప్పించుకోకుండా ఉండేందుకు పక్కా సాక్ష్యాలను సిట్ అధికారులు సేకరించే పనిలో పడ్డారు.ఈ క్రమంలోనే సిట్ అధికారులు మంగళవారం 15 మంది బాధితుల నుంచి వాంగ్మూలం స్వీకరించారు. సాక్షులుగా వాంగ్మూలం ఇచ్చిన బాధితుల్లో టిపిసిసి చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్, ఎంపి అనిల్‌కుమార్ యాదవ్, గద్వాల జడ్పి మాజీ చైర్‌పర్సన్, నియోజక వర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి సరితల కూడా ఉన్నారు. గాంధీభవన్‌లోని కొంత మంది స్టాఫ్ నుంచి కూడా సాక్ష్యాలను స్వీకరించే అవకాశాలు ఉన్నాయి. సిట్ విచారణ అనంతరం మహేష్‌కుమార్‌గౌడ్ మీడియాతో మాట్లాడుతూ..గత బిఆర్‌ఎస్ ప్రభుత్వం కాంగ్రెస్ పార్టీకి చెందిన 650 మంది నేతల ఫోన్‌లను ట్యాపింగ్ చేశారని ఆరోపించారు. తమ ఫోన్లను ట్యాప్ చేసిందనే అనుమానంతోనే అప్పటి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి ఫిర్యాదు చేశామని ఆయన వెల్లడించారు. గత ప్రభుత్వ హయాంలో టెలిగ్రాఫ్ చట్టాన్ని



తరువాయి 2లో

# నిలువు దోపిడీ

- ప్రైవేటు స్కూళ్ల ఇష్టారాజ్యం
- భారీగా అడ్మిషన్ ఫీజులు
- అధిక ధరలకు మెటీరియల్
- అర్హత లేని ఉపాధ్యాయులు

ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం

విద్యా సంవత్సరం ప్రారంభమైందంటే చాలు తల్లిదండ్రుల గుండెల్లో గుబులే. తమ పిల్లలను ప్రైవేటు బడుల్లో చదివించాలనుకునే వారిని ఫీజులు భయపెడుతున్నాయి. దానికి తోడు మెటీరియల్ పుస్తకాలు, యూనిఫాం, బ్యాగులు, నోటు బుక్స్ ఇలా ప్రతీదీ ఆ స్కూల్లోనే తీసుకోవాల్సి వస్తోంది. బడిలో చేరింది మొదలుకుని ఏడాది పూర్తయ్యే వరకు ఆ ఫీజులు, ఈ మెటీరియల్, ఎగ్జామ్ ఫీజ్ అదనం అంటూ యాజమాన్యాలు అందిన కాడికి దండుకుంటున్నాయి. ప్రైవేటు స్కూళ్ల ఇష్టారాజ్యంతో విద్యావ్యాపారం హెచ్చుమీరుతోంది. నియంత్రించాల్సిన అధికారులు ఏడాదికోసారి రెన్యూవల్స్ పేరిట ముడుపులు పుచ్చుకోవడంతో పాటు విద్యాహక్కు చట్టం అమలును కూడా పక్కకు పెడుతున్నట్లు తెలుస్తోంది. సామాన్యుల పిల్లలు ప్రైవేటు స్కూళ్లలో చదివే పరిస్థితి లేదు. విద్య

తరువాయి 12లో



# కాల్పుల విరమణ కాదు నిజమైన ముగింపు కావాలి

- ప్రతి ఒక్కరూ టెహ్రాన్‌ను వదిలివెళ్లాలి
- సోషల్ మీడియా వేదిక 'ట్రూత్ సోషల్'లో ట్రంప్ పోస్ట్
- జి–7 దేశాల 51వ శిఖరాగ్ర సదస్సుకు హాజరైన ట్రంప్ ఒకరోజు ముందుగానే అమెరికాకు పయనం

**వాషింగ్టన్ :** ప్రతిఒక్కరూ టెహ్రాన్‌ను వదిలి వెళ్ళిపోవాలని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ మంగళవారంనాడు తన సోషల్ మీడియా వేదిక 'ట్రూత్ సోషల్'లో పోస్టింగ్ పెట్టారు. అయితే ప్రతి ఒక్కరూ ఎందుకు టెహ్రాన్‌ను వదిలివెళ్ళిపోవాలన్న ఆయన డిమాండ్‌కు సరైన కారణాన్ని మాత్రం ట్రంప్ చెప్పలేదు. ఇరాన్‌కు వ్యతిరేకంగా వెనకనుండి సహాయం చేస్తున్న అమెరికా నేరుగా యుద్ధంలో చేరుతుందన్న వదంతుల తరుణంలో ట్రంప్ ప్రకటన అనుమానాస్పదంగా మారింది. కెనడాలో జి–7 దేశాల 51వ శిఖరాగ్ర సదస్సుకు హాజరైన ట్రంప్ నిర్ణీత సమయానికి ఒకరోజు ముందుగానే సదస్సునుండి హడావుడిగా బయలుదేరి అమెరికాకు వెళ్ళిపోయారు. కెనడా నుండి తిరిగివస్తూ విమానంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ, ఇరాన్‌తో కాల్పుల విరమణకు తాను ప్రయత్నం చేయడం లేదని, యుద్ధానికి నిజమైన ముగింపు (రియల్ ఎండ్) పలికేందుకు ప్రయత్నం చేస్తున్నానని, అణు ఒప్పందానికి

తరువాయి 12లో






# ప్రపంచం
WORLD NEWS

## ఉక్రేన్‌పై రష్యా దాడులు
### తొమ్మిది అంతస్తుల భవనం ధ్వంసం : 15 మంది మృతి

**కీవ్ :** ఉక్రేన్‌పై రష్యా చేసిన డ్రోన్ల దాడిలో తొమ్మిది అంతస్తుల నివాసిత భవనం ధ్వంసమైంది. దాడుల్లో 15 మంది మరణించారు. మృతుల్లో ఒక అమెరికా పౌరుడు కూడా ఉన్నారు. మరో 116 మంది గాయపడ్డారు. మంగళవారంనాడు తెల్లవారకముందే రష్యా క్షిపణులు, డ్రోన్లు కీవ్‌పై దాడి చేశాయి. నివాసిత ప్రాంతాలపై జరిగిన ఈ దాడుల్లో ఉక్రేన్ ప్రజలు నిద్రలోనే మరణించారు. నగరంలో అనేకచోట్ల భారీ పేలుళ్ళు సంభవించాయని, అనేకమంది మరణించారని కీవ్ సిటీ మిలిటరీ పాలనాధిపతి తైమూర్ తకచెంకో చెప్పారు. రాజధాని నగరంపై రష్యా చేసిన అతి దారుణమైన దాడుల్లో ఇది కూడా ఒకటి అని ఆయన చెప్పారు. ఉక్రేన్ అధ్యక్షుడు జెలెన్స్కీ ఈ దాడులను తీవ్రంగా ఖండించారు. రష్యా 32 క్షిపణులను, 440 డ్రోన్లను తమ రాజధాని నగరంపై ప్రయోగించిందని, ఇది అతితీవ్రమైన విధ్వంసకరమైన దాడి అని జెలెన్స్కీ అన్నారు. దాదాపు తొమ్మిది గంటలపాటు ఈ దాడులు కొనసాగాయి. కెనడాలో జి–7 సదస్సులో పాల్గొనేందుకు ఆయన వెళ్ళాల్సి ఉంది. మంగళవారంనాడు కూడా ఈ సదస్సు జరుగుతుంది. మొత్తం 27 ప్రాంతాలపై కీవ్‌లో రష్యా దాడులు చేసిందని చెప్పారు.

# ఇరాన్ కొత్త ఆర్మీచీఫ్‌ను చంపిన ఇజ్రాయెల్

**టెల్‌అవీవ్ :** ఇరాన్–ఇజ్రాయెల్ మధ్య ఐదో రోజు యుద్ధంలో వ్యూహాత్మక ప్రదేశాలపై పరస్పర సైన్యాలు దాడులు చేసుకున్నాయి. ఐదు రోజుల యుద్ధంలో ఇరాన్ 550 ఇజ్రాయెల్ లక్ష్యాలపై దాడులు చేసింది. కానీ మంగళవారంనాడు యుద్ధంలో పైచేయి సాధించినట్లు ఇజ్రాయెల్ ప్రకటించుకుంది. ఇరాన్ సర్వాధినేత ఆయొతుల్లా అలీ ఖమేనీకి అత్యంత ఆప్తుడైన, ఇరాన్ టాప్ కమాండర్ కొత్త ఆర్మీ ఛీఫ్ జనరల్ అలీ షాద్మానీని దాడుల్లో హతమార్చినట్లు ఇజ్రాయెల్ చెప్పింది. గడచిన శుక్రవారం జూన్ 13వ తేదీన ఇజ్రాయెల్ మొదటిరోజు మెరుపు దాడులు చేసినప్పుడు ముగ్గురు అత్యున్నతస్థాయి ఇరాన్ ఆర్మీ కమాండర్లతోపాటు తొమ్మిదిమంది అణుశాస్త్రవేత్తలు మరణించారు. ఆ తర్వాత ఖమేనీ కొత్త జనరల్‌గా అలీ షాద్మానీని నియమించారు. తాజా దాడుల్లో షాద్మానీని కూడా హతమార్చినట్లు ఐడిఎఫ్ ప్రకటించింది. ఖతమ్ ల్–అన్బియా సెంట్రల్ హెడ్‌క్వార్టర్స్‌లో ఐఆర్‌జిసి అధిపతిగా షాద్మానీని ఇటీవల బాధ్యతీసుకున్నారు. ఐతే షాద్మానీ మరణాన్ని ఇరాన్ ఇంకా ధృవీకరించలేదు. ఇరాన్ పారామిలిటరీ రివల్యూషనరీలో షాద్మానీ ఒక సైనిక జన



రల్. సెంట్రల్ టెహ్రాన్‌లో చేసిన దాడుల్లో ఆయన మరణించినట్లు ఐడిఎఫ్ ప్రకటించింది. చొచ్చుకువెళుతున్న ఇజ్రాయెలీ క్షిపణులు 2,300 కి.మీ ఇరాన్‌లో లోపలికి వెళ్ళాయని, దీనితో ఆయొతుల్లా అలీ ఖమేనీ రహస్య బంకరులో దాక్కున్నారని ఐడిఎఫ్ ప్రకటించింది. ఐఆర్‌జిసి (ఇరాన్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్) ఇంటిలిజెన్స్ చీఫ్‌తోపాటు మరో నలుగురు ఇంటిలిజెన్స్ అధికారులను కూడా ఇజ్రాయెల్ సోమవారంనాడు దాడుల్లో చంపింది. ఇరాన్ బ్యాంకింగ్ వ్యవస్థపై కూడా సైబర్ దాడులు చేసింది. తొలుత ఇరాన్ ప్రభుత్వ టీవీ ప్రధాన కేంద్రంపై కూడా దాడి చేసింది. ఇదిలా ఉండగా ఇజ్రాయెల్‌ను అదుపు చేయకపోతే మరింత దారుణమైన పరిణామాలను చవిచూడాల్సి వస్తుందని అమెరికాకు ఇరాన్ అధ్యక్షుడు పెజెష్కియన్ హెచ్చరిక చేశారు. ఇజ్రాయెల్‌పై చేస్తున్న దాడులు ఆత్మరక్షణ కోసమేనని ఐక్యరాజ్యసమితిలో ఇరాన్ శాశ్వత ప్రతినిధి అమిర్ సయాద్ ఇరవని చెప్పారు. శుక్రవారం నుండీ ఇప్పటివరకూ నాలుగు రోజులుగా ఇజ్రాయెల్ చేసిన దాడుల్లో 224 మంది మరణించారని, 1277 మంది గాయపడ్డారని ఇరాన్ ప్రకటించింది. మరోవైపు ఇజ్రాయెల్ ఒక ప్రకటన చేస్తూ ఇరాన్‌పై దాడులు కొనసాగిస్తున్నామని పేర్కొంది.

**45 మంది పాలస్తీనియన్లు మృతి**

ఒకవైపు ఇరాన్‌లో యుద్ధంపై అందరూ దృష్టిసారించిన తరుణంలో ఇజ్రాయెల్ గాజాలో దారుణ అమానుష చర్యలు కొనసాగిస్తోంది. మంగళవారంనాడు కూడా ఆహారంకోసం ఎదురుచూస్తున్న పాలస్తినా ప్రజలపై కాల్పులు జరిపింది. ఈ కాల్పుల్లో 45 మంది మరణించారు. ఆహార సహాయం కేంద్రం వద్ద ప్రజలు గుంపులుగా ఎదురుచూస్తున్న సమయంలో ఐడిఎఫ్ సైన్యం ప్రజలపై కాల్పులు జరిపింది. అనేకరోజులుగా ఐడిఎఫ్ ఈ విధంగా ఆహారంకోసం వెంపర్లాడుతున్న పాలస్తినా ప్రజలను కాల్చిచంపుతున్నది.

# గగనతల యుద్ధంలో ఆరితేరిన ఇజ్రాయెల్

**ఇరాన్ వద్ద చురుకైన సైనిక బలగాలు**

టెల్‌అవీవ్ : ఇరాన్‌ను చాలా సులభంగా గెలుస్తామని నేతన్యాహూ కలలు కంటున్నారు. ప్రపంచంలో అత్యంత శక్తిమంతమైన గగనతల సైనిక బలం ఇజ్రాయెల్‌కు ఉందన్నది సర్వత్రా వినిపించే విషయం. ఇజ్రాయెల్ గడచిన ఐదు రోజులుగా ఇరాన్ అణుస్థావరాలనే లక్ష్యంగా చేసుకుంది. ఇంధన కేంద్రాలను, శాస్త్రవేత్తలు లక్ష్యంగా దాడులు చేస్తోంది. తూర్పు ఇరాన్ ప్రాంతంలోని మష్హాద్ విమానాశ్రయంలో ఇంధనం నింపుకుంటున్న విమానంపై ఇజ్రాయెల్ తాజా దాడులు చేసింది. ఇజ్రాయెల్ హై–టెక్ ఆయుధాలను ఉపయోగిస్తుండగా ఇరాన్ మాత్రం ఆక్షలు అమలులో ఉన్న కారణంగా పాతకాలకు యుద్ధ ఆయుధాలను, వాహనాలనే ఉపయోగిస్తున్నది. జనాభాపరంగా చూస్తే ఇరాన్‌కు ఉన్న బలం ఇజ్రాయెల్‌కు లేదు. ఇరాన్‌లో తొమ్మిదికోట్లమంది ప్రజలు ఉన్నారు. ఇజ్రాయెల్ దేశం మొత్తం మీద ఉన్నది కోటి మంది జనాభా మాత్రమే. అందువల్ల ఇజ్రాయెల్ హై–టెక్ ఆయుధాలతో ఇరాన్‌ను దెబ్బతీస్తున్నది.



ఇజ్రాయెల్ కంటే ఇరాన్ వద్ద ఎక్కువగా యుద్ధ ట్యాంకులు, పదాతిదళ సమూహాలు ఉన్నాయి. ఇజ్రాయెల్ నుండి ఇరాన్‌కు ప్రధానంగా గగనతలమార్గంలోనే దాడులు ఎక్కువగా ఎదురవుతున్నాయి. గగనతల యుద్ధంలో ఇజ్రాయెల్ ఆరితేరింది. ఇరాన్–ఇజ్రాయెల్ దేశాలకు బలమైన సైన్యాలున్నప్పటికీ, ఇరాన్ వద్దనే చాలా చురుకైన సైనిక బలగాలున్నాయి. సెంట్రల్ ఇరాన్‌లో ఉన్న భూతలం నుండి భూతలంపైకి ప్రయోగించే క్షిపణి కేంద్రాలను ధ్వంసం చేసేందుకు తమ గగనతల బలగాలు దృష్టి కేంద్రీకరించాయని ఇజ్రాయెల్ ప్రకటించింది. రాకెట్ లాంఛెర్లను ఇజ్రాయెల్ ధ్వంసం చేస్తున్నది. దీనివల్ల రాకెట్లు ఉన్నాగానీ ఇరాన్ ప్రయోగించలేని పరిస్థితి వస్తుంది. అదేసమయంలో ఇరాన్ వద్ద ఇజ్రాయెల్‌కు చెందిన ఫైటర్ జెట్‌లను ధ్వంసం చేయగల సామర్థ్యం, నైపుణ్యం ఉన్నప్పటికీ, ఆంక్షలవల్ల ఇరాన్ అత్యాధునికమైన ఆయుధ వ్యవస్థలను సమకూర్చుకోలేకపోయింది. ఇరాన్ వద్ద ఉన్న ఖండాంతర క్షిపణులను, క్రూయిజ్ క్షిపణులను కనిపెట్టగల శక్తిసామర్థ్యాలు ఇజ్రాయెల్ రక్షణ వ్యవస్థ సమకూర్చుకుంది. అమెరికా అండదండలవల్లనే ఇజ్రాయెల్ ఈ శక్తిని సమకూర్చుకుంది. దీనికితోడు ఇప్పుడు మధ్యప్రాచ్యం దిశగా అమెరికా యుద్ధనౌకలు తరలివస్తున్నాయి. ఇజ్రాయెల్‌కు ఐరన్‌డోమ్‌తోపాటు తన గగనతల వ్యవస్థను కాపాడుకునేందుకు బహుముఖవలయాల రక్షణ వ్యవస్థను సమకూర్చుకుంది. గురిచూసి దెబ్బతీసేందుకు వీలైన గగనతల ఆధునిక వ్యవస్థను కూడా ఇజ్రాయెల్ సమకూర్చుకుంది.

# అణ్వాయుధాలు లేని జోన్‌గా మధ్యప్రాచ్యం
## ఐఎఇఎలో స్పష్టం చేసిన చైనా

**వియన్నా :** ఇరాన్ అణుసమస్యకు రాజకీయ, దౌత్యపరమైన మార్గంలోనే పరిష్కారం లభిస్తుందని అంతర్జాతీయ అణు ఇంధన నిఘా సంస్థ ((ఐఎఇఎ) పేర్కొంది. వియన్నాల్లో ఒక ప్రత్యేక సమావేశాన్ని ఐఎఇఎ నిర్వహించింది. మధ్యప్రాచ్యంలో పరిణామాలపట్ల ఐఎఇఎ సభ్యదేశాలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశాయి. మధ్యప్రాచ్యంలో ఇరాన్–ఇజ్రాయెల్ మధ్య దౌత్యమార్గ పరిష్కారమే మిగిలి ఉందని సభ్యదేశాలు పేర్కొన్నాయి. ఇరాన్ వద్ద అణ్వాయుధాలు ఉండకూడదనీ, ఐతే తమ దేశాన్ని కాపాడుకునే హక్కు ఇరాన్‌కు ఉందని సభ్యదేశాలు పేర్కొన్నాయి. మధ్యప్రాచ్యాన్ని అణ్వాయుధాలతోపాటు ఇతర విధ్వంసకర ఆయుధాలు లేని శాంతిమండలంగా తీర్చిదిద్దాలన్న ప్రతపాదనకు చైనా మద్దతు ఇచ్చింది. సమావేశంలో పాల్గొన్న ఐఎఇఎలో చైనా శాశ్వత ప్రతినిధి లీ సోంగ్ మాట్లాడుతూ, ఇరాన్‌పై ఇజ్రాయెల్



దాడులను తీవ్రంగా ఖండించారు. ఇజ్రాయెల్ దాడులు ఇరాన్ సార్వభౌమాధికారాన్ని, ప్రాదేశిక సమగ్రతను ఉల్లంఘించినట్లేనన్నారు. ఈ విధమైన దాడులు రాజకీయ, దౌత్యపరమైన చర్చల ప్రక్రియకు విలువలేకుండా చేస్తాయన్నారు. మధ్యప్రాచ్యంలో అసాధారణంగా పెరిగిపోయిన ఉద్రిక్తతలు ఏ ఒక్కదేశ ప్రయోజనాలకు ఉపయోగపడవన్నారు.

# ఖమేనీ ఎక్కడున్నాడో తెలుసు కానీ ప్రస్తుతానికి చంపం : ట్రంప్

**వాషింగ్టన్ :** ఇరాన్ సర్వోన్నత నాయకుడు ఆయొతుల్లా అలీ ఖమేనీ ఎక్కడ దాక్కుని ఉన్నాడో తమకు తెలుసుననీ, కానీ ప్రస్తుతానికి మాత్రం ఆయనను చంపదలచుకోలేదని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ చెప్పారు. ఆయన ఎక్కడ ఉన్నాడో మాకు తెలుసు, ఆయనను చంపడం మాకు చాలా సులభమైన లక్ష్యం, కానీ ఆయన మాకు హెచ్చరికలు చేస్తున్నాడు, మా ఓపిక సన్నగిల్లుతోంది'' అని ట్రంప్ అన్నారు. ఇరాన్ వద్ద అణ్వాయుధాలు ఉండకూడదని, కానీ తొమ్మిది అణ్వాయుధాలు తయారు చేయడానికి సరిపడ యురేనియమ్‌ను ఆ దేశం శుద్ధిచేస్తోందని అమెరికా, ఇరాన్ ఆరోపిస్తున్నాయి. ఐతే ప్రస్తుతం ఇరాన్ వద్ద అణ్వాయుధం లేదని ట్రంప్ ఒక సందర్భంగా ఇంతకుముందు చెప్పారు. ఇరాన్‌పై గడచిన శుక్రవారం నాడు ఇజ్రాయెల్ దాడి చేసి ఇప్పటికి ఐదు రోజులు గడిచాయి, ఐనాగానీ ఇంకా దాడులు కొనసాగుతూనే ఉన్నాయి. ఇజ్రాయెల్ చేసిన దాడుల్లో ఇప్పటివరకూ నలుగురు ఇరాన్ అగ్రశ్రేణి సైన్యాధికారులు మరణించగా, మరో తొమ్మిదిమంది అణుశాస్త్రవేత్తలు కూడామరణించారు. 224 మంది పౌరులు మరణించగా మరో 1800 మంది ప్రజలు గాయపడ్డారు. కీలకమైన వ్యవస్థలను ఇజ్రాయెల్ నాశనం చేసింది. ప్రస్తుతం ఖమేనీ రహస్యస్థావరంలో తలదాచుకున్నారు. కానీ అమెరికాతో అణుఒప్పందం చేసుకోవాలని,ఇజ్రాయెల్ తన అణుకార్యక్రమాన్ని పరిమితం చేసుకోవాలని, గతంకంటే మెరుగైన ఒప్పందం చేసుకోవాలని ట్రంప్ కోరుతున్నారు. ఖమేనీని లొంగదీసేందుకే ట్రంప్ ఈదాడులు చేయించినప్పటికీ ఖమేనీ లొంగిరాలేదు. ఐతే అమెరికా ఉపాధ్యక్షుడు జె.డి.వాన్స్ ఒక ప్రకటన చేస్తూ తదుపరి చర్యలు తీసుకోవడానికి ట్రంప్ ఒక నిర్ణయం తీసుకుంటారన్నారు.

**టెహ్రాన్‌లో ఉండాలా? వెళ్ళాలా?**
**సందిగ్ధంలో ఇరానీయన్లు**

ఇరాన్ రాజధాని టెహ్రాన్‌ను ప్రతి ఒక్కరూ వదిలివెళ్ళిపోవాలని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ మంగళవారంనాడు తాజా హెచ్చరిక చేసిన తర్వాత టెహ్రాన్ నగర పౌరులు సందిగ్ధంలో పడ్డారు. నగరాన్ని వదిలి వెళ్ళిపోవాలా? లేక మొండిగా నగరంలోనే ఉండిపోవాలా? ఇంతమంది ప్రత్యామ్నాయంగా ఎక్కడికి పోవాలి? అనే ప్రశ్నలు వెంటాడుతున్నాయి. ఇప్పటికే టెహ్రాన్‌లో ఉన్న 110 మంది భారతీయ విద్యార్థులను ఆర్మేనియాకు భారత దౌత్యకార్యాలయం తరలించింది. ఇప్పటికే చాలామంది ఇరానియన్లు టెహ్రాన్ నుండి వెళ్ళిపోయారు. కానీ తరతరాలుగా అక్కడే పుట్టిపెరిగినవారు తాము ఎక్కడికి వెళ్ళాలో తెలియక అయోమయంలో పడిపోయారు. వాస్తవం ఏమిటంటే ఎలాంటి కారణం చెప్పకుండా, ఎందుకు టెహ్రాన్‌ను ఖాళీ చేయాలో చెప్పకుండా ట్రంప్ టెహ్రాన్ ప్రజలను సందిగ్ధంలో, భయాందోళనలోకి నెట్టేశారు. ఇక ఇజ్రాయెల్ ప్రధానమంత్రి బెంజిమన్ నేతన్యాహూ ప్రకటనలు కూడా అసందిగ్ధంగా, అనుమానాస్పదంగా ఉన్నాయి. అసలు నేతన్యాహూకు ఏం కావాలి? అనే ప్రశ్నకు అనేక సమాధానాలు, సందేహాలు వ్యక్తం అవుతున్నాయి. ఇరాన్‌లో ఖమేనీ ప్రభుత్వాన్ని మార్చాలన్న ఆశయం పెట్టుకున్నారు. దాడుల ద్వారా ఇరాన్ ప్రజలు సొంత నిర్ణయం తీసుకోవడానికి అవకాశం కల్పించామని అన్నారు. ఇరాన్‌పై మొదట దాడి చేసినప్పుడు తమ అస్తిత్వాన్ని సహించలేకపోతున్న ఇరాన్‌కు గుణపాఠం చెప్పాలని, ఆ దేశ అణుకార్యక్రమాన్ని అడ్డుకునే చర్యలు తీసుకుంటామని, అణ్వాయుధ, బాలిస్టిక్ క్షిపణి వ్యవస్థలే ప్రధాన లక్ష్యంగా దాడులు చేస్తామని నేతన్యాహూ చెప్పారు.

కానీ దాడులు చేశాక ఆయన ఆలోచనలు మారాయి. ఇరాన్ విదేశాంగశాఖ కార్యాలయ భవంతిపై ఇజ్రాయెల్ దాడి చేసింది. ప్రభుత్వ టీవీ భవంతిపై దాడి చేసింది. ఇరాన్ పోలీసు ప్రధాన కార్యాలయం పైన, ఇరాన్ గూఢచారి, భద్రతామంత్రిత్వశాఖ భవంతులపైన దాడులు చేసింది. దీంతో ఇరాన్‌లో అంతర్గత భద్రత ఎంత బలహీనంగా ఉందో బయట పడింది. ఇరాన్ రివల్యూషనరీ గార్డ్‌కార్ప్స్ ప్రధాన కార్యాలయంపై దాడి చేసింది. కొత్తగా నియమితుడైన సైనిక జనరల్‌ను హతమార్చింది. చమురు క్షేత్రాలపై దాడులు చేసింది. దక్షిణ ఇరాన్‌లో పార్స్ గ్యాస్ ఫీల్డ్స్‌పై దాడి చేసింది.

## కార్యాచరణ రూపొందిస్తాం(మొదటి పేజీ తరువాయి)

అహ్వానించినట్లు తెలిపారు. అందుబాటులో ఉన్న లోక్‌సభ సభ్యులు, రాజ్యసభ సభ్యులతో ఫోన్‌లో మాట్లాడి సమావేశంలో పాల్గొనాలని ఆయన కోరారు. ఇప్పటికే ఈ ప్రాజెక్ట్‌పై రాష్ట్ర సిఎం రేవంత్‌రెడ్డి, తాను 2025 జూన్ 3న న్యూఢిల్లీలో కేంద్ర జలశక్తి మంత్రి సి.ఆర్.పాటిల్‌ను స్వయంగా కలసి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తరపున అభ్యంతరాలను లేవనెత్తిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. అందుకు ప్రతిగా స్పందించిన కేంద్ర మంత్రి సి.ఆర్.పాటిల్ స్పందిస్తూ 2025 మే 28న తనకు రాసిన లేఖలో గోదావరిబనకచర్ల లింక్ ప్రాజెక్టుకు సంబంధించిన డిపిఆర్ కేంద్ర ప్రభుత్వానికి ఇప్పటివరకు అందలేదని చెబుతూనే అది అందిన తరువాత నీటి కేటాయింపులలో ప్రస్తుతం ఉన్న మార్గదర్శకాలు, ట్రిబ్యునల్ తీర్పులు, అంతర్‌రాష్ట్ర ఒప్పందాలతో పాటు 2014 ఆంధ్రప్రదేశ్ పునర్ వ్యవస్థీకరణ చట్టాలను పరిగణనలోకి తీసుకున్నాకే సమీక్షిస్తామన్నారు. 2025 జూన్ 13న తిరిగి తాను కేంద్ర జలశక్తి మంత్రికి రాసిన లేఖలో గోదావరిబనకచర్ల లింక్ పథకంపై అభ్యంతరాలను తెలియజేశామన్నారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన అనుమతులను కేంద్ర జల సంఘం నిలువరించాలని డిమాండ్ చేసిన విషయాన్ని ఆయన ఉటంకించారు. భవిష్యత్‌లో అనుసరించాల్సిన వ్యూహంపై బుధవారం సచివాలయంలో లోక్‌సభ, రాజ్యసభ సభ్యులతో సమావేశం ఏర్పాటు చేశామని మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి తెలిపారు.

## కరెంటు కోతల్లేవ్
(మొదటి పేజీ తరువాయి)

అక్కడ ఏర్పాటు చేసిన సభలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ, రాష్ట్రంలో కరెంటు ఎంత అవసరం ఉన్న ఇచ్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వస్తే కరెంటు ఉండదని ప్రతిపక్షాలు దుష్ప్రచారం చేశాయని,గతంతో పోలిస్తే 2,000 మెగావాట్ల అదనపు డిమాండ్ వచ్చిన రాష్ట్రంలో ఒక్క నిమిషం అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా చేసిన చరిత్ర కాంగ్రెస్ ప్రభుత్వానిదని అన్నారు.

ఉచిత విద్యుత్ పథకాల కోసం రాష్ట్ర ప్రజల పక్షాన ప్రభుత్వం ప్రతి సంవత్సరం 13,992 కోట్లు ఖర్చు చేస్తుందని తెలిపారు. నియోజకవర్గంలో 3500 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేశామని అన్నారు. రూ.22,500 కోట్లు ఖర్చు చేసి 4.50 లక్షల మందికి ఇందిరమ్మ ఇల్లు నిర్మించబోతున్నామని తెలిపారు. గత పదేళ్ల అధికారంలో ఉన్న బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఇంటికో ఉద్యోగం ఇస్తామని చెప్పి, కనీసం ఒక్క ఉద్యోగం కూడా ఇవ్వలేదన్నారు. మేం అధికారంలోకి రాగానే ఏడాదిన్నర కాలంలో 57 వేల ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేశామని, మరో 30 వేల ఉద్యోగాలు కూడా భర్తీ చేయబోతున్నామన్నారు. కాలేశ్వరం పేరిట రాష్ట్ర సొమ్ము దోపిడీ చేసి సిగ్గు లేకుండా బ్రహ్మాండమని చెబుతున్నారు. అత్యంత ప్రమాదకరం, డిజైన్ కు కట్టిన దానికి పొంతనలేదని ఎన్‌డిఎస్‌ఎ చెప్పిందని అన్నారు.

1,20,000 కోట్ల ఖర్చు చేసి ప్రాజెక్టు నిర్మిస్తే కుంగిపోయిందని అన్నారు. ఈ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వాలు కట్టిన నాగార్జున సాగర్,శ్రీరామ్ సాగర్, జూరాల ఎల్లంపల్లి ప్రాజెక్టులకు చిన్న పగులు కూడా రాలేదన్నారు. పేద విద్యార్థులకు ప్రపంచ స్థాయి విద్యను అందించేందుకు యంగ్ ఇండియా ఇంటర్నేషనల్ స్కూల్స్ నిర్మిస్తున్నామన్నారు. భూపాలపల్లి నియోజకవర్గ పరిధిలోని 8 మండలాలకు ఏ ఈ ఆఫీసుల,జిల్లా కేంద్రంలో పవర్ సరఫరా కేంద్రం, దుబ్బపల్లి, పరశురంపల్లి సింగరేణి ప్రభావిత గ్రామాలను తరలించాలని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు కోరగా ఉప ముఖ్యమంత్రి వెంటనే హామీని అమలు చేయాలని అధికారులకు సూచించారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ అయిత ప్రకాష్ రెడ్డి, జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్పీ కిరణ్ ఖరే, సింగరేణి జిఎం ఏ రాజేశ్వర్ రెడ్డి, అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయ లక్ష్మి, ఆర్‌డిఓ రవి, మార్కెట్ చైర్మన్‌లు జి.కిష్టయ్య, గుమ్మడి శ్రీదేవి, ఆర్‌టిఎ మెంబెర్ సుంకరి రాంచెంద్రయ్య, కాంగ్రెస్ పార్టీ పట్టణ వర్కింగ్ ప్రెసిడెంట్ పుప్పాల రాజేందర్, యువ జన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు బట్టు కరుణాకర్,అప్పం కిషన్, నాయకులు పాల్గొన్నారు.

## సమగ్ర విధానం (మొదటి పేజీ తరువాయి)

అధిగమించి గోవుల సంరక్షణే ధ్యేయంగా తొలుత రాష్ట్రంలోని నాలుగు ప్రదేశాల్లో అత్యాధునిక వసతులతో గోశాలలు నిర్మించాలని సిఎం సూచించారు. ప్రముఖ దేవస్థానాల ఆధ్వర్యంలో కోడె మొక్కులు చెల్లించే వేములవాడ, యాదగిరిగుట్ట, హైదరాబాద్ నగర సమీపంలోని ఎనికేపల్లి, పశు సంవర్ధక శాఖ విశ్వవిద్యాలయం సమీపంలో విశాల ప్రదేశాల్లో తొలుత గోశాలలు నిర్మించాలని రేవంత్‌రెడ్డి సూచించారు. భక్తులు అత్యధిక భక్తిశ్రద్ధలతో సమర్పించే కోడెల పట్ల ప్రత్యేకమైన శ్రద్ధ కనపర్చాలని సిఎం సూచించారు. వేములవాడ సమీపంలో వంద ఎకరాలకు తక్కువ కాకుండా గోశాల ఉండాలని సిఎం తెలిపారు. గో సంరక్షణ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం ఎంతటి వ్యయానికైనా వెనుకాడదని సిఎం స్పష్టం చేశారు. అనంతరం రాష్ట్రంలో గోశాలల నిర్వహణకు సంబంధించిన అప్రోచ్ పేపర్‌ను అధికారులు సిఎంకు అందజేశారు. సమావేశంలో రాష్ట్ర పశుసంవర్ధక శాఖ మంత్రి వాకిటి శ్రీహరి, సిఎం ముఖ్య కార్యదర్శులు వి.శేషాద్రి, శ్రీనివాసరాజు, పశుసంవర్ధక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సబ్యసాచి ఘోష్, దేవాదాయశాఖ ముఖ్య కార్యదర్శి శైలజ రామయ్యార్, వ్యవసాయ శాఖ కార్యదర్శి రఘునందన్ రావు, హెచ్‌ఎండిఎ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్, పశుసంవర్ధక శాఖ డైరెక్టర్ గోపి, రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## శాంతి చర్చలు జరపాలి
(మొదటి పేజీ తరువాయి)

కె.జి.రామచందర్, ఎంసిపిఐ (యు) రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి, సిపిఐ (ఎంఎల్) లిబరేషన్ రాష్ట్ర కార్యదర్శి ఎం.రమేష్ రాజా, ఆర్‌ఎస్‌పి రాష్ట్ర కార్యదర్శి జె. జానకిరాములు, సిపిఐ (ఎంఎల్) రాష్ట్ర కార్యదర్శి ప్రసాదన్న, ఎస్‌యుసిఐ (సి) రాష్ట్ర కార్యదర్శి సిహెచ్.మురహరి, ఫార్వర్డ్ బ్లాక్ రాష్ట్ర కార్యదర్శి బండ సురేందర్‌రెడ్డి, తెలంగాణ సాంస్కృతిక మండలి ఛైర్మన్ వెన్నెల గద్దర్, విసికె నాయకులు జిలకర శ్రీనివాస్, భారత్ బచావో ఆల్ ఇండియా నాయకులు డాక్టర్ ఎం. ఎఫ్. గోపీనాథ్, పౌరహక్కుల సంఘం అధ్యక్షులు ప్రొఫెసర్ గడ్డం లక్ష్మణ్, మానవ హక్కుల వేదిక (హెచ్‌ఆర్‌ఎఫ్) నాయకులు ఎస్. జీవన్ కుమార్, అరుణోదయ నాయకులు విమలక్క, తెలంగాణ విద్యావంతుల వేదిక రాష్ట్ర అధ్యక్షులు అంబటి నాగయ్య, టిఎస్‌డిఎఫ్ రాష్ట్ర కన్వీనర్ ప్రొఫెసర్ ఎ.వినాయక రెడ్డి,తుడుం దెబ్బ రాష్ట్ర అధ్యక్షులు బెల్లంనగేష్ తదితరులు ప్రసంగించారు.

**అంతంచేసే అధికారం ఎవరిచ్చారు : కూనంనేని**

సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ గోద్రా ఘటనకు సంబంధించి ఈ దేశ రాజ్యాంగ బద్ధంగా ఏర్పడిన చట్టాల ద్వారా ముద్దాయిగా పేర్కొనబడ్డ వారు ప్రధానమంత్రి నరేంద్రమోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్‌షాలు అయితే, ఈ దేశంలోని అణగారిన వర్గాల కోసం సర్వస్వం త్యాగం చేసి ఉద్యమాలు చేస్తున్న వారు మావోయిస్టులు అని కూనంనేని సాంబశివరావు అన్నారు. మావోయిస్టులు తప్పు చేస్తే రాజ్యాంగ బద్ధంగా చట్ట ప్రకారం శిక్షించాలి తప్ప భౌతికంగా అంతం చేసే అధికారం మీకు ఎవరిచ్చారని ప్రశ్నించారు. గతంలో ఫ్యూడల్ వ్యవస్థకు కార్పొరేట్ వ్యవస్థకు ప్రధాని నరేంద్రమోదీ, హోంమంత్రి అమిత్‌షాలు కాపలా కుక్కలుగా కొమ్ము కాస్తున్నారని ధ్వజమెత్తారు.

**తక్షణమే చర్చలు జరపాలి : నారాయణ**

సిపిఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ మాట్లాడుతూ మావోయిస్టుల నేరుగా చూడడం కాదు.. వారి శవాలను చూస్తేనే భయపడే పిరికి పందలు ఈ పాలకులని ఎద్దేవా చేశారు. మావోయిస్టుల ముక్త్ భారత్ కాదు.. త్వరలోనే అమిత్ షా ముక్త్ భారత్ ఉద్యమాలు రాకుండా చూసుకోవాలని హెచ్చరించారు. పొరుగు దేశాలైన శ్రీలంక, బంగ్లాదేశ్‌లో వెల్లువెత్తిన ప్రజా ఉద్యమాలతో అక్కడ పాలకులకు ఏ గతి పట్టిందో కేంద్ర పాలకులు గుర్తుంచుకోవాలని హెచ్చరించారు. మావోయిస్టులతో కేంద్ర ప్రభుత్వం తక్షణమే చర్చలు జరపాలని





డిమాండ్ చేశారు.

**పార్లమెంట్‌లో లేవనేత్తుతాం : ఎంపి మల్లు రవి**

మల్లు రవి మాట్లాడుతూ హింకు కాంగ్రెస్ పార్టీ వ్యతిరేకమన్నారు. బస్తర్‌లో ఆపరేషన్ కగార్ పేరుతో కేంద్ర ప్రభుత్వం జరుపుతున్న ఆదివాసీల హననాన్ని, అంతర్‌యుద్ధాన్ని వెంటనే ఆపివేయాలని, తక్షణం కాల్పుల విరమణను ప్రకటించి, పేదల కోసం పోరాడుతున్న మావోయిస్టులతో కేంద్రం శాంతి చర్చలు జరపాల్సిందేనని, స్పష్టం చేశారు. ఈ అంశాన్ని కాంగ్రెస్ అగ్ర నాయకులు రాహుల్ గాంధీ, పార్టీ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే దృష్టికి తీసుకు వెళ్లడంతో పాటు పార్లమెంట్‌లో లేవనెత్తి శాంతి చర్చలు జరిగే కృషి చేస్తామని ఆయన పేర్కొన్నారు. అలాగే టిపిసిసి అధికార ప్రతినిధి చెనగాని దయాకర్ మాట్లాడుతూ ఈ అంశంపై ఢిల్లీ రాంలీలా మైదానంలో పెద్ద ఎత్తున ఉద్యమం జరగాలని సూచించారు.

**రైతు ఉద్యమం తరహాలో ఉద్యమించాలి : తమ్మినేని**

సిపిఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు తమ్మినేని వీరభద్రం మాట్లాడుతూ తమ అధికారానికి, రాజకీయ నిరంకుశ్వతానికి ఎదురు నిలిచే ప్రతి ఒక్కరిని అంతమొందించడమే బిజెపి లక్ష్యమన్నారు. కమ్యూనిజాన్ని అంతం చేయాలని బిజెపి రక్తంలో, సిద్ధాంతంలోనే ఉందని, దీనిని అడ్డుకోవడానికి సైద్దాంతిక పరమైన యుద్ధం కూడా చేయాల్సిన అవసరముందని వీరభద్రం సూచించారు. ఆపరేషన్ కగార్‌పై రైతు ఉద్యమం తరహాలో ఢిల్లీలో పోర ఉద్యమం చేయాల్సిన అవసరం ఉందన్నారు.

**మావోయిస్టులు దొంగలు, దోపిడీదారులు కాదు : కోదండరామ్**

టిజెఎస్ అధ్యక్షుడు ప్రొఫెసర్ ఎం. కోదండరామ్ మాట్లాడుతూ అడవిలో ఉండి పోరాడుతున్న మావోయిస్టులు దొంగలు, దోపిడీదారులు కాదని, వారు ఒక సామాజిక సమస్య పరిష్కారానికి పోరాటం చేస్తున్నారని వివరించారు.

అలాంటి శక్తులతో చర్చించాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వంపై ఉన్నదని తెలిపారు. ప్రజల సమస్యలను పరిష్కరిస్తేనే రాజకీయ ఉద్యమాలకు పరిష్కారం దొరుకుతుందని, కానీ కేవలం హింస మాత్రమే ఇటువంటి సమస్యలకు పరిష్కారం అని భావిస్తే అది అవివేకమే అని అన్నారు.

**మూల సమస్యలను పరిష్కరించాలి : దాసోజు శ్రవణ్**

బిఆర్‌ఎస్ ఎంఎల్‌సి డాక్టర్ దాసోజు శ్రవణ్ మాట్లాడుతూ ప్రశ్న నుంచి పుట్టిందే నక్సలిజమని, ఆ సమస్య ఎక్కడ తీవ్రత ఉంటుందో, అక్కడ తప్పకుండా తిరుగుబాటు ఉంటుందన్నారు. మూల సమస్యలను పరిష్కరించకుండ దుర్మార్గమైన దాష్టీకానికీ పాల్పడడం మానవత్వానికే తీరని మచ్చ అని దుయ్యబట్టారు.

ప్రముఖ సినీనటులు ఆర్.నారాయణ మూర్తి మాట్లాడుతూ పదే పదే తమది రామరాజ్యమని, తాము రామభక్తులమని చెబుతున్న ప్రధాని మోదీ, హోంమంత్రి అమిత్‌షాలు, రామ,రావణ యుద్ధంలో అలసిపోయిన రావణుడిని విశ్రాంతి తీసుకుని, ఆ మరుసటి రోజు యుద్ధానికి రావాలని రాముడు సూచించారని విషయాన్ని మోదీ ఎందుకు పాటించడం లేదని ప్రశ్నించారు. తాము చర్చలకు సిద్ధమని ప్రకటించిన మావోయిస్టులను కక్ష కట్టి, చుట్టిముట్టి చంపేస్తున్న ప్రధానిమోదీ, కేంద్ర మంత్రి అమిత్‌షాలు రామ భక్తులు, హిందువులు ఎలా అవుతారని నిలదీశారు. ప్రొఫెసర్ హరగోపాల్ మాట్లాడుతూ రాజ్యాంగాన్ని తుంగలో తొక్కి మరి కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం హింసకు పాలడ్పడం గర్హనీయమన్నారు.


జస్టిస్ చంద్రకుమార్ మాట్లాడుతూ గడిచిన 11 ఏళ్లలో బిజెపి పాలకులు తాము చేసిన తప్పులను కప్పిపుచ్చుకునేందుకే ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నారని విమర్శించారు. ప్రొఫెసర్ కె.నాగేశ్వర్ మాట్లాడుతూ మావోయిస్టులతో కేంద్రప్రభుత్వం శాంతి చర్చలు జరపకపోతే వారు నష్టపోయేది ఏమీ లేదన్నారు. ఆదివాసీల కోసమైన కేంద్రం తక్షణమే శాంతి చర్చలు నిర్వహించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గాదగోని రవి మాట్లాడుతూ, ఆపరేషన్ కగార్‌కు వ్యతిరేకంగా ఇండియా కూటమి తరపున ఢిల్లీలో ఉద్యమించేందుకు సిపిఐ నాయకులు నారాయణ చొరవ తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

## ఫోన్లు ట్యాప్
(మొదటి పేజీ తరువాయి)

తుంగలో తొక్కి తమ ఫోన్లను ట్యాప్ చేశారని ఆరోపించారు. 'రాజకీయ నాయకుల ఫోన్లు ట్యాప్ చేయడం చాలా నీచమైన చర్య. ఇలాంటి పనికి పాల్పడిన కెసిఆర్,కెటిఆర్ సిగ్గుతో తలదించుకోవాలి' అని ఆయన తీవ్రంగా విమర్శించారు. 'కుంభం అనిల్ కుమార్ యాదవ్, గాలి అనిల్‌తో పాటు అనేకమంది ఫోన్లు ట్యాప్ అయినట్లు వెలుగులోకి వచ్చింది. ఇవన్నీ గమనిస్తే, నాడు అధికారాన్ని ఏ విధంగా దుర్వినియోగం చేసి దుశ్చర్యలకు పాల్పడ్డారో స్పష్టమవుతోంది' అని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్యంలో నిష్పక్షపాతంగా వ్యవహరించాల్సిన కొందరు అధికారులు, రాజకీయ నాయకులకు దాసోహమై వారి ఆదేశాలను పాటించారని విమర్శించారు. వ్యక్తిగత గోప్యత అనేది తమ ప్రాథమిక హక్కు అని, దానిని కూడా కాలరాశారని అన్నారు. దేశ చరిత్రలో ఎక్కడా లేని విధంగా, రిటైర్డ్ అయిన ప్రభాకర్‌రావును ఇంటెలిజెన్స్ చీఫ్‌గా నియమించి ఇలాంటి తప్పుడు పనులకు పాల్పడ్డారని మహేశ్ కుమార్ గౌడ్ ఆరోపించారు. 'నక్సలైట్లకు సానుభూతిపరులుగా ఉన్నారని మమ్మల్ని ట్యాప్ చేయడం సిగ్గుచేటు. తమ ఫోన్లు ట్యాప్ చేసి రాజకీయ లబ్ధి పొందాలని ప్రయత్నించారని, అందుకు వారు కచ్చితంగా శిక్షార్హులని అన్నారు. భవిష్యత్తులో ఏ ప్రభుత్వం కూడా ఇలాంటి దిగజారుడు పనులకు పాల్పడకుండా ఉండాలంటే, ఈ కేసులో దోషులకు కఠిన శిక్షలు పడాల్సిందేనని ఆయన డిమాండ చేశారు. ఇలాంటి చర్యలకు ఒడిగట్టిన ఐఎఎస్, ఐపిఎస్ అధికారులకు కూడా శిక్ష విధించాలని కోరారు. ఈ కేసు విచారణ సజావుగా జరిపి, బాధ్యులైన రాజకీయ నాయకులు, అధికారులను కఠినంగా శిక్షించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నట్లు మహేశ్ కుమార్ గౌడ్ తెలిపారు.

# మహేష్‌కుమార్ గౌడ్‌కు కెటిఆర్ లీగల్ నోటీసులు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఫోన్ ట్యాపింగ్ పేరుతో అసత్య ఆరోపణల చేసిన టిపిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ వెంటనే బేషరతుగా క్షమాపణ చెప్పాలని బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటి.రామారావు డిమాండ్ చేశారు. ఈ మేరకు మహేష్ కుమార్ గౌడ్‌కు లీగల్ నోటీసులు పంపించినట్టు కెటిఆర్ మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. అధికారంలోకి వచ్చిన నాటి నుంచి హామీలు అమలు చేయడం చేతకాని కాంగ్రెస్ ప్రభుత్వం, తమ చేతికాని తనాన్ని కప్పి పుచ్చేందుకే ఫోన్ ట్యాపింగ్ వ్యవహారాన్ని తెరపైకి తెచ్చి, రాద్ధాంతం చేస్తోందని పేర్కొన్నారు. ఎటువంటి సాక్ష్యాధారాలు లేకుండా తమపై, తమ పార్టీ నేత



లపై ఇంతటి దిగజారుడు వ్యాఖ్యలు చేయడం సిగ్గుచేటని మండిపడ్డారు. చట్టాలను గౌరవించే వ్యక్తులుగా తాము అక్రమంగా నమోదు చేసిన కేసు విచారణకు కూడా హాజరవుతున్నా మన్నారు. అడ్డగోలుగా మాట్లాడితే బిఆర్‌ఎస్ శ్రేణులు కూడా చూస్తూ ఊరుకోబోరన్నారు. అధికారంలోకి వచ్చిన నాటి నుంచి అత్యంత అప్రజాస్వామికంగా వ్యవహరిస్తున్న కాంగ్రెస్ నేతలకు ప్రజాక్షేత్రంలో గుణపాఠం తప్పదని కెటిఆర్ అన్నారు. స్థానిక ఎన్నికల్లో ప్రజలను తప్పుదోవ పట్టించాలనే దురుద్దేశంతోనే మరోసారి ఫోన్ ట్యాపింగ్ వ్యవహారాన్ని తెరపైకి తెచ్చారని, ఈ లొట్టపీసు కేసులతో ఒరిగేదే ఏమీ లేదని కెటిఆర్ అన్నారు. అబద్దాలు చెప్పడంలో సిఎం, పిసిసి చీఫ్ పోటీపడుతున్నట్టు కనిపిస్తోందని, రాష్ట్రాన్ని నడిపించే సత్తా, సామర్థ్యం లేకపోవడంతోనే ఇలాంటి అటెన్షన్ డైవర్షన్ కుట్రలతో కాలం వెళ్లదీసే ప్రయత్నం చేస్తున్నారని కెటిఆర్ ఆరోపించారు.

కేవలం రాజకీయంగా పబ్బం గుడుపుకునేందుకు ఇలాంటి దుర్మార్గపూరిత వ్యాఖ్యల చేస్తున్న మహేష్ కుమార్ గౌడ్ లాంటి నాయకులను కోర్టులకు ఈడుస్తామని కెటిఆర్ హెచ్చరించారు.



# జనరల్
STATE & REGIONAL NEWS

## టిజిటిడిసి ఎండిని కలిసిన ఎఐటియుసి నేతలు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ (టిజిటిడిసి) ఎండిగా నూతన బాధ్యతలు స్వీకరించిన వల్లూరి క్రాంతిని తెలంగాణ పర్యాటక అభివృద్ధి సంస్థ కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగ సంఘం ఆధ్వర్యంలో నేతలు పుష్పగుచ్ఛం ఇచ్చి శాలువాతో సత్కరించారు. కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ ఉద్యోగ సంఘం (ఎఐటియుసి) నేతలు రాష్ట్ర జనరల్ సెక్రెటరీ సబ్బు రాజమౌళి, జ్యోతి, మధుర, ముద్దుల, రాధిక, నేత్ర, రాజ్యలక్ష్మి, రాజ్ కుమార్, శ్రీధర్, రవి, యాదవ్ తదితరులు నూతనంగా బాధ్యతలు స్వీకరించిన వల్లూరి క్రాంతి శుభాకాంక్షలు తెలిపారు.





## ఆగస్టు 15 నాటికి న్యాయబద్ధమైన దరఖాస్తులన్నీ పరిష్కారం : పొంగులేటి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** వచ్చే రెండు నెలలు రెవెన్యూ శాఖకు అత్యంత కీలకమని, భూ సమస్యల పరిష్కారానికి నిర్దేశించుకున్న ఆగస్టు 15 వతేదీ నాటికి న్యాయబద్ధమైన అన్ని దరఖాస్తులను పరిష్కరించాలని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సూచించారు. గత ప్రభుత్వం ధరణి పోర్టల్ వల్ల చేసిన తప్పిదాలతో రాష్ట్రంలోని ప్రతి గ్రామంలో వందల కుటుంబాలు భూ సంబంధిత సమస్యలను ఎదుర్కొంటున్నాయని, ఆ సమస్యలకు భూ భారతి చట్టం ద్వారా పరిష్కారాన్ని చూపాలని ఆయా జిల్లా కలెక్టర్లకు ఆదేశించారు. తెలంగాణ సమాజంలో భూమి కీలకమైన అంశమన్నారు. కొత్తగా నియమితులైన సంగారెడ్డి కలెక్టర్ ప్రావీణ్య, సిద్దిపేట కలెక్టర్ హైమావతి, హైదరాబాద్ కలెక్టర్ హరిచందన, నిజామాబాద్ కలెక్టర్ వినయకృష్ణారెడ్డి, స్టాంప్స్, రిజిస్ట్రేషన్ స్పెషల్ సెక్రటరీ రాజీవ్‌గాంధీ హనుమంత్ హైదరాబాద్‌లోని సచివాలయంలో రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వంలో భూములకు సంబంధించి రైతులు అనుభవించిన కష్టాలకు, బాధలకు విముక్తి కల్పించే విధంగా భూ భారతి రెవెన్యూ సదస్సుల్లో స్వీకరిస్తున్న దరఖాస్తుల పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ప్రభుత్వం పనిచేస్తుందని, ప్రభుత్వ ఆలోచనకు అనుగుణంగా కలెక్టర్లు పనిచేయాలని మంత్రి పొంగులేటి సూచించారు.

### తెలంగాణ ప్రభుత్వము
### రెవెన్యూ (భూసేకరణ) శాఖ
### ఫారం - C
### ప్రకటన

(10 A మినహాయింపు ఇవ్వబడిన చట్టంలోని సెక్షన్ - 11 క్రింద)
(రూల్ 6/12 చూడుము)

గజిట్ నెం. GHMC-11 — తేది: 04.06.2025
నెం. C/318/2025 — తేది: 03.06.2025

**శేరిలింగంపల్లి** గ్రామం, **శేరిలింగంపల్లి** మండలం, **రంగారెడ్డి** జిల్లాలో మొత్తం **3173.89 చ.గజాల** విస్తీర్ణం గల భూమి ఉపయోగ నిమిత్తం అంటే H-C.L.T.I క్రింద గుల్మోహర్ పార్క్ జంక్షన్ నుండి తారా నగర్ మీదుగా BHEL జంక్షన్ వరకు ప్రతిపాదిత 30.0 M & 36.0 M వెడల్పు గల రహదారి మరియు లింగంపల్లి స్టేషన్ రైల్వే క్రాసింగ్ వద్ద ప్రతిపాదిత ROB కోసం అవసరమై ఉందని తెలంగాణ ప్రభుత్వం / స్పెషల్ కలెక్టర్ (భూ. సే.) & కమీషనర్, GHMC వారు భావిస్తున్నారు.

అందువలన **శేరిలింగంపల్లి** గ్రామం, **శేరిలింగంపల్లి** మండలం, **రంగారెడ్డి** జిల్లాలో పైన తెలిపిన ప్రాజెక్ట్ కోసం **3173.89 చ.గజాల** కంటే తక్కువ లేదా ఎక్కువ విస్తీర్ణం గల ప్రామాణిక కొలత గల భూమి అవసరమై ఉందని ప్రకటించడమైనది. భూసేకరణ కోసం ప్రతిపాదించబడిన భూమి సవివరమైన వివరణ దిగువ ఇవ్వబడింది.

| క్రమ సంఖ్య | సర్వే నెం | [illegible] | [illegible] | భూసేకరణ క్రింద విస్తీర్ణం చ.గ.లలో | ఆసక్తి గల వ్యక్తి పేరు మరియు చిరునామా | సరిహద్దులు: ఉత్తరం | దక్షిణం | తూర్పు | పడమర | చెట్లు: రకం | సంఖ్య | కట్టడాలు: రకం | విస్తీర్ణం |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| 1 | 2 | 3 | 4 | 5 | 6 | 7 | 8 | 9 | 10 | 11 | 12 | 13 | 14 |
| 1 | - | - | - | 29.94 | శ్రీ ఎన్. శ్రీనివాస్ ఇ.నెం.6-47 | లొకేషన్ స్కెచ్ ప్రకారం | | | | - | - | - | - |
| 2 | - | - | - | 56.94 | శ్రీ ఎన్. పశుపతి ఇ.నెం.6-40 | | | | | - | - | - | - |
| 3 | - | - | - | 94.44 | శ్రీ ఉదయ్ భాస్కర్ ఇ.నెం.6-39 | | | | | - | - | - | - |
| 4 | - | - | - | 70.78 | శ్రీ డి.వి.సుబ్బారావు ఇ.నెం.6-39 | | | | | - | - | - | - |
| 5 | - | - | - | 71.46 | శ్రీ టి.హెచ్. నరహరి ప్లాట్ నెం.6 | | | | | - | - | - | - |
| 6 | - | - | - | 22.45 | శ్రీ కె. మల్లేష్ ఇ.నెం.6-6 | | | | | - | - | - | - |
| 7 | - | - | - | 53.02 | శ్రీ కె.బాబు రావు ఇ.నెం.6-4 & 5 | | | | | - | - | - | - |
| 8 | 59 & 60 | - | - | 62.94 | శ్రీ సి.సుదర్శన్ రెడ్డి ప్లాట్ నెం. 5/P | | | | | - | - | - | - |
| 9 | - | - | - | 23.06 | శ్రీమతి లక్ష్మీదేవి ఇ.నెం.5-5/1/A | | | | | - | - | - | - |
| 10 | - | - | - | 121.11 | శ్రీ. ఎ. పెద్దా రెడ్డి ఇ.నెం.5-1 | | | | | - | - | - | - |
| 11 | - | - | - | 54.28 | శ్రీ ఎ. రవీందర్ గౌడ్ ఇ.నెం.5-2/2-3, ప్లాట్ నెం.2 | | | | | - | - | - | - |
| 12 | - | - | - | 46.18 | శ్రీ ఎల్. ప్రవీణ్ రెడ్డి ఇ.నెం. 5-3 | | | | | - | - | - | - |
| 13 | - | - | - | 45.00 | శ్రీ ఎల్. నవీన్ రెడ్డి ఇ.నెం.5-4 | | | | | - | - | - | - |
| 14 | - | - | - | 10.04 | శ్రీ ఆర్. యాదయ్య ఇ.నెం.5-5 | | | | | - | - | - | - |
| 15 | - | - | - | 22.29 | శ్రీమతి పి. సుశీలా షోనీ ఇ.నెం.5-6&7 | | | | | - | - | - | - |
| 16 | - | - | - | 12.18 | శ్రీ మహమ్మద్ తాజుద్దీన్ & ఇతరులు ఇ.నెం.5-8/1 | | | | | - | - | - | - |
| 17 | - | - | - | 89.08 | శ్రీ టి.ఎస్. పనికర్ ఇ.నెం.5-10 | | | | | - | - | - | - |
| 18 | - | - | - | 113.85 | శ్రీ యం. ప్రీతం ప్లాట్ నెం.53 ఇ.నెం.5-53/NR | | | | | - | - | - | - |
| 19 | - | - | - | 189.30 | శ్రీ సి. సోమదాస్ ఇ.నెం.4-12 | | | | | - | - | - | - |
| 20 | - | - | - | 152.83 | శ్రీ మహమ్మద్ నసీరుద్దీన్ ఇ.నెం.4-6/A | | | | | - | - | - | - |
| 21 | - | - | - | 86.39 | శ్రీ కె. కుమార్ యాదవ్ & శ్రీ. కె. నర్సింహ యాదవ్ ఇ.నెం.2-39 | | | | | - | - | - | - |
| 22 | - | - | - | 23.20 | శ్రీమతి కె. శశికళ ఇ.నెం.2-40 | | | | | - | - | - | - |
| 23 | - | - | - | 49.18 | శ్రీమతి కె. సురేఖ ఇ.నెం.2-45 | | | | | - | - | - | - |
| 24 | - | - | - | 56.54 | శ్రీమతి కె. బాబు రావు ఇ.నెం.2-46 | | | | | - | - | - | - |
| 25 | - | - | - | 25.07 | శ్రీ జి. జనార్దన్ రెడ్డి ఇ.నెం.2-47 | | | | | - | - | - | - |
| 26 | - | - | - | 128.66 | శ్రీ ఎస్. శ్రీనివాస్ గౌడ్ ఇ.నెం.4-13 & 4-14 | | | | | - | - | - | - |
| 27 | 59 & 60 | - | - | 27.11 | శ్రీ కె. నర్సింహ ప్లాట్ నెం.1/పార్ట్ | | | | | - | - | - | - |
| 28 | 59 & 60 | - | - | 22.11 | శ్రీ కె.రాజు ప్లాట్ నెం.1/పార్ట్ & 2/పార్ట్ | | | | | - | - | - | - |
| 29 | 59 & 60 | - | - | 19.55 | శ్రీ కె. శ్రీరాములు ప్లాట్ నెం.2/పార్ట్ | | | | | - | - | - | - |
| 30 | - | - | - | 26.44 | శ్రీమతి పి. ఐలమ్మ ఇ.నెం.5-5/2 | | | | | - | - | - | - |
| 31 | 58/1 | - | - | 90.54 | శ్రీ నీలిమ శివాజీ యాదవ్ మరియు శ్రీ మంచె శ్రీనివాస్ యాదవ్ ప్లాట్ నెం.9 & 10/పార్ట్, ఇ.నెం.5-9 | | | | | - | - | - | - |
| 32 | 57 | - | - | 91.37 | మాశెట్టి నివాస్ వెల్ఫేర్ అసోసియేషన్ యొక్క ప్రతినిధి దాని ప్రధాన కార్యదర్శి శ్రీ ఎన్.కిరణ్ బాబు ఇ.నెం.4-12/101-601 | | | | | - | - | - | - |
| 33 | - | - | - | 111.05 | శ్రీ ఇస్మాయిల్ ఇ.నెం.4-6 | | | | | - | - | - | - |
| 34 | - | - | - | 104.49 | శ్రీమతి తాహెరా బేగం & ఇతరులు ఇ.నెం.4-3, 4-4 & 4-5 | | | | | - | - | - | - |
| 35 | - | - | - | 331.04 | శ్రీమతి శోభ అని ఇ.నెం.4-12/B | | | | | - | - | - | - |
| 36 | - | - | - | 183.45 | శ్రీమతి సువర్ణ & శ్రీమతి ప్రభావతి ఇ.నెం.4-12/A & C | | | | | - | - | - | - |
| 37 | - | - | - | 71.03 | శ్రీమతి సిహెచ్. శకుంతలా బాయి ఇ.నెం.4-15 | | | | | - | - | - | - |
| 38 | - | - | - | 304.23 | శ్రీ హెచ్. సోమయ్య ఇ.నెం.4-86/2 | | | | | - | - | - | - |
| 39 | - | - | - | 45.09 | శ్రీ యాదగిరి గౌడ్ ఇ.నెం.3-102/31 & 32/GF | | | | | - | - | - | - |
| 40 | - | - | - | 36.18 | శ్రీ లక్ష్మణ్ గౌడ్ & శ్రీ యాదగిరి గౌడ్ ఇ.నెం.2-44 | | | | | - | - | - | - |
| | | | మొత్తం | 3173.89 | | | | | | | | | |

భూసేకరణ, పునరావాసము మరియు పునరుపాధిలో న్యాయబద్ధమైన నష్టపరిహారం మరియు పారదర్శకతకు హక్కు చట్టం 2013 (కేంద్ర చట్టం నెం. 30/2013) సెక్షన్-11(1) ద్వారా సవరించబడిన భూసేకరణ, పునరావాసము మరియు పునరుపాధిలో న్యాయబద్ధమైన నష్టపరిహారం మరియు పారదర్శకతకు హక్కు (తెలంగాణ సవరణ) చట్టం, 2016 (చట్టం నెం. 21 ఆఫ్ 2017) ఏర్పాట్ల క్రింద సంబంధితులు అందరికీ ఈ ప్రకటన జారీ చేయడమైనది.

హైదరాబాద్ లోని GHMC స్పెషల్ కలెక్టర్ (భూ. సే.) & కమిషనర్ కార్యాలయంలో ఉంచబడిన భూమి యొక్క ప్లాన్‌ను ఏదేని పని రోజున కార్యాలయ పని వేళల్లో తనిఖీ చేసుకొనగలరు. తెలంగాణ ప్రభుత్వం / స్పెషల్ కలెక్టర్-సహిత-సముచిత ప్రభుత్వం అధీకృత అధికారి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, భూసేకరణ, GHMC, హైదరాబాద్ వారిని మరియు అతని సర్వే సిబ్బందిని సర్వే భూమి నందు ప్రవేశించుటకు మరియు భూమిని సర్వే చేయుటకు, ఏదేని భూమి యొక్క లెవల్స్ తీసుకొనుటకు, సబ్-సాయిల్‌ను తవ్వుటకు లేదా బోరు వేయుటకు మరియు సదరు చట్టం యొక్క సెక్షన్ - 12 నందు ఏర్పాటు చేయబడిన మరియు నిర్దిష్ట పరిచిన విధంగా తమ పని కొరకు అవసరమైన అన్ని ఇతర చర్యల్ని చేపట్టు నిమిత్తం వారిని అధీకృతుల్ని చేయుటకు సమ్మతించినారు.

చట్టం యొక్క సెక్షన్-11(4) క్రింద స్పెషల్ కలెక్టర్ వారి ముందస్తు అనుమతి లేకుండా సదరు ప్రకటన ప్రచురణ తేదీ నుండి ఏ వ్యక్తి అయినా సదరు భూమికి సంబంధించి ఏ విధమైన లావాదేవీ నిర్వహించుట కానీ, ఏదేని లావాదేవీ కొరకు ప్రేరేపించుట కానీ అనగా విక్రయం / కొనుగోలు, వగైరా లేదా సదరు భూమిపై ఏవేని తాకట్టు రుణభారాలు కల్పించుట కానీ చేయరాదు.

ఒకవేళ సేకరణకు సంబంధించి ఏవేని అభ్యంతరములు ఉన్న యెడల మరియు సంప్రదింపు ద్వారా నష్ట పరిహారం సెటిల్‌మెంట్ కొరకు ఆసక్తి గల/బాధిత వ్యక్తులు అందరి నుండి ఏవేని క్లెయిములు ఉన్నచో చట్టంలోని సెక్షన్ 15 క్రింద ఏర్పాటు చేసిన విధంగా ఈ ప్రకటన ప్రచురించిన తేదీ నుండి 60 (అరవై) రోజుల్లోగా స్పెషల్ కలెక్టర్ (భూ. సే.) / అధీకృత అధికారి సమక్షమున ఫైల్ చేయవలెను.

సం/-
స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ (భూ. సే.),
జి. హెచ్.ఎం.సి., హైదరాబాద్

సం/- స్పెషల్ కలెక్టర్, (భూ. సే.) &
కమీషనర్, జి. హెచ్.ఎం.సి., హైదరాబాద్

DIPR No. 241/LA/PP-Advt/Agency/2025-26

## భవన నిర్మాణ సంక్షేమ బోర్డును ఇన్సూరెన్స్ కంపెనీలకు అప్పచెప్పే

# ప్రతిపాదన ఉపసంహరించుకోవాల్సిందే

**సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివ రావు**

**తెలంగాణ బిల్డింగ్ అండ్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్(ఎఐటియుసి) హైదరాబాద్‌లో భారీ ధర్నా**



**ప్రజాపక్షం/హైదరాబాద్:** భవన నిర్మాణ సంక్షేమ బోర్డులో ప్రమాదవశాత్తు, సహజ మరణం చెందిన క్లెయిమ్‌లను ఇన్సూరెన్స్ కంపెనీలకు అప్పజెప్పాలనే ప్రభుత్వ నిర్ణయాన్ని తక్షణం ఉపసంహరించుకోవాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, సిపిఐ శాసనసభ పక్షనేత కూనంనేని సాంబశివ రావు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. భవన నిర్మాణ సంక్షేమ బోర్డును ఇన్సూరెన్స్ కంపెనీలకు అప్పగించాలనే ప్రతిపాదనను ఉపసంహకరించుకోవాలని డిమాండ్ చేస్తూ మంగళవారం హైదరాబాద్ ఆర్‌టిసి క్రాస్ రోడ్స్‌లోని కార్మిక శాఖ కమిషనర్ కార్యాలయం వద్ద తెలంగాణ బిల్డింగ్ అండ్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో భారీ ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాలో కూనంనేని సాంబశివ రావు మాట్లాడుతూ ఎన్నో పోరాటాలు చేసి సాధించుకున్న సంక్షేమ బోర్డును ఇన్సూరెన్స్ రంగాలకు ఇవ్వాలని ప్రభుత్వం ఆలోచన చేయడం బాధాకరమన్నారు. 2009 నుంచి మన రాష్ట్రంలో కార్మిక శాఖ ద్వారా కార్మికులకు పథకాలు అందుతున్నాయని, ఇప్పుడు ఎలాంటి కారణాలు లేకుండా బీమా రంగానికి అప్పచెప్పడం ఎంతవరకు సమంజసమన్నారు. రాష్ట్రంలో 15 లక్షలకుపైగా మంది భవన నిర్మాణ కార్మికులు సంక్షేమ బోర్డులో నమోదై ఉన్నారని తెలిపారు. భవన నిర్మాణ సంక్షేమ బోర్డు ద్వారా చెల్లిస్తున్న డబ్బులు కార్మిక శాఖ చేతులు దులిపేసుకొని, బీమా కంపెనీకి అప్పచెప్పడంలో మతలబు ఏంటో చెప్పాలన్నారు. అధికారులు ఎలాంటి కారణాలు చెప్పకుండా గోప్యంగా ఉంచడంలో అంతర్యం ఏమిటని కూనంనేని ప్రశ్నించారు. బీమా కంపెనీలకు అప్పచెప్పడం అంటే సంక్షేమ బోర్డు ఎత్తివేసే కుట్రలో భాగమే అని విమర్శించారు. ఇన్సూరెన్స్ రంగానికి ఇచ్చే టెండర్లను వెంటనే రద్దు చేయాలన్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు మాదిరిగానే భవన నిర్మాణ కార్మికులు, అసంఘటిత రంగంలో పనిచేస్తున్న కార్మికులకు పెన్షన్ సౌకర్యం కల్పించాలని కూనంనేని సాంబశివ రావు డిమాండ్ చేశారు.

**అంబానీ, ఆదానీలకు డబ్బులు ఇచ్చేందుకేనా?**

ఇప్పటికే దేశంలో సంపదను మొత్తం ఇద్దరు వ్యక్తుల సంస్థలు చట్టబద్ధంగా లూటి చేస్తున్నాయని కూనంనేని సాంబశివరావు అన్నారు. ఇన్సూరెన్స్ కంపెనీలలో డబ్బులు ఆదానీ, అంబానీలకు ప్రధాని మోదీ దోచిపెడుతున్నారని మండిపడ్డారు. భవన నిర్మాణ కార్మికుల డబ్బులను కూడా ఆదానీ, అంబానీలకు దోచిపెట్టేందుకే ఇన్సూరెన్స్ కంపెనీలకు అప్పగించాలనే నిర్ణయంలా ఉందని ఆయన అనుమానం వ్యక్తం చేశారు. నిర్మాణ రంగంలో ఒరిస్సా, ఛత్తీస్‌ఘడ్, జార్ఖండ్, బీహార్, యుపి, పశ్చిమ్‌బెంగాల్ రాష్ట్రాల నుంచి కార్మికులను తీసుకొచ్చి, వెట్టిచాకిరి చేయిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్మికులు చనిపోయిన వారికి డబ్బులు ఇవ్వడం లేదన్నారు.

**ఆర్‌టిసి, సింగరేణి తెలంగాణకు గుండె చప్పుడు..**

ఆర్‌టిసి, సింగరేణిలను ప్రైవేట్‌పరం చేసేందుకు కుట్రలు జరుగుతున్నాయని కూనంనేని సాంబశివరావు అన్నారు. ఆర్‌టిసి, సింగరేణి తెలంగాణకు గుండె చప్పుడు అన్నారు. వాటిని ప్రభుత్వరంగం నుంచి తప్పించి, ప్రైవేటీకరణ చేసేందుకు పెద్ద ఎత్తున కుట్రలు జరుగుతున్నాయని విమర్శించారు. అలాంటి కుట్రలను సమిష్టిగా కార్మికవర్గం తిప్పికొట్టాలని కూనంనేని పిలుపునిచ్చారు.

**గుట్టుచప్పుడు కాకుండా టెండర్లు ఆహ్వానించడంలో అంతర్యమేంటి? : యూసుఫ్, బాల్‌రాజ్**

ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షులు ఎం.డి. యూసఫ్, ప్రధాన కార్యదర్శి ఎస్. బాలరాజ్ మాట్లాడుతూ ఈ నెల నాలుగో తేదీన గుట్టు చప్పుడు కాకుండా సంక్షేమ బోర్డు అధికారులు ఇన్సూరెన్స్ కంపెనీ నుంచి టెండర్ కోరుతూ నోటిఫికేషన్ విడుదల చేశారని తెలిపారు. ఇన్సూరేన్స్ కంపెనీకి అప్పచెప్పడం వల్ల కార్మికులకు వచ్చే అదనపు ప్రయోజనాలు ఏంటో చెప్పడం లేదన్నా రు.

భవన నిర్మాణ సంక్షేమ బోర్డుకు కార్మిక సంగాల ప్రతినిధులతో బోర్డు వేయాలని డిమాండ్ చేశారు. నిజమైన కార్మికులను గుర్తించడంలో కార్మిక శాఖ మరింత లోతుగా పనిచేయాలని, తద్వారా కార్మికులకు న్యాయం జరుగుతుందని యూసుఫ్, బాల్‌రాజ్ అన్నారు. భవన నిర్మాణ సంక్షేమ బోర్డు క్లెయిములు బీమా కంపెనీలకు అప్పచెప్పే టెండర్లు వెంటనే రద్దు చేయక పోతే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ ధర్నా కార్యక్రమంలో తెలంగాణ బిల్డింగ్ అండ్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు మోటె నరసింహా, వర్కింగ్ ప్రెసిడెంట్ గన్నారపు రమేష్, అధ్యక్షులు ఎం. ప్రవీణ్ కుమార్, ప్రధాన కార్యదర్శి పల్లా దేవేందర్ రెడ్డి, ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి ఎం.డి. ఇమ్రాన్, మేకల శ్రీనివాస్, పానుగంటి పర్వతాలు, బిఓసి రాష్ట్ర ఉపాధ్యక్షులు జి. రాజు నూనె వెంకటేశ్వర్లు, గాదె లక్ష్మి నారాయణ, జి. పరమేశ్, సహయ కార్యదర్శిలు కమతం యాదగిరి, ఎస్. మల్లేష్, కె. వెంకటేశ్, మల్లికార్జున్, శివ శంకర్, కోశాధికారి కె. నర్సింహా రెడ్డి, సి.హెచ్. శ్రీనివాస్, గణేశ్, కాషయ్య, బి. కిషన్, రాజు, గోవర్ధన్, అశోక్, ఎన్. రామస్వామి, లక్ష్మ ణ్, లావణ్య, రాజమ్మ, రజిత పాల్గొన్నారు.

## తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు సుగుణ మృతి

**ప్రజాపక్షం/హైదరాబాద్/శేరిలింగంపల్లి:** తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు, సిపిఐ, మహిళా సమాఖ్య నాయకురాలు శాఖమూరి సుగుణ(91) సోమవారం రాత్రి 11 గంటలకు హైదరాబాద్ కొండాపూర్‌లోని చంద్ర రాజేశ్వరరావు (సిఆర్) ఫౌండేషన్ వృద్ధాశ్రమంలో తుదిశ్వాస విడిచారు. సుగుణ తెలంగాణ సాయుధ పోరాట యోధులు, సిపిఐ నేత దివంగత ఎస్.వి.కె. ప్రసాద్ భార్య. సుగుణ మరణ వార్త తెలిసిన వెంటనే అమెరికాలో ఉంటున్న ఆమె కుమార్తె డాక్టర్ శాఖమూరి శోభ, కుమారులు డాక్టర్ శాఖమూరి రవి, శాఖమూరి రమేష్ హైదరాబాద్‌కు బయలుదేరారు. వారు బుధవారం రాత్రికి హైదరాబాద్ చేరుకోనున్నారు. భౌతికకాయాన్ని పార్టీ, ప్రజా సంఘాల శ్రేణులు, శ్రేయోభిలాషుల సందర్శనార్థం 19వ తేదీ ఉదయం 08:30 గంటల నుంచి 11.00 గంటలవరకు సిఆర్ ఫౌండేషన్‌లో ఉంచుతారు. అనంతరం మధ్యా హ్నం 12 గంటల నుంచి 2 వరకు మియాపూర్‌లోని సుగుణ నివాసంలో ఉంచుతారు. అదేరోజు సాయంత్రం 4 గంటలకు ఫిలింనగర్‌లోని మహాప్రస్థానంలో సుగుణ అంత్యక్రియలు జరుగుతాయి.



**సిపిఐ, ప్రజాసంఘాల సంతాపం**

సుగుణ మరణ వార్త తెలిసిన వెంటనే మంగళవారం ఉదయం సిఆర్ ఫౌండేషన్ గౌరవాధ్యక్షులు, సిపిఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ, సిపిఐ తెలంగాణ కార్యదర్శి, ఎంఎల్‌ఎ కూనంనేని సాంబశివరావు ఆమె భౌతికకాయంపై కమ్యూనిస్టు పార్టీ జెండా కప్పి పుష్పాంజలి ఘటించారు. సిఆర్ ఫౌండేషన్ కార్యదర్శి చెన్నమనేని వెంకటేశ్వరరావు, కోశాధికారి వి.చెన్నకేశవ రావు, పాలిక్లినిక్ డైరెక్టర్ డాక్టర్ రజిని, మహిళా సంక్షేమ కేంద్ర డైరెక్టర్ జోస్యబట్ల కల్పన, ఎన్ఎఫ్ఐడబ్ల్యు నాయకురాలు పి.ప్రేమ్ పావని, డాక్టర్ నారాయణరావు, వృద్ధాశ్రమం సలహా కమిటీ సభ్యులు తమ్మారెడ్డి తానియా, డాక్టర్ మండవ గోపీచంద్, డాక్టర్ పి.సరస్వతి, ఎక్లెన్ ఎడ్యుకేషనల్ సంస్థ ప్రతినిధి ఎ.కె.జిలాని, మేనేజర్ శ్రీనివాస్, వృద్ధాశ్రమ వాసులు, సిబ్బంది ఆమె భౌతికకాయంపై పుష్ప గుచ్ఛాలుంచి శ్రద్ధాంజలి ఘటించారు. సుగుణ మృతి పట్ల సిపిఐ మాజీ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్ రెడ్డి, సిఆర్ ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి పల్లా వెంకటరెడ్డి, సిఆర్ ఫౌండేషన్ ఉపాధ్యక్షులు, సిపిఐ జాతీయ కార్యదర్శి, మాజీ ఎంపి సయ్యద్ అజీజ్ పాషా, తెలంగాణ సాయుధ పోరాట అమరవీరుల ట్రస్ట్ కార్యదర్శి, స్వాతంత్ర్య సమర యోధులు కంది మళ్ల ప్రతాపరెడ్డి ఆమె కుటుంబ సభ్యులకు సంతాపాన్ని, ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఆమె మృతికి ఎన్ఎఫ్ఐడబ్ల్యు జాతీయ సమితి, ఆంధ్రప్రదేశ్ తెలంగాణ మహిళా సమాఖ్య రాష్ట్ర శాఖలు ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశాయి. సుగుణ మరణం మహిళా ఉద్యమానికి, వామపక్ష ఉద్యమానికి తీరనిలోటు అని పేర్కొన్నాయి. ఆమె చివరి శ్వాసవరకు మహిళా ఉద్యమ శ్రేయోభిలాషిగా నేటి యువతరాన్ని ఉత్తేజ పరిచేందుకు వారి అనుభవాలను వ్యక్తం చేసేవారని తెలిపాయి.

## ఇరాన్-ఇజ్రాయెల్ ఉద్రిక్తతల నేపథ్యంలో ఢిల్లీ తెలంగాణ భవన్‌లో హెల్ప్‌లైన్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఇరాన్–ఇజ్రాయెల్ దేశాల మధ్య నెలకొన్న యుద్ధ వాతావరణం నేపథ్యంలో, ఆ ప్రాంతాల్లో నివసిస్తున్న లేదా ప్రయాణిస్తున్న తెలంగాణ వాసులు, విద్యార్థులకు సహాయం అందించేందుకు, తెలంగాణ ప్రభుత్వం ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో ప్రత్యేక హెల్ప్‌లైన్‌ను ప్రారంభించింది. విదేశాంగ వ్యవహారాల మంత్రిత్వ శాఖతో పాటు రెండు దేశాల భారత రాయబార కార్యాలయాల నుంచి లభించిన తాజా సమాచారం ప్రకారం, ఇప్పటివరకు తెలంగాణకు చెందిన వారెవరూ ప్రభావితమైనట్టు సమాచారం లేదు. అయినప్పటికీ, భవిష్యత్ పరిణామాల దృష్ట్యా ముందు జాగ్రత్తగా హెల్ప్‌లైన్ ఏర్పాటు చేయడమైనది. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఆదేశానుసారం, తెలంగాణ భవన్ సీనియర్ అధికారులు కేంద్ర విదేశాంగ మంత్రిత్వ శాఖతో, ఆయా దేశాల రాయబార కార్యాలయాలతో నిరంతరం సంప్రదిస్తూ అవసరమైతే తక్షణ సహాయం అందించేందుకు సిద్ధంగా ఉన్నారు.

**సహాయం కోసం ప్రజలు క్రింది నెంబర్లను సంప్రదించవచ్చు:**

వందన, పి.ఎస్, రెసిడెంట్ కమిషనర్ – +91 9871999044
జి.రక్షిత్ నాయక్, లైజన్ ఆఫీసర్ – +91 9643723157
జావేద్ హుస్సేన్, లైజన్ ఆఫీసర్ – +91 9910014749
సిహెచ్.చక్రవర్తి, పౌర సంబంధాల అధికారి– +91 9949351270

## రిజర్వేషన్ల కోసం బిసిలంతా ఏకం కావాలి

**తెలంగాణ జాగృతి రాష్ట్ర అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల**

**ప్రజాపక్షం/మెదక్ ప్రతినిధి :** బిసి రిజర్వేషన్ల కోసం బిసిలంతా ఏకం కావాలని, ప్రతి బిసి బిడ్డ మాట్లాడాలి, బిసిలలో చైతన్యం రావాలని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, బిఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత సూచించారు. బిసిలకు 42 శాతం రిజర్వేషన్ల కల్పించడానికి రాష్ట్ర అసెంబ్లీ పాస్ చేసిన బిల్లులను ఆమోదించాలని కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తూ జూలై 17న రాష్ట్రవ్యాప్తంగా రైల్ రోకో నిర్వహిస్తున్నట్లు ప్రకటించారు. అన్ని బిసి సంఘాల నాయకులను కలుపుకొని రైల్‌రోకో చేస్తామని, ఢిల్లీ పాలకులకు తెలంగాణ బిసిల పౌరుషాన్ని చాటుతామని తేల్చిచెప్పారు.



ఢిల్లీ పాలనలకు సెగ తాకేలా రైల్ రోకో ఉంటుందని స్పష్టం చేశారు. మెదక్ జిల్లా కేంద్రంలో యునైటెడ్ పూలే ఫ్రంట్, తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో కామారెడ్డి డిక్లరేషన్ రాజ్యాంగ బద్ధంగా 42 శా తం రిజర్వేషన్ సాధన కోసం బిసి రౌండ్ టేండ్ సమావేశాన్ని జిల్లా కేంద్రంలోని హెచ్ కన్వెన్షన్‌లో ఏర్పాటు చేశారు సమావేశానికి ఎమ్మె ల్సీ కవిత ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించకుండా స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించనివ్వబోవమని హెచ్చరించారు. మెదక్ బిజెపి ఎంపీ రఘునందన్ రావు బీసీ బిల్లు గురించి ఒక్క రోజు కూడా మాట్లాడలేదని ధ్వజమెత్తారు. రఘునందన్ రావు బీసీల కోసం ఎందుకు మాట్లాడడం లేదని నిలదీశారు. కార్యక్రమంలో యుపిఎఫ్ స్టేట్ కన్వీనర్ బొల్లా శివ శంకర్, స్టేట్ కో ఆర్డినేటర్ అలకుంట హరి, తెలంగాణ జాగృతి ప్రధాన కార్యదర్శి రంగు నవీన్ ఆచారి, నాయకులు సంపత్ గౌడ్, ఈగ సంతోష్, నరేందర్ యాదవ్, లలిత యాదవ్‌లు పాల్గొన్నారు.

## టూరిజం ప్లాజాలో మంత్రి జూపల్లి ఆకస్మిక తనిఖీలు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** టూరిజం ప్లాజా హోటల్స్‌లో పరిశుభ్రత పాటించాలని, ఆహారంలో నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరిగా ఉండాలని పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అధికారులను ఆదేశించారు. బేగంపేటలోని టూరిజం ప్లాజా హోటల్‌లో మంగళవారం ఉదయం మంత్రి జూపల్లి ఆకస్మిక తనిఖీలు చేశారు. రెస్టారెంట్ అంతా కలియతిరుగుతూ.. ఆహార పదార్థాలను, కిచెన్‌ను పరిశీలించారు. అల్పాహారం చేస్తున్న పర్యాటకులు, అతిథులతో మంత్రి జూపల్లి మాట్లాడారు. ఆహార నాణ్యత, రుచి గురించి ఆరా తీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. హరిత హోటల్స్‌లో సౌకర్యాలు, ఆహార నాణ్యతపై నిరంతరం పరిశీలన కొనసాగిస్తామని, నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రభుత్వ ఆదాయం పెంచడంతో పాటు పర్యాటకులు, అతిథుల కోసం మెరుగైన సౌకర్యాలు, వసతుల కల్పనపై ప్రధానంగా దృష్టి పెడుతున్నామని అన్నారు. ఆహ్లాదకరమైన వాతారణం ఉండేలా హరిత హోటల్స్‌ను తీర్చిదిద్దుతామని చెప్పారు.




**గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్**
సూపరింటెండింగ్ ఇంజనీర్ / సిటిఓ కార్యాలయం, శేరిలింగంపల్లి జోన్: జిహెచ్ఎంసి
మెయిల్: sew.ghmc@gmail.com సెల్ నం. 7337367271

NIT No. 03/SE-CTO/SLPZ/GHMC/2025-26 — 'ఇ' ప్రొక్యూర్‌మెంట్ నోటీసు — తేది: 16.06.2025

**పని పేరు:** సిటిఓ, ఎస్ఎల్‌పిజెడ్, జిహెచ్ఎంసిలోని ఐదు మొబైల్ టాయిలెట్ల నిర్వహణ. (01 అంశం), **అంచనా విలువ / ఇసివి:** రూ.45.00లక్షలు, **బిడ్స్ స్వీకరణకు ప్రారంభ తేది / ఆఖరి తేది & సమయం:** 18.06.2025న మ.1.00గం.ల నుండి 25.06.2025న మ.1.30గం.ల వరకు, **అధికారి పేరు & చిరునామా:** ఎస్ఇ-సిటిఓ, ఎస్ఎల్‌పిజెడ్, జిహెచ్ఎంసి. సెల్ నం. 7337367271.

సం/- సూపరింటెండింగ్ ఇంజనీర్ / సిటిఓ కార్యాలయం,
శేరిలింగంపల్లి జోన్: జిహెచ్ఎంసి

DIPR R.O. No. : 3666-PP/CL/ADVT/1/2025-26, Date: 17-06-2025

**తెలంగాణ ప్రభుత్వం**
**పర్యవేక్షక అధికారి కార్యాలయం, నీటి పారుదల శాఖ, కామారెడ్డి జిల్లా.**

**టెండర్ నోటీస్ నంబర్:** 09/SE/IC/KMR/2025-26, Dt: 16-06-2025, రూ.21.32 లక్షలకు (SDF) **పని లభ్యమగు తేది:** 17.06.2025, ఉదయం 11:00 గం. నుండి 23.06.2025 సాయంత్రం 5:00 గం. వరకు టెండర్లు ఆహ్వానించనైనది. మిగతా వివరాలకు మార్కెట్ ప్లేస్ https://tender.telangana.gov.in లో చూడగలరు.

సం/- A/c. సూపరింటెండింగ్ ఇంజనీర్,
ఇరిగేషన్ సర్కిల్, కామారెడ్డి.

DIPR R.O. No. : 3677-PP/CL/ADVT/1/2025-26, Date: 17-06-2025

**తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, పురపాలక సంఘం ఆర్మూర్, జిల్లా: నిజామాబాద్**

E1/03/MCA/2025-26, — కొటేషన్ నోటీస్ — తేది: 17.06.2025

పట్టణములో వనమహోత్సవములో భాగముగా ప్రతి ఇంటికి మొక్కలను పంచుటకు గాను ఒక్కో హెమ్ స్టీడ్ మొక్కకు రేటు కొరకు, అవెన్యు ప్లాంటేషన్‌లో భాగముగా నాటబడు మొక్కల రేట్ల కొరకు, జైల్ డిపార్ట్మెంట్ అర్సపల్లి నుండి ఆర్మూర్ వరకు 70,000ల మొక్కలను రవాణ చేయుటకు ట్రాన్స్పోర్టేషన్ రేటు & లోడింగ్ అన్‌లోడింగ్ రేటు కొరకు, 6 ఫీట్ల నుండి 18 ఫీట్ల వరకు ఎత్తు గల బ్యాంబుస్టిక్స్ రేటు కొరకు, ప్లాస్టిక్/హెచ్‌ఐపిఇ/ ఐరన్ ట్రీ గార్డ్స్ రేటు కొరకు, L/XL/XXL సైజు రేయిన్ కోట్ల(Men/Women) రేటు కొరకు, 18 వాట్స్ నుండి 190 వాట్స్ వరకు ఎల్.ఇ.డి లైట్ల డ్రైవర్స్, పిసిబి, డిఫ్యుసర్స్, సెన్సార్స్, యం.సి.బి, కాంట్రాక్టర్ల రేట్ల కొరకు, ఆలమ్, క్లోరిన్, పాలి అల్యుమినియం క్లోరైడ్ రేట్ల కొరకు, 0.50 హెచ్.పి. నుండి 7.50 హెచ్.పి వరకు సబ్‌మర్సిబుల్ మోటర్ల మరమ్మత్తులకు, రివైండింగ్ రేట్ల కొరకు, వివిధ రకాల ప్యానల్ బోర్డుల మరమ్మత్తుల రేట్ల కొరకు మరియు నీటి సరఫరా లీకేజీల అరికట్టుటలో భాగముగా Non-SSR ఐటమ్స్ రేట్ల కొరకు కొటేషన్లు కోరుచున్నాము. ఇట్టి కొటేషన్లు తేది: 20.06.2025 సా.4:00 గం.లోపు కార్యాలయములో సమర్పించగలరు. ఇట్టి కొటేషన్లను తేది: 21.06.2025 ఉ.11:30 లకు కార్యాలయములో తెరువబడును.

సం/- కమీషనర్
పురపాలక సంఘం, ఆర్మూర్

DIPR R.O. No. : 3661-PP/CL/ADVT/1/2025-26, Date: 17-06-2025

ప్రజాపక్షం
బుధవారం, 18 జూన్

# ఇక చాలు, యుద్ధం ఆపండి!

ఇరాన్‌పై ఇజ్రాయెల్ మిస్సిలీ దాడులు, టెహరాన్ ఎదురుదాడులు మంగళవారం ఐదవరోజులో ప్రవేశించాయి. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కెనడాలో జి7 అగ్రనాయక సమావేశం నుండి మధ్యలోనే హడావిడిగా వాషింగ్టన్ ప్రయాణమయ్యారు. ఇజ్రాయెల్–ఇరాన్ మధ్య కాల్పుల విరమణ సాధించే అత్యవసర పనులున్నాయని ఆయన సూచనప్రాయంగా చెప్పారు. యుద్ధం ముగించేందుకు ఇరాన్ ట్రంప్ సహాయం కోరినట్లు ఫ్రెంచి అధ్యక్షుడు ఇమాన్యూల్ మాక్రాన్ జి7 సమావేశ ప్రాంగణం వద్ద తెలియజేశారు. జూన్ 13 తెల్లవారుఝాము నుండి ఘటనల క్రమాన్ని చూసినట్లయితే ఒక విషయం స్పష్టమవుతుంది. ఇజ్రాయెల్ ఆకస్మికంగా ఇరాన్ అణుకేంద్రాలు, ఇతర రక్షణ దుర్గాలపై బాంబుల వర్షం నుండి జి7 నుంచి ట్రంప్ ఆకస్మిక నిష్క్రమణ వరకు ఇదంతా ట్రంప్ – నెతన్యాహు ముందస్తు పథకం ప్రకారం నిర్వహించినట్లుగా ఉంది. తమ అణు కార్యక్రమంపై అమెరికాతో తదుపరి రౌండ్ చర్చలకు ఇరాన్ ఎటువంటి బేరసారాల శక్తి లేకుండా కాళ్లీడ్చుకుంటూ వచ్చేటట్లు చేయటం ట్రంప్ ధ్యేయం. విజేత అయిన నెతన్యాహును, కకావికమైన ఇరానీయన్ నాయకులను చర్చల బల్ల వద్దకు తీసుకురావటం ద్వారా తాను శాంతిదూతగా ఆవిర్భవించటం ట్రంప్ ఎత్తుగడ. కాగా ఇజ్రాయెల్ లక్ష్యాలు రెండు ఒకటి, ఇజ్రాయెల్‌కు ఇరాన్ అణు ప్రమాదం లేకుండా చేయటం. రెండవది, వీలైతే టెహరాన్‌లో ప్రభుత్వాన్ని మార్చటం. తిరుగుబాటు చేయాల్సిందిగా నెతన్యాహు ఇరానీయన్‌లకు పిలుపు ఇచ్చాడుకూడా. ఇరాన్ సుప్రీం నాయకుడు అయతుల్లా ఖమేనీ నివాసం సమీపంలో ఇజ్రాయెల్ బాంబులుపడ్డాయి కూడా. ఇజ్రాయెల్‌కు ఖమేనీని చంపే కార్యక్రమం ఉందని, తాను ఖండించానని ట్రంప్ చెప్పటం గమనార్హం.

ట్రంప్ వ్యవహారం ఎలా ఉందంటే ఇజ్రాయెల్ – ఇరాన్ యుద్ధం గూర్చి ఇజ్రాయెల్ చర్యలన్నీ తనకు తెలుసు అంటూనే, తనకు చెప్పకుండానే నెతన్యాహు దాడులకు దిగాడని బుకాయిస్తున్నట్లుగా ఉంది.

ఇరాన్ అణు కార్యక్రమంపై ఆరవ దఫా చర్చలు ఆదివారం (జూన్15)నాడు ఒమన్ రాజధాని మస్కట్‌లో జరగాల్సి ఉండింది. తన షరతుల ప్రకారం ఒప్పందాన్ని ట్రంప్ కోరుకున్నాడు. అయితే అమెరికా ఆదేశాలకు తలవంచే స్థితిలో ఇరానీయన్‌లు లేనందున ట్రంప్‌కు సానుకూలమైన సమాధానం రాలేదు. అంతకు రెండు రోజుల ముందు ఇరాన్‌పై ఇజ్రాయెల్ క్షిపణిదాడులు మొదలైనాయి. అణుశక్తి వసతులు దెబ్బతిన్నాయి, 9మంది అగ్రశ్రేణి అణు శాస్త్రవేత్తలు, పలువురు మిలటరీ కమాండర్‌లు హతమైనారు. ఇరాన్ ప్రతీకార దాడుల్లో ఇజ్రాయెల్ నగరాల్లో కూడా విధ్వంసం జరిగింది. ఇజ్రాయెల్ ఆధిక్యత సాధించినట్లే కనిపిస్తున్నది. అంతమాత్రాన లొంగుబాటు ఊహించలేము.

ఈ పరస్పర విధ్వంసం ఇలా సాగవలసిందేనా! ఎన్నాళ్లూ? జి.7 దేశాలు అగ్నికి ఆజ్యం పోస్తున్నాయి. ఆ నాయకులు ఇజ్రాయెల్ ఆత్మరక్షణ హక్కును బలపరుస్తూ, మధ్య ప్రాచ్యంలో అస్థిరతను తెచ్చింది ఇరాన్ అని నిందిస్తూ ఒక ప్రకటన ఆమోదించారు. ఆత్మరక్షణహక్కు ఇజ్రాయెల్‌కేనా, ఇరాన్‌కు లేదా? ఉద్రిక్తతలు తగ్గించి శాంతిస్థాపనకు చొరవ చేయాల్సిన పెద్దమనుషులు ఎప్పటివలె పక్షపాతం ప్రదర్శించారు. వారంతా ట్రంప్ వెంట ఉన్నారు. ఇదిలావుండగా, యుద్ధానికి స్వస్తి చెప్పి చర్చలకు సిద్ధపడాల్సిందిగా చైనా, రష్యా, తుర్కియె (టర్కీ)లు ఇరాన్, ఇజ్రాయెల్‌లకు విజ్ఞప్తి చేశాయి. ఉద్రికతల సడలింపునకు తక్షణ చర్యలు తీసుకుని, ఆ ప్రాంతం పెద్దఎత్తున కల్లోలంలో చిక్కుకోకుండా కాపాడాలని చైనా విజ్ఞప్తి చేసింది. కాగా తక్షణం కాల్పుల విరమణ పాటించాలని, ఇరాన్ అణు కార్యక్రమం సహా వివాదాస్పద సమస్యలన్నిటినీ రాజకీయంగా, దౌత్యపరంగా చర్చల ద్వారా పరిష్కరించుకోవాలని రష్యా, తుర్కియె నాయకులు విజ్ఞప్తి చేశారు.

శాంతియుత ప్రయోజనాలకు అణుశక్తిని వినియోగించే హక్కు తమకు ఉందని, అందుకు లోబడే అణుశుద్ధి కార్యక్రమం సాగిస్తున్నామన్నది ఇరాన్ వాదన. అణుబాంబు తయారీకి ఇరాన్ చేరువలో ఉందని, అది ఇజ్రాయెల్ అస్థిత్వానికి ముప్పు అన్నది అమెరికా, ఇజ్రాయెల్ వాదన. ఇరాన్ అణు కార్యక్రమం విరమించుకోవాలన్నది వాటి డిమాండ్. ఈ వైరుధ్యం మధ్యలో అంతర్జాతీయ అణుశక్తి సంస్థ కూడా ఉల్లంఘనలకు పాల్పడిందని ఆరోపించింది. ఈ సంఘర్షణలో ఇరాన్ అరబ్ ప్రపంచం నుంచీ ఏకాకి అయింది.

# జనాభా కంటే ఓటర్ల ఆధారంగా పునర్విభజన!

**అనీశ్ గుప్తా**

నియోజకవర్గాల పునర్విభజన కసరత్తులో పార్లమెంటరీ నియోజకవర్గాల కేటాయింపునకు జనాభాను ప్రాథమిక ప్రమాణంగా పరిగణిస్తే దక్షిణ రాష్ట్రాలకు అసమానంగా నష్టం కలుగుతుందని ఇటీవల ప్రధాన స్రవంతి మీడియాలో అనేక కథనాలు వస్తున్నాయి. ఈ అభిప్రాయానికి మద్దతుదారులు వాదించేదేమిటంటే, ఉత్తర రాష్ట్రాల కంటే కుటుంబ నియంత్రణ నిబంధనలను మరింత కఠినంగా పాటించిన దక్షిణ రాష్ట్రాలకు, సాపేక్షంగా తక్కువ పార్లమెంటరీ స్థానాలు లభిస్తాయి లేదా ప్రస్తుతం ఉన్న సీట్ల కంటే కూడా తగ్గుతాయి.

అయితే, తగినంతగా చర్చించబడని విస్తృతమైన ప్రశ్న ఏమిటంటే: పార్లమెంటరీ నియోజకవర్గాల కేటాయింపునకు అత్యంత హేతుబద్ధమైన ప్రమాణాలు ఏమిటి: జనాభానా లేదా ఓటర్ల సంఖ్యనా?

నియోజకవర్గంలోని ఓటర్లు ఎల్లప్పుడూ జనాభాలో అంతర్భాగంగా ఉండబోరు. చాలా మంది ఓటర్లు తాము నమోదు చేసుకున్న పార్లమెంటరీ నియోజకవర్గాల వెలుపల నివసించవచ్చు లేదా నమోదు చేసుకోవడంలో విఫలమై ఉండవచ్చు. జనాభా లెక్కల రికార్డులలో వలసల వివరాలు అంతగా ఉండవు. ఎందుకంటే అవి కేవలం ఆరు నెలలు లేదా అంతకంటే ఎక్కువ కాలం నివాసం (లేదా నివసించాలనే ఉద్దేశ్యం)పై ఆధారపడి ఉంటాయి. వలస జీవులకు నివాస రుజువు అవసరం ఉండదు లేదా ఓటరు జాబితాలో నమోదు చేసుకోవాల్సిన అవసరం లేదు. వలసదారులు సాధారణంగా వివిధ కారణాల వల్ల తమ ఓటును బదిలీ చేయడాన్ని నివారించవచ్చు/ఆలస్యం చేయవచ్చు. అంతేకాకుండా,18 ఏళ్లలోపు వయసు కలిగిన వారు ఎక్కువ సంఖ్యలో ఉన్న సందర్భాలలో సమాన జనాభా కలిగిన పార్లమెంటరీ నియోజకవర్గాల మధ్య ఓటర్ల సంఖ్యలో పెద్ద తేడాలకు దారితీయవచ్చు. ముఖ్యంగా, 'ఒక వ్యక్తి, ఒక ఓటు, ఒక విలువ' అనే సూత్రం జనాభా కంటే ఓటర్లతో ఎక్కువగా సరిపోలుతుంది. ఓటరు డేటాను ఉపయోగించడం ద్వారా జనగణన కోసం వేచి ఉండే అవసరాన్ని నిరోధిస్తుంది. ప్రాతినిధ్యానికి సంబంధించి మరింత కచ్చితమైన కొలమానాన్ని అందిస్తుంది.

**ఓటరు అసమానత**

ఓటు విలువను ఒక పార్లమెంటరీ నియోజకవర్గంలో ఓటర్ల సంఖ్య కు విలోమ అనుపాతం(ఇన్వర్స్లీ ప్రపోర్షనల్)లో పరిగణించవచ్చు. డేటా ప్రకారం, ఓటు విలువ ప్రాంతాలవారీగా, కాలక్రమేణా గణనీయంగా మారుతూ వచ్చింది. కేంద్రపాలిత ప్రాంతాలు, కొండ ప్రాంత రాష్ట్రాలు, ఈశాన్య రాష్ట్రాలు 1951 నుండి 2024 వరకు స్థిరంగా అధిక ఓటు విలువను కలిగి ఉన్నాయి. భౌగోళిక అంశాలు, ప్రతి రాష్ట్రం నుండి కనీస ప్రాతినిధ్య అవసరం కారణంగా ఇది జరిగింది.

దక్షిణ రాష్ట్రాలను ఇతర రాష్ట్రాలతో పోల్చినప్పుడు, అవి 1951లో అధిక ఓటు విలువతో ప్రారంభమయ్యాయని కనుగొన్నాము. అయితే, ఈ ధోరణి 1961, 1971, 1980, 1991,1999లో తలకిందులుగా మారి ఓటు విలువ తగ్గదలను నమోదు చేశాయి. ఈ ధోరణి మరోసారి తలకిందులైంది. దక్షిణ రాష్ట్రాలు 2009, 2019, 2024లో అధిక ఓటు విలువను నమోదు చేశాయి. ఇది ఒక మిశ్రమ నమూనాను ప్రదర్శిస్తుంది. దక్షిణ రాష్ట్రాలు, ఇతర రాష్ట్రాల మధ్య సగటు ఓటర్ల సంఖ్యలో వ్యత్యాసం 10.5శాతం నుండి +5శాతం వరకు ఉంటుంది.

ముఖ్యంగా, 1951లో మొదటి పార్లమెంటు ఏర్పడినప్పుడు, దక్షిణ రాష్ట్రాలు ప్రతి పార్లమెంటరీ నియోజకవర్గానికి అధిక ఓటు విలువతో ప్రారంభమయ్యాయి. ఈ ప్రారంభ ప్రయోజనం ప్రభు త్వ విధానాలు, కార్యక్రమాలు, అభివృద్ధి ఫలితాలు, ఇతరములలో దీర్ఘకాలిక ప్రభావాలను కలిగి ఉండవచ్చు.

అంతేకాకుండా, ఓటర్ల పరంగా ఐదు అతిపెద్ద , ఐదు అతి చిన్న పార్లమెంటరీ నియోజకవర్గాలలో (కొండ ప్రాంతాలు/కేంద్రపాలిత ప్రాంతాలు/ఈశాన్య ప్రాంతాలు మినహా), ప్రతి సమూహంలో నాలుగు దక్షిణ రాష్ట్రాల నుండి ఉన్నాయి. ఇడుక్కిలో ఓటు విలువ మల్కాజ్‌గిరి కంటే 4.5 రెట్లు ఎక్కువ, ఉత్తర బెంగళూరు కంటే 2.6 రెట్లు ఎక్కువ. ఇది దక్షిణ రాష్ట్రాలలో పార్లమెంటరీ నియోజకవర్గాల మరింత హేతుబద్ధీకరణ అవసరాన్ని సూచిస్తుంది.

**రాజ్యసభ ప్రాతినిధ్యం**

2024 నాటి ఓటరు డేటా ప్రకారం, దక్షిణ రాష్ట్రాలు భారతదేశంలోని మొత్తం ఓటర్లలో కేవలం 22.45 శాతం మాత్రమే ఉన్నప్పటికీ, అవి లోక్‌సభ స్థానాల్లో 23.8 శాతం కలిగి ఉన్నాయి. రాజ్యసభలో వాటి ప్రాతినిధ్యం ఓటర్లు, లోక్‌సభ స్థానాల కంటే ఎక్కువగా 24.4 శాతంగా ఉంది. ఇతర రాష్ట్రాలకు ఈ నమూనా భిన్నంగా ఉంది. అవి భారతదేశంలోని మొత్తం ఓటర్లలో 71.2 శాతం ఉన్నప్పటికీ, లోక్‌సభ స్థానాల్లో కేవలం 67.4 శాతం, రాజ్యసభ స్థానాల్లో కేవలం 64.4శాతం మాత్రమే కలిగి ఉన్నాయి. ప్రత్యేకించి, తమిళనాడుకు 39 లోక్‌సభ స్థానాలు ఉన్నాయి. ఇది బీహార్‌లోని 40 లేదా పశ్చిమ బెంగాల్‌లోని 42 కంటే తక్కువ; కానీ దానికి 18 రాజ్యసభ స్థానాలు ఉన్నాయి. ఇది బీహార్, పశ్చిమ బెంగాల్ రెండింటికీ కేటాయించిన 16 స్థానాల కంటే ఎక్కువ.

ఓటర్ల ఆధారంగా సీట్లను కేటాయించడం మరింత ఉత్తమమైన విధానం. చిన్న రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు నష్టం జరగకుండా, వాటి ప్రస్తుత సీట్ల సంఖ్యను నిలుపుకుంటాయి. దీని ఫలితంగా మొత్తం సీట్ల సంఖ్య 810 అవుతుంది. పట్టిక ప్రకారం, పెద్ద రాష్ట్రాలలో, రాజస్థాన్ (76 శాతం), కర్ణాటక (60.7శాతం), తెలంగాణ (58.8 శాతం) సీట్లలో అత్యధిక శాతం లాభాలను చూస్తాయి.

పార్లమెంటరీ నియోజకవర్గాలను కేవలం జనాభా ఆధారంగానే కేటాయిస్తున్నారని, దక్షిణ రాష్ట్రాలలో ప్రధానంగా కుటుంబ నియంత్రణ విధానాలకు కఠినంగా కట్టుబడి ఉన్నందునే సీట్ల తగ్గించే అవకాశం ఉందని ప్రస్తుత కథనాలు పూర్తిగా కచ్చితమైనవి కావు. మొదటిది, నియోజకవర్గ కేటాయింపు ఎప్పుడూ కేవలం జనాభా ఆధారంగానే జరగలేదు. ఇతర పరిగణనలు, అంటే భౌగోళిక సవాళ్ళు, కనీస ప్రాతినిధ్యం ఎల్లప్పుడూ పాత్ర పోషించాయి. రెండవది, రాజకీయ ప్రాతినిధ్యాన్ని జనాభా నియంత్రణకు ముడిపెట్టడం ప్రమాదకరమైన సాంప్రదాయం ఏర్పరుస్తుంది. ఆ తర్కం ప్రకారం, మతం లేదా కులం ఆధారంగా ప్రాతినిధ్యం కోసం ఇలాంటి వాదనలు చేయవచ్చు. ఉదాహరణకు, అన్ని మత సమూహాలలో, అన్ని సామాజిక సమూహాలలో, ఉన్నత కులాల వారిలో, జైనులు జనాభా నియంత్రణకు అత్యధికంగా పాటిస్తారు. అయితే, ముస్లింలు, షెడ్యూల్డ్ తెగలకు సాపేక్షంగా అధిక సంతానోత్పత్తి రేట్లు ఉన్నాయి. మూడవది, నిజానికి పార్లమెంటరీ నియోజకవర్గాల ఏర్పాటుకు జనాభా లెక్కలను ప్రమాణంగా తీసుకున్నప్పుడు భారీ స్థాయి వలసలను ఊహించలేదు. కాబట్టి 'ఒక వ్యక్తి, ఒక ఓటు, ఒక విలువ' అనే సూత్రం వాస్తవ అర్థంలో పార్లమెంటు నియోజకవర్గాల వారీగా జనాభా కంటే ఓటర్ల సంఖ్య ఆధారంగా జరిగితే దగ్గరగా ఉంటుంది.

**2024 ఓటర్ల జాబితా ఆధారంగా ఓటర్ల ప్రాతిపదికన పార్లమెంటరీ నియోజకవర్గాల ప్రతిపాదిత సంఖ్య**

| రాష్ట్రాలు/ కేంద్ర పాలిత ప్రాంతాలు (1) | ప్రస్తుత సీట్లు (2) | ఓటర్లు (3) | ప్రతిపాదిత సీట్లు (4) | సర్దుబాటు చేసిన సీట్లు** (5) | పెరుగుదల (6) |
|---|---|---|---|---|---|
| ఆంధ్రా | 25 | 4,14,01,087 | 33.9 | 34 | 36 |
| కర్నాటక | 28 | 5,47,72,332 | 44.9 | 45 | 60.7 |
| కేరళ | 20 | 2,78,07,008 | 22.7 | 23 | 15 |
| తమిళనాడు | 39 | 6,24,04,947 | 51 | 51 | 30.8 |
| తెలంగాణ | 17 | 3,32,32,315 | 27.2 | 27 | 58.8 |
| బీహార్ | 40 | 7,72,59,579 | 63.2 | 63 | 57.5 |
| చత్తీస్‌గఢ్ | 11 | 2,06,78,667 | 16.9 | 17 | 54.5 |
| గుజరాత్ | 26 | 4,80,09,945 | 39.3 | 39 | 50 |
| హర్యానా | 10 | 2,01,87,911 | 16.5 | 17 | 70 |
| జార్ఖండ్ | 14 | 2.58.77,892 | 21.2 | 21 | 50 |
| మధ్యప్రదేశ్ | 29 | 5,66,68,852 | 46.4 | 46 | 58.6 |
| మహారాష్ట్ర | 48 | 9,30,61,760 | 76.1 | 75 | 58.3 |
| ఢిల్లీ | 7 | 1,52,14,638 | 12.4 | 13 | 85.7 |
| ఒడిశా | 21 | 3,37,16,965 | 27.6 | 28 | 33.3 |
| పంజాబ్ | 13 | 2,15,67,196 | 17.6 | 18 | 38.5 |
| రాజస్థాన్ | 25 | 5,35,08,010 | 43.8 | 44 | 76 |
| ఉత్తర ప్రదేశ్ | 80 | 15,44,03,112 | 126.3 | 126 | 57.5 |
| పశ్చిమ బెంగాల్ | 42 | 7,61,24,780 | 62.3 | 62 | 47.6 |
| అండమాన్ నికోబార్ దీవులు | 1 | 3,15,745 | 0.3 | 1 | 0 |
| అరుణాచల్‌ప్రదేశ్ | 2 | 8,98,442 | 0.7 | 2 | 0 |
| అస్సాం | 14 | 2,45,72,114 | 20.1 | 20 | 42.9 |
| చండీగఢ్ | 1 | 6,60,552 | 0.5 | 1 | 0 |
| దాద్రానగర్ హవేలీ దయ్యుడామన్ | 2 | 4,17,236 | 0.3 | 2 | 0 |
| గోవా | 2 | 11,79,644 | 1 | 2 | 0 |
| హిమాచల్ | 4 | 57,11,969 | 4.7 | 5 | 25 |
| జమ్మూ కశ్మీర్ | 5 | 88,02,348 | 7.2 | 7 | 40 |
| లద్దాఖ్ | 1 | 1,90,576 | 0.2 | 1 | 0 |
| లక్షద్వీప్ | 1 | 57,953 | 0 | 1 | 0 |
| మణిపూర్ | 2 | 20,51,357 | 1.7 | 2 | 0 |
| మేఘాలయ | 2 | 20,30,451 | 1.8 | 2 | 0 |
| మిజోరం | 1 | 8,61,327 | 0.7 | 1 | 0 |
| నాగాలాండ్ | 1 | 13,25,383 | 1.1 | 1 | 0 |
| పుదుచ్చేరి | 1 | 10,24,024 | 0.5 | 1 | 0 |
| సిక్కిం | 1 | 4,66,643 | 0.4 | 1 | 0 |
| త్రిపుర | 2 | 28,70,986 | 2.3 | 3 | 50 |
| ఉత్తరాఖండ్ | 5 | 84,31,101 | 6.9 | 7 | 40 |
| లోక్‌సభ స్థానాలు | 543 | 97,79,65,560 | 500 | 810 | 49.2 |

** దగ్గరి అంకెతో సరిచేయబడింది

(ది హిందూ సౌజన్యంతో...)

## కాళేశ్వరం విచారణతో కాలయాపన చేయకుండా..

# ప్రత్యామ్నాయ ఏర్పాట్లు

కాళేశ్వరం ప్రాజెక్టు ప్రపంచంలోనే అతి పెద్దదైన ఎత్తిపోతల పథకమని.. ఇది తెలంగాణకు కల్పతరవని బిఆర్‌ఎస్ నాయకులు గొప్పగా చెబుతుంటారు. గోదావరి నది జలాలను ఎత్తిపోసేదే కాళేశ్వరం ప్రాజెక్టు. దీనిలో ప్రధాన బ్యారేజీలు మూడు. అవి మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల.. ఈ బ్యారేజీలు గోదావరి నదికి అడ్డంగా చేపట్టడం జరిగింది. మేడిగడ్డ నుండి అన్నారంకు, అక్కడి నుండి సుందిళ్లకు, అక్కడి నుండి ఎల్లంపల్లికి నీటిని ఎత్తిపోస్తూ దాదాపు 141 టిఎంసిల సామర్థ్యంతో 15 రిజర్వాయర్లు చేపట్టడం జరిగింది. దీనికి అంచనా వ్యయం రూ.85 వేలకోట్ల నుండి రూ.1.20 లక్షల కోట్లకు పెరిగింది. అందులో రంగనాయక సాగర్, మల్లన్న సాగర్, కొండపోచమ్మ సాగర్‌తో పాటు మరికొన్ని రిజర్వాయర్లు నిర్మాణంలో ఉన్నాయి. ఇవి ఏవి పూర్తిగా పనులు కాలేదు. పూర్తిస్థాయిలో భూసేకరణ గాని.. భూములు కోల్పోతున్న రైతులకు.. ఇండ్లు, ఆస్తులు కోల్పోతున్న వారికి పూర్తి నష్టపరిహారం అందలేదు. అయితే ప్రధానంగా ఎత్తిపోసే మేడిగడ్డ బ్యారేజ్‌ని 7 బ్లాకులుగా 85 పియర్లుగా నిర్మించడం జరిగింది. ఈ ప్రాజెక్టు ద్వారా తెలంగాణలోని 13 జిల్లాలలో వివిధ ప్రాజెక్టుల కింద, రిజర్వాయర్ల కింద పాత ఆయకట్టును స్థిరీకరించి, కొత్తగా 20,33,572 ఎకరాలకు సాగునీరుతో పాటు హైదరాబాద్ నగరానికి తాగునీరు అందించే విధంగా రూపొందించిన అతి పెద్ద ప్రాజెక్టు అని కెసిఆర్, కెటిఆర్, హరీష్‌రావుతో పాటు బిఆర్‌ఎస్ నాయకులు పదేపదే చెప్పుకుంటూ వస్తున్నారు.



**కాళేశ్వరం ఎత్తిపోతలు**

2009లో ఆనాటి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రాణహిత నది గోదావరి నదిలో కలిసే ప్రాంతం తుమ్మిడిహట్టి వద్ద ప్రాణహిత చేవెళ్ల ఎత్తిపోతల పథకాన్ని ద్వారా 16.5 లక్షల ఎకరాలకు సాగుతో పాటు తాగునీటి అవసరాలకు కోసం రూ.32 వేల కోట్లతో చేపట్టింది. దాదాపుగా రూ.10 వేల కోట్లు 2013 వరకు ఖర్చుచేసి కొంత భూసేకరణ, కాలువల పనులు చేపట్టారు.. 2014లో అధికారంలోకి వచ్చిన బిఆర్‌ఎస్ ప్రభుత్వం అక్కడ నీరు లభ్యత తక్కువగా ఉంటుందని.. కెసిఆర్ రీ డిజైన్ చేసి కాళేశ్వరానికి దిగువన మేడిగడ్డ వద్ద బ్యారేజీ నిర్మిస్తే త్రివేణి సంగమంతో 200 టిఎంసిల పుష్కలమైన నీరు ఉంటుందని, గోదావరి, ప్రాణహిత, సరస్వతి నదుల అనుసంధానంతో వచ్చిన నీటిని ఒడిసిపెట్టి ఉత్తర, దక్షిణ తెలంగాణకు నీరు ఎత్తిపోయవచ్చని 2016 మే 2న కాళేశ్వరానికి శంకుస్థాపన చేశారు. ప్రధాన ప్రాజెక్టులో ప్రధాన మెయిన్ కెనాల్, కొన్ని రిజర్వాయర్లు పూర్తి చేసి నప్పటికీ, 3వ వంతు కాలువలు, రిజర్వాయర్లు, భూసేకరణలో కొంత పూర్తి కాకుండానే మూడేళ్లలోనే పూర్తి చేశామని, ఈ ప్రాజెక్టు ద్వారా లక్ష ఎకరాల మాగాణి సాగులోకి వచ్చిందని ప్రచారం చేస్తూ.. ప్రపంచానికే తలమానికంగా ఉండాలని 2019 జూన్ 21న ప్రారంభించారు. ప్రత్యేక బస్సుల ద్వారా రైతులను, బిఆర్‌ఎస్ ప్రజా ప్రతినిధులను, కార్యకర్తలను తీసుకెళ్లి జాతర సాగించారు.

**కుంగిన మేడిగడ్డ బ్యారేజీ**

మూడేళ్లు నేరుగా గోదావరి నీటిని 500 టిఎంసిలకు పైగా ఎత్తిపోసామని, తెలంగాణను అన్నపూర్ణగా దేశంలోనే తలమానికంగా అభివృద్ధి చేశామని చెప్పుకుంటున్న బిఆర్‌ఎస్‌కు ప్రాజెక్టు మొత్తం పూర్తి కాకముందే ఎన్నికల ముందు ఒక్కసారిగా 2023 అక్టోబర్ 21న మేడిగడ్డ ప్రధాన బ్యారేజీలో మూడు పిల్లర్స్ కుంగిపోయాయి. ప్రాజెక్టులో నీళ్లు నిల్వ ఉంచలేని పరిస్థితి ఏర్పడింది. కాళేశ్వరం పనుల్లో నాణ్యత లేదని కాంగ్రెస్, బిజెపి పార్టీలు ఆరోపిస్తున్న సందర్భంలోనే ప్రాజెక్టు పిల్లర్స్ కుంగిపోయి బిఆర్‌ఎస్ ప్రభుత్వ పతనానికి హేతువైంది. ఆ పతనం బిఆర్‌ఎస్‌ను ఇంకా వెంటాడుతూనే ఉంది.

**రాజకీయ చదరంగం**

కాళేశ్వరం ఎత్తిపోతల పనులలో నాణ్యత లోపాలు, అవినీతిపై కాంగ్రెస్, బిజెపి ఆరోపణలు నేటికీ కొనసాగుతూనే ఉన్నాయి. దీనికి కౌంటర్‌గా బిఆర్‌ఎస్ పార్టీ నాయకులు ఒక పిల్లరు లేదా రెండు పిల్లర్లు కుంగిపోతే వెంటనే రిపేర్ చేయలేని దద్దమ్మ, అసమర్థత కాంగ్రెస్ ప్రభుత్వమని ప్రత్యారోపణలు ఎపిసోడ్‌ల రూపంలో కొనసాగుతున్నాయి. లక్ష కోట్లు కెసిఆర్ దిగమింగటంతో కాళేశ్వరం ప్రాజెక్టు పనికిమాలిన ప్రాజెక్టుగా ఉండిపోయిందని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి, కాళేశ్వరంలో జరిగిన అవినీతి అక్రమాలపై సిబిఐతో విచారణ చేయించాలని కేంద్రమంత్రి బండి సంజయ్ డిమాండ్ చేస్తున్నారు. ప్రాజెక్ట్ నుండి ఒక ఎకరానికి నీరు పారించకున్నా దీనికి చేసిన అప్పుల క్రింద కిస్తీలు, వడ్డీ కలిపి ప్రతి సంవత్సరం రూ.10 వేల కోట్ల నుంచి 13 వేల కోట్ల వరకు చెల్లించవలసి ఉన్నది. దీంతో ఈ ప్రాజెక్టు నిర్వహణ రాష్ట్ర ప్రభుత్వానికి గుదిబండగా మారిందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఇరిగేషన్ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి అంటున్నారు.

**ఎన్‌డిఎస్‌ఎ నివేదిక**

మేడిగడ్డ బ్యారేజి పిల్లర్లు కుంగిపోయిన నేపథ్యంలో ప్రాజెక్టు పనికొస్తుందా? రాదా? కాళేశ్వరం ప్రాజెక్టు అక్టోబర్ 21న గత బిఆర్‌ఎస్ ప్రభుత్వంలోనే కుంగిన తర్వాత ఆ ప్రాజెక్టు పనికిరాదని మూడు పిల్లర్లు భూమిలోనికి కుంగడం మూలంగానే బ్యారేజీ కుంగిందని, ప్రాజెక్టులో నీరు నిల్వ చేస్తే ప్రాజెక్టు కొట్టుకుపోతుందని ఎన్‌డిఎస్‌ఎ (నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ) నివేదిక ఇచ్చింది. ఆ తర్వాత మేడిగడ్డ బ్యారేజీలాగే సుందిళ్ల, అన్నారం రిజర్వాయర్లలో కూడా పిల్లర్ల కింది నుండి నీటి లీకేజీ బుంగల రూపంలో వస్తూ ఇసుక కొట్టుకుపోతుందని, బ్యారేజ్‌లో నీటిని నిలువ చేస్తే కూలిపోతాయని ఆ ప్రాజెక్టులపై తుది నిర్ణయం వచ్చేవరకు బ్యారేజీలలో నీటిని నిల్వ చేయకూడదని గత ప్రభుత్వ పాలనలోనే ఎన్‌డిఎస్‌ఎ తేల్చింది. ఆ రిజర్వాయర్లలో ఉన్న నీటిని గేట్లు ఎత్తి వదిలిపెట్టినారు. దీంతో గత రెండు సంవత్సరాలుగా కాళేశ్వరం ప్రాజెక్టు నిరుపయోగంగా మారింది. 2019 జూన్ 2న ప్రారంభించిన ఈ ప్రాజెక్టు బరాజ్‌లు అదే ఏడాది నవంబర్‌లో వచ్చిన వరదలకు దెబ్బతిన్నాయి. ఆర్‌సిసి వేసిన కోట్, సిసి కర్టెన్ గోడలలో కొంత భాగం, దిగువ భాగంలో నిర్మించిన కాంక్రీట్ బ్లాకులు కొట్టుకుపోయాయి. మేడిగడ్డ బరాజ్‌కు, అన్నారం బరాజ్‌కు, సుందిళ్ల బరాజ్‌కు తీవ్ర నష్టం వాటిల్లింది. డిజైన్ లోపం, లోపభూయిష్టంగా చేపట్టిన పనుల కారణంగానే నష్టం జరిగింది. నిర్వహణ పర్యవేక్షణ లోపం కారణంగానే మేడిగడ్డ కుంగినట్లు జలశక్తి శాఖ నియమించిన ఆరుగురు సభ్యుల కమిటీ తేల్చి చెప్పింది.

**బ్యారేజీలు కుంగిపోవడంపై కమిషన్:**

రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభు త్వం కాళేశ్వరం ప్రాజెక్టుపై సమగ్ర విచారణకు పిసి ఘోష్ నేతృత్వంలో జ్యుడిషియల్ కమిషన్ వేయడం జరిగింది. ఈ కమిషన్ గత సంవత్సర కాలంగా ప్రాజెక్టులో ప్రధాన వింగులైన టెక్నికల్, ఇంజనీరింగ్, క్వాలిటీ కంట్రోల్, డిజైనింగ్, నిర్మాణరంగాలకు బాధ్యులైనవారిని 112 మందిని విచారించింది. చివరిసారిగా ఆనాడు అధికారంలో ఉన్న కర్త, కర్మ, క్రియగా భావిస్తున్న ఆనాటి ముఖ్యమంత్రి కెసిఆర్, నీటి పారుదల శాఖ మంత్రి హరీష్‌రావు, ఆర్థిక మంత్రి ఈటల రాజేందర్‌కు నోటీసులు ఇవ్వడం జరిగింది. జూన్ 5న ఈటల రాజేందర్, జూన్ 9న హరీష్ రావు, జూన్ 11న కేసీఆర్ కమిషన్ ముందు హాజరై వివరించారు. ఈ రాజకీయ నాయకులు ప్రాజెక్టు నిర్మాణం, నిర్వహణ పూర్తి ఇంజనీరింగ్ సిబ్బందిపైన నెట్టి తప్పించుకున్నారు. కమిషన్ కాల పరిమితి జులై ఆఖరి వరకు ఉన్నందున, వారు ఇచ్చే రిపోర్టుపై భవిష్యత్ ఆధారపడి ఉందని న్యాయం నిపుణులు తెలుపుతున్నారు.

**ప్రత్యామ్నాయంగా గోదావరి నీరందించే విధంగా చూడాలి**


ప్రస్తుతం కాళేశ్వరం ప్రాజెక్టు పనికి రాదంటే.. రాష్ట్ర ప్రభుత్వం ఇంకా ఏమాత్రం ఆలస్యం చేయకుండా తుమ్మిడిహట్టి వద్ద ప్రత్యామ్నాయ ప్రాజెక్టు చేపట్టి ఎల్లంపల్లికి ఎత్తిపోస్తూ మిడ్‌మానేరు నుండి ఎస్‌ఆర్‌ఎస్‌పి లింక్ చేయాల్సి ఉంటుంది. ఎస్‌ఆర్‌ఎస్‌పి ప్రాజెక్ట్ నీటితో గత సంవత్సరం నుండి కాంగ్రెస్ ప్రభుత్వం పంటలను కాపాడింది. ఈ సంవత్సరం కూడా విచారణలతో కాలయాపన చేయకుండా గోదావరి నీరు ఎస్సారెస్పీ కాలువల చెరువుల ద్వారా అందించే ప్రత్యామ్నాయ విధానం చేపట్టి ప్రస్తుతం ఉన్న ఆయకట్టు సేద్యం అయ్యే విధంగా రైతులను, ప్రజలను ఆదుకోవాలని కోరుకుంటున్నారు.

– ఉజ్జిని రత్నాకర్ రావు
9490952646

# కథ పాతదే... పెత్తనమే కొత్తది

## తెలంగాణలో పెరుగుతున్న భూ కమతాలు

తెలంగాణ గ్రామీణ నేపథ్యంలో మళ్లీ గతం వైపునకు పయనిస్తుంది. మారిన పరిస్థితుల నేపథ్యంలో భూ కమతాలు పెరుగుతున్నాయి. భూమి వ్యాపార వస్తువుగా మారిన తర్వాత సంపన్న వర్గాల దృష్టి భూమిపై పడింది. భూమి ఉండడం అది ఎక్కువగా ఉండటం స్టేటస్ సింబల్‌గా మారింది. దీనితో భూ కొనుగోళ్లు మొదలయ్యాయి. ఎంత భూమి దొరికితే అంత కొనుగోలు చేసేందుకు సిద్దమవుతున్నారు. రాజధాని నగరానికే కాదు జిల్లా కేంద్రాలకు సుదూరంగా ఉన్న ప్రాంతాల్లో సైతం భూములు కొనుగోలు చేస్తున్నారు. వంద, రెండు వందల ఎకరాల భూములు కొనేసి అక్కడ కొన్ని కుటుం బాలకు నిర్వహణ, సాగు బాధ్యతలు అప్పగిస్తున్నారు. మరికొందరు అతిథి గృహాలను నిర్మించుకుని విలాస విడిదిగా మార్చుకుంటున్నారు. అప్పటి రైతుబంధులోనూ ఇప్పటి రైతుభరోసాలోనూ భూ పరిమితి లేకపోవడంతో అతిపెద్ద సానుకూల అంశంగా మారింది. కారణాలు ఏమైనా తెలంగాణలో తిరిగి కమతాలు పెరిగిపోతున్నాయి. గతంలో భూస్వాములు గ్రామాలపై పెత్తనం చెలాయించేవారు.



గ్రామాలను తమ అదుపు ఆజ్ఞల్లో ఉంచుకుంటూ తమకు తెలియకుండా ఏమి జరిగినా ప్రజలను శిక్షించేందుకు వెనకాడేవారు కాదు. ఆ భూస్వామ్య పెత్తనమే తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటానికి దారి తీసింది. ఆ తర్వాత వచ్చిన భూ సంస్కరణల చట్టాలు, భూమిపై ఆదాయం రావడం లేదన్న కారణం, విలువ లేని భూముల విక్రయాలు ఇలా క్రమంగా భూ కమతాలు అంతర్ధనమయ్యాయి. ఆ స్థానంలో చిన్న సన్నకారు రైతులు సాగులోకి వచ్చారు. తెలంగాణ గ్రామీణంలో పది ఎకరాలలోపు రైతుల సంఖ్య గణనీయంగా పెరిగింది. అదే సమయంలో వ్యవసాయరంగ ఉత్పత్తి పెరగడంతో పాటు, గ్రామీణ బానిసత్వం పాలేరుల వ్యవస్థ దాదాపుగా కనుమరుగయ్యా యి. యాంత్రీకరణను మధ్యతరగతి రైతాంగం తట్టుకుని నిలబడింది. రెండు దశాబ్దాలుగా భూ విలువ క్రమంగా పెరుగుతూ వచ్చింది. అలా పెరిగి ఇప్పుడు చాలా చోట్ల లక్షలు దాటి కోట్లకు చేరుకుంటుంది. సంపన్న వర్గాలు గ్రామీణ ప్రాంతాల్లో భూములు కొనుగోలు చేసి దాని రక్షణకు గ్రామాల్లో కొందరిని చేరదీయడం రాజకీయం గా లేదా ఇతరత్రా ప్రోత్సహించడం మొదలు పెట్టారు. ప్రతిది డబ్బుతో ముడిపడిన ఈ రోజుల్లో గ్రామాల్లో భూమి కలిగిన సంపన్నులు డబ్బును ఎరగా వేసి తనవైపుకు తిప్పుకుని పరోక్ష పెత్తనం సాగించటం ప్రారంభమైంది. రియల్టర్లు, భూ కామందులు, జాతరలు, గ్రామ సామూహిక అవసరాలతో పాటు కొందరి వ్యక్తిగత అవసరాలను డబ్బుతో తీరుస్తూ గౌరవంతో కూడిన పెత్తనానికి వస్తున్నారు. చాలా గ్రామాలలో ఇప్పుడిప్పుడే కొందరు శాసించే పరిస్థితిలోకి వస్తున్నారు. స్థానిక ఎన్నికల్లో మన వాడే గెలవాలి అందుకు ఎంత ఖర్చు అయినా ఫర్వాలేదు అన్న భరోసా ఇస్తున్నారు. తమ ఆస్తుల రక్షణ ముసుగులో గ్రామీణ వర్గ రాజకీయాలను ప్రోత్సహిస్తున్నారు. గత స్థానిక సంస్థల ఎన్నికల్లో తమకు ఇష్టమైన అభ్యర్థులకు లక్షలాది రూపాయల సాయం అందించి గెలిపించుకున్న ఘటనలు అనేకం. 136 ఓట్లు ఉన్న గ్రామ పంచాయతీ చుట్టూ రియల్ వెంచర్లు వెలిశాయి. ఆ పంచాయతీకి 2019 ఎన్నికల్లో ముగ్గురు సర్పంచు అభ్యర్థులు వెరసి రూ.80 లక్షలు ఖర్చు చేయగా 58 ఓట్లు వచ్చిన అభ్యర్థి గెలుపొందాడు. ఈ ఖర్చు అంత పైన పేర్కొన్న పరోక్ష పెత్తనం కోసం ఖర్చు చేయబడిందే. ఇది ఒక ఉదాహరణ మాత్ర మే ఇలా చెప్పుకుంటే అనేకం. ముఖ్యంగా తెలంగాణ గ్రామీణ వ్యవస్థపై పరోక్ష పెత్తనం ఇప్పటిది కాకపోయినా పెత్తనం పాతదే కానీ ఇప్పుడు తిరిగి కొత్తగా మొదలైంది. భూమి వ్యాపార వస్తువుగా మారిన తర్వాత భూమిని కొనుగోలు చేసే స్థితిలో రైతాంగం లేదు. భూమి అవసరమైన వారి నుంచి సంపదగా మార్చుకునే వారి వైపు జరిగిపోతుంది. పదుల ఎకరాలతో ప్రారంభమై వందల ఎకరాలకు చేరుకుంటున్న భూ కమతాల మధ్య ఎకరం రెండు ఎకరాల రైతులు ఇమడలేక భూమిని అమ్ముకుని ప్రత్యామ్నాయ రంగాల వైపు పయనిస్తున్నారు. భూ పరిమితి చట్టం లేని కారణంగా అక్రమ సంపాదన భూ విక్రయాల వైపు మరలడంతో ఆదాయ పన్ను మినహాయింపు, భూమి నుంచి వచ్చిన ఆదాయం అని చూపిస్తూ పెద్ద మొత్తంలో పన్నుల నుంచి తప్పించుకునేందుకు దోహదపడుతుంది. మొత్తంగా వెలిసిన, వెలుస్తున్న భూ కమతాలు పరోక్ష పెత్తనానికి దారులు వేశాయి వేస్తున్నాయి. భూస్వామ్యుల పెత్తనం కథ పాతదే అయినా కొత్తగా మొదలైంది. ఇది పెరిగి చివరకు ఏ వైపునకు దారి తీస్తుందోనన్న ఆందోళన క్రమ క్రమంగా గ్రామీణ ప్రాంతంలో మొదలైంది.

– ఏనుగు వెంకటేశ్వరరావు
ప్రజాపక్షం ప్రతినిధి ఖమ్మం

# జాతీయం

NATIONAL & GENERAL NEWS

## భాషల పేరుతో విభజన వద్దు : ధన్‌ఖడ్



**పుదుచ్చేరి :** భారతదేశం భాషల విషయంలో విభజనను భరించ లేదని ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ అన్నారు. దేశ భవిష్యత్తు శ్రేయస్సును దృష్టిలో ఉంచుకొని ఈ తుఫాను నుండి బయటపడా లని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.అలాగే, జాతీయ విద్యా విధానం 2020ని అక్షరాలా అమలు చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఎందుకంటే ఇది విద్యా రంగంలో 'గేమ్ ఛేంజర్' అని, ఇది దేశం యొక్క మరింత అభివృద్ధికి తోడ్పడుతుందని ఆయన అన్నారు. పుదుచ్చేరి విశ్వవిద్యాలయంలో జరిగిన కార్యక్రమంలో విశ్వవిద్యాలయ ఛాన్సలర్‌గా వ్యవహరిస్తున్న ధన్‌ఖడ్ మాట్లాడుతూ భాషల పట్ల వ్యతిరేకత ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. 'పార్లమెంటులో సభ్యులు 22 భాషల్లో మాట్లాడటానికి అను మతి ఉంది. మన భాషలు సమ్మేళనాన్ని సూచిస్తాయి. సనాతనం ఒకే ఉన్నతమైన ప్రయోజనం కోసం కలిసుండాలని బోధి స్తుంది' అని ధన్‌ఖడ్ తెలిపారు.

## చికిత్సకు స్పందిస్తున్న సోనియాగాంధీ



**న్యూఢిల్లీ :** ఉదర సంబంధిత సమస్య కారణంగా ఆసుపత్రిలో చేరిన కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ చైర్‌పర్సన్ సోనియా గాంధీ చికిత్సకు బాగా స్పందిస్తు న్నారని, కానీ ఆమె డిశ్చార్జ్ తేదీ ఇంకా నిర్ణయించలేదని మంగళ వారం ఆసుపత్రి వర్గాలు తెలి పాయి. 78 ఏళ్ల కాంగ్రెస్ నాయ కురాలు ఆదివారం సాయంత్రం సర్ గంగా రామ్ ఆసుపత్రిలో చేరారు. ఆమె ఆరోగ్యం నిలక డగా ఉందని, చికిత్సకు స్పంది స్తున్నారని, ఆసుపత్రి చైర్మన్ అజయ్ స్వరూప్ ఒక ప్రకట నలో తెలిపారు. కడుపులో ఇన్ఫెక్షన్ నుండి ఆమె కోలుకుంటున్నారని, ఆమె ఆహారాన్ని కూడా నిశితంగా పరిశీలిస్తున్నామన్నారు. సోనియాగాంధీ ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు పరిశీలిస్తున్నట్లు ఆయన చెప్పారు. ముందు జాగ్రత్త చర్యగా, ఆమె డిశ్చార్జ్ తేదీని ఇంకా నిర్ణయించలేదు అజయ్ స్వరూప్ ఆ ప్రక టనలో పేర్కొన్నారు. డాక్టర్ ఎస్ నుండే, డాక్టర్ అమితాబ్ యాదవ్‌తో కూడిన తమ వైద్యుల బృందం సోనియా ఆమె ఆరోగ్యం, ఆహారాన్ని నిశితంగా పరిశీలి స్తున్నారని చెప్పారు. కాగా, ఈనెల 9న మాజీ కాంగ్రెస్ అధ్యక్షురాలు అదే ఆసు పత్రిలో వైద్య పరీక్షలు చేయించుకున్నారు. చెక్‌అప్‌కు రెండు రోజుల ముందు, ఆమె అధిక రక్తపోటు గురించి ఫిర్యాదు చేసిన తర్వాత సిమ్లాలోని ఇందిరా గాంధీ మెడికల్ కాలేజీలో కొన్ని పరీక్షలు చేయించుకున్నారు.

## కులగణనపై ప్రభుత్వ ఉద్దేశమేంటి?

ప్రశ్నించిన కాంగ్రెస్ : కులగణనను ఆలస్యం చేస్తోందని మండిపాటు



**న్యూఢిల్లీ :** కేంద్ర ప్రభుత్వం కుల గణనను ఆలస్యం చేస్తోందని కాంగ్రెస్ ఆరోపించింది. సమయం సంపాదిం చడం, ముఖ్యాంశాలను పొందడం, కథనాన్ని నిర్వహిం చడం దాని ఉద్దేశ్యంగా కనిపిస్తోందని మండిపడింది. ప్రభుత్వం కుల గణన ప్రక్రియపై పారదర్శకంగా వ్యవహ రించాలని డిమాండ్ చేసింది. ఒక వ్యక్తి కులానికి సంబం ధించిన డేటాను సేకరించడం మాత్రమే లక్ష్యం కాదని, ఈ కుటుంబాల జీవన పరిస్థితులను అర్థం చేసుకోవడం, వారి జీవనోపాధిని గణనీయంగా మెరుగుపరచడానికి కూడా విధానాలను రూపొందించాలని కాంగ్రెస్ ప్రధాన కార్య దర్శి సచిన్ పైలట్ అన్నారు. కుల గణన గురించి ప్రభుత్వ ఉద్దేశాలపై సందేహాలు ఉన్నాయని, జనాభా గణనకు అవ సరమైన నిధులు రూ. 10,000 కోట్లు అవసరం కాగా, ప్రభుత్వం రూ. 574 కోట్లు మాత్రమే కేటాయించిందని ఆయన పేర్కొన్నారు. కుల గణనలో కులాన్ని చేర్చడంపై ప్రభుత్వ నోటిఫికేషన్ 'మౌనంగా' ఉందని కాంగ్రెస్ ఆరో పించిన నేపథ్యంలో జనాభా గణనలో కుల గణన కూడా ఉంటుందని హోం మంత్రిత్వ శాఖ ప్రతినిధి స్పష్టం చేశారు. దీంతో సచిన్ పైలట్ స్పందించారు. కుల గణన డిమాండ్‌ను కాంగ్రెస్ పార్టీ, ముఖ్యంగా లోక్‌సభలో ప్రతి పక్ష నాయకుడు రాహుల్ గాంధీ చాలా సంవత్సరాలుగా లేవనెత్తుతున్నారన్నారు. కాంగ్రెస్ నిరంతరం చాలా గట్టిగా డిమాండ్ చేస్తున్నందునే మోడీ ప్రభుత్వం కుల గణనను ప్రకటించిందన్నారు. అయితే, వాస్తవాలు, గణాంకాలు మరోలా చెబుతున్నాయని పైలట్ మంగళ వారం కాంగ్రెస్ ఇందిరా భవన్ ప్రధాన కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో అన్నారు. కేంద్రం ప్రభుత్వం 2027లో జగగణన చేయాలని భావిస్తోంది, ఇందుకు రూ. 10 వేల కోట్లు అవసరం కాగా, కేటాం చింది మాత్రం రూ. 574 కోట్లేనని పైలట్ ఆరోపించారు. జన గణనతో పాటు కలు గణన చేయాలని డిమాండ్ చేసి నందుకు బిజెపి తొలుత తమను 'పట్టణ నక్సల్స్'గా పేర్కొ న్నదని, ఈ డిమాండ్లను అంగీకరించడానికి నిరాకరించిం దని, అయితే ఇప్పుడు దేశ మానసిక స్థితిని గ్రహించి, వారు ఈ ప్రతిపాదనను సూత్రప్రాయంగా అంగీకరించా రని ఆయన అన్నారు. దీనికి సంబంధించి గణనీయమైన గందరగోళం, అసంతృప్తి ఉన్నట్లు కనిపిస్తోందని చెప్పారు. అందువల్ల, ప్రభుత్వం స్పష్టంగా, పారదర్శకంగా ఉండా లని, పొడిగించిన గడువులను, సరిపోని బడ్జెట్ కేటాయిం పులను నివారించాలని కోరుతున్నానని పైలట్ అన్నారు. భారతదేశంలో నివసిస్తున్న ప్రజల స్థితిని కచ్చితంగా అంచనా వేయడం దీని ఉద్దేశమని, కులగణన దీనికి సరైన మార్గమన్నారు. మోదీ ప్రభుత్వం మహిళా రిజర్వేషన్ అంశంపై చేసినట్లుగానే కుల గణనను కూడా ఆలస్యం చేస్తోందని పైలట్ పేర్కొన్నారు. ప్రభుత్వం దీనిని రాజ కీయం చేయడం మానేసి సమర్థవంతంగా పనిచేయాలని, జాతీయ స్థాయిలో కుల గణన కోసం 'తెలంగాణ నమూ నా'ను స్వీకరించాలని తాము సూచిస్తున్నామన్నారు. ప్రభుత్వం కుల గణన నిర్వహిస్తామని ప్రజలకు చెబు తోంది, కానీ అధికారిక నోటిఫికేషన్‌లో ఈ విషయం లేదు అని పైలట్ అన్నారు. కుల గణన ప్రజల ఆర్థిక, సామా జిక స్థితిగతులను తెలుసుకోవడానికి మొదటి అడుగు కాగా, మోదీ ప్రభుత్వానికి కులగణన నిర్వహించాలనే ఉద్దేశం ఉన్నట్లు కనిపించడం లేదని పైలట్ ఆరోపిం చారు. కుల గణన డిమాండ్‌ను లేవనెత్తే వ్యక్తులు అర్బన్ నక్సల్స్ అని బిజెపి, నరేంద్ర మోడీ చాలాసార్లు చెప్పారు. కుల గణన నిర్వహించడానికి తాము అనుకూలంగా లేమని మోడీ ప్రభుత్వం పార్లమెంటులో సమాధానం ఇచ్చిందని, కానీ, భారీ నిరసనల తర్వాత, ప్రభుత్వం అక స్మాత్తుగా కాంగ్రెస్ డిమాండ్‌ను అంగీకరించి కుల గణన నిర్వహించాలని నిర్ణయించిందని ఆయన అన్నారు.



## పొదుపు తగ్గింది రుణాలు పెరిగాయి : కాంగ్రెస్

**న్యూఢిల్లీ :** భారతదేశంలో సామాన్యుల ఆర్థిక పరిస్థితి చాలా ఆందోళనకరంగా ఉందని, మోదీ ప్రభుత్వం వాగ్దానం చేసిన'అచ్ఛే దిన్' (మంచి రోజులు) బదులుగా, రుణాల రోజు లు వచ్చాయని కాంగ్రెస్ ఆరోపించింది. దేశం లో ప్రజల ఆదాయం పెరిగినప్పటికీ, ద్రవ్యో ల్బణం నియంత్రణలో ఉన్నప్పటికీ, గృహ పొ దుపులు వరుసగా మూడవ సంవత్సరం తగ్గా పోయాయని వచ్చిన ఒక మీడియా నివేదికను కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేశ్ తన 'ఎక్స్' ఖాతాలో మంగళవారం పోస్ట్ చేశా రు.'దేశంలో ప్రజల పొదుపులు తగ్గుతున్నా యి. అప్పులు పెరుగుతున్నాయి! దీని అర్థం ఒకవైపు ద్రవ్యోల్బణం పెరుగుతోంది, మరో వైపు ప్రజల ఆదాయం తగ్గుతోంది. ఫలితంగా, ప్రజలు తమ పొదుపులను ఉపసంహరించు కుంటున్నారు లేదా రుణాలు తీసుకొని జీవిం చవలసి వస్తుంది' అని ఆవేదన్య వ్యక్తం చేశారు.

## నిజాయితీగా, సమయానికి జనగణన చేయాలి

ఈ ప్రక్రియ ప్రజల సంక్షేమానికి సంబంధించినది : మాయావతి



**లక్నో :** జనాభా గణన అనేది నేరుగా ప్రజల సంక్షేమానికి సంబంధించినదని, నిజాయి తీగా, సమయానికి నిర్వహించాలని బహు జన సమాజ్ పార్టీ (బిఎస్‌పి) చీఫ్ మాయావతి అన్నారు. మంగళవారం ఆమె హిందీలో ఎక్స్‌లో వరుస పోస్టులు చేశారు. దేశం నుండి పేదరికం, నిరుద్యోగాన్ని నిర్మూలించగలిగారా అని ఉత్తరప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి కేంద్రంలో 11 సంవత్సరాల పాలనపై బిజెపిని లక్ష్యంగా చేసుకుని ప్రశ్నించారు. కాంగ్రెస్ హయాం నుంచి జాతీయ, కులగణన పెండిం గ్‌లో ఉందని, ఈ ప్రక్రియ ఇప్పుడు ప్రారంభ మైందన్నారు. జనాభా గణన ప్రజా సంక్షేమా నికి నేరుగా సంబంధించినదని, దేశ ప్రయోజ నాల దృష్ట్యా దీనిని నిజాయితీగా, సమయా నికి పూర్తి చేయాలని ఆమె అన్నారు. భారత దేశం 16వ జనాభా గణనను నిర్వహించడా నికి ప్రభుత్వం సోమవారం నోటిఫికేషన్ జారీ చేసింది. కాగా, మాయావతి మరో పోస్ట్‌లో రాబోయే బీహార్ అసెంబ్లీ ఎన్నికలకు వ్యూహాన్ని రూపొందించడానికి సన్నాహాలు జరుగుతున్నాయని చెప్పారు. కేంద్రంలో బిజెపి 11 సంవత్సరాల పాలనపై వ్యాఖ్యా నిస్తూ, పార్టీ సాధించినట్లు చెప్పుకునే విజ యాలు నిజంగా ప్రజలకు ప్రయోజనం చేకూ రుస్తున్నాయా అని ఆమె నిలదీశారు. బిజెపి పేదరికం, నిరుద్యోగం, బాధలు, ప్రజల ఇబ్బందులను నిర్మూలించగలిగిందా? అని నిలదీస్తూ ప్రజలు సరైన సమయంలో సమా ధానం చెబుతారన్నారు.

## వాళ్ళే రాజీనామా చేయాలి : సిఎం సిద్ధరామయ్య



బెంగళూరు : అహ్మదాబాద్ విమాన ప్రమాదం, గుజరాత్‌లోని మోర్బిలో పాదచారుల సస్పెన్షన్ వంతెన కూలిన ఘట న, ఉత్తరప్రదేశ్‌లో కుంభమేళా సందర్భంగా జరిగిన తొక్కిసలాటకు బాధ్యులైన వారి రాజీనామాను బీజేపీ నాయకులు కోరాలని కర్నాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య కోరారు. బెంగళూరులోని చిన్న స్వామి స్టేడియం సమీపంలో జరిగిన తొక్కిసలాటలో 11 మంది మరణిం చిన ఘటనకు సంబంధించి తనతో పాటు, ఉప ముఖ్యమంత్రి సిద్ధరా మయ్య, హోం మంత్రి పరమేశ్వర రాజీనామా కోరుతూ బెంగళూరు ఫ్రీడం పార్క్‌లో నిరసన తెలిపిన ప్రతిపక్ష బిజెపిపై మంగళవారం నాడు ఆయన మండిపడ్డారు. 'గోధ్రా సంఘటనకు , మోర్బిలో 140 మంది మర ణించిన వంతెన కూలిపోవడానికి ఎవరు బాధ్యులు?' అని సిఎం ప్రశ్నిం చారు.తన రాజీనామాను డిమాండ్ చేయడానికి బిజెపికి ఎలాంటి నైతిక హక్కు ఉందని ఆయన ప్రశ్నించారు.

## భయపెడుతున్న విమానాలు


తలెత్తుతున్న సాంకేతిక సమస్యలు

**న్యూఢిల్లీ :** దేశీయ విమానయాన సంస్థ ఎయిర్ ఇండియాకు చెందిన విమానాల్లో సాంకేతిక సమస్యలు ఆందోళన కలిగిస్తు న్నాయి. ఈ సంస్థకు చెందిన డ్రీమ్‌లైనర్ ఫ్లైట్ ఇటీవలే అహ్మ దాబాద్‌లో కుప్పకూలిన విషయం తెలిసిందే. ఈ దుర్ఘటనలో 270 మందికిపైగా ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటన మర వకముందే మరిన్ని విమానాల్లో సాంకేతిక సమస్యలు బయ టపడుతున్నాయి. తాజాగా ఢిల్లీ నుంచి పారిస్ వెళ్లే ఎయిర్ ఇండియా ఫ్లైట్‌లోనూ అదే పరిస్థితి తలెత్తింది. ఈ విష యాన్ని ఎయిర్‌లైన్స్ ఓ ప్రకటనలో తెలిపింది. ఢిల్లీ నుంచి పారిస్ వెళ్లాల్సిన ఎయిర్ ఇండియా విమానం ఎఐ 143 రద్దు చేసినట్లు తెలిపింది. ముందస్తు విమాన తనిఖీల్లో సమస్యను గుర్తించినట్లు పేర్కొంది. ఫలితంగా బుధవారం పారిస్ నుంచి ఢిల్లీకి రావాల్సిన ఎయిర్ ఇండియా ఎఐ 142ను కూడా తాత్కాలికంగా రద్దు చేసినట్లు వెల్లడించింది. ప్రయాణికులకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నట్లు పేర్కొంది. హోటల్ వసతి సదుపాయాన్ని కూడా కల్పించనున్నట్లు తెలిపింది. మధ్యాహ్నం అహ్మదాబాద్ నుంచి లండన్ వెళ్లాల్సిన ఎయిర్ ఇండియా ఫ్లైట్ సాంకేతిక సమస్య కారణంగా తాత్కాలికంగా రద్దైన విషయం తెలిసిందే. ఎయిర్ ఇండియా విమానం ఎఐ 159 మంగళవారం ఉదయం న్యూఢిల్లీ నుంచి అహ్మదాబాద్ చేరుకుంది. అక్కడి నుంచి అది లండన్‌లోని గాట్విక్ ఎయిర్ పోర్ట్‌కు బయల్దేరాల్సి ఉంది. అయితే, ముందు విమానంలో సాంకేతిక సమస్య తెలెత్తింది. దీంతో అప్రమత్తమైన అధికా రులు విమాన సర్వీసును చివరి నిమిషంలో రద్దు చేశారు. సోమవారం హాంకాంగ్ నుంచి ఢిల్లీకి బయల్దేరిన బోయింగ్ 787–8 డ్రీమ్‌లైనర్ రకానికి చెందిన ఎఐ 315 విమానంలో సాంకేతిక సమస్య తలెత్తింది. దీంతో విమానాన్ని వెనక్కి మళ్లించారు. మంగళవారం ఉదయం కూడా శాన్ ఫ్రాన్సిస్కో నుంచి కోల్‌కతా మీదుగా ముంబై వస్తున్న ఎఐ180 విమా నంలో టె క్నికల్ ఇష్యూలు వచ్చాయి. గుర్తించిన పైలట్ తెల్ల వారుజామున కోల్‌కతాలో విమానాన్ని నిలిపివేశారు. దీంతో భద్రత దృష్ట్యా ప్రయాణికులను విమానం నుంచి దించేశారు. విమానంలోని ఇంజిన్లలో ఒకటి పనిచేయడం లేదని, దీంతో విమా నం ఎగరడంలో ఇబ్బందులు తలెత్తాయని అధికా రులు తెలిపారు. ఇలా వరుస ఘటనలు భయాందోళనకు గురిచేస్తున్నా యి.

**విమానానికి బాంబు బెదిరింపు..**

మరోవైపు ఓ విమానానికి బాంబు బెదిరింపు వచ్చింది. కొచ్చి నుంచి ఢిల్లీ బయలుదేరిన ఇండిగో విమానానికి బాంబు బెది రింపు రావడంతో విమానాన్ని నాగ్‌పూర్‌లో అత్యవసర ల్యాండింగ్ చేశారు. ప్రయాణికులను సురక్షితంగా తరలిం చిన తర్వాత.. విమానాన్ని తనిఖీ చేశారు. బాంబు లేదని తేల డంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. ఈ ఘటనపై అధికా రులు దర్యాప్తు చేపట్టారు.

## 'నో ఫ్లయింగ్ జోన్'గా అమర్‌నాథ్ యాత్ర మార్గాలు



**శ్రీనగర్ :** మరికొద్ది రోజుల్లో అమర్‌నాథ్ వార్షిక యాత్ర ప్రారంభం కానుంది. మంచు లింగాన్ని దర్శించుకోవడానికి ఏటా వేల మంది యాత్రికులు యాత్రకు వెళ్తారు. అయితే, ఇటీవల పహల్గామ్‌లో ఉగ్రదాడి జరిగిన నేపథ్యంలో జమ్మూకశ్మీర్ ప్రభుత్వం ఈ యాత్రకు భద్రతను కట్టుదిట్టం చేసింది. ఇందులో భాగంగానే.. అమర్‌నాథ్ యాత్ర వెళ్లే అన్ని మార్గాలను నో ఫ్లయింగ్ జోన్‌గా ప్రకటించింది. ఈ మేరకు జమ్మూకశ్మీర్ హోం శాఖ మంగళవారం దీనిపై ఉత్త ర్వులు జారీ చేసింది. లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా ఆదేశాల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపింది. సాధారణంగా అమ ర్‌నాథ్ యాత్రకు పహల్గాం మార్గంతో పాటు బాల్తాల్ మీదుగా యాత్రికులు వెళ్తుంటారు. ఈ రెండు మార్గాలను నో ఫ్లయింగ్ జోన్‌గా ప్రకటించారు. ఈ మార్గాల్లో జులై 1 నుంచి ఆగస్టు 10 వరకు మానవ రహిత వైమా నిక వాహన వ్యవస్థలు, డ్రోన్లు, బెలూన్లు వంటివి ఎగరవేయడంపై నిషేధం విధించారు. అయితే, అత్యవసర వైద్య తరలింపు, విపత్తు నిర్వహణ, భద్రతా దళాల నిఘా వంటి సంద ర్భాలలో ఈ ఆంక్షలు వర్తించబోవని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. వీటికి సంబంధించిన పూర్తి ఎస్‌ఒపిని త్వరలోనే జారీ చేస్తామని అధికారులు వెల్లడించారు. జులై 3 నుంచి అమర్‌నాథ్ యాత్ర ప్రారంభం కానున్న సందర్భంగా సజావుగా, శాంతియుతంగా సాగడానికి ఈ భద్రతా ఏర్పాట్లు చేసినట్లు అధికారులు తెలిపారు. అంతేగాక, యాత్రికులకు అదనపు రవాణా సదుపాయాలను కూడా కల్పించనున్నట్లు పేర్కొన్నారు.

## ఇండియా కూటమి చెక్కుచెదరదు..

పోయేవాళ్లు పోవచ్చు : అఖిలేష్ యాదవ్



**లక్నో :** ప్రతిపక్ష ఇండియా కూటమి పని అయిపోయిందని, ఆ కూటమిలోని పార్టీల మధ్య సఖ్యత లేదని జరుగుతున్న ప్రచారంపై ఉత్తరప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, సమాజ్‌వాది పార్టీ చీఫ్ అఖిలేష్ యాదవ్ స్పందించారు. ఇండియా కూటమి చెక్కుచెదరదని, బలంగా ఉన్నదని ఆయన వ్యాఖ్యా నించారు. ఎవరైనా కూటమి నుంచి వెళ్లిపోవాలనుకుంటే స్వేచ్ఛగా వెళ్లిపోవచ్చని, ఎవరూ ఆపరన్నారు. అంతేగానీ కూటమిలో ఉంటూ కూటమిని పలుచన చేసే వ్యాఖ్యలు చేయొద్దు అని అఖిలేష్ మండిపడ్డారు. ఉత్తరప్రదేశ్‌లో 2027లో జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో ఇండియా కూటమి సత్తా చాటుతుందని అన్నారు. మంగళవారం మధ్యాహ్నం లక్నోలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అఖిలేష్ యాదవ్ మాట్లాడారు. ఈ సందర్భంగా ఉత్తరప్రదేశ్ ప్రభుత్వ తీరుపై ఆయన విమర్శలు గుప్పించారు. మహాకుంభమేళా మృతుల కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున పరిహారం చెల్లించను న్నట్లు ప్రభుత్వం చెబుతోందని, అందుకు సంబంధించిన పేర్లను ఎందుకు వెల్లడించడంలేదని ప్రశ్నించారు.

విమాన ప్రమాదానికి కారణమైన వారు రాజీనామా చేయాలి ఈనెల 12న అహ్మదాబాద్‌లో జరిగిన ఎయిర్ ఇండియా విమాన ప్రమాదానికి కారణమైన వ్యక్తులు తమ రాజీనామా లను సమర్పించాలని అఖిలేష్ అన్నారు. 'అహ్మదాబాద్‌లో జరిగిన ప్రమాదం గురించి ఆలోచించండి, ఇప్పటివరకు ఎవరూ రాజీనామా చేయలేదు. ఏమి జరిగిందో ఆలోచిం చండి వారు బతికి ఉన్న ఒక క్షణం, వారు లేని మరుసటి క్షణం. కొన్ని సెకన్లలో, ప్రజలు తమ ప్రాణాలను కోల్పో యారు. విమానం ఎక్కడ కూలిందో, ఎంత మంది వైద్యులు మరణించారు? ఎంత మంది తమ కుటుంబ సభ్యులను కోల్పోయారు?' అని నిలదీశారు. 'పుల్వామా కోసం రాజీనా మాలు అడగడం లేదు, పహల్గామ్ కోసం రాజీనామాలు కోరడం లేదు. కానీ కనీసం ప్రభుత్వం ఈ విమాన ప్రమాదా నికి కారణమైన వారు తమ పదవులకు రాజీనామా చేయాలి' అని ఆయన డిమాండ్ చేశారు. ప్రైవేటీకరణ ప్రారంభమైన ప్పటి నుండి, ప్రజలను వారి ఉద్యోగాల నుండి తొలగిస్తున్నా రని, వాటిని 'అధికారంలో ఉన్నవారికి దగ్గరగా ఉన్నవారికి ఇస్తున్నారని' ఆయన మండిపడ్డారు. వారి సొంత ప్రజలకు ఉద్యోగాలు పొందడానికి, అసమర్థులను ఈ పదవుల్లో కూర్చోబెట్టడం జరిగిందా? ఇది సాధారణ సమస్య కాదు' అని యాదవ్ అన్నారు.

## ఇడి విచారణకు మరోసారి రాబర్ట్ వాద్రా డుమ్మా



న్యూఢిల్లీ : కాంగ్రెస్ ఎంపి ప్రియాంకా గాంధీ భర్త, ప్రముఖ వ్యాపారవేత్త రాబర్ట్ వాద్రా మరోసారి ఇడి విచారణకు డుమ్మా కొట్టారు. తన కుమార్తె స్నాతకోత్సవానికి హాజరు కావడానికి విదేశాలకు వెళ్తున్నానని, తిరిగి వచ్చాక విచారణకు హాజరవు తానని ఇడి అధికారులకు రాబర్ట్ వాద్రా సమా చారం ఇచ్చినట్లు తెలిసింది. కాగా, యుకెకు చెందిన ఆయుధాల కన్సల్టెంట్ సంజయ్ భండారీకి సంబంధించిన మనీలాండరింగ్ కేసులో రాబర్ట్ వాద్రా వాంగ్మూలాన్ని రికార్డ్ చేయ డానికే ఇడి సమన్లు జారీ చేసింది. వాస్తవానికి జూన్ 10నే రాబర్ట్ వాద్రా ఇడి విచారణకు హాజరు కావాల్సి ఉంది. కానీ 56 ఏళ్ల వాద్రా తనకు జూన్ 9న ఫ్లూ లాంటి లక్షణాలు ఉన్నాయని, ప్రోటోకాల్ ప్రకారం కొవిడ్ టెస్ట్ చేయించుకున్నానని చెప్పి గైర్హా జరు అయ్యారు. దీంతో ఆయనకు ఇడి మరోసారి సమన్లు పంపింది. 17న తమ ముందు హాజరు కావాలని రాబర్ట్ వాద్రాను ఇడి కోరింది. అయితే, ఈసారి కూడా ఇడి సమన్లను రాబర్ట్ వాద్రా దాటవేశారు.

## భారత్ అణ్వాయుధాగారాన్ని 'కొద్దిగా విస్తరించింది'

'సిప్రి' నివేదిక వెల్లడి

**న్యూఢిల్లీ :** భారతదేశం సహా పాకిస్థాన్ తదితర తొమ్మిది అణ్వా యుధ దేశాలలో దాదాపు అన్నీ 2024లో సమీకృత అణ్వాయుధ ఆధునీకరణ కార్యక్రమాలను కొనసాగించాయని, ఇప్పటికే ఉన్న ఆయుధాలను అప్‌గ్రేడ్ చేయడం, కొత్త వెర్షన్‌లను జోడించడం వంటివి చేశాయని గ్లోబల్ థింక్‌టాంక్ నివేదిక తెలియజేసింది. 2024లో భారతదేశం మరొకసారి తన అణ్వాయుధాగారాన్ని కొంచెం విస్తరించిందని, సరికొత్త రకాల అణు సరఫరా వ్యవస్థ లను అభివృద్ధి చేయడం కొనసాగించిందని స్టాక్‌హోమ్ ఇంటర్నేష నల్ పీస్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (ఎస్‌ఐపిఆర్‌ఐసిప్రి) ఒక ప్రకట నలో తెలిపింది. అదే సమయంలో పాకిస్థాన్ కూడా 2024లో 'కూడబెట్టే విచ్ఛిత్తి పదార్థం' అయిన కొత్త డెలివరీ వ్యవస్థలను అభి వృద్ధి చేయడం కొనసాగించిందని, రాబోయే దశాబ్దంలో దాని అణ్వాయుధాగారాన్ని మరింత విస్తరించవచ్చనే విషయం స్పష్టం అవుతున్నదని ఆ నివేదిక తెలిపింది. సిప్రి తన వార్షిక పుస్తకం 2025లో ఆయుధాల స్థితి, నిరాయుధీకరణ, అంతర్జాతీయ భద్ర తపై వార్షిక అంచనాను థింక్‌టాంక్ సోమవారం ప్రారంభిం చింది.తన ఇయర్ బుక్ విడుదలకు సంబంధించిన ప్రకటనలో భారతదేశం, పాకిస్థాన్ మధ్య ఇటీవల చోటుచేసుకున్న సైనిక సంఘర్షణ గురించి కూడా ప్రస్తావించింది. మే నెలలో రెండు అణ్వాయుధ పొరుగుదేశాల మధ్య నాలుగురోజుల సైనిక సంఘ ర్షణ పూర్తి స్థాయి యుద్ధానికి దారితీసింది. ఆయుధాల స్థితి, నిరా యుధీకరణ, అంతర్జాతీయ భద్రతకు సంబంధించి రెండు దేశాల మధ్య ఈ సిప్రి ఇయర్ బుక్ దేశాలవారీగా అంచనా స్థితిని అందిం చింది. 'దాదాపు ఈ 9దేశాలు అన్నీ అణ్వాయుధాలను కలిగి ఉన్నాయని తెలిపింది. యునైటెడ్ స్టేట్స్, రష్యా, ది యునైటెడ్ కింగ్‌డమ్, ఫ్రాన్స్, చైనా, ఇండియా, పాకిస్థాన్, ది డెమొక్రటిక్ పీపుల్స్ రిపబ్లిక్ ఆఫ్ కొరియా (నార్త్ కొరియా), ఇజ్రాయెల్ దేశాలు దాదాపు అన్నీ 2024లో సమీకృత అణ్వాయుధ ఆధునీక రణ కార్యక్రమాలను కొనసాగించాయి. ఇప్పటికే ఉన్న ఆయుధా లను అప్‌గ్రేడ్ చేయడం, కొత్త వెర్షన్‌లను జోడించడం చేశాయని' ఆ ప్రకటన తెలియజేసింది.'జనవరి 2025నాటికి మొత్తం ప్రపంచ జాబితాలో 12, 241 వార్ హెడ్స్ ఉన్నాయన్నది ఒక అంచనా అని తెలిపింది. దాదాపు 9,614 సైనికనిల్వలు సంభావ్య ఉపయోగం కోసం ఉన్నాయి' అని అది పేర్కొం ది.'భారతదేశం 2024నాటికి మరొకసారితన అణ్వాయుధాలను కొద్దిగా విస్తరిం చుకుంటుందని, న్యూక్లియర్ డెలివరీ వ్యవస్థను అభివృద్ధి చేయ డాన్ని నిరవధికంగా కొనసాగిస్తుందని నమ్ముతారు' అని పే ర్కొంది. 2025ప్రారం భంలో భారతదేశంపా కిస్థాన్ మధ్య ఉద్రిక్త తలు సాయుధ సంఘ ర్షణగా రూపాంతరం చెందిందని అది తెలి యజేసింది.

అణ్వాయుధాలపై ఆధారపడ టం పెరిగే దేశాలకు ఇది ఒక గట్టి హెచ్చరికగా పనిచే యాలని న్యూక్లియర్ ఇన్ఫర్మేషన్ ప్రాజెక్ట్ ఎట్ ఎఫ్ఎఎస్ (ఫెడరే షన్ ఆఫ్ అమెరికన్ సైంటిస్ట్స్) అసోసి యేట్ డైరెక్టర్ మట్ట్ కోర్డా చెప్పారు.

## కొలీజియం రద్దుచేసి, ప్రభుత్వ ఆధీనంలోకి నియామకాలు



రాజ్యసభ సభ్యుడు, ప్రముఖ సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్

**న్యూఢిల్లీ :**అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న జస్టిస్ యశ్వంత్‌వ ర్మపై ప్రభుత్వం అభిశంసన తీర్మానం తీసుకురావడంలోని అసలు ఉద్దేశం కొలీజియం వ్యవస్థను దూరంచేసి న్యాయమూర్తుల నియా మకాన్ని నియంత్రించడమేనని రాజ్యసభ సభ్యుడు కపిల్ సిబల్ అన్నారు. సీనియర్ న్యాయవాది అయిన కపిల్ సిబల్ యశ్వంత్‌వ ర్మకు మద్దతుగా మాట్లాడుతూ 'నేను ఇంతకు ముందు వాదించిన అత్యుత్తమ జడ్జిలలో ఆయన ఒకరు' అని చెప్పారు. జస్టిస్ వర్మ, జస్టిస్ శేఖర్ యాదవ్ కేసులను నిర్వహించడంలో ప్రభుత్వం ఒక ఎంపిక విధానాన్ని కలిగి ఉందని కపిల్‌సిబల్ విమర్శించారు. గత సంవత్సరం 'మతపరమైన' వ్యాఖ్యలు చేశారని ఆరోపిస్తూ అభిశం సన తీర్మానం కోసం పార్లమెంట్ సభ్యులు రాజ్యసభలో ఒక నోటీ స్‌ను సమర్పించారని చెప్పారు. పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరెణ్ రెజిజు జస్టిస్ యశ్వంత్‌వర్మపై అభిశంసన తీర్మా నాన్ని ప్రతిపాదించడంలో అన్ని రాజకీయ పార్టీలను భాగస్వాము లను చేయాలనే ప్రభుత్వ నిర్ణయాన్ని పార్లమెంట్‌లో బలపరిచారు. జస్టిస్ యశ్వంత్‌వర్మ ఢిల్లీలో హైకోర్టు న్యాయమూర్తిగా ఉన్నప్పుడు ఆయన నివాసం బయట ఉండే చిన్న ఇంట్లో (ఔట్‌హౌస్)లో నగదు కాలిపోయిన డబ్బు సంచులను కనుగొన్నారు. విలేకరుల సమావే శంలో కపిల్ సిబల్ మాట్లాడుతూ ప్రభుత్వం జడ్జిమెంట్ నియామ కాలను తన ఆధీనంలోకి తీసుకునేందుకు కొలిజీయం వ్యవస్థను నిర్మూలించాలనే ఉద్దేశాన్ని కలిగి ఉందనే విషయం స్పష్టమవుతోం దన్నారు. జస్టిస్ యశ్వంత్‌వర్మ గురించి కపిల్ సిబల్ మాట్లాడుతూ నేను వాదించిన ప్రభుత్వ న్యాయమూర్తులలో యశ్వంత్‌వర్మ ఒక అత్యంత బాధ్యతాయుతమైన న్యాయమూర్తి ఆయన అని పేర్కొ న్నారు. 'మీరు హైకోర్టులో గానీ, సుప్రీంకోర్టులోగానీ ఏ న్యాయవా దిని అడిగినా ఆ న్యాయమూర్తి ఏ చిన్న తప్పు కూడా చేయలేదనే చెబుతారు. మీరు (ప్రభుత్వం) సాక్ష్యమే లేని జడ్జిని టార్గెట్ చేశా రన్న విషయం ఆశ్చర్యం కలిగిస్తోంది. ప్రజల్లో బహిరంగంగా వ్యా ఖ్యలు చేసిన సాక్ష్మమే అవసరం లేని జడ్జిని మీరు రక్షిస్తున్నారు' అని సిబల్ తెలిపారు. పబ్లిక్ డొమైన్‌లో జస్టిస్ యశ్వంత్‌వర్మకేసు ను సుప్రీంకోర్టు ఇన్‌హౌస్ ఎంక్వైరీ రిపోర్టును పార్లమెంట్ వర్షా కాల సమావేశాల తొలిరోజున ఒక తీర్మానం తీసుకువచ్చేందుకు కిరెణ్ రెజిజు ఆకాంక్షిస్తున్నారని కపిల్ సిబల్ చెప్పారు. దేనికో సం? మీరు శేఖర్‌యాదవ్‌ను రక్షిస్తున్నారు? అని సిబల్ ప్రభుత్వా ని గట్టిగా ప్రశ్నించారు.కొలీజియానికి న్యాయమూర్తుల నియామక అధికారం రద్దు చేసి, నేషనల్ జ్యుడీషియల్ అపాయింట్‌మెంట్స్ క మిషన్ (ఎన్‌జెఎసి)కి అప్పగించేందుకే ప్రభుత్వం ఈ గేమ్ ప్లాన్ ఆడుతోందని ప్రతిపక్షం ఎందుకు గ్రహించడం లేదని కపిల్ సిబల్ ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం చేసే కసరత్తు అంతా గేమ్ ప్లాన్ లో భాగమేనని ఆయన స్పష్టం చేశారు. ఎలాంటి విచారణ, ప్రొసీ జర్ లేకుండా ప్రభుత్వం హైకోర్టు జడ్జిపై నిర్ణయం తీసుకుందని సిబల్ ప్రభుత్వాన్ని విమర్శించారు. జడ్జి చెప్పింది వినకుండా ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకోవడం ది గ్భ్రాంతిని కలిగించిందని, ఈ కేసులోకి రాజకీయన్ని తీసుకువచ్చారని ఆయన ఆరోపించారు.


**డాక్యుమెంట్స్ పోయినవి**

నేను, అనగా **కొడాలి లహరి, తండ్రి : కొడాలి రాంచందర్ రావు,** అడ్రస్ : సరోజినీ గర్ల్స్ హాస్టల్, ఎన్ఐటి వరంగల్, కాజీపేట. నాకు సంబంధించిన ఎన్ఐటి వరంగల్ సెకండ్ సెమిస్టర్ గ్రేడ్ షీట్ డాక్యుమెంట్ నెం. 961671 గలది నేను 10 జూన్ 2025 నాడు హనుమకొండ నుండి హైదరాబాద్‌కు బస్సులో ప్రయాణించుచుండగా పోయినది. ఎవరికైనా దొరికినచో కింది అడ్రస్, ఫోన్ నెంబర్‌కు తెలియజేయగలరు.

ఇట్లు

**కొడాలి లహరి**

అడ్రస్ : సరోజినీ గర్ల్స్ హాస్టల్, ఎన్ఐటి వరంగల్, కాజీపేట, జిల్లా : హనుమకొండ.

సెల్ నెం. **8309091244**



**IN THE COURT OF THE HON'BLE Vth JUNIOR CIVIL JUDGE, CITY CIVIL COURT, HYDERABAD AT HYDERABAD**

**OS. NO. 2157 OF 2025**

BETWEEN:

**Smt. Goteti Rama Naga Kiranmai & Ors. ... Plaintiffs**

AND

**The Tehsildar & Anr. ... Defendants**

To,

All Concerned

**...Defendant No. 2**

Whereas the Plaintiffs named above have filed the aforementioned suit to be declared as the Legal Heirs of Late. Goteti Venkata Veera Bhadra Kishor and the Hon'ble Court has issued Summons to you and posted the matter to **10-07-2025** for your appearance if anybody has an objection.

You are hereby directed to appear in the aforementioned matter at **10:30AM on 10-07-2025**, either in person or through Counsel, failing which the matter will be decided on merits in your absence, as per law.

-BY ORDER OF THE COURT-

**G. RAM BABU**
**ADVOCATE**
Flat No.402, 4th floor, #12-11-1362, Boudh Nagar, Warasiguda, Secunderabad-61. Cell: 98664 70246



# జనరల్
STATE & REGIONAL NEWS

## రాష్ట్రంలో మరో ఐదురోజులు వర్షాలు

ప్రజాపక్షం/హైదరాబాద్ : రాష్ట్రంలో మరో ఐదు రోజు లు వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు. నైరుతి బంగ్లాదేశ్, దాన్ని ఆనుకొని ఉన్న పశ్చిమ బెంగాల్ లోని గంగా తీరప్రాంతంలో ఉదయం 8.30 గంటలకు అల్పపీడనం కొనసాగుతుందన్నారు. అనుబంధంగా ఉపరితల ఆవర్తనం సగటు సముద్రమట్టానికి 7.6 కిలోమీటర్ల ఎత్తులో విస్తరించి ఎత్తుకు వెళ్లే కొలది దక్షిణం దిశగా వంగి ఉందన్నారు. మంగళవారం భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, నల్లగొండ, సూర్యాపేట జిల్లాల్లో ఉరుములు, మెరుపులు, గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశాలున్నాయన్నారు.



## మావోయిస్టుల ఘాతుకం

### ఛత్తీస్‌గఢ్ బీజాపూర్ జిల్లా పెద్దకోర్మా గ్రామంలో ముగ్గిరిని ఉరితీసిన నక్సల్స్

**బీజాపూర్:** ఛత్తీస్‌గఢ్‌లో మావోయిస్టులు మంగళవారం ఘాతుకానికి పాల్పడ్డారు. విద్యార్థి సహా ముగ్గురికి ఉరివేసి పాశవికంగా హత్య చేశారు. బీజాపూర్ జిల్లా పెద్దకోర్మా గ్రామంలో నక్సలైట్లు ఈ దుశ్చర్యకు పాల్పడ్డారు. అంతేకాదు గ్రామానికి చెందిన ఇతరులపై కూడా దాడిచేసి దాదాపు 12 మందికిపైగా స్థానికులను కిడ్నాప్ చేసి తీసుకువెళ్లినట్లు సమాచారం. జనజీవన స్రవంతిలో కలిసిన మాజీ మావోయిస్టుల బంధువులే టార్గెట్‌గా నక్సలైట్లు ఈ చర్యకు పాల్పడినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. స్థానిక ప్రజలను భయబ్రాంతులకు గురి చేయడం, లొంగిపోయిన నక్సలైట్లతో సంబంధాలు నెరపుతున్నవారిని శిక్షించడమే నక్సలైట్ల దాడి లక్ష్యంగా స్థానిక పోలీసులు భావిస్తున్నారు. పోలీసుల కథనం ప్రకారం.. పెద్దకోర్మా గ్రామానికి చెందిన జింగు మోడియం, సోమ మోడియం, అనిల్ మడివి అనే వ్యక్తులను మంగళవారం సాయంత్రం తాళ్ళతో ఉరి వేసి చంపారు. అందులో ఒక విద్యార్థి కూడా ఉన్నారు. ఈ ముగ్గురిలో ఇద్దరు బాధితులు కొద్దినెలల క్రితం ఆయుధాలతో ప్రభుత్వానికి లొంగిపోయిన దినేష్ మోడియం అనే నక్సలైట్ బంధువులుగా చెబుతున్నారు. బీజాపూర్ జిల్లాలో దినేష్ మోడియం కరడుగట్టిన మావోయిస్టు నాయకుడు. ఇతని లొంగుబాటు వ్యూహాత్మకంగా పోలీసులు లాభించినట్లు తెలుస్తోంది. ఈ ఘాతుక చర్యలకు మావోయిస్ట్ కమాండర్ వెల్ల దళం నాయకత్వం వహించినట్లు సమాచారం. కాగా ముగ్గురు వ్యక్తులను ఉరివేసి చంపిన నక్సలైట్లు ఏడుగురు గ్రామస్తులపై కూడా దాడిచేసి గాయపరిచారు. మరో డజనుకుపైగా స్థానికులను తమవెంట తీసుకు వెళ్లారు. వీరి ఆచూకీ ఇప్పటి వరకు లభించలేదు. రాత్రి 8.30 గంటల వరకు కూడా నక్సల్స్ చేతిలో హత్యకు గురైనవారి కుటుంబ సభ్యులు పోలీసులు సంప్రదించలేదు. పెద్దకోర్మా గ్రామంలో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. నక్సల్స్ తమవెంట తీసుకువెళ్లిన డజన్‌మంది గురించి గ్రామస్తులు తీవ్రంగా ఆందోళన చెందుతున్నారు.

## కిషన్‌రెడ్డికి ఎమ్మెల్యే రాజాసింగ్ స్నేహ హస్తం

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణలో బిజెపిని అధికారంలోకి తెచ్చేందుకు కలిసి పనిచేద్దామని కేంద్రమంత్రి, బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్ రెడ్డికి ఆ పార్టీ ఎమ్మెల్యే రాజాసింగ్ స్నేహ హస్తం అందించారు. వ్యక్తిగత విభేదాలను విడిచిపెట్టి, ఐక్యంగా పని చేద్దామని రాజాసింగ్ కోరారు. గత కొంతకాలంగా రాష్ట్ర నాయకత్వంపై తనదైన శైలిలో విమర్శలు గుప్పించిన రాజాసింగ్ సోమవారం కిషన్ రెడ్డి తనపై చేసిన వ్యాఖ్యలపై తాజాగా స్పందించారు. మంగళవారం ఓ ప్రకటనను రాజాసింగ్ విడుదల చేశారు. పార్టీలో అందరికీ తగిన గౌరవాన్ని ఇస్తూ, ఈ విషయంపై తాను నేరుగా స్పందించాలనుకుంటున్నానని తెలిపారు. పార్టీలోని ప్రతి ఒక్కరూ బాగుపడాలి, తెలంగాణలో బిజెపి అధికారంలోకి రావాలనేది తన లక్ష్యమని రాజాసింగ్ అన్నారు. తెలంగాణలోని అన్ని 119 నియోజకవర్గాల్లో బిజెపి పార్టీ ఎలా విజయం సాధించడానికి బదులుగా, తనను మాత్రమే లక్ష్యంగా చేసుకొని, తనను విడదీసి, అడ్డంకులు సృష్టిస్తున్నారని, అయినప్పటికీ తాను పార్టీకి అంకితమైన, నిస్వార్థ సేవ చేశానని చెప్పారు. ఒక పార్టీ కార్యకర్తను ఇబ్బంది పెడితే ఏం లాభమని రాజాసింగ్ ప్రశ్నించారు. కిషన్ రెడ్డి తమకు కొంత సమయం కేటాయించాలని కోరారు. కిషన్ రెడ్డి ఎక్కడైనా, ఎప్పుడైనా సమావేశం నిర్ణయిస్తే తాము రావడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. తాము పార్టీని విభజించడాని కి కాదని, ఐక్యతను తీసుకురావడానికి కృషి చేస్తామని అన్నారు. పార్టీ నిజమైన లక్ష్యాన్ని మనం మరచిపోకూడదన్నారు. తెలంగాణకు బిజెపి ప్రభుత్వం అవసరమని అన్నారు.




## పాత బిల్లులతో సంబంధం లేకపోతే కెసిఆర్ నిర్మించిన సచివాలయం ఎందుకు?: పెద్ది

**ప్రజాపక్షం/హైదరాబాద్:** కెసిఆర్ హయాంలో సర్పంచులు గ్రామాలలో చేపట్టిన అభివృద్ధి పనులకు సంబంధించిన బిల్లులపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆ బిల్లులతో తమకేమి సంబంధం అన్నట్టుగా మాట్లాడుతున్నారని బిఆర్‌ఎస్ మాజీ ఎంఎల్‌ఎ పెద్ది సుదర్శన్ రెడ్డి అన్నారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో మాజీ ఎంఎల్‌ఎలు డాక్టర్ మెతుకు ఆనంద్, హనుమంతుషిండే, కార్పొరేషన్ మాజీ చైర్మన్లు కె.వాసుదేవరెడ్డి, గాంధీ నాయక్‌తో కలిసి మంగళవారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో పెద్ది సుదర్శన్ రెడ్డి మాట్లాడు తూ పాత సర్పంచుల బిల్లులతో సిఎంకు సంబంధం లేకపోతే, కెసిఆర్ నిర్మించిన సచివాలయంతో రేవంత్ రెడ్డికి ఏం సంబంధమని ప్రశ్నించారు. రేవంత్ రెడ్డి తీరు దొంగే దొంగ అన్నట్టు అని అరిచినట్టుగా ఉన్నదని, ప్రతిదీ బట్టకాల్చిపైన దష్ప్రచారం చేయడమే పనిగా పెట్టుకున్నారని ఆరోపించారు. వరంగల్ రైతు డిక్లరేషన్‌లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీల్లో ఏ ఒక్కటి అమలు కాలేదని ఆరోపించారు. డాక్టర్ మెతుకు ఆనంద్ ప్రస్తుతం గ్రామాల్లో ట్రాక్టర్ల నిర్వహణ చేయలేమని పంచాయతీ కార్యదర్శులు వాటికి తాళం వేసి, కలెక్టర్లకు అప్పజెబుతున్నారని ఆరోపించారు. ప్రస్తుత వర్షకాలంలో పరిస్థితి ఇలాగే ఉంటే మళ్లీ విష జ్వరాలు విజృంభిస్తాయని, ఇలాంటి అంశాలపైన దృష్టి పెట్టాలని, కేసులపైన కాదని సిఎంకు విజ్ఞప్తి చేశారు.

## 'డిఆర్‌డిఓ–ఐఐటి ఢిల్లీ' ప్రయోగం సక్సెస్

**న్యూఢిల్లీ :** సైబర్ దాడులు తప్పించుకుని సమాచారాన్ని సురక్షితంగా ఒక చోట నుండి మరోచోటకు బదిలీ చేయడంలో భారతదేశం సరికొత్త క్వాంటమ్ శకంలోకి ప్రవేశించింది. డిఆర్‌డిఓ, ఐఐటి ఢిల్లీలు క్వాంటమ్ కమ్యూనికేషన్‌లో ముందడుగువేసిసంబంధిత ప్రయోగాన్ని విజయవంతంగా ప్రదర్శించారు. ఈ ప్రదర్శన విజయవంతం కావడంతో భారతదేశం క్వాంటమ్ కమ్యూనికేషన్ విభాగంలో ఆచరణాత్మకంగా క్వాంటమ్ సైబర్ సెక్యూరిటీని అమలు చేయడానికి మార్గం సుగమమైంది. రక్షణ మంత్రిత్వశాఖ మంగళవారంనాడు ఈ విషయం చెప్పింది. ఈ ప్రయోగాన్ని నిర్వహించడానికి ఐఐటి ఢిల్లీ క్యాంపస్‌లో దాదాపు ఒక కిలోమీటరు కంటే ఎక్కువ దూరం ఫ్రీ–స్పేస్ ఆప్టికల్ లింక్‌ను ఏర్పాటు చేశారు. ఒక చివరి నుండి మరో చివరికి సమాచారం చాలా సురక్షితంగా విజయవంతంగా ఫోటాన్ రేణువుల రూపంలో ఎన్‌కోడింగ్‌లా విడివడి ప్రయాణించి తర్వాత డీకోడింగ్ అయ్యింది. ఈ కొత్త పద్ధతిలో ఫోటాన్స్ కదలికలను ఆటంకపరచి ఎవరైనా సమాచారాన్ని దొంగిలించే ప్రయత్నం చేస్తే మధ్యలోనే సంబంధిత అధీకృత యూజర్ ఇద్దరిమధ్య సంభాషణను రహస్యంగా వింటున్న వ్యక్తి ఉనికిని సులభంగా కనుగొనవచ్చు. ఈ క్వాంటమ్ కమ్యూనికేషన్‌లో సమాచారాన్ని సురక్షితంగా పంపకుండా ఎవరూ ఆపలేరు. అంటే రక్షణరంగం, ఆర్థిక రంగం, టెలికమ్యూనికేషన్స్‌కు ఇది ఎక్కువ ఉపయోగపడుతుంది.

బ్యాంకింగ్ వ్యవస్థనులో సైబర్ నేరాలకు అవకాశం తగ్గుతుంది. దీంతో పాత ఆలోచనలు చెరిపేసి ఆ స్థానంలో సరికొత్త ఆలోచనలకు ఆవిష్కారం జరిగిందని, భవిష్యత్‌కాలంలో సాంకేతిక, వ్యూహాత్మక మార్పులతో సంభవించే యుద్ధరీతులలో సమాచారాన్ని సురక్షితంగా బదిలీ చేయడంలో క్వాంటమ్ సైబర్ సెక్యూరిటీ ఒక గేమ్ ఛేంజర్ (అత్యాధునిక మార్గం)గా దోహదం చేస్తుందని రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్ చెప్పారు. ఈ సందర్భంగా వారికి అభినందనలు తెలియజేశారు.

# పెండింగ్ లేకుండా పనులు పూర్తి

### పంచాయతీ రాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ సమీక్షా సమావేశంలో అధికారులకు మంత్రి సీతక్క ఆదేశం



**ప్రజాపక్షం/హైదరాబాద్:** పనులను, దస్త్రాలను పెండింగ్‌లో పెట్టకుండా త్వరగా పరిష్కరించాలని పంచాయతీ రాజ్ గ్రామీణాభివృద్ధి శాఖమంత్రి డాక్టర్ ధనసరి అనసూయ సీతక్క సూచించారు. మంత్రి నుంచి మల్టీపర్పస్ వర్కర్స్ వరకు అందరూ ఒక కుటుంబంగా పనిచేసి, గ్రామాలను అభివృద్ధి చేయాలని, సకాలంలో పనులను పూర్తి చేయాలని ఆదేశించారు. హైదరాబాద్‌లోని సచివాలయంలో పంచాయతీ రాజ్ గ్రామీణ అభివృద్ధి శాఖ పనితీరు పైన మంత్రి సీతక్క మంగళవారం సమీక్ష నిర్వహించారు. పనుల పురోగతి, అభివృద్ధి సంక్షేమ కార్యకలాపాలను, హామ్ విధానంలో రోడ్ల నిర్మాణం, ఇందిరా మహిళా శక్తి, స్త్రీ నిధి, మిషన్ భగీరథ, ఉద్యోగుల పెండింగ్ సమస్యలపై ఉన్నతాధికారులు మంత్రికి పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చా రు. కాగా పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శిగా బాధ్యతలు తీసుకున్న ఎన్. శ్రీధర్‌ను మంత్రి సీతక్క అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నెలవారీగా లక్ష్యాలు నిర్దేశించుకుని పనిచేయాలని అధికారులను ఆదేశించారు. ఎంపిడిఓల బదిలీల దస్త్రం సిఎం వద్ద ఉన్నదని, ఎంపిడిఓలకు వాహనాల అలవెన్స్ ఫైల్ ఆర్థిక శాఖ వద్దకు చేరిందని, ఈ రెండు ఫైళ్లకు కొద్దిరోజుల్లో క్లియరెన్స్ వస్తుందన్నారు. మెరుగైన సేవలను అందించేందుకు ఉద్యోగులంతా కష్టపడుతున్నారని, వారి సమస్యలను కూడా ప్రభుత్వం పరిష్కరిస్తుందన్నారు. తాము అధికారంలోకి వచ్చిన తర్వాత ఎన్నో ఉద్యోగ సమస్యలను పరిష్కరించామని, 93వేల గ్రామస్థాయి ఉద్యోగులకు గ్రీన్ ఛానల్ ద్వారా ప్రతినెలా జీతాలు చెల్లిస్తున్నామని సీతక్క వివరించారు. గ్రామీణ ప్రాంతాల్లో రహదారుల నిర్మాణం కోసం నూతన విధానం తీసుకొచ్చామని,

**రేపు లేదా ఆ మరుసటి రోజున 'హమ్' జిఒ**

గతంలో గ్రామీణ రోడ్లు అంటే చిన్నచూపు ఉండేదని, హమ్ విధానంతో పట్టణ రోడ్లకు ధీటుగా పల్లె రోడ్లు మెరుగుపడుతున్నాయని, హమ్ ప్రాజెక్టుకు సంబంధించి మార్గదర్శకాలతో బుధవారం, లేదా గురువారం ఉత్తర్వులు విడుదల చేస్తామని మంత్రి సీతక్క తెలిపారు. కర్నాటక, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్ వంటి రాష్ట్రాల్లో హమ్ విధానాన్ని అవలంబిస్తున్నారని, మహారాష్ట్ర, కర్నాటకలకు అధికారుల బృందాలను పంపించాలని మంత్రి ఆదేశించారు. ఆ రెండు రాష్ట్రాల అనుభవాలను అధ్యయనం చేసి హమ్ విధానాన్నీ మన రాష్ట్రంలో పకడ్బందీగా అమలు చేస్తామన్నారు.

హమ్ విధానం ద్వారా మొత్తం 18,472 కిలోమీటర్ల మేరా గ్రామీణ రహదారులను ఆధునీకరిస్తామని, మొదటి విడతలో 7947 కిలోమీటర్లను ఆధునీకరిస్తామని తెలిపారు. 15 రోజుల్లో టెండర్లు వేసే విధంగా అధికారులు కార్యాచరణ రూపొందించాలని మంత్రి ఆదేశించారు. ఉపాధి నిధుల ద్వారా ఇప్పటికే రూ.1800 కోట్ల పనులను మంజూరు చేశామని, త్వరలో రాష్ట్ర వ్యాప్తంగా పనుల జాతరను ప్రారంభిస్తామన్నారు. పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి శాఖలో ప్రతి విభాగం నెలవారీగా టార్గెట్లు రూపొందించుకొని పని చేయాలన్నారు. పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి ముఖ్య కార్యదర్శి శ్రీధర్ మాట్లాడుతూ ఎంతోమంది ప్రజలతో పెనవేసుకున్న శాఖ పంచాయతీరాజ్ శాఖ అని అన్నారు. సిఎం రేవంత్‌రెడ్డి, మంత్రి సీతక్క మార్గదర్శకత్వంలో ప్రభుత్వానికి మంచిపేరు తీసుకొచ్చేలా అందరూ కలిసి పనిచేద్దామని ఆయన చెప్పారు.

## ఇరాన్ నుండి ఆర్మేనియాకు 110 మంది భారత విద్యార్థుల తరలింపు

**న్యూఢిల్లీ :** యుద్ధం జరుగుతున్న ఇరాన్‌లో భద్రత కొరవడినందువల్ల 110మంది భారతదేశ విద్యార్థులను ఆర్మేనియా దేశానికి తరలించా రు. ఇరాన్ రాజధాని టెహ్రాన్‌పై ఇజ్రాయెల్ ఐదు రోజులుగా ఎడతెగని దాడులు చేస్తోంది. ఇరాన్‌లో లోపలికి దూసుకువెళ్ళి క్షిపణులు, యుద్ధ విమానాలతో దాడులుచేస్తూ ఉండటంతో టెహ్రాన్‌లో విద్యాభ్యా సం చేస్తున్న భారత విద్యార్థులను ఆ సరిహద్దుల్లోనే ఉన్న ఆర్మేనియా దేశానికి తాత్కాలికంగా తరలించారు. భారత దౌత్యకార్యాలయం మన దేశ విద్యార్థులతో నిత్య సంబంధాలు కొనసాగిస్తోంది. వారి క్షేమ సమాచారాలు అడిగి తెలుకుంటున్నది. భారత విదేశీ వ్యవహారాల మంత్రిత్వశాఖ ఒక ప్రకటనలో ఈ విషయం చెప్పింది. విద్యార్థులకు కావాల్సిన ఏర్పాట్లన్నీ భారత దౌత్యకార్యాలయం సమకూర్చింది. రవాణా ఖర్చులు భరించడానికి సిద్ధంగా ఉన్న ఇతర నివాసితులను కూడా ప్రస్తుత పరిణామాల రీత్యా టెహ్రాన్ నుండి వెళ్ళిపోవాలని దౌత్య కార్యాలయం సలహా ఇచ్చింది. విడిగా మరికొందరు భారతీయులను కూడా ఆర్మేనియా వెళ్ళేందుకు వీలు కల్పించింది. ఉర్మియా మెడికల్ యూనివర్సిటీకి చెందిన 110మంది భారత విద్యార్థులను తరలించారు. వీరిలో 90 మంది కశ్మీరులోయ నుండి వచ్చినవారే. వారిని సురక్షితంగా సరిహద్దులు దాటించారు. ఎక్స్ వేదికగా ఇరాన్‌లోని భారత దౌత్యకార్యాలయం ఈ విషయం పేర్కొంది. అదేవిధంగా భారత విదేశీ వ్యవహారాల మంత్రిత్వశాఖ ఒక కంట్రోల్ రూమ్ కూడా ఏర్పాటు చేసింది. ప్రస్తుత పరిణామాలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటున్నది.



## తెలంగాణలో బిజెపి వికసిత్ సభలు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణలో గురువారం నుంచి బిజెపి 'వికసిత్ సభలు' పేరిట రాష్ట్ర వ్యాప్తంగా కార్యక్రమాన్ని ప్రారంభిస్తోంది. కేంద్రంలో గత 11 ఏళ్ల నరేంద్ర మోదీ ప్రభుత్వ పాలనలో సాధించిన అభివృద్ధి, ఆర్థిక సంస్కరణలు, భద్రత, మౌలిక వసతులు, ఓబిసి, ఎస్‌సి, ఎస్‌టి సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేయడం లక్ష్యంగా ఈ సభలు నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా గ్రామ, మండల, జిల్లా స్థాయిలో సభలు, రోడ్ షోలు, ఇంటింటి ప్రచారం నిర్వహించనున్నారు. తెలంగాణలో రానున్న స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని ఈ సభలు నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్, ఎంపిలు డి. అరవింద్ (నిజామాబాద్), గోడం నాగేశ్ (ఆదిలాబాద్), ఈటల రాజేందర్ (మల్కాజిగిరి), కొండా విశ్వేశ్వర్ రెడ్డి (చేవెళ్ల), ఎం. రఘునందన్ రావు (మెదక్), 8 మంది ఎమ్మెల్యేలు, 3 మంది ఎమ్మెల్సీలు, సీనియర్ నాయకులు పాల్గొననున్నారు.

## కాంట్రాక్ట్ కార్మికుల జీతాలు వెంటనే చెల్లించాలి

### యూనియన్ అధ్యక్షుడు ఎం.నరసింహ



**ప్రజాపక్షం/హైదరాబాద్:** సికింద్రాబాద్ సబ్ ఏరియాలో పనిచేస్తున్న దాదాపు 700మంది కాంట్రాక్టు కార్మికులకు సంబంధిత కాంట్రాక్టర్లు ప్రతినెల వేతనాలు సకాలంలో చెల్లించకుండా తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారని, వేతనాలు సకాలంలో చెల్లించకపోతే ఆందోళనకు సిద్ధం కావాలని సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డ్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) అధ్యక్షులు ఎం.నరసింహ డిమాండ్ చేశారు. బొల్లారంలోని పబ్లిక్ గార్డెన్‌లో మంగళవారం కార్మికుల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా నరసింహ మాట్లాడుతూ సబ్ ఏరియాలలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు ఏ నెల కూడా సక్రమంగా వేతనాలు 7వ తేదీలోపు చెల్లించలేదన్నారు. చాలామంది కార్మికులకు తక్కువ జీతాలు చెల్లిస్తున్నారని, కొంతమంది కార్మికులకు అసలు జీతాలే ఇవ్వకుండా వేధింపులకు గురి చేస్తున్నారన్నారు. ఇఎస్‌ఐ పేరిట వేతనంలో కోత విధిస్తున్నప్పటికీ కార్మికులకు దాని ఫలితాలు అందటం లేదన్నారు. ఇఎస్‌ఐ కార్మికుల కుటుంబ సభ్యుల పేర్లు నమోదు చేయకపోవటంతో వారికీ ప్రయోజనం లేకుండా ఉందన్నారు. కార్మికులకు ఈఎస్‌ఐ కార్డులు అందజేయని కాంట్రాక్టర్‌పై అధికారులు తగ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్మికుల సమస్యలపైన కంటోన్మెంట్ సిఈఓకు వినతిపత్రం అందజేసి సమస్యలు తెలియజేస్తామన్నారు.

## ఘనంగా శ్రీచైతన్య ''ఐరావత్ ఛాంపియన్స్'' వేడుక




**హైదరాబాద్ :** జాతీయ స్థాయి పోటీ పరీక్షలైన IITJEE (మెయిన్ & అడ్వాన్స్‌డ్), NEET 2025 ఫలితాల్లో శ్రీచైతన్య విద్యాసంస్థలు మరోసారి తన అగ్రస్థానాన్ని నిరూపించుకుని, ఆలిండియా నంబర్ వన్‌గా నిలిచిన సందర్భంగా ''ఐరావత్ ఛాంపియన్స్ వేడుక''ను ఘనంగా నిర్వహించింది. ఈ వేడుక హైటెక్ సిటీ శిల్పకళావేదికలో అంగరంగ వైభవంగా జరిగింది. దేశవ్యాప్తంగా ఉన్న శ్రీచైతన్య టాపర్లు, విద్యార్థులు, అధ్యాపకు లు పెద్ద ఎత్తున ఈ స్ఫూర్తిదాయక వేడుకలో పాల్గొన్నారు. ప్రతిభను ప్రోత్సహించే కార్యక్రమంగా, సాధకులను సత్కరించే వేదికగా ''ఐరావత్'' నిలిచింది. ఈ కార్యక్రమానికి విశిష్ట అతిథులుగా ప్రపంచ చెస్ ఛాంపియన్ గుకేష్ దొమ్మరాజు, ప్రముఖ నటుడు అడివి శేష్ హాజరయ్యా రు. గౌరవ అతిథులుగా శ్రీచైతన్య డైరెక్టర్లు శ్రీధర్ యలమంచిలి, సుష్మా బొప్పన, సీమ బొప్పన పాల్గొన్నారు. జాతీయ స్థాయిలో టాపర్లుగా నిలిచిన విద్యార్థులకు ప్రత్యేక సన్మానాలు చేశారు. శాస్త్రీయ శిక్షణతో, అత్యాధునిక మౌలిక వసతుల తో ముందంజలో ఉన్న శ్రీచైతన్య విజయం వెనుక ఉన్న కలలు, కృషిని ఈ వేడుక మరోసారి చాటిచెప్పింది. ఈ సందర్భంగా గుకేష్ దొమ్మరాజు, అడవి శేష్ విద్యార్థులను ఉద్దేశించి స్ఫూర్తిదాయక ప్రసంగాన్ని ఇచ్చారు. గుకేష్ దొమ్మరాజు మాట్లాడుతూ ''చదరంగం మాదిరిగానే, JEE & NEET వంటి పోటీ పరీక్షల విజయానికి వ్యూహాత్మక ఆలోచన, క్రమశిక్షణ, మానసిక స్థైర్యం ఎంతో అవసరం. ఈ భాగస్వామ్యం ద్వారా విద్యార్థులకు ఈ నైపుణ్యాలు పెంపొందించేందుకు ప్రేరణనిచ్చే అవకాశాన్ని నేను నిబద్ధతతో నిర్వర్తిస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమం లో విశిష్ట అతిథిగా పాల్గొన్న ప్రముఖ సినీ నటుడు అడివిశేష్ మాట్లాడుతూ 2025లో JEE & NEET పరీక్షల్లో టాప్ ర్యాంకులు సాధించిన ప్రతి శ్రీచైతన్య విద్యార్థులకు హృదయపూర్వక అభినందనలు. ఈ విజయాల వెనుక ఉన్న ప్రణాళిక, అంకితభావం అభినందనీయం. ఇంజనీరిం గ్, మెడికల్ రంగాల్లో దేశవ్యాప్తంగా ప్రతిభా వంతులను అందిస్తూ శ్రీచైతన్య విద్యాసంస్థలు ఓ మార్గదర్శక శక్తిగా నిలుస్తున్నాయని ప్రశంసించారు. శ్రీచైతన్య విద్యాసంస్థల అకడమిక్ డైరెక్టర్ సుష్మ బొప్పన మాట్లాడుతూ... భారతీయ చెస్ గ్రాండ్ మాస్టర్, ప్రపంచ చెస్ ఛాంపియన్ అయిన గుకేష్ దొమ్మరాజును బ్రాండ్ అంబాసిడర్‌గా నియమించినందుకు సంతోషంగా ఉందని, ఈ భాగస్వామ్యం దేశవ్యాప్తంగా JEE, NEET ఛాంపియన్‌లను అత్యధికంగా అందించే లక్ష్యం తో ఈ నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. చిన్న వయస్సులోనే గుకేష్ సాధించిన అసాధారణ విజయాలు పాఠశాల విద్యార్థుల నుండి JEE, NEET అభ్యర్థుల వరకు ప్రేరణగా నిలిచాయి. శ్రీచైతన్యలో, మేము విద్యార్థులను సమస్య పరిష్కారం, విశ్లేషణాత్మక నైపుణ్యాలతో అభివృద్ధి చేసేందుకు మేము అంకితభావంతో ఉన్నాము. గుకేష్ యొక్క సామర్థ్యా లు, సంక్లిష్ట సవాళ్లను ఎదుర్కొనేందుకు, ఒత్తిడి పరిస్థితుల్లో ప్రశాంతంగా ఉండటానికి అవసరమైన నైపుణ్యాలతో పోటీ పరీక్షలలో విజయాన్ని సాధించడంలో విద్యార్థులకు మార్గదర్శకంగా ఉంటాయి. గుకేష్ యొక్క ప్రేరణతో, శ్రీచైతన్యలో విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో, వ్యూహాత్మకంగా ఆలోచించి, అత్యున్నత సామర్థ్యాలను చేరుకునేందుకు సమర్థులవుతారని అన్నారు. శ్రీచైతన్య స్కూల్స్ అకడమిక్ డైరెక్టర్ సీమా బొప్పన మాట్లాడుతూ ''గుకేష్ దొమ్మరాజు శ్రీచైతన్య బ్రాండ్ అంబాసిడర్‌గా వ్యవహరించటం గర్వకారణం. గుకేష్ ప్రేరణతో విద్యార్థులు మరింత దృఢంగా ముందుకు సాగుతారని మేము నమ్ముతున్నాం'' అని తెలిపారు.

## క్రిప్టో కరెన్సీ పేరుతో సైబర్ మోసాలు

### ప్రజలను అప్రమత్తం చేసిన హైదరాబాద్ పోలీసులు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** సైబర్ నేరగాళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలని హైదరాబాద్ సిటీ సైబర్ క్రైమ్ పోలీసులు సూచిస్తున్నారు. ఈ మేరకు ఇవాళ అధికారిక ఎక్స్ ఖాతా సైబర్ మోసాలపై అవగాహన కల్పిస్తూ వరుస ట్వీట్లు వేశారు. అందులో ముఖ్యంగా క్రిప్టో కరెన్సీ మాటున సైబర్ మోసాలకు పాల్పడుతున్నారని అలర్ట్ చేశారు. క్రిప్టో కరెన్సీలో పెట్టుబులతో భారీగా లాభాలంటే ఆశపడకండని సూచించారు. రోజుల వ్యవధిలోనే డబ్బులు రెట్టింపు అవుతాయంటే అస్సలు నమ్మకండని తెలిపారు. ఆశ చూపి గుర్తు తెలియని వెబ్సైట్లలో రిజిస్ట్రేషన్ చేయించుకుంటారని సూచించారు. వాట్సాప్, టెలిగ్రామ్ గ్రూపుల్లో ఫేక్ స్క్రీన్ షాట్స్ సృష్టించి నమ్మించే యత్నం చేస్తారని తెలిపారు. నెల రోజుల్లో డబ్బులు డబుల్ అవుతాయని కబుర్లు చెబుతారని, పెట్టుబడి పెట్టాక ఫోన్ స్విచ్ఛాఫ్ చేస్తారని వెల్లడించారు. ముందు వెనకా ఆలోచించకుండా పెట్టుబడులు పెట్టొద్దని క్రిప్టో మోసాలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. సోషల్ మీడియాను నమ్మి అస్సలు పెట్టుబడులు పెట్టొద్దని పేర్కొన్నారు. తక్కువ సమయంలో ఎక్కువ సంపాదించాలనే అత్యాశ ఇబ్బందులకు గురి చేసే అవకాశం ఉంటుందని, ముఖ్యంగా వాట్సాప్, టెలిగ్రామ్లో వచ్చే ట్రేడింగ్ టిప్స్కు దూరంగా ఉండాలని తెలిపారు. ఆన్లైన్ మోసాలపై మరో ట్వీట్ చేస్తూ.. మార్కెట్ ధర కంటే తక్కువకే వస్తున్నాయని సోషల్ మీడియాలో కనిపించిన లింక్స్ క్లిక్ చేసి చిక్కుల్లో పడొద్దన్నారు. ప్రముఖ ఈకామర్స్ వెబ్సైట్లను పోలి ఉండేలా ఫేక్ వెబ్సైట్లను క్రియేట్ చేసి మోసం చేస్తారని తెలిపారు. ఇక పబ్లిక్ వైఫై వాడకంపై మరో ట్వీట్ చేస్తూ.. పబ్లిక్ వైఫై వాడుతూ ఆర్థికలావాదేవీలు అస్సలు చేయొద్దన్నారు. ఉచిత వైఫై వాడేటప్పుడు తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ముఖ్యంగా రద్దీ ప్రదేశాల్లో ఉండే ఫ్రీ వైఫై వాడటం కోసం క్యూఆర్ కోడ్ స్కాన్ చేసే ముందు నిర్ధారించుకోవాలని కీలక సూచనలు చేశారు.




### రైల్వే ట్రాక్‌లపై ప్రమాదకర వస్తువులు ఉంచిన

## ఆకతాయిలపై కఠిన చర్యలు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఈ ఏడాదిలో రైళ్లపై రాళ్ల దాడికి పాల్పడిన 102 మందిని రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ (ఆర్‌పిఎఫ్) పోలీసులు అరెస్టు చేయగా రైల్వే పట్టాలపై ప్రమాదకర వస్తువులు ఉంచినందుకుగాను మరో 33 మంది నేరస్థులను అరెస్టు చేసినట్లు దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్ జైన్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రయాణికుల భద్రత, రైల్వే ఆస్తుల పరిరక్షణకు రైల్వే అత్యంత ప్రాధాన్యతనిస్తుందని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు. రైళ్లపై రాళ్లు రువ్వడం, రైల్వే ట్రాక్‌లపై ప్రమాదకారక వస్తువులను ఉంచడం వంటి దుశ్చర్యలకు పాల్పడవద్దని ఆయన ప్రజలకు విజ్ఞప్తి చేశారు. దీనివల్ల ప్రయాణికుల భద్రతకు భంగం కలుగుతుందని, రైల్వే ఆస్తులకు నష్టం వాటిల్లుతుందని తెలిపారు. ఇటువంటి కార్యకలాపాలు క్రిమినల్ నేరం, నేరస్థులపై రైల్వే చట్టంలోని సెక్షన్ 153 కింద కఠినమైన చర్యలు తీసుకుంటామని, దీనికి 5 సంవత్సరాల వరకు జైలు శిక్ష విధించబడుతుందన్నారు. రైల్వే రక్షక దళం(ఆర్.పి.ఎఫ్) భవిష్యత్తులో ఇటువంటి సంఘ వ్యతిరేక సంఘటనలను నివారించడానికి, దక్షిణ మధ్య రైల్వే వ్యాప్తంగా అనేక చర్యలను తీసుకుంటోందన్నారు. ఈ ప్రయత్నాలలో భాగం గా, దక్షిణ మధ్య రైల్వేలో 2025 సంవత్సరంలో జనవరినెల నుండి మే వరకు, రైళ్ల పై 128 రాళ్ల దాడి కేసులు నమోదు చేశామన్నారు. వీటిలో 85 కేసులు గుర్తించబడి 102 మంది నేరస్థులను అరెస్టు చేశామని ఈ కేసులన్నీ సంబంధిత న్యాయస్థానాల్లో విచారణలో ఇందులో ఇప్పటివరకు 12 మందిని దోషులుగా నిర్ధారించగా , అందులో 01 నిందితుడికి 15 రోజుల జైలు శిక్ష, మిగిలిన 11 మంది నిందితులకు రూ.30,500 జరిమానా విధించబడిందని తెలిపారు. రైల్వే పట్టాలపై ప్రమాదకారక వస్తువులను ఉంచిన 29 కేసులు నమోదు చేయగా, వీటిలో 26 కేసులు గుర్తించబడి 33 మంది నేరస్థులను అరెస్టు చేశారు. అన్ని కేసులు సంబంధిత న్యాయస్థానాలలో విచారణలో ఉన్నాయి.

ఇలాంటి చర్యలను ఎదుర్కోవడంలో రైల్వేకు సహకరించాలని ఆయన అందరికీ విజ్ఞప్తి చేశారు. ఇలాంటి కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తుల గురించి 139కి ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని ప్రజలకు సూచించారు. ఇలాంటి చర్యలు ప్రయాణీకుల భద్రత, విలువైన జాతీయ వనరులను కోల్పోవడంతో పాటు వారి భవిష్యత్తుపై శాశ్వత ప్రభావాన్ని చూపే ప్రతికూల పరిణామాల గురించి పిల్లలకు అవగాహన కల్పించాలని ఆయన తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు.



## నూతన మానవ అక్రమ రవాణా నిరోధక విభాగం ప్రారంభం




**ప్రజాపక్షం/హైదరాబాద్:** మానవ అక్రమ రవాణాను అరికట్టేందుకు హైదరాబాద్ మహి ళా భద్రత విభాగం ఆధ్వర్యంలో నూతనంగా మానవ అక్రమ రవాణా నిరోధక విభాగం (ఎహెచ్‌టియు)ను పోలీసు కమిషనర్ సివి ఆనంద్ మంగళవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సిట్ అదనపు సిపి పి. విశ్వ ప్రసాద్, సిసిఎస్ డిసిపి ఎన్. శ్వేత, ఉమెన్ సేఫ్టీ వింగ్ డిజిపి డాక్టర్ లావణ్య, ప్రజ్వల వ్యవస్థాపకురాలు డాక్టర్ సునీత కృష్ణన్, ఎహెచ్‌టియు ఎసిపి ప్రసన్న లక్ష్మి , ఎహెచ్‌టియు సిఐ సినీత సర్వ్, జెబి, ఎస్‌జెపియు సిఐ కె.మధులతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సివి ఆనంద్ మాట్లాడుతూ.. హైదరాబాదు ఉమెన్ సేఫ్టీ వింగ్ ఆధ్వర్యంలో మానవ అక్రమ రవాణాను అరికట్టడంలో, పిల్లలను రక్షించడంలో తమ నిబద్ధతను మరింత పెంచుకోవడానికి హైదరాబాద్ నగర పోలీసులు ఈరోజు ఒక కీలక అడుగు వేశారన్నారు. దీంతో పాటు జువైనల్ బ్యూరో (జెబి) యూనిట్ కోసం పునరుద్ధరించబడిన సౌకర్యాలను అధికారికంగా ఏర్పాటు చేసి, దీనితో పాటుగా, ప్రజ్వల ఎన్‌జిఒతో కలిసి బాధితుల సహాయ విభాగం (విఎయు) ను కూడా ప్రారంభించామని తెలిపారు. అక్రమ రవాణాదారులను పట్టుకోవడానికి దాడులు నిర్వహించడం, సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకుంటూ భారతీయ బాధితులను వారి సొంత రాష్ట్రాలకు తిరిగి పంపించడం, విదేశీ పౌరులను బహిష్కరించడం. ఈ సంవత్సరంలో ఎహెచ్‌టియు చాలా సమర్థవంతంగా పనిచేసిందన్నారు.. దాడులు నిర్వహించి 23 కేసులు నమోదు చేసి 44 మంది బాధితులను రక్షించి, 71 మందిని అరెస్టు చేసిందని తెలిపారు. జువైనల్ బ్యూరో టీంను అధికారికంగా ఏడుగురు సిబ్బందితో ఏర్పాటు చేశారని ఇందులో ఒక ఇన్‌స్పెక్టర్, ఇద్దరు ఎస్ఐలు, ఇద్దరు హెడ్‌కానిస్టేబుళ్లతో పాటు ఇద్దరు కానిస్టేబుళ్లు ఉంటారు. 'ఆపరేషన్ స్మైల్' , 'ఆపరేషన్ ముస్కాన్' కార్యక్రమాల కింద, 896 మంది పిల్లలను రక్షించామని తెలిపారు.

## వానాకాలం పంట పెట్టుబడి నిధులు జమ

**ప్రజాపక్షం/వికారాబాద్ ప్రతినిధి :** రైతుల ఖాతాలో వానాకాలం పంట పెట్టుబడి నిధులు జమ, రైతు భరోసాతో అన్నదాతకు ఆదరువు కల్పించిన ప్రభుత్వం అని జిల్లా కలెక్టర్ అన్నారు. వ్యవసాయాన్ని పండుగలా మారుస్తూ రైతులకు రైతు భరోసా పథకం వ్యవసాయ ఆధారిత ప్రాంతమైన వికారాబాద్ జిల్లాలోని అందరు రైతులకు ఎంతో ప్రయోజనం చేకురుస్తోందని జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్ తెలిపారు. వానాకాలం 2025 సీజన్‌కు సంబంధించిన పంట పెట్టుబడి సాయం కింద జిల్లాలోని 3,18,447 మంది రైతులకు రూ.384.4 కోట్ల నిధులు నేరుగా వారి బ్యాంక్ ఖాతాలలో జమ చేస్తోందని అన్నారు. రైతులు బ్యాంకు ఖాతా వివరాలను వ్యవసాయవిస్తరణ అధికారులు ఇప్పటికే రైతు భరోసా పోర్టల్‌లో నమోదు చేశారని అన్నారు. మంగళవారం జిల్లాలోని 2,05,361 మంది రైతుల ఖాతాలలో రూ.163.6కోట్ల నిదులు ఇప్పటికే జమ అయ్యాయని కలెక్టర్ వివరించారు. పెట్టుబడి సాయం ప్రారంభించి నిన్నటి వరకు మూడు ఎకరాలలోపు వ్యవసాయ భూమి కలిగిన జిల్లాలోని రైతుల ఖాతాలలో జమ చేశారనన్నారు. మిగుతా రైతులకు పంట పెట్టుబడి సాయం కింద ప్రభుత్వం రైతు భరోసా కింద ప్రభుత్వం నిధులు జమ చేయడం జరిగిందని కలెక్టర్ తెలిపారు.

## మంత్రి శ్రీహరిని కలిసిన కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు వీరేశ్

**ప్రజాపక్షం/నిజాంపేట్ :** తెలంగాణ రాష్ట్ర క్రీడా శాఖ మంత్రిగా వాకేటి శ్రీహరి సెక్రటరియేట్‌లో నూతనంగా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా రాష్ట్ర కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షులు కాసాని వీరేశ్ ముదిరాజ్ కలిశారు. మంత్రి శ్రీహరికి వీరేశ్ పుష్పగుచ్ఛాన్ని అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కాసాని వీరేశ్ ముదిరాజ్ మాట్లాడుతూ కబడ్డీ క్రీడలపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని కోరారు. కబడ్డీ క్రీడాకారులకు రాష్ట్ర ప్రభుత్వం తరఫున ప్రోత్సహాన్ని అందిస్తూ పేద క్రీడా కారులకు సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపి టీసీ నందిగామ సత్యనారాయణ, నాయకులు వెంకటేశ్ పాల్గొన్నారు.



## అభివృద్ధి పనులను పరిశీలించిన ఎంపి



**ప్రజాపక్షం/నాగారం :** మున్సిపాలిటీల అభివృద్ధి తనవంతు కృషి చేస్తానని మల్కాజ్‌గిరి పార్లమెంటు సభ్యులు ఈటల రాజేందర్ అన్నారు.మంగళవారం నాగారం మున్సిపాలిటీ పరిధిలోని బిఎంఆర్ కాలనీలో నిర్మించనున్న బాక్స్ డ్రైనేజీ పనులకు ఎంపి ఈటల సహకారంతో హెచ్‌ఎండిఎ నిధులు 9 కోట్ల 90 లక్షల రూపాయలు మంజూరు అయ్యాయి.ఈ సందర్భంగా ఈటల బిఎంఆర్ కాలనీలోని అభివృద్ధి పనులు పరిశీలించారు.ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు విక్రమ్‌రెడ్డి,మాజీ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి,మల్లేష్‌యాదవ్,అన్నంరాజు సురేష్,నక్క కిషోర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## 100 రోజుల ప్రణాళికతో మున్సిపాలిటీ అభివృద్ధి



**ప్రజాపక్షం/నాగారం:** తెలంగాణ ప్రభుత్వ 100 రోజుల ప్రణాళికలో భాగంగా నాగారం మున్సిపాలిటీ 9వ వార్డు విజయపురి కాలనీలో సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ భాస్కర్‌రెడ్డి తడి, పొడి చెత్త, వీధి కుక్కల నియంత్రణపై కాలనీవాసులకు అవగాహన కల్పించారు. ఆటో డ్రైవర్లకు డబ్బాలు, గ్లౌజులు, యాప్రాన్‌లు పంపిణీ చేశారు. 10వ వార్డులో హరితపురిలో నాలాలో జెసిబితో పూడికలు తీసి వ్యర్థాలను తొలగించారు. ఈ కార్యక్రమంలో డిఇ సంతోష్‌కుమార్, మేనేజర్ సురేష్‌రెడ్డి, పట్టణ ప్రణాళిక ఇన్‌చార్జ్ తిరుపతి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## డాక్టర్ సతీష్‌రెడ్డికి అభినందనలు తెలిపిన టిఫ్ అధ్యక్షులు



**ప్రజాపక్షం/చర్లపల్లి:** నేషనల్ సెక్యూరిటీ అడ్వైజరీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా సభ్యునిగా నియమితులైన డాక్టర్ జి సతీష్‌రెడ్డిని తెలంగాణ ఫెడరేషన్ ఆఫ్ తెలంగాణ అధ్యక్షులు కొండవీటి సుధీర్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. సతీష్‌రెడ్డి నైపుణ్యం, జాతీయ భద్రత, వ్యూహాత్మక వ్యవహారాలకు చేసిన కృషిని గుర్తించి పదవీ రావడం అభినందనీయమని,ఆయన మరిన్ని విజయాలు సాధించాలని కోరుకుంటున్నామని సుధీర్ రెడ్డి అన్నారు.

## హిందూ స్మశాన వాటికను పరిశీలించిన జోనల్ కమిషనర్



**ప్రజాపక్షం/అల్వాల్ :** మచ్చ బొల్లారం డివిజన్ హిందూ స్మశాన వాటికను కూకట్పల్లి జోనల్ కమిషనర్ అపూర్వ చౌహాన్ స్థానిక కార్పొరేటర్ రాజ్ జితేందర్ నాథ్ తో కలిసి స్మశాన వాటికను పరిశీలించారు. హిందూ స్మశాన వాటికను అభివృద్ధి చేసి స్థానికులకు అన్ని రకాలుగా ఉపయోగపడే విధంగా చేయాలని అధికారులను జోనల్ కమిషనర్ సూచించారు. ముఖ్యంగా మంచినీటి సౌకర్యం కోసం బోర్వెల్ వేయాలని ముఖద్వారం మరియు వేరు వేరుగా మరుగుదొడ్లు స్త్రీలకు పురుషులకు స్నానాల గదులను కల్పించాలని కాంపౌండ్ వాల్ ఏర్పాటు చేయాలని వాకింగ్, మొక్కలతో స్మశాన వాటికను సుందరీకరించి అభివృద్ధి చేయాలని వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు బొబ్బిలి సురేందర్ రెడ్డి, వెంకటేష్ గౌడ్, స్మశాన వాటిక అభివృద్ధి కమిటీ మెంబర్లు పిడి అశోక్ కుమార్, ఏ నర్సింగ్ రావు, పుట్నాలకృష్ణ, ఆనంద రెడ్డి, రామచంద్ర రెడ్డి, నర్సింగ్, పాండురంగా రావు, కే.నర్సింగరావు, యాదగిరి అధికారులు, ఈఈ శ్రీకాంతి, డిఈ రఘు, ఏఈ రవళి తదితరులు పాల్గొన్నారు.

## బడ్జెట్ స్కూళ్లకు సహకరించండి

'ట్రస్మా' ప్రతినిధులు



**ప్రజాపక్షం/మేడ్చల్ ప్రతినిధి/దుండిగల్:** బడ్జెట్ స్కూళ్ల సమస్యల దృష్ట్యా యాజమాన్యాలకు సహకరించాలని మేడ్చల్ జిల్లా ట్రస్మా ప్రతినిధులు కోరారు. ట్రస్మా రాష్ట్ర అసోసియేట్ రామేశ్వరరెడ్డి, ట్రస్మా నూతన కమిటి అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఆంజనేయులు, కోశాధికారి గిరి బాబులు మంగళవారం జిల్లా విద్యా శాఖాధికారి విజయకుమారిని కలిసారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇటీవలి కాలంగా బడ్జెట్ పాఠశాలలను ఇబ్బంది పెట్టే విధంగా కార్పొరేట్ స్కూళ్లు ఎలాంటి అనుమతులు లేకుండా ఎక్కడ పడితే అక్కడ తమ పాఠశాలల శాఖలను ఏర్పాటు చేస్తున్నాయన్నారు. ఇలాంటి అనుమతి లేని పాఠశాలల వల్ల విద్యార్థులు, తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాల్సి ఉంటుందని, ఈ విషయంలో జిల్లా విద్యా శాఖ తనిఖీలు చేస్తూ తగు చర్యలు తీసుకోవాలని కోరారు. వీరితో పాటు ట్రస్మా జిల్లా నాయకులు గడ్డమీద బాలరాజు,వినోద్ డిఈఓను కలిసిన వారిలో ఉన్నారు.

# గంజాయి, మత్తు పదార్థాల నిర్మూలనకు కృషి

డిజిపి జితేందర్



**ప్రజాపక్షం/వికారాబాద్ ప్రతినిధి :** వికారాబాద్ జిల్లా ఎస్‌పి కార్యాలయాన్ని డిజిపి జితేందర్ మంగళవారం సందర్శించారు. ముందుగా జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్ డిజిపిని కలిసి పుష్పగుచ్ఛం ఇచ్చి స్వాగతం తెలిపారు. ఎస్‌పి కార్యాలయ ప్రాంగణంలో మొక్కను నాటారు. మల్టీజోన్ 2 ఐజీపీ వి.సత్యనారాయణ, చార్మినార్ జోన్ డీఐజి తస్ఫీర్ ఇక్బాల్, జిల్లా ఎస్‌పి నారాయణరెడ్డి కలిసి ఉన్నత స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. అనంతరం మీడియా సమావేశంలో డిజిపి మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణకు, నేరాల నియంత్రణకు పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న కేసులపై ప్రత్యేక దృష్టి సారించి ,వాటిని త్వరితగతిని పూర్తి చేయాలని అదేశించారు. తరచుగా నేరాలకు పాల్పడుతూ శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై రికార్డులు పక్కాగా నమోదు చేసి, వారి నేర చరిత్రను బట్టిరౌడీషీట్ తెరవాలని లేదా పీడీ యాక్ట్ కింద కేసు లు నమోదు చేయాలని స్పష్టం చేశారు. జిల్లాలోని ప్రో యాక్టివ్ పోలీసింగ్ పటిష్టంగా అమలు చేయ డం ద్వారా నేరాలు జరగకముందే అడ్డుకట్ట వేయాలని సూచించారు. అదేవిధంగా, పోలీస్ స్టేషన్ల పరిధిలో నమోదైన దొంగతనం కేసులను త్వరితగతిన చేధించాలని ఆదేశించారు. యువత భవిష్యత్తును నాశనం చేస్తున్న మాదకద్రవ్యాలపై ఉక్కుపాదం మోపాలని డిజిపి అదేశించారు. జిల్లాలో ఎన్‌డిపిఎస్ కేసులపై ప్రత్యేక దృష్టి సాగించి, గంజాయి, ఇతర మత్తు పదార్థాలు, రాష్టంలో లేకుండా నిర్మూలించాలని అన్నారు. సరిహద్దు పోలీస్‌స్టేషన్ల అధికారులు మత్తు పదార్థల రవాణాలపై ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని, పోలీస్ స్టేషన్లు పరిధిలో నిరంతరం దాడులు నిర్వహించి మత్తు పదార్థాలను పూర్తిగా అరికట్టాలని తెలిపారు. ప్రభుత్వ పిడిఎస్ బియ్యాన్ని అక్రమంగా తరలించి వ్యాపారం చేసే వరిని, ఇసుక మాఫియాను, మట్కా, గేమింగ్, వంటి వటిని ఎట్టి పరిస్థితుల్లోను ఉపేక్షించవద్దని రాత్రి వేళ్లలో వాహన తనిఖీలు ముమ్మరం చేయాలని ఆదేశించారు. మహిళ, ఎస్సీ, ఎస్టీ వర్గాల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని డీజీపీ స్పష్టం చేశారు. మహిళలపై నేరాలు, పోక్సో చట్టం కింద నమోదైన కేసులు, ఎస్సీ ,ఎస్టీ అట్రాసిటీ కేసుల సమాచారాన్ని వెంటనే ఉన్నతాధికారులకు తెలియజేసి,పకడ్బందీగా దర్యాప్తు ద్వారా నిందితులకు కఠినశిక్ష పడేలా చూడాలన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతి గ్రామంలో సీసీటివి కెమెరాలు ఏర్పాటు చేసేలా ప్రజలను చైతన్యపరచాలని, మరమ్మతులు చేయించాలని అన్నారు. డయల్ 100కు వచ్చే కాల్స్‌పై తక్షణమే స్పందించాలన్నారు. అధికారులు కష్టపడి పనిచేయాలని సూచించారు. వికారాబాద్ జిల్లాలో పర్యాటక ప్రాంతాలు, ఫార్మ్‌హౌస్‌లు, వీకెండ్‌లలో జరిగే పార్టీలపైనా, ప్రత్యేక నిఘా పెట్టాలని డిజిపి తెలిపారు. కేసులలో చార్జ్‌షీట్‌లను వెంటనే వేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో డిఎస్‌పిలు, సిఐలు పాల్గొన్నారు.

# కన్నుల పండువగా హిల్ కౌంటీ శ్రీవెంకటేశ్వర స్వామి కల్యాణం

ప్రత్యేక పూజలు చేసిన ఎమ్మెల్యే కెపి వివేకానంద



**ప్రజాపక్షం/నిజాంపేట్ :** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ బాచుపల్లిలోని హిల్ కౌంటీ కాలనీలోని శ్రీ వెంకటేశ్వర స్వామి కళ్యాణ మహోత్సవ వేడుకలు కన్నుల పండువగా జరిగాయి. ఈ వేడుకలకు స్థానిక ఎమ్మెల్యే, బిఆర్‌ఎస్ పార్టీ శాసనసభ విప్ కెపి వివేకానంద విచ్చేసి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా వివేక్ మాట్లాడుతూ కలియుగ ప్రత్యక్ష దైవం వెంకటేశ్వరుడని, ఆ స్వామి వారి కృపా, కటాక్షలు అందరి పై ఉండాలని అన్నారు. ఆ భగవంతుని ఆశీస్సులతో ప్రజలంతా సుభిక్షంగా జీవించాలని ప్రార్థించారు. కార్యక్రమంలో నాయకులు రాజేందర్ రెడ్డి, శ్రీదేవి, భూపాల్ రెడ్డి, అజయ్ సాగి, పరిమళ పాల్గొన్నారు.

**పావురాల ఎల్లమ్మ తల్లి వార్షికోత్సవ వేడుకల్లో ఎమ్మెల్యే కెపి వివేక్**

కుత్బుల్లాపూర్ సర్కిల్ పరిధిలోని సుభాష్‌నగర్ డివిజన్ జీడిమెట్ల డిపో వద్ద గల శ్రీశ్రీశ్రీ పావురాల ఎల్లమ్మ తల్లి కళ్యాణ మహోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ వేడులకు స్థానిక ఎమ్మెల్యే కెపి వివేక్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా వివేక్ మాట్లాడుతూ ఎల్లమ్మ తల్లి దయతా ప్రతిఒక్కరు చల్లగా జీవించాలని ప్రార్థించారు. అమ్మవారి ఆశీస్సులతో ప్రజలంతా సుఖ:సంతోషాలతో జీవించాలని ప్రార్థించారు. కార్యక్రమంలో నాయకులు దన్‌రాజ్ యాదవ్, కాలనీ వాసులు పాల్గొన్నారు.

# చర్లపల్లి రైల్వేస్టేషన్‌కు బస్సు సౌకర్యం కల్పించాలి

బస్సులు లేక ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు



**ప్రజాపక్షం/చర్లపల్లి:** చర్లపల్లి రైల్వే టర్మినల్‌కు పలు ప్రాంతాల నుండి బస్సు సౌకర్యం కల్పించాలని చెంగిచెర్ల ఆర్‌టిసి డిపో మేనేజర్ తెలంగాణ ఆల్ స్టేట్ సీనియర్ సిటిజన్ అసోసియేషన్ ఆఫ్ కొర్రెముల శాఖ ఆధ్వర్యంలో వినతి పత్రం సమర్పించారు. చర్లపల్లి టర్మినల్ స్టేషన్‌ను వందల కొట్లతో ఆధునీకరణ చేసి అనేక రైళ్లు ఇక్కడి నడుస్తున్నాయని పోచారం మున్సిపాలిటీ పరిధిలోని కొర్రెముల, చౌదరిగూడ నివాస ప్రాంతాలకు 10 కిలోమీటర్ల దూరంలో ఉండడంతో రైల్వే స్టేషన్‌కు బస్సు సౌకర్యం లేక సీనియర్ సిటిజన్స్, ఇతర రాష్ట్రాల ప్రజలు, ఈ ప్రాంతంలో అనేక విద్యా సంస్థలో చదివే విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. బస్సు సౌకర్యం కల్పించాలని డిపో మేనేజర్‌ను వినతి పత్రంలో కోరారు. ఈ కార్యక్రమలో అధ్యక్షులు బంగారి రాజయ్య, సింగరేణి రిటైర్డ్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఉప ప్రధాన కార్యదర్శి ఆళవందార్ వేణుమాధవ్, కె.బీరయ్య, ఎం.రాజనర్సు, చుక్కల నర్సయ్య, మల్లయ్య, కనకయ్య తదితరులు ఉన్నారు.

**చర్లపల్లి నుండి పరిసర ప్రాంతాలకు బస్సులు నడపాలి: స్థానికులు**

నూతనంగా ప్రారంభించిన చర్లపల్లి రైల్వే టర్మినల్ నుండి ఘట్‌కేసర్, కీసర, చర్లపల్లి నుండి వయా ఇసీఐఎల్, లాలాపేట్, తార్నాక మీదుగా సికింద్రాబాద్‌కు బస్సులు నడపాలని స్థానికులు కోరుతున్నారు. ఈ ప్రాంతాల నుండి బస్సులు లేక ప్రైవేట్ క్యాబ్‌లు,ఆటోలలో వేల రూపాయలు ఖర్చు పెట్టి రావాలసి వస్తుందని. చర్లపల్లి నుండి ఇసీఐఎల్‌కు వెళ్లలంటే మూడు బస్సులు లేక ఆటోలు మారవలసి వస్తుందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కీసర, ఘట్‌కేసర్ నుండి చర్లపల్లి స్టేషన్‌కు సౌకర్యం కల్పించాలని కోరుతున్నారు.

# కార్పొరేషన్‌ను అభివృద్ధి చేయడమే నా బాధ్యత




నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి కొలను హన్మంత రెడ్డి

**ప్రజాపక్షం/ నిజాంపేట్ :** నిజాంపేట్ కార్పొరేషన్‌ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే నా బాధ్యత అని కుత్బుల్లాపూర్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కొలను హన్మంత రెడ్డి అన్నారు. నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ బాచుపల్లి 18వ డివిజన్ సాయి అనురాగ్ కాలనీలో రూ.35 లక్షల వ్యయంతో సిమెంటు రోడ్డు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణపు పనులను స్థానిక మాజీ కార్పొరేటర్ కొలను వీరేందర్ రెడ్డితో కలిసి హన్మంతరెడ్డి ప్రారంభించారు. అనంతరం పలు సమస్యలను పరిష్కరించాలని కోరుతూ హన్మంత రెడ్డికి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా హన్మంత రెడ్డి మాట్లాడుతూ కాలనీలో నెలకొన్న సమస్యలను త్వరితగతిన పరిష్కరించేవిధంగా కృషి చేస్తానని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల ప్రభుత్వమని, అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం ముందుకు వెళ్తుందని అన్నారు. నిజాంపేట్ కార్పొరేషన్‌లో నెలకొన్న సమస్యలన్నింటిని ప్రభుత్వం, ఇన్‌చార్జి మంత్రి దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేలా పాటుపడాతనని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎన్‌ఎంసీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కొలను రాజశేఖర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి కొలను జీవన్ రెడ్డి, జిల్లా యువజన కాంగ్రెస్ కార్యదర్శి కొలను బాల్ రెడ్డి, నాయకులు రాజేందర్, జీతూ, శ్రీనివాస్, జితేందర్ రెడ్డి, శ్రీకాంత్, భరత్, రామకృష్ణ, సంపత్ రెడ్డి, రమేశ్ కుమార్, అరుణ చౌదరి పాల్గొన్నారు.

# ప్రతిపక్షాలు రాష్ట్ర ప్రగతికి సహకరించాలి

పట్నం మహేందర్‌రెడ్డి



**ప్రజాపక్షం/మేడ్చల్ ప్రతినిధి :** ప్రభుత్వాన్ని ఆర్థిక భారం వెంటాడుతున్నా ప్రజా సంక్షేమ పథకాలు అమలు చేస్తూ మేడ్చల్ జిల్లా అభివృద్ధి కొనసాగిస్తూనే ఉంటుందని తెలంగాణా ప్రభుత్వ చీఫ్ డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డి అన్నారు. జిల్లాలోని శామీర్‌పేట మండలంలోని ఎస్ ఎన్ ఆర్ పుష్ప కన్వెన్షన్ హాలులో మంగళవారం నిర్వహించిన కళ్యాణలక్ష్మి , షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో మల్కాజిగిరి ఎంపి ఈటెల రాజేందర్, మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డితో కల్సి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అధికారం చేపట్టిన కాంగ్రెస్ ప్రభ్యుం ఎన్నికల సమయంలో ఇచ్చిన అన్ని హామీలను దిగ్విజయంగా అమలు చేస్తోందన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను వినియోగించుకోవాలని ఆయన ప్రజలను కోరారు. ప్రతిపక్షాలు విమర్శలను తగ్గించి సంయమనం పాటిస్తూ రాష్ట్ర అభివృద్ధికి సహకరించాలని కోరారు. రాష్ట్రంలోని రైతాంగానికి రైతు భరోసా కింద ఎకరాకు రూ.12 వేలు సహాయాన్ని ఆయన ప్రారంభించారు. మేడ్చల్ జిల్లాలో 3656 మంది రైతులకు కోటి 72 లక్షలు రైతు భరోసా కింద అందిస్తున్నామన్నారు. విద్య, వైద్యం, ఆరోగ్యం, వ్యవసాయం లాంటి వాటికి ముఖ్యమంత్రి అవసరమైన నిధులు కేటాయిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ ఉపేందర్‌రెడ్డి, రాష్ట్ర కాంగ్రెస్ నేతలు నక్క ప్రభాకర్‌గౌడ్, ఆర్టీఏ సభ్యుడు జైపాల్‌రెడ్డి, శామీర్‌పేట మండల కాంగ్రెస్ అధ్యక్షుడు శంకర్‌గౌడ్, బిఆర్‌ఎస్ నేతలు దయానంద్‌యాదవ్, భాస్కర్‌యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

## ఎసిబికి చిక్కిన మహిళా ఇంజనీర్



**ప్రజాపక్షం/మేడ్చల్ ప్రతినిధి :** లంచాలకు మరిగిన జిహెచ్‌ఎంసి కాప్రా సర్కిల్‌లో ఇంజనీర్‌గా విధులు నిర్వహిస్తున్న ఓ మహిళా ఉద్యోగిని స్వరూపను అవినీతి అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకొన్నారు. ఎసిబి విభాగ అధికారులు, బాధితుడు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గత కొద్దికాలంగా కాప్రా సర్కిల్‌లో విద్యుత్ సంబంధిత పనులు చేస్తున్న రామిరెడ్డి అనే కాంట్రాక్టర్ కార్యాలయంలో విద్యుత్ విభాగంలో ఏఈగా పని చేస్తున్న స్వరూపను కల్సి తాను చేసిన పనులకు గాను బిల్లులు చెల్లించాలని గత కొద్ది నెలలుగా కోరుతుండటంతో తనకు రూ.1.2 లక్షలు కానుకగా (లంచం) ఇవ్వాలని డిమాండ్ చేస్తూ తాత్సారం చేయసాగింది. ఎన్నిసార్లు కార్యాలయంలో కల్సి బతిమిలాడినా ఉపయోగం లేకపోవటంతో అతడు చివరికి ఎసిబి అధికారులను ఆశ్రయించి లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేసాడు. దీంతో రంగంలోకి దిగిన ఎసిబి అధికారులు మంగళవారం తన కార్యాలయ ప్రాంగణంలో సదరు కాంట్రాక్టర్ నుండి లంచం డబ్బులు తీసుకొంటుండగా ఆమెను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకొన్నారు. ఆమెపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. గతంలో కూడా ఆమెపై కాంట్రాక్టర్లను లంచాల కోసం వేధింపులకు గురి చేసేదని ఆరోపణలు ఉన్నాయి.



## పేదోడి సొంతింటి కల నెరవేరుస్తాం

జిల్లా ట్రాన్స్‌పోర్ట్ మెంబర్ జైపాల్‌రెడ్డి

**ప్రజాపక్షం/శామీర్‌పేట :** పేదోడి సొంతింటి కల కాంగ్రెస్ ప్రభుత్వంతోనే సాధ్యమని జిల్లా ఆర్‌టిఎ మెంబర్ బీమిడి జైపాల్‌రెడ్డి అన్నారు. మంగళవారం తూంకుంట మున్సిపాలిటి అంతాయిపల్లిలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత బిఆర్‌ఎస్ హయాంలో ఏ ఒక్క పేదోడికి ఇళ్లు కట్టించలేదని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన యేడాదిన్నరలోపే ఇళ్లు లేని వారిని గుర్తించి ఇందిరమ్మ ఇళ్లు కట్టిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో హౌజింగ్ ఎఇ కమలాకర్, వార్డు ఆఫీసర్ మహేందర్, ఇందిరమ్మ కమిటీ సభ్యులు కత్తి రమేష్, రాజబోయిన శ్రీనివాస్‌యాదవ్, వజ్జల శశాంత్, వార్డు యూత్ కాంగ్రెస్ అద్యక్షులు మహేష్, ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారులు పాల్గొన్నారు.

## ఘనంగా ఎమ్మెల్యే జన్మదిన వేడుకలు



**ప్రజాపక్షం/అల్వాల్ :** మల్కాజిరి నియోజకవర్గ శాసనసభ్యులు మర్రి రాజశేఖర్ రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకొని అల్వాల్ పట్టణ కేంద్రంలోని తెలంగాణ తల్లి విగ్రహం వద్ద బిఆర్‌ఎస్ పార్టీ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి మిఠాయిలు పంపిణీ చేశారు. అనంతరం అల్వాల్ కార్పొరేటర్ చింతల శాంతి శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పేదలకు పండ్లు పంపిణీ, ప్రభుత్వ పాఠశాలలో పేద విద్యార్థులకు నోటుబుక్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ విద్యార్థులకు ఉచితంగా రెండు జతల స్కూల్ యూనిఫామ్ పాఠ్యపుస్తకాలు పరిశుభ్రమైన రుచికరమైన మధ్యాహ్న భోజనం అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులచే బోధన కంప్యూటర్ శిక్షణ వ్యక్తిగత పర్యవేక్షణ మొదలగు సౌకర్యాలు ప్రభుత్వం కల్పిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మూడు డివిజన్ల నాయకులు కార్పొరేటర్లు శాంతి శ్రీనివాస్ రెడ్డి, సబితా అనిల్ కిషోర్ గౌడ్, ఎంబీసీ మాజీ చైర్మన్ నంది కంటి శ్రీధర్, డోలి రమేష్, నార్ల సురేష్, శరణ్ గిరి, యాదగిరి గౌడ్, లక్ష్మణ్ యాదవ్, పరమేష్, సత్యనారాయణ, సూర్య ప్రకాష్ రెడ్డి, సాజిత్, ప్రభాకర్, సరిత, సులోచన, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

**నార్ల సురేష్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే జన్మదిన వేడుకలు**

మచ్చబొల్లారం డివిజన్‌లోని సురేష్ సమితి వ్యవస్థాపక అధ్యక్షులు నార్ల సురేష్ ఆధ్వర్యంలో మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి జన్మదిన సందర్భంగా కేక్ కట్ చేసి పేద విద్యార్థులకు అన్నదానం నిర్వహించారు.

## విలీన విద్య, బాలిక దినోత్సవం

**ప్రజాపక్షం/వికారాబాద్ ప్రతినిధి :** వికారాబాద్ మండల పరిధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మదన్‌పల్లి గ్రామంలో జయశంకర్ బడి బాట కార్యక్రమంలో భాగంగా మంగళవారం విలీన విద్య, బాలికదినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు యాదయ్య మాట్లాడుతూ బాలికా విద్యా అనేది సమాజంలో మహిళల సాధికరతకు, ఆర్థికాభివృదికి, దేశాభివృద్ధికి ఎంతో ముఖ్యం అని ప్రధానోపాధ్యాయులు తెలిపారు. విద్యా నేర్చుకున్న బాలికలు మంచి ఉద్యోగాలు సంపాదించి, ఆర్థికంగా స్వతంత్రులుగా మారుతరు అని అన్నారు. పేదరికం నుండి బయటపడుతారని ఈ సందర్భంగా గుర్తు చేశారు. విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హేమతల, ఎంవి ఫౌండేషన్ ఇంచార్జీ దేవ కుమారి, ఉపాధ్యాయులు ,విద్యార్థులు పాల్గొన్నారు.

## అర్హులైన ప్రతి ఒక్కరికీ రెండు మాసాల్లోపు ధ్రువీకరణ పత్రాలు : కలెక్టర్

**ప్రజాపక్షం/వికారాబాద్ ప్రతినిధి :** అంగవైకల్యానికి సంబధించిన అర్హులైన ప్రతి ఒక్కరికీ రెండు మాసాల్లోపు ధ్రువీకరణ పత్రాలను అందజేయాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయంలో యుడిఐడి శిబిరాల నిర్వహణపై డిఆర్‌డిఓ ,వైద్యశాఖ అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో అంగవైకల్యంతో కూడిన ప్రతి ఒక్కరికి సదరం యుడిఐడి శిబిరాల ద్వారా ధ్రువీకరణ పత్రాలు అందజేసిందుకు వీలుగా అధిక శిబిరాలను ఏర్పాటు చేసి ధ్రువీకరణ పత్రాలను అందజేయాలని అన్నారు. ఈసమీక్ష సమావేశంలో డిఆర్‌డిఓ శ్రీనివాస్ ,జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ రాంచంద్రయ్య, కొండగల్ ,వికారాబాద్ వైద్య కళాశాల ప్రిన్సిపల్ పద్మ ,మల్లికర్జున డీపీఎం నర్సింలు ఏపిఎం కమలాకర్ తదితరులు పాల్గొన్నారు.

## సమాజంలో వైద్యుడు దేవుడితో సమానం

మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింలు



**ప్రజాపక్షం/షాద్‌నగర్ :** సమాజంలో వైద్యుడు దేవుడితో సమానం అని మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింలు అన్నారు. మంగళవారం పట్టణ కేంద్రంలో ఉత్తమ డాక్టర్‌గా అవార్డు అందుకున్న డాక్టమిర్యాల వెంకట రమణను ఘనంగా శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వైద్యులకు సమాజంలో మంచి గురింపు గౌరవం ఉందన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు చంద్రయ్య, వీరేందర్, కిషోర్, కృష్ణయ్య తదితరులు ఉన్నారు.

## రంగారెడ్డిలో రూ.127.79కోట్ల రైతు భరోసా సహాయం

రంగారెడ్డి జిల్లా వ్యవసాయ అధికారి నరసింహారావు

**ప్రజాపక్షం/రంగారెడ్డి ప్రతినిధి :** జిల్లాలో రైతు భరోసా కార్యక్రమం కింద సోమ, మంగళవారాల్లో 1,87,255 మంది రైతులకు రూ.127.79 కోట్ల రైతు భరోసా సహాయం అందించడం జరిగిందని రంగారెడ్డి జిల్లా వ్యవసాయ అధికారి బి.నరసింహారావు తెలిపారు. కొత్త పాస్ బుక్కులు కలిగి ఉన్న రైతులు, వారి బ్యాంకు అకౌంట్లో వివరాలు సంబంధిత వ్యవసాయ విస్తరణ అధికారి, మండల వ్యవసాయ అధికారి కార్యాలయాల్లో సమర్పించాలన్నారు. బ్యాంకు అకౌంట్ నెంబరు తప్పుగా ఉండి, రైతు భరోసా సహాయం అందని వారు తమ తమ బ్యాంకు అకౌంట్‌ల వివరాలను సంబంధిత వ్యవసాయ విస్తరణ అధికారి, మండల వ్యవసాయ అధికారికి దృష్టికి తీసుకువెళ్లాలని జిల్లా వ్యవసాయ అధికారి నరసింహారావు సూచించారు.

## బడికి 'బాట' చూపిన 'హైడ్రా'కు ధన్యవాదాలు చెప్పిన విద్యార్థులు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** మా బడికి బాట చూపారంటూ హైడ్రా కమిషనర్ ఎవి రంగనాథ్‌కు సికింద్రాబాద్‌లోని మెట్టుగూడ డివిజన్ చిలకలగూడ దూద్‌బావి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు ధన్యవాదాలు తెలిపారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు మల్లికార్జున్ రెడ్డి, ఉపాధ్యాయులు వెంకట రమణతో కలిసి వచ్చిన విద్యార్థులు మంగళవారం హైడ్రా కార్యాలయంలో కమిషనర్‌ను కలిసి మొక్కను బహూకరించారు. మే 26న జిహెచ్‌ఎంసి జోనల్ కార్యాలయం ఎదుట ప్రధానోపాధ్యాయుడు మల్లికార్జున్ రెడ్డి 'సిఎం గారు.. మా బడికి బాట వేయించండి' అంటూ ప్ల కార్డు పట్టుకుని ధర్నాకు దిగిన వార్త మీడియాలో ప్రసారం అవ్వడంతో హైడ్రా రంగంలోకి దిగింది. హైడ్రా కమిషనర్ ఆదేశాలతో ఇన్‌స్పెక్టర్ ఆదిత్య క్షేత్రస్థాయిలో పరిశీలించి, పాఠశాలకు వెళ్లే మార్గంలో అడ్డంగా ఉన్న ప్రహరీని తొలగించిన విషయం తెల్సిందే. జిహెచ్‌ఎంసి సహకారంతోరోడ్డు వేయించి, పాఠశాలకు గేటు ఏర్పాటు చేశారు. పాఠశాలకు రోడ్డు వేయించి గేటు పెట్టించిన జిహెచ్‌ఎంసి జోనల్ కమిషనర్ ఎన్.రవికిరణ్‌కు విద్యార్థులు, ఉపాధ్యాయులు కృతజ్ఞతలు తెలిపారు. స్కూల్ బడిబాట కోసం మద్దతు తెలిపిన సిపిఐ సికింద్రాబాద్ కార్యదర్శి కాంపల్లి శ్రీనివాస్ పాల్గొన్నారు.

## ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ సేవలు అభినందనీయం



**ప్రజాపక్షం/రంగారెడ్డి:** ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ సేవా కార్యక్రమాలు అభినందనీయమని తలకొండపల్లి సర్పంచుల సంఘం మాజీ అధ్యక్షులు జప్లావత్ గోపాల్ నాయక్ అన్నారు. తలకొండపల్లి మండలం సంఘాయిపల్లి గ్రామానికి చెందిన రమాదేవి భర్త నరేష్ మరణించడంతో ఒక్కగానొక్క బిడ్డ పల్లవిని చదివించలేక ఇబ్బంది పడుతున్నారని ఉప్పల వెంకటేష్ దృష్టికి తీసుకువెళ్లడంతో స్పందించి ఆర్థికసాయం అందించడం అందినందనీయమని గోపాల్ నాయక్ అన్నారు. కార్యక్రమంలో నర్సింహా, నిర్మల శ్రీశైలంగౌడ్ పాల్గొన్నారు.

## కాంగ్రెస్ బలోపేతానికి కృషిచేయాలి

మధుయాష్కిగౌడ్‌ను కలిసిన ఉప్పల శ్రీనివాస్‌గుప్త



**ప్రజాపక్షం/సరూర్‌నగర్ :** టిపిసిసి క్యాంపెయిన్ కమిటీ చైర్మన్, మాజీ ఎంపి మధుయాష్కీగౌడ్‌ను ఉప్పల శ్రీనివాస్‌గుప్త కలిశారు. మంగళవారం టిపిసిసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన సందర్భంగా మధుయాష్కీని ఆయన నివాసంలో ఉప్పల కలిసి ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని ఉప్పల శ్రీనివాస్‌గుప్తకు మధుయాష్కీ సూచించారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పర్యావరణాన్ని ప్రేమించే వారిపై దాడి బాధాకరం : కార్పొరేటర్ ప్రేమ్



**ప్రజాపక్షం/సరూర్‌నగర్ :** పర్యావరణాన్ని ప్రేమించే వారిపై దాడి చేయడం బాధాకరమని గడ్డిఅన్నారం డివిజన్ కార్పొరేటర్ బద్దం ప్రేమ్ మహేశ్వర్‌రెడ్డి అన్నారు. మంగళవారం డివిజన్ పరిధిలోని కమలానగర్ కాలనీలో ఎటువంటి ముందస్తు నోటీసులు లేకుండా ప్రజా ప్రతినిధులను సంప్రదించకుండా పూలమొక్కలు, ట్రీ గార్డులను బుల్డోజర్‌తో ధ్వంసం చేయడంతో టౌన్ ప్లానింగ్ అధికారుల అమానుష చర్యలతో స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇలాంటి దౌర్జన్య నిర్ణయాలు తీసుకోవడం ప్రజాస్వామ్యానికి తూట్లు పొడిచే చర్య అని విమర్శించారు. ఈ ఘటనపై సంబంధిత అధికారులపై తక్షణమే విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## అక్షర కేంద్రాలు అంగన్‌వాడీలు

జిల్లా సంక్షేమ శాఖ అధికారి శ్రీలత



**ప్రజాపక్షం/సరూర్‌నగర్ :** అక్షరభ్యాసానికి కేంద్రాలు అంగన్‌వాడీలు అని రంగారెడ్డి జిల్లా సంక్షేమ శాఖ అధికారి శ్రీలత అన్నారు. మంగళవారం ఆర్‌కెపురం డివిజన్ ఎన్‌టిఆర్ నగర్ ఫేస్3 కేంద్రంలో సామూహిక అక్షరాభ్యాం కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నేటి బాలలే రేపటి పౌరులు అని ఐదు ఏళ్ల లోపు చిన్నారులను అంగన్వాడీ కేంద్రాలకు పంపాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వాలు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అక్షరభ్యాసంతో పాటు పౌష్టికాహారాన్ని అందిస్తుందని వివరించారు. ఏడు నెలల వయస్సు నుంచి మూడు సంవత్సరాల వయస్సు వరకు బాలామృతం, గుడ్లు ఇంటికి సరఫరా చేస్తామని తెలిపారు. మూడు సంవత్సరాలు వయస్సు నుంచి ఐదు సంవత్సరాల వయస్సు ఉన్న బాలబాలికలు అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని తల్లిదండ్రులను కోరారు. కార్యక్రమంలో హయత్‌నగర్ సిపిడిఓ రేణుక, సూపర్‌వైజర్ సావిత్రి, యాదగిరి, అంగన్‌వాడీ టీచర్లు గంగా, పుష్పలత, సునీత, అశావర్కర్లు హేమలత, వెంకటమ, అంజమ్మ, కమళమ్మతో పాటు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## తెలంగాణ సంస్కృతీ, సంప్రదాయాలు ఉట్టిపడేలా బోనాల ఉత్సవాలు

హైదరాబాద్ ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్





**ప్రజాపక్షం/హైదరాబాద్ :** బోనాల పండుగలో భక్తులకు ఎలాంటి లోటుపాట్లు లేకుండా సకల సౌకర్యాలతో ఏర్పాట్లు చేయాలని హైదరాబాద్ ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. గోల్కొండ కోటలో బోనాల పండుగపై మంత్రి పొన్నం ప్రభాకర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశానికి నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత శోభన్ రెడ్డి, ఎంపి అనిల్ కుమార్‌యాదవ్, ఎమ్మెల్యేలు కౌసర్ మొనుద్దీన్, జిల్లా కలెక్టర్ దాసరి హరిచందన, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాజకీయాలకు కులాలకు, మతాలకు అతీతంగా ప్రపంచ వ్యాప్తంగా తెలిసేలా హైదరాబాద్ ఆషాఢ మాస బోనాలు వేడుకలు నిర్వహించాలని అధికారులకు మంత్రి సూచించారు. తెలంగాణ సంస్కృతీ, సంప్రదాయాలు ఉట్టిపడేలా బోనాల ఉత్సవాలను నిర్వహిస్తామన్నారు. ఆషాఢ మాస బోనాలు ఈనెల 26న గోల్కొండ బోనాలతో ప్రారంభం అవుతున్నాయన్నారు. మొత్తం నెలరోజుల పాటు ఆషాఢమాస బోనాలు జరుగనున్నాయని, భక్తులకు అసౌకర్యం లేకుండా ఈ ఉత్సవాలు జరపాలని సూచించారు. అధికారులంతా బాధ్యతగా పనిచేయాలని సూచించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇప్పటికే బోనాల ఉత్సవాలకు నిధులు కేటాయించారన్నారు. జిహెచ్‌ఎంసి సిబ్బంది నిత్యం అప్రమత్తంగా ఉండాలని, తాగునీటి సౌకర్యం లేకుండా చూసుకోవాలని, ఎక్కడా విద్యుత్ అంతరాయాలు ఉండొద్దన్నారు. హెల్త్‌క్యాంపులు, అంబులెన్స్‌లు, ఏర్పాటు చేయాలని, మహిళలకు ఇబ్బందులు కలుగకుండా షీ టీమ్‌లను ఏర్పాటు చేయాలన్నారు. అగ్ని ప్రమాదాలు జరగకుండా ఫైర్ విభాగం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గోల్కొండకు ప్రత్యేక ఆర్‌టిసి బస్సులు, బస్టాపులు ఏర్పాటు చేస్తామన్నారు. మహిళలకు ఉచితంగా బస్సులు ఉన్నందున భక్తులు ఎక్కువగా వచ్చే అవకాశం ఉందన్నారు. బోనాల ఉత్సవాలు విజయవంతం చేయడానికి ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేస్తోందన్నారు. అధికారుల సహకారం కూడా ఉంటే పండుగ మరింత గ్రాండ్‌గా జరగడం ఖాయమన్నారు.

## ఎండల నివారణ దినోత్సవం సందర్భంగా రేడియంట్ హైస్కూల్‌లో అవగాహన



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** పంట భూముల క్షీణత, ఎండల నివారణ ప్రపంచ దినోత్సవాన్ని పురస్కరించుకుని రేడియంట్ హైస్కూల్‌లో మంగళవారం పర్యావరణ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా నీటి సంరక్షణ, వర్షజల సంచయం, నదుల కాలుష్యం నివారణపై ప్రత్యేక పోస్టర్‌ను జిల్లా సైన్స్ అధికారి ధర్మేందర్‌రావు, స్కూల్ చైర్మన్ అహ్మద్ షరీఫ్, ప్రిన్సిపాల్ జి.వంశీకృష్ణ ఆవిష్కరించారు. కాలుష్య నియంత్రణ మండలి ప్రాజెక్టు అధికారి బి. నాగేశ్వర్ రావు మాట్లాడుతూ విద్యార్థులు, ప్రజలంతా తమ దైనందిన జీవితాల్లో పర్యావరణహిత అలవాట్లు అవలంబించాలని సూచించారు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రిన్సిపాల్ వంశీ కృష్ణ మాట్లాడుతూ పర్యావరణ బాధ్యతపై విద్యార్థుల్లో అవగాహన పెంచడమే తమ లక్ష్యమన్నారు.

## శిల్పా లేఔట్ ఫేస్ 2 ఫ్లైఓవర్.. సుందరీకరణ పనులు త్వరితగతిన పూర్తి

జిహెచ్‌ఎంసి కమిషనర్ ఆర్‌వి.కర్ణన్





**ప్రజాపక్షం/హైదరాబాద్ :** శిల్పా లేఔట్ ఫేస్ 2 ఫ్లైఓవర్‌కు సుందరీకరణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని జిహెచ్‌ఎంసి కమిషనర్ ఆర్‌వి కర్ణన్ అధికారులను ఆదేశించారు. ఒఆర్‌ఆర్ నుంచి గచ్చిబౌలి వరకు రూ. 178 కోట్ల అంచనా వ్యయంతో నిర్మాణం చేపట్టిన శిల్పా లేఔట్ త్వరలో అందుబాటులోకి రానున్న నేపథ్యంలో మంగళవారం కమిషనర్ పరిశీలించారు. గచ్చిబౌలి, హాఫీజ్‌పేట్ ఫ్లై ఓవర్లు, ఇతర అభివృద్ధి పనులు పరిశీలించారు. వివిధ అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. శిల్పా లేఔట్ ఫేస్ 2 ఫ్లైఓవర్ పనులు పూర్తయి, ప్రారంభానికి సిద్ధంగా ఉన్నందున మిగిలిన సుందరీకరణ, గ్రీనరీ పనులను వెంటనే పూర్తి చేయాలని అధికారులకు కమిషనర్ స్పష్టం చేశారు. ఐఆర్‌సి నిబంధనల మేరకు ట్రాన్స్ ఫర్‌బార్ (రంబుల్ స్ట్రిప్స్) ఏర్పాటు చేయాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. కమిషనర్ వెంట ఇంజనీర్ ఇన్ చీఫ్(ప్రాజెక్ట్స్) భాస్కర్‌రెడ్డి, డిప్యూటీ ఇఇ హరీశ్, జోనల్ ఎస్‌ఇ శంకర్ నాయక్ ఉన్నారు. అనంతరం హాఫీజ్ పేట్‌లో పలు ప్రాంతాలను పరిశీలించారు. హాఫీజ్ పేట్ ఫ్లైఓవర్ కింద వ్యర్థాలను తొలగించి, స్పోర్ట్స్‌కు అనుకూలంగా తయారు చేయాలని అధికారులకు తెలిపారు. అనంతరం ఈర్ల చెరువు డ్రైనేజీ డైవర్షన్ పనులను పరిశీలించారు. మజీరా పైప్‌లైన్ సిసి రోడ్డు పనులకు ప్రతి పాదనకు సిద్ధం చేయాలని ఎస్‌ఇని ఆదేశించారు. కమిషనర్ వెంట కార్పొరేటర్ జగదీశ్వర్ గౌడ్, జోనల్ ఎస్‌ఇ శంకర్ నాయక్, లేక్స్ ఇఇ నారాయణ, డిప్యూటీ కమిషనర్ ఉన్నారు.

## 42శాతం రిజర్వేషన్లతోనే 'స్థానిక' ఎన్నికలు



బిసి సంఘాలు, మేధావుల డిమాండ్

**ప్రజాపక్షం/ఖైరతాబాద్ :** బిసిలకు 42శాతం రిజర్వేషన్లు అమలు చేశాకే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని పలువురు వక్తలు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సిఎం రేవంత్‌రెడ్డి వెంటనే అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకెళ్లి, ప్రధాని మోదీని ఒప్పించి, బిసి బిల్లులను ఆమోదింపజేయాలని కోరారు. మంగళవారం హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో 'స్థానిక సంస్థల ఎన్నికలు – బిసి రిజర్వేషన్ల అమలు– భవిష్యత్తు ఉద్యమ కార్యాచరణ'పై బిసి సంఘాల అత్యవసర రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. బిసి కుల సంఘాల జెఎసి చైర్మన్ కుందారపు గణేశ్ చారి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి దీనికి సిరికొండ మధుసూదనాచారి, జస్టిస్ ఈశ్వరయ్య, బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్‌గౌడ్, బిసి మేధావుల ఫోరం చైర్మన్, రిటైర్డ్ ఐఎఎస్ టి.చిరంజీవులు తదితరులు హాజరయ్యారు. మధుసూదనాచారి మాట్లాడుతూ దేశంలో బిసిలను మోసం చేసే కుట్ర జరుగుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం 42శాతం రిజర్వేషన్లు అమలు చేయకపోతే బిసిల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే కుట్రగానే పరిగణిస్తామన్నారు. జస్టిస్ ఈశ్వరయ్య మాట్లాడుతూ బిసిల పట్ల సిఎం రేవంత్‌రెడ్డికి చిత్తశుద్ధి లేదన్నారు. పలుకుబడి ఉన్న మంత్రి శాఖలు రెడ్లకు, సంక్షేమ శాఖలు కిందిస్థాయి వర్గాలకు ఇచ్చారని విమర్శించారు. జాజుల శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ రాష్ట్రంలో బిసి వాదం బలపడిందన్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికకు కాంగ్రెస్ తరపున బిసి అభ్యర్థిని నిలబెట్టాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో స్వతంత్ర అభ్యర్థిని దింపుతామని హెచ్చరించారు. చిరంజీవులు మాట్లాడుతూ వక్ఫ్‌బిల్లు, 317 ఆర్టికల్, ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు హడావుడిగా తెచ్చిన కేంద్రం బిసి బిల్లును ఎందుకు ఆమోదిస్తలేదని ప్రశ్నించారు. బిసిలు యాచించడం కాదని, శాసించేస్థాయికి ఎదగాలని పిలుపునిచ్చారు. సమావేశంలో బిసి కుల సంఘాల జెఎసి కన్వీనర్ బాల్‌రాజ్‌గౌడ్, సగర సంఘం అధ్యక్షులు శేఖర్, నేతలు శ్రీశైలం యాదవ్, మణిమంజిరి, సంధ్యారాణి, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

## పెంచేవరకూ వదిలిపెట్టం

ఎంపి ఆర్.కృష్ణయ్య, బిసి కమిషన్ మాజీ చైర్మన్ వకుళాభరణం

**ప్రజాపక్షం /ఖైరతాబాద్ :** రాష్ట్ర ప్రభుత్వం బిసి రిజర్వేషన్లను 42శాతం పెంచేవరకు వదిలిపెట్టే ప్రసక్తే లేదని బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు ఆర్.కృష్ణయ్య, బిసి కమిషన్ మాజీ చైర్మన్ వకుళాభరణం కృష్ణమోహన్ రావు పేర్కొన్నారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 243–టి6 ప్రకారం స్థానిక సంస్థల్లో బిసి రిజర్వేషన్లు పెంచే అధికారం రాష్ట్ర ప్రభుత్వానికి ఉన్నదన్నారు. దీని ప్రకారం జిఓ జారీచేసి ఎన్నికలు నిర్వహించవచ్చని సూచించారు. మంగళవారం హైదరాబాద్ బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో బిసి సంక్షేమ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ నీలం వెంకటేశ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బిసిల 42శాతం రిజర్వేషన్లపై ప్రభుత్వం సందిగ్ధత వీడి స్పష్టత చేయాలని డిమాండ్ చేశారు. అన్ని పార్టీలతో, బిసి సంఘాల నేతలతో చర్చించి, స్థానిక సంస్థల్లో బిసి రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేశారు. కులగణన నేపథ్యంలో డెడికేషన్ కమిషన్ రిపోర్టుపై సమగ్రంగా అధ్యయనం చేయలేదన్నారు. కాంగ్రెస్ సీనియర్ నేత జైరాం రమేశ్ కులగణనలో తెలంగాణ మాడల్ అని చెప్పుకోవడం సరికాదన్నారు. కామారెడ్డి డిక్లరేషన్ ప్రకారం బిసి రిజర్వేషన్లు పెంచాల్సిందేనని, లేనిపక్షంలో తాడోపేడో బిసి సంఘాలు చూసుకొంటాయని హెచ్చరించారు. సమావేశంలో సంఘం నేతలు జిల్లపల్లి అంజి, వేముల రామకృష్ణ, మోదీ రాందేవ్, అనంతయ్య, నిఖిల్ పాటిల్, లింగం ముదిరాజ్, సుజాత తదితరులు పాల్గొన్నారు.



## కాలుష్య రహిత పరిశ్రమల స్థాపనకు కృషి

ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి



**ప్రజాపక్షం/ఇబ్రహీంపట్నం :** నియోజకవర్గంలో కాలుష్య రహిత నూతన పరిశ్రమల స్థాపనకు కృషి చేస్తామని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. మంగళవారం మంచాల మండలం ఆరుట్ల, చెన్నారెడ్డి గూడ గ్రామాలలో వివిధ అభివృద్ధి కార్యక్రమాలు, ఇబ్రహీంపట్నం మార్కెట్ కమిటీ యార్డు సమీపంలో నూతన దుకాణ సముదాయాలను, బైపాస్ రోడ్డులో సిసి రోడ్డు నిర్మాణ పనులను ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించారు. అనంతర మార్కెట్ కమిటీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఈ ప్రాంతంలో నూతన పరిశ్రమలు స్థాపించి నిరుద్యోగ యువతీ యువకులకు నైపుణ్యత శిక్షణ ఇచ్చి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడమే తన లక్ష్యమన్నారు. మండల కేంద్రంలో 100 పడకల ప్రభుత్వాసుపత్రి నిర్మాణం కోసం రూ.40కోట్ల నిధులు తెచ్చామని త్వరలో పనులు ప్రారంభిస్తామని, ఇబ్రహీంపట్నం మార్కెట్ కమిటీని అభివృద్ధి చేయటానికి 40కోట్ల రుపాయిల మంజూరు చేసినట్లు తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బిసి, దివ్యాంగులతో పాటు అర్హులైన రైతులకు టెండర్ల సహకారంతో దుకాణ సముదాయాలను కెటాయిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ గురునాథ్‌రెడ్డి, వైస్‌చైర్మన్ మంఖాల కరుణాకర్, మార్కెట్ కమిటీ జిల్లా మేనేజర్ ఎండి రియాజ్, వ్యవసాయ శాఖ ఎడి సుజాత, పాలక వర్గ డైరెక్టర్లు ,రైతులు పాల్గొన్నారు.

## నియోజకవర్గంలో ప్రజాసమస్యల పరిష్కారమే లక్ష్యం

రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్



**ప్రజాపక్షం/గండిపేట :** నియోజకవర్గంలో ప్రజాసమస్యల పరిష్కారమే లక్ష్యమని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ పేర్కొన్నారు. మంగళవారం శంషాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని 25 వార్డులో రూ.11 కోట్లతో సిసి రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ పనులను, నూతన బిటి రోడ్డు పనులకు ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ శకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వంలో సంక్షేమ పథకాలు నిరంతర ప్రక్రియగా కొనసాగుతుందని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలు చేసేందుకు చిత్తశుద్ధితో పనిచేస్తుందన్నారు. రైతు భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, నూతన రేషన్ కార్డులు, నూతన పథకాలు ప్రారంభించి ప్రజల సంక్షేమం కొరకు నిరంతరం కృషి చేసేందుకు కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందన్నారు. కార్యక్రమంలో శంషాబాద్ మున్సిపల్ కమిషనర్ సుమన్ రావు, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ కొలను సుష్మ మహేందర్‌రెడ్డి అధికారులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## రెవెన్యూ సదస్సు బహిష్కరించిన ఫార్మాసిటీ రైతులు



**ప్రజాపక్షం/యాచారం :** ఫార్మాసిటీని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం మండల పరిధిలో రెవెన్యూ సదస్సును ఫార్మాసిటీ వ్యతిరేక సంఘం ఆధ్వర్యంలో అడ్డుకున్నారు. మండల డిప్యూటీ తహసీల్దారు కీర్తిసాగర్,మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ మురళిని అడ్డుకున్నారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ ఫార్మాసిటీకి భూములు ఇవ్వని రైతుల పేర్లను ఆన్‌లైన్ లో నమోదు చేయకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నిషేధిత జాబితా నుండి తమ పేర్లను తొలగించాలని రైతులు డిమాండ్ చేశారు. అంత వరకు గ్రామంలో రెవెన్యూ సదస్సు జరగనీయమని రైతులు తేల్చి చెప్పారు. దీంతో చేసేదిలేక అధికారులు వెనుదిరిగారు.

### రైతు భరోసా విడుదల చేయాలి



తాడిపర్తి గ్రామానికి చెందిన రైతుల భూములను నిషేధిత జాబితా నుంచి తొలగించి రైతుఅందరికీ రైతు భరోసా వర్తింప చేయాలని ఫార్మాసిటీ వ్యతిరేక ఉద్యమ నాయకులు సామ నిరంజన్, మాజీ సర్పంచ్ దూస రమేశ్ రైతులతో కలిసి మండల తహసీల్దారు అయ్యప్పకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం ఫార్మాసిటిని రద్దు చేస్తామని అసెంబ్లీ సాక్షిగా ప్రకటించిందని, హైకోర్టు కూడా రైతులకు అనుకూలంగా తీర్పునిచ్చిందన్నారు. ఫార్మాసిటీకి భూములు ఇవ్వని రైతుల పేర్లను నిషేధిత జాబితానుండి తొలగించి బలవంతపు భూసేకరణ అపాలన్నారు. తక్షణమే రైతు భరోసా వచ్చే విధంగా చూడాలని అధికారులను కోరారు.

# క్రీడ

## విన్నింగ్ కెప్టెన్‌కు 'పటౌడీ మెడల్'!

సచిన్ జోక్యంతో దిగొచ్చిన ఇంగ్లాండ్



భారత క్రికెట్ జట్టు ఇంగ్లాండ్ పర్యటన ఖరారైనప్పటి నుంచి పటౌడీ ట్రోఫీ గురించి చర్చ కొనసాగుతోంది. అందుకు కారణం ఈ ఏడాది నుంచి ఇరు దేశాల దిగ్గజాలు సచిన్ అండర్సన్ పేర్లతో ట్రోఫీ నిర్వహిస్తామని ఇంగ్లాండ్ ప్రకటించడమే. ఈ నేపథ్యంలో భారత లెజెండరీ ఆటగాళ్లు సునీల్ గవాస్కర్, బీసీసీఐ పెద్దలు పటౌడీ పేరు మార్చవద్దని ఈసీబీకి విన్నవించారు. సచిన్ టెండూల్కర్, ఐసీసీ ఛైర్మన్ జై షాలు సైతం ఆనవాయితీ ప్రకారం ఆయన పేరుతో ట్రోఫీ జరపాలని సూచించారు. ఈ ఇద్దరి విజ్ఞప్తితో దిగొచ్చిన ఇంగ్లాండ్ బోర్డు కీలక నిర్ణయం తీసుకుంది.

'ఈ ఏడాది నుంచి భారత్, ఇంగ్లాండ్ టెస్టు సిరీస్‌ను పటౌడీ పేరుతో కాకుండా సచిన్–అండర్సన్ ట్రోఫీగా నిర్వహించాలని ఈసీబీ నిర్ణయించింది. అయితే.. అలా చేయడం దిగ్గజ ఆటగాడైన పటౌడీని అగౌరపరచడమేనంటూ పలువురు భారత క్రికెటర్లు మండిపడ్డారు. తన పేరుతో ట్రోఫీ జరపాలనుకుంటున్న ఇసిబికి తెండూల్కర్ ప్రత్యేక విన్నపం చేశాడు. ఎట్టిపరిస్థితుల్లోనూ ఇరుదేశాల సిరీస్‌లో పటౌడీ పేరు ఉండేలా చూడాలని కోరాడు. దాంతో, సానుకూలంగా స్పందించిన ఇసిబి.. విన్నింగ్ కెప్టెన్‌కు 'పటౌడీ మెడల్'ను కానుకగా ఇస్తామని తెలిపింది' అని మంగళవారం బిసిసిఐ ఓ ప్రకటనలో వెల్లడించింది.

### 75 ఏళ్లకు గుర్తుగా..

భారత్, ఇంగ్లండ్‌ల మధ్య తొలి టెస్టు సిరీస్‌కు 2007లో 75 ఏళ్లు పూర్తి అయ్యాయి. ఈ సందర్భంగా ఇరుదేశాల బోర్డులు ఇంగ్లండ్‌లో జరుగబోయే సిరీస్‌ను మన్సూర్ అలీ ఖాన్ పటౌడీ పేరుతో నిర్వహించాలని నిర్ణయించాయి. అప్పటినుంచి 2024 వరకూ పటౌడీ పేరుతోనే ట్రోఫీని జరిపారు. అయితే.. నిరుడు జేమ్స్ అండర్సన్ వీడ్కోలు పలకడంతో అతడిని గౌరవించాలనుకుంది ఇసిబి. అందుకే.. పటౌడీ ట్రోఫీకి మంగళం పాడి.. భారత లెజేండ సచిన్ టెండూల్కర్ పేరును జతచేసింది. ఈ ఏడాది నుంచి సచిన్ – అండర్సన్ ట్రోఫీ నిర్వహిస్తామని ఇంగ్లండ బోర్డు తెలిపింది. పటౌడీ, ట్రోఫీతో ద్రవిడ్ సంబురాలు.. జూన్ 20 నుంచి భారత్, ఇంగ్లాండ్‌ల మధ్య తొలి టెస్టు జరుగనుంది. అంతకంటే ముందే సచిన్ అండర్సన్ ట్రోఫీని ఆవిష్కరించాలని ఈసీబీ భావించింది. ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ ఫైనల్ సందర్భంగా లార్డ్స్ మైదానంలో ట్రోఫీ ఆవిష్కరణ వేడుక జరిపేందుకు ఏర్పాట్లు కూడా చేసింది. కానీ, జూన్ 12న అహ్మదాబాద్‌లో ఘోర విమాన ప్రమాదం అనంతరం భారత క్రికెటర్లు విషాదంలో మునిగిపోయారు. దాంతో, ట్రోఫీ కార్యక్రమాన్ని వాయిదా వేసింది ఇసిబి. ఇరుబోర్డులకు ఆమోదయోగ్యమైన రోజున అంటే జూన్ 19న ఆవిష్కరణకు సిద్ధమవుతోంది ఇంగ్లాండ్ బోర్డు.

## వరల్డ్ కప్ తర్వాత వీడ్కోలు..

న్యూజిలాండ్ కెప్టెన్ షాకింగ్ నిర్ణయం!



న్యూజిలాండ్ కెప్టెన్ సోఫీ డెవినె షాకింగ్ నిర్ణయం తీసుకుంది. నిరుడు మహిళల జట్టును పొట్టి వరల్డ్ కప్ విజేతగా నిలిపిన ఆమె.. వన్డేలకు అల్విదా చెప్పనుంది. వన్డే వరల్డ్ కప్ అనంతరం వన్డే ఫార్మాట్ నుంచి వైదొలగాలని ఆమె భావిస్తోందట. ఈ విషయాన్ని మంగళవారం ఈ విధ్వంసక ప్లేయర్ వెల్లడించింది. 50 ఓవర్ల క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటించేందుకు ఇదే సరైన సమయం అని భావిస్తున్నా' అని డెవినె తెలిపింది. న్యూజిలాండ్ క్రికెట్ కూడా ఈ వార్తను ధ్రువీకరించింది.'ఇన్ని రోజులు దేశానికి ప్రాతినిధ్యం వహించాను. ఇక వన్డేల నుంచి వైదొలగాలని నిర్ణయించుకున్నాను. వన్డే వరల్డ్ కప్ తర్వాత రిటైర్మెంట్ పలకడం మంచిదని అనిపిస్తోంది. న్యూజిలాండ్ క్రికెట్ మద్దతు నాకు ఇన్నాళ్లు లభించడం అదృష్టంగా భావిస్తున్నా. వీడ్కోలుకు ముందు వైట్ ఫెరన్స్‌కు నేను చేయగలిగినంత చేస్తాననే నమ్మకం నా సహచరులకు ఉంది. యువ క్రికెటర్లతో నిండిన ఈ జట్టు ప్రయాణం గొప్పగా సాగాలని కోరుకుంటున్నా. వచ్చే 6 నుంచి 9 నెలలు ఆటను ఆస్వాదించాలనుకుంటున్నా' అని డెవినె తెలిపింది. భారత్, శ్రీలంక సంయుక్తంగా ఆతిథ్యమిస్తున్న మహిళల వన్డే వరల్డ్ కప్ సెప్టెంబర్ 30న మొదలు కానుంది. అక్టోబర్ 1న ఇండోర్‌లో ఆస్ట్రేలియాతో కివీస్ తలపడనుంది.

## జట్టు కోసం రక్తాన్ని ధారపోశా

టెస్టు గద విజయాన్ని జీవితంలో మర్చిపోను : రబడ



అంతర్జాతీయ క్రికెట్‌లో ఛాంపియన్ అనిపించుకోవాలనే దక్షిణాఫ్రికా కల లార్డ్స్ మైదానంలో సాకారమైంది. ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ ఫైనల్లో ఆస్ట్రేలియాతో చిత్తు చేసి టెస్టు గదను చేజిక్కించుకుంది. ఐసిసి టోర్నీలో 27 ఏళ్ల తర్వాత జగజ్జేతగా అవతరించింది తెంబ బవుమా టీమ్. ఈ చరిత్రాత్మక విజయంలో పేసర్ కగిసో రబడ పాత్ర నిజంగా చాలా గొప్పది. తొలి, రెండు ఇన్నింగ్స్‌ల్లో ఆసీస్ బ్యాటర్లను బెంబేలెత్తించిన రబడ.. టెస్టు గద సంబురాల్లో మునిగి తేలుతున్నాడు. సఫారీల విక్టరీలో ముఖ్య భూమిక పోషించినఈ స్పీడ్‌స్టర్ మంగళవారం ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. లార్డ్స్ మైదానంలో టెస్టు గదను అందుకున్న క్షణాలను జీవితాంతం గుర్తు పెట్టుకుంటాను' అని పేసర్ అన్నాడు. 'నన్ను నేను స్టార్‌గా భావించను. నిత్యం నేను ఒక శ్రామికుడిని అనే భావనతోనే ఉంటాను. దక్షిణాఫ్రికా జట్టు కోసం నా రక్తాన్ని ధారపోశాను. టీమ్‌ను గెలిపించేందుకు ఎంతో కష్టపడ్డాను. ఈ క్రమంలో పేసర్‌గా నేనెంతో మెరుగయ్యాను కూడా. క్రికెటర్‌గా ప్రతిసారి నన్ను నేను తీర్చిదిద్దుకునేందుకు ప్రయత్నిస్తాను. దేశం తరఫున ఆడడాన్ని గొప్ప గౌరవంగా భావిస్తాను. మ్యాచ్ ఏదైనా సరే వికెట్లు తీయడమే నా ఉద్దేశం. అయితే.. ఇన్నేసి వికెట్లు తీయాలని మాత్రం మైదానంలోకి దిగను. సాధ్యమైనన్ని ఎక్కువ వికెట్లు పడగొట్టి జట్టును గెలిపించాలని అని లక్ష్యంగా పెట్టుకుంటా. కానీ, ఇదంతా నా ఒక్కడి వల్ల సాధ్యం కాదు. సమిష్టిగా రాణిస్తేనే విజయం వరిస్తుంది. డబ్ల్యుటిసి ఫైనల్‌కు ఏడాది ముందు మాది పెద్దగా అనుభవం లేని జట్టు. ఆటగాళ్లం కలిసి ఉన్నది తక్కువ రోజులే. అయినా సరే ఒక్కటిగా పోరాడి ఆస్ట్రేలియాకు షాకిచ్చాం. లార్డ్స్‌లో టెస్టు గదను అందుకున్న క్షణాల్ని నా జీవితాంతం మర్చిపోలేను. కుర్రాళ్లు కూడా ఆ అద్భుత గడియల్ని సదా గుర్తు పెట్టుకుంటారని నా నమ్మకం' అని రబడ వెల్లడించాడు.

# మహిళ

## ఫోకస్

## మార్గదర్శకులు

ఆమె జీవితం... ఆదర్శప్రాయం..



కమలా సాహోనీ (1911 జూన్ 18 – 1998 జూన్ 28)... సైన్స్‌లో పిహెచ్‌డి చేసిన మొట్టమొదటి భారత మహిళ. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్‌లో ప్రవేశం పొందిన తొలి మహిళగా కూడా ఆమె పేరు చరిత్ర పుటల్లో చిరస్థాయిగా నిలిచి ఉంటుంది. ప్రపంచ ప్రఖ్యాత శాస్త్రవేత్త, ప్రతిష్టాత్మక నోబెల్ పురస్కార గ్రహీత సివి రామన్ ప్రశంసలు పొందిన కమల జీవితం అందరికీ ఆదర్శప్రాయం. ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్‌లో ఆమెకు ప్రవేశం అంత సులభంగా లభించలేదు. తన ప్రతిభ ఆధారంగా సీటు ఇవ్వాలన్న ఆమె విజ్ఞప్తిని అధికారులు తోసిపుచ్చారు. మహిళలు శాస్త్ర, సాంకేతిక రంగాల్లో రాణించలేరన్న అభిప్రాయం బలంగా నెలకొని వున్న రోజులు కావడంతో, కమల తన డిమాండ్‌ను సాకారం చేసుకోవడానికి సత్యాగ్రహానికి దిగింది. చివరికి ప్రవేశం పొందగలిగింది. ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్‌లో ఆమె పనితీరు, విషయాన్ని అవగాహన చేసుకోవడంలో కనబరుస్తున్న చురుకుదనం, అప్పచెప్పిన పనిని ఎంతో ఏకాగ్రతతతో పూర్తి చేసే లక్షణం అందరినీ ఆకట్టుకున్నాయి. సివి రామన్ సైతం ఆమెను ప్రశంసించారు. మహిళలు సైన్స్‌లోనూ రాణించగలరని నిరూపించిన కమల, వివిధ పరిశోధనలు జరిపింది. ఆమె పరిశోధనలు పాలు, పప్పు ధాన్యాలు, బియ్యం, తాటి బెల్లం, నీర వంటి ఆహార పదార్థాల పోషక విలువలపై కేంద్రంగా సాగాయి. కేంబ్రిడ్జ్ యూనివర్సిటీలో 'సైటోక్రోమ్ సి' అనే ముఖ్యమైన ఎంజైమ్‌ను ఆమె మొక్కల కణాల్లో కనుగొన్నది. తాటి బెల్లంలో విటమిన్ 'ఎ', 'సి', ఐరన్ వంటి పోషకాలు ఉన్నాయని గుర్తించి, ఇది పోషకాహార లోపంతో బాధపడే పిల్లలు, గర్భిణులకు ఎంతో మేలు చేస్తుందని నిరూపించింది. తన పరిశోధనలకుగాను భారత రాష్ట్రపతి అవార్డు పొందింది. కమల పరిశోధనలు భారతీయ మహిళలకు శాస్త్రరంగంలో మార్గదర్శకంగా నిలిచాయి. ఆమె పోరాటం వల్ల ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ సైన్స్‌లో మహిళలకు ప్రవేశం ప్రారంభమైంది. ఆమె జీవితం, కృషి యువతికి, ముఖ్యంగా మహిళలకు, శాస్త్రరంగంలో ప్రేరణగా నిలిచాయి. కమల పరిశోధనలు భారతీయ ఆహార పదార్థాల పోషక విలువలను గణనీయంగా ప్రభావితం చేశాయి. తాటి బెల్లం, నీరా వంటి స్థానిక ఆహారాల్లో పోషక విలువలు ఉన్నాయని ఆమె నిరూపించడంతో, పోషకాహార లోపాన్ని ఎదుర్కొనేందుకు వీటిని ప్రోత్సహించేలా మార్గనిర్దేశం చేశారు. ఆమె పరిశోధనలు భారతీయ ఆహార విధానాలకు శాస్త్రీయ ప్రామాణికతను తీసుకువచ్చి, ప్రజారోగ్యానికి మద్దతుగా నిలిచాయి.

## 50 ప్లస్ మహిళలకు వీక్లీ డైట్ ప్లాన్



వివిధ పత్రికలు, నిపుణుల ఇంటర్వ్యూలు, ఇతర మార్గాల ద్వారా సేకరించిన వివరాలను అనుసరించి, యాభై సంవత్సరాల వయసు దాటిన మహిళల కోసం వారం రోజుల ఆహార ప్రణాళిక ఇది. ఇది ఉదయం నుండి రాత్రి వరకు తీసుకోవాల్సిన ఆహారాన్ని వివరిస్తుంది. అన్ని రోజులు శరీర ఆరోగ్యం, హార్మోనల్ సమతుల్యత, శక్తి, జీర్ణవ్యవస్థను దృష్టిలో పెట్టుకొని రూపొందించారు.

**రోజు 1**
ఉదయం: గోధుమ రవ్వ ఉప్మా, టమాటా పచ్చడి, గ్రీన్ టీ
మధ్యాహ్నం: బ్రౌన్ రైస్, సన్నగ జొన్నకూర, చిక్కుడుకూర, పెరుగు
సాయంత్రం: ఆపిల్ లేదా సపోటా, కొద్దిగా బాదం
రాత్రి: మినపప్పుతో దోస, నల్ల కారం, నీళ్ళలో నానబెట్టిన రాగి మాల్ట్

**రోజు 2**
ఉదయం: ఓట్స్ కిచిడీ (బీన్స్, క్యారెట్), బటర్‌మిల్క్
మధ్యాహ్నం: మిల్లెట్ రైస్, మెంతి కూర పప్పు, క్యాబేజీకూర, పెరుగు
సాయంత్రం: అరటిపండు, అవిసె గింజల పొడి వేయించిన లడ్డు
రాత్రి: పెసరట్టు (మొలకెత్తిన మినపపప్పుతో), అల్లం చట్నీ

**రోజు 3**
ఉదయం: ఫ్రూట్ సలాడ్ (పుచ్చకాయ, జామపండు), వాల్‌నట్, గ్రీన్ టీ
మధ్యాహ్నం: బాస్మతి బ్రౌన్ రైస్, వంకాయ పులుసు, మినపపప్పు, పెరుగు
సాయంత్రం: స్ప్రౌట్స్ సలాడ్ (పసరపప్పు, టమాటా, నిమ్మరసం)
రాత్రి: గోధుమ రొట్టి, టమాటా అల్లం కూర

**రోజు 4**
ఉదయం: రాగి జావ, అరటి ముక్కలు కలిపి, వాల్‌నట్ తినాలి
మధ్యాహ్నం: జొన్నరొట్టె, బీర, కాయపచ్చడి, ముద్దపప్పు, పెరుగు
సాయంత్రం: బాదం 5, ఖర్జూరం 1 లేదా 2
రాత్రి: పప్పుతో ఉడకబెట్టిన బియ్యపపిండి ఇడ్లి, నిమ్మరసం చట్నీ

రోజు 5
ఉదయం: గోధుమ అటుకులు, తరిగిన పండ్లు, తేనె చుక్కలు
మధ్యాహ్నం: మిల్లెట్ కిచిడీ (వెజిటబుల్స్‌తో), మజ్జిగ
సాయంత్రం: అరటిపండు లేదా పండు జ్యూస్ (చక్కెర లేకుండా)
రాత్రి: టమాటా పప్పు, గోధుమ రొట్టి

**రోజు 6**
ఉదయం: అల్లం చాయ్ (చక్కెర లేకుండా), మినపగారెలు 2
మధ్యాహ్నం: బ్రౌన్ రైస్, బెన్సీ కూర, చికెన్ లేదా సొంపుగా ఉడికించిన చేప
సాయంత్రం: అండా పొడి వేయించిన సలాడ్
రాత్రి: ఓట్స్ దోస, మిరపకాయ కారం

**రోజు 7**
ఉదయం: ఫ్రూట్ జ్యూస్, గోధుమ సున్నపిండి అట్టు
మధ్యాహ్నం: సజ్జ రొట్టె, బఠానీ కూర, మినపప్పు, పెరుగు
సాయంత్రం: సీతాఫల లేదా జామ పండు
రాత్రి: వెజిటబుల్ ఉప్మా, చింత పండు పచ్చడి.

**అందరూ గుర్తుంచుకోవాల్సిన కొన్ని నియమాలు:**
ప్రతి రోజూ 6–8 గ్లాసుల నీరు తాగాలి
మధ్యాహ్నం తర్వాత మితంగా తినాలి
తక్కువ ఉప్పు, తక్కువ నూనె వాడాలి
రోజూ కనీసం 30 నిమిషాలు నడక/యోగాసనాలు/ప్రాణాయామం చేయాలి

---

# ప్రజాసమస్యల పరిష్కారానికి ఉద్యమాలే మార్గం

సిపిఐ ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం
ఘనంగా సిపిఐ హయత్‌నగర్ మండల మహాసభ






**ప్రజాపక్షం/ఎల్‌బి నగర్ :** ప్రజా సమస్యల పరిష్కారానికి ఉద్యమాలే పరిష్కార మార్గమని సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం అన్నారు. మంగళవారం హయత్ నగర్ మండల సిపిఐ 10వ మహాసభలను హయత్ నగర్‌లోని పద్మావతి ఫంక్షన్ హాల్‌లో ఘనంగా నిర్వహించారు. మహాసభలను ఎఐఎస్‌ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సామిడి వంశీవర్ధన్‌రెడ్డి అధ్యక్షత వహించారు. మహాసభ అవరణలో పార్టీ జెండాను ఎమ్మెల్సీ అవిష్కరించి, అమరవీరుల స్థూపకానికి నివాళిలర్పించారు. అనంతరం సభలో ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం మాట్లాడతూ దేశస్వాతంత్ర ఉద్యమంలో సిపిఐ పాత్ర కీలకమన్నారు. నిజాంకు వ్యతిరేకంగా తెలంగాణ సాయుధ పోరాటంలో ముఖ్యపాత్ర పోషించిందని గుర్తుచేశారు. నాటి నుంచి నేటివరకు పేదప్రజల పక్షాన, కార్మిక, కర్షక సబ్బండవర్గాల శ్రేయస్సుకు పాటు పడే పార్టీ భారత కమ్యూనిస్టు పార్టీ అన్నారు. 100 వ సంతలలోకి అడుగుపెడుతున్న తరుణంలో పేదల పక్షాన ఇండ్లస్థలాలు, భూపోరాటాలు నిర్వహించాలని, నిరుపేదలకు సంక్షేమ పథకాలు అందేలా కృషిచేయాలని పార్టీ శ్రేణులకు నెల్లికంటి పిలుపునిచ్చారు. మహాసభలో రంగారెడ్డి జిల్లా సిపిఐ ప్రధాన కార్యదర్శి పాలమాకుల జంగయ్య, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఆందోజు రవీంద్రాచారి, ఎల్‌బి నగర్ నియోజకవర్గ నాయకుడు సామిడి శేఖర్ రెడ్డిలు మాట్లాడుతూ జిల్లాలో భూ పోరాటా లు నిర్వహించి, పేదలకు భూములు పంచిన చరిత్ర కమ్యూనిస్టు పార్టీకి ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీ లన్ని అమలు చేయాలని వారు కోరారు. జిల్లాలో అర్హులైన వారందరికీ ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు తక్షణమే ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారానికి ఉద్యమాలు చేస్తున్న కమ్యూనిస్టులను ప్రజలు ఆదరించాలని కోరారు. పార్టీ ప్రజాసంఘాలను బలోపేతం చేస్తూ, ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం పోరాటాలు చేస్తామని వారు తెలిపారు. మహాసభలో సిపిఐ మండల కార్యదర్శి శేషరాజు పల్లి శ్రీదేవి, సహాయ కార్యదర్శి బొంగు అరుణ్ కుమార్‌గౌడ్, మున్సిపల్ కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) జిల్లా అధ్యక్షులు రమావత్ సక్రు నాయక్, ఎఐవైఎఫ్ మాజీ జిల్లా అధ్యక్షుడు పోలోజు లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

## 20న సిపిఐ ఆసిఫాబాద్ జిల్లా మహాసభ

పార్టీ జిల్లా కార్యదర్శి సత్యనారాయణ



**ప్రజాపక్షం /ఆసిఫాబాద్ :** ఈ నెల 20న జరగనున్న సిపిఐ జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి బద్రి సత్యనారాయణ జిల్లా కౌన్సిల్ సభ్యులను కోరారు. మంగళవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో అన్ని ప్రజాసంఘాలను బలోపేతం చేస్తూ కార్మిక వర్గ ప్రయోజనాల కొరకు నిరంతరం పని చేస్తామని ఆయన తెలిపారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలలో పార్టీ బలంగా ఉన్నచోట పోటీ చేస్తామని తెలిపారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీతో మిత్ర సంబంధాలు కొనసాగిస్తూనే ప్రజల సమస్యలపై నిరంతరం పోరాటాలు చేస్తామని అన్నారు. జిల్లాలోని వ్యవసాయానికి యోగ్యమైన లక్ష ఎకరాల పైచిలుకు పోడు భూములు ఉన్నాయని వాటిని అర్హులైన రైతు కూలీలకు పంచాలని డిమాండ్ చేశారు. అర్హులైన నిరుపేదలందరికీ ప్రభుత్వమే నివేశ స్థలాలు ఇచ్చి ఇంటి నిర్మాణం కొరకు 8 లక్షల రూపాయల ఇవ్వాలని కోరారు. లేని పక్షంలో పోరాటాలు చేస్తామన్నారు.ఆసిఫాబాద్‌లోని తిరుమల మినీ ఫంక్షన్ హాల్‌లో 20న జరగనున్న సిపిఐ జిల్లా మహాసభలు నిర్వహించనున్న నేపథ్యంలో ప్రతి సభ్యుడు బాధ్యతగా పాల్గొని మహాసభలను విజయవంతం చేయాలన్నారు. ఈ మహాసభలకు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కునంనేని సాంబ శివరావు, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కలవేన శంకర్ ముఖ్యఅతిథులుగా హాజరుకానున్నారని ఆయన తెలిపారు. సభకు పార్టీ శ్రేణు హాజరై విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో ఎస్.తిరుపతి, రాయిల్ల నర్సయ్య, ఆత్మకూరి చిరంజీవి, ఆత్రం సీతారాం తదితరులు పాల్గొన్నారు.

## పేదల పక్షాన భూపోరాటాలు

సిపిఐ యాదాద్రి జిల్లా కార్యదర్శి గోద శ్రీరాములు

**ప్రజాపక్షం/తుర్కపల్లి :** పేదల పక్షాన, కార్మిక, కర్షక సబ్బండ వర్గాల శ్రేయస్సు కోసం పాటు పడే పార్టీ భారత కమ్యూనిస్టు పార్టీ అని, 100 వసంతలలోకి అడుగుపెడుతున్న కమ్యూనిస్టు పార్టీ పేదల పక్షాన ఇండ్ల స్థలాలు, భూపోరాటాలు నిర్వహించాలని, నిరుపేదలకు సంక్షేమ పథకాలు అందేలా కృషి చేయాలని సిపిఐ యాదాద్రి భువనగిరి జిల్లా కార్యదర్శి గోద శ్రీరాములు అన్నారు. తుర్కపల్లి మండల కేంద్రంలోని జెఎం ఫంక్షన్ హాల్లో మంగళవారం నాగపూరి నర్సింహ, వసంతల అధ్యక్షతన నిర్వహించిన సిపిఐ మండల మహాసభకు ముఖ్య అతిథిగా హాజరై గోద శ్రీరాములు మాట్లాడుతూ అర్హులైన వారందరికీ ఇందిరమ్మ ఇండ్లు, పోడు భూముల పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ముల్కలపల్లి నుండి గొల్లగూడెం వరకు బిటి రోడ్డు నిర్మాణం చేపట్టాలని, దత్తాయపల్లి నుండి, ఇబ్రహీంపురం, రాజపేట వరకు బిటి రోడ్డు మరమ్మత్తు పనులు చేయించాలని కోరారు. నూతనంగా ఏర్పడ్డ గ్రామపంచాయతీలకు గ్రామపంచాయతీ భవనాలు ఏర్పాటు చేయాలని, అన్ని గ్రా మాల్లో అంగన్వాడీ కేంద్రాలకు పక్కా బిల్డింగులు ఏర్పాటు చేయాలని, ఉపాధి హామీ కూలీలకు పెండింగ్ బిల్లులు చెల్లించాలని, అర్హులైన పేదలందరికీ రేషన్ కార్డులు ఇవ్వాలని, తుర్కపల్లి నుండి యాదగిరిగుట్ట వరకు అసంపూర్తిగా ఉన్న డబుల్ రోడ్డు పనులను పూర్తి చేయాలని డిమాండ్ చేశారు .సమావేశంలో మండ ల నూతన కమిటీని ఎన్నుకున్నారు. కార్యదర్శిగా సిలువేరు దుర్గయ్య, సహాయ కార్యదర్శిగా గుంటిపల్లి సత్తయ్యను 16మంది కౌన్సిల్ సభ్యులు, 9 మంది మండల కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. మహాసభలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి, బోలగాని సత్యనారాయణ, సభ్యులు కళ్లెం కృష్ణ, మహిళా సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి బండి జంగమ్మ, నాయ కులు చెక్క దయాకర్‌రెడ్డి, సిలువేరు దుర్గయ్య, బొట్టు భూమయ్య, వల్లపు భగవంతు, బాణోత్ యాదమ్మ, పకీరా నాయక్, ఎస్‌కె జమాల్, జిన్నా రజిత, కొండ అంజమ్మ, నాగారం అంజయ్య, గుజ్జుక మహిపాల్, నరేంగల రమేష్, బత్తుల కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.




## వైద్య ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక కమిషన్ ఏర్పాటు

తెలంగాణ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు సత్యనారాయణరెడ్డి డిమాండ్
ఘనంగా యూనియన్ వ్యవస్థాపక దినోత్సవం




**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ ప్రతినిధి :** వైద్యరంగ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కమిషన్ ఏర్పాటు చేయాలని తెలంగాణ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ (ఎఐటియుసి) రాష్ట్ర అధ్యక్షుడు సత్యనారాయణరెడ్డి డిమాండ్ చేశారు. తెలంగాణ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ పదకొండవ ఆవిర్భావ దినోత్సవాలను పురస్కరించుకుని మంగళవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి ప్రాంగణంలో నిర్వహించిన వేడుకలలో నర్సింగ్ సూపరింటెండెంట్, యూనియన్ సీనియర్ నాయకురాలు సునీత యూనియన్ పతాకాన్ని ఆవిష్కరించారు. ముఖ్య అతిథిగా హాజరైన సత్యనారాయణరెడ్డి మాట్లాడుతూ ఉమ్మడి రాష్ట్రం నుండే ప్రభుత్వ వైద్యరంగం అస్తవ్యస్తంగా విభజించబడిందని, దీని ఫలితంగా వైద్యరంగం సమస్యల కేంద్రంగా మారిందన్నారు, ముఖ్యంగా వైద్య ఉద్యోగులు పదోన్నతులు, బదిలీల లాంటి ముఖ్యమైన అంశాల్లో తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం మెడికల్ విద్యబోధన కళాశాలలు, జనరల్ ఆసుపత్రుల సంఖ్య పెరుగుతుండటంతో వైద్య విధాన పరిషత్ పరిధిలోని ఆసుపత్రుల నిర్వహణ, బడ్జెట్ కేటాయింపు కొత్త రిక్రూట్‌మెంట్ లేక ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. వైద్య విధాన పరిషత్ పరిధిలోని ఉద్యోగులకు నేటికి 010 పద్దు కింద వేతనాలు చెల్లించడం లేదన్నారు. పిఆర్‌సిల అమలు, డిఎలు సంవత్సరాల తరబడి పెండింగ్‌లో ఉంచడం సబబు కాదన్నారు. కాంట్రాక్టు అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులను థర్డ్ పార్టీ ఏజేన్సీల కింద పనిచేస్తున్న శానిటేషన్ పేషెంట్ కేర్ సెక్యూరిటీ సూపర్‌వైజర్ కార్మికులను మానవత దృక్పథంతో క్రమబద్ధికరించాలని విజ్ఞప్తి చేశారు. వైద్య ఉద్యోగుల హక్కుల సాధనకు మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ దశాబ్దాల తరబడి రాజీలేని పోరాటాలు నడిపిన నేపథ్యంలోనే అనేక జిఒలు వచ్చాయన్నారు. ఉద్యోగ భద్రత, వేతన సవరణలు లాంటి అనేక హక్కులు సాధించుకున్న చరిత్ర ఎఐటియుసి మెడికల్ యూనియన్‌కే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో జనరల్ ఆసుపత్రి డిప్యూటీ సూపరిండెంట్ డా.సునీల్, మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి, కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి పి.సురేష్, యూనియన్ ఆసుపత్రి బ్రాంచ్ ప్రధాన కార్యదర్శి వెంకటేశ్, కోటేశ్వర్‌రెడ్డి, భాస్కర్, కిశోర్, రాంప్రసాద్, వారి ప్రసాద్‌రెడ్డి, స్వామి, నర్సింగ్ ఆఫీసర్స్ శ్రావణి, కళ్యాణి, ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ బ్రాంచ్ అధ్యక్ష, కార్యదర్శులు గోపాల్‌నాయక్, సతీష్‌రెడ్డి, నాయకులు బుచ్చన్న, కామేశ్వరరావు, సత్తయ్య, వెంకట్రామిరెడ్డి, ఓంకార్, సాగర్, కరుణాకర్, మురళి, కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ నేతలు చెన్నయ్య, నరసింహ, మొగులన్న, దేవానంద్, పద్మమ్మ వరలక్ష్మి, జ్యోతి, సంధ్య తదితరులు పాల్గొన్నారు.

## ఫీజుల నియంత్రణపై విద్యాశాఖ నిఘా కరువు

ఎఐఎస్‌ఎఫ్ నల్లగొండ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు

**ప్రజాపక్షం/దేవరకొండ :** విద్యాసంవత్సరం ప్రారంభమైన నేపథ్యంలో ప్రైవేట్, కార్పొరేట్ విద్యా సంస్థలు విచ్చలవిడిగా ఫీజుల దోపిడీకి పాల్పడుతున్నా విద్యాశాఖ అధికారుల నిఘా కరువయ్యిందని ఎఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షుడు వలమల్ల ఆంజనేయులు ఆరోపించారు. మంగళవారం పట్టణంలోని పల్లా పర్వత్‌రెడ్డి భవన్‌లో ఎఐఎస్‌ఎఫ్ దేవరకొండ డివిజన్ సమితి సమావేశానికి హాజరైన ఆంజనేయులు మాట్లాడుతూ ప్రైవేట్ కార్పొరేట్ విద్యా సంస్థలు ఫీజులు మోతలు మోగిస్తున్నా, విద్యా శాఖ అధికారులు చోద్యం చూస్తున్నారే తప్పా, గుర్తింపు లేని పాఠశాలలను గుర్తించి ఆ పాఠశాలపై చర్యలు తీసుకోవడంలో ఆలసత్వాన్ని ప్రదర్శిస్తున్నారన్నారు. ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలను నియంత్రించడంలో ప్రభుత్వాలు గానీ ప్రభుత్వ అధికారులు ద్వంద వైఖరి ప్రదర్శిస్తున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. అడ్మిషన్లు తీసుకుంటే డొనేషన్లు, బుక్స్‌కు సపరేట్ యూనిఫాంలకు సపరేట్ ఫీజులు వసూలు చేస్తూ దందాకి పురికొలుపుతున్నారన్నారు. పేద విద్యార్థుల తల్లిదండ్రులనుంచి ప్రైవేట్, కార్పొరేట్ విద్యా సంస్థలు కాసుల వసూలుకు పాల్పడుతున్నారన్నారు. ఇప్పటికయిన విద్యాశాఖ అధికారులు మేల్కొని నిబంధనలకు విరుద్ధంగా ఫీజుల వసూళ్లకు పాల్పడుతున్న ప్రవేట్ విద్యాసంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎఐఎస్‌ఎఫ్ డివిజన్ కార్యదర్శి వట్టేపు శివకుమార్, మధు, శివ, వినయ్, భాను, రాజు, మహేష్, అరవింద్, ఆకాష్ పాల్గొన్నారు.





# స్థానికం
REGIONAL NEWS
మహబూబ్‌నగర్, నారాయణపేట, వనపర్తి, నాగర్‌కర్నూల్

## నోట్ బుక్‌లు పంపిణీ



ప్రజాపక్షం/అడ్డాకుల : మూసాపేట మండలం నందిపేట గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు దేవరకద్ర నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు సూదిరెడ్డి లక్ష్మి కాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో నోట్ బుక్కులు పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో నందిపేట గ్రామ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ప్రభాకర్‌రెడ్డి, ఖాదర్, యువకులు ప్రవీణ్ కుమార్, శ్రీకాంత్, పోల్కంపల్లి రాజు తదితరులు పాల్గొన్నారు.

# మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలి

మంత్రి వాకిటి శ్రీహరి



ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ ప్రతినిధి : మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని రాష్ట్ర పశు సంవర్ధక, మత్స్య, పాడి పరిశ్రమ అభివృద్ధి, క్రీడలు యువజన సర్వీసుల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. మంగళవారం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో మహబూబ్‌నగర్ ఫస్ట్ నైపుణ్య అభివృద్ధి కేంద్రం, సెట్విన్ ద్వారా వివిధ స్వల్ప కాలకోర్సుల్లో శిక్షణ పొందిన మహిళలకు సర్టిఫికెట్‌ల ప్రధాన కార్యక్రమాన్ని మంత్రి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహబూబ్‌నగర్ ఫస్ట్ కార్యక్రమం క్రింద సెట్విన్ ద్వారా మహిళలకు స్థానిక శాసనసభ్యులు యెన్నం శ్రీనివాస్‌రెడ్డి ఆలోచనతో స్వయం ఉపాధి శిక్షణా కార్యక్రమం చేపట్టడం చాలా సంతోషంగా ఉందని అన్నారు. యువజన శాఖ పరిధిలో ఉన్న సెట్విన్ ద్వారా మహబూబ్‌నగర్‌లో మహిళలకు శిక్షణా కార్యక్రమాలను పైలెట్‌గా తీసుకుని ఉమ్మడి పాలమూరు జిల్లా, రాష్ట్రవ్యాప్తంగా విస్తరించనున్నట్లు తెలిపారు. మహిళలు తలెత్తుకుని గౌరవంగా జీవించినప్పుడే ప్రజా ప్రతినిధులకు గౌరవం ఉంటుందని అన్నారు. స్త్రీ శక్తితోనే సమాజం అభివృద్ధి చెందుతుందని అన్నారు. పాలమూరు మహిళలు రాష్ట్రంలో ఆదర్శంగా నిలిచేలా తన శాఖ ద్వారా బాధ్యత తీసుకుంటానని ఆయన తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతి పథకం మహిళల పేరునే అమలు చేస్తుందని ఆయన తెలిపారు. నారాయణపేట జిల్లాలో మహిళా స్వయం సహాయ సంఘాల ద్వారా నిర్వహించే పెట్రోల్ బంక్‌ను ముఖ్యమంత్రి ప్రారంభించడం జరిగిందన్నారు. మహిళలు ఎవరికి తీసిపోరని, వారిలోని నైపుణ్యాన్ని వెలికి తీసి శిక్షణ ని స్తే కుటుంబం బాగు పడుతుందన్నారు. మహబూబ్‌నగర్ శాసనసభ్యులు యెన్నం శ్రీనివాస్‌రెడ్డి తన నియోజకవర్గంలోని పదవతరగతి చదువుతున్న పిల్లలకు ప్రత్యేకంగా రూపొందించిన 3 డి యానిమేటెడ్ పుస్తకాలు పంపిణీ మార్గదర్శకంగా తీసుకుని మక్తల్ నియోజకవర్గంలో 3718 విద్యార్థులకు అందజేసినట్లు తెలిపారు.మహబూబ్‌నగర్ శాసనసభ్యులు యెన్నం శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ మహిళల సంక్షేమ అభివృద్ధి కోసం రాష్ట్ర ముఖ్యమంత్రి అన్ని కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే 45 గంటలు ఆర్‌టిసి బస్సులలో హస్త ప్రయాణం సౌకర్యం కల్పించినట్లు తెలిపారు. అమ్మ ఆదర్శ కమిటీలు ఏర్పాటు చేసింది. మహిళలను చైర్మన్‌గా పాఠశాలలో మౌలిక వసతులు అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. పేదవారికి సొంత ఇంటి కలను నిజం చేసేలా ఇందిరమ్మ ఇల్లు గొప్ప పథకాన్ని మహిళలు పేరుమీద తీసుకొచ్చి ఇంటి నిర్మాణంకు రూ.5 లక్షలు అందజేస్తున్నట్లు తెలిపారు.

### జిల్లాకు విచ్చేసిన మంత్రికి ఘన స్వాగతం

రాష్ట్ర పశు సంవర్ధక, మత్స్య పాడి అభివృద్ధికి, క్రీడలు, యువజన, సర్వీసుల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి మహబూబ్‌నగర్ జిల్లా కు విచ్చేసిన సందర్భంగా శాసనభ్యులు యెన్నం శ్రీనివాస్ రెడ్డి, జి,మధుసూదన్ రెడ్డి, రాష్ట్ర మైనార్టీ, ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్, జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి ఎస్‌పి.డి.జానకి, అదనపు కలెక్టర్‌లు శివేంద్ర ప్రతాప్, మోహన్ రావులు ఘన స్వాగతం పలికారు. జిల్లా కేంద్రంలో పండుగ సాయన్న విగ్రహానికి పూల మాల వేశారు. అనంతరం అర్,బి అతిథి గృహం ఆవరణలో అమర వీరుల స్థూపం వద్ద నివాళులు అర్పించారు. అర్,బి అతిథి గృహం వద్ద నివాళులు అర్పించారు. అర్,బి అతిథి గృహం వద్ద పోలీసులు వందనం స్వీకరించారు. అధికారులు, అనధికారులతో సమావేశ మయ్యారు.

## ఊర్కొండలో ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు ప్రొసీడింగ్ పంపిణీ



ప్రజాపక్షం/ఊర్కొండ : జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి ఊర్కొండ మండలంలో పర్యటించి మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 236 మంది ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారులకు ప్రొసిడింగ్‌లను అధికారుల సమక్షంలో పంపిణీచేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం పేదల ప్రభుత్వమన్నారు. రాష్ట్రప్రభుత్వం పేదప్రజల హక్కులను కాపాడేందుకు వారి జీవనప్రమాణాలను మెరుగుపర్చేందుకు ఇలాంటి పథకాలను అమలుచేస్తుందన్నారు. ప్రతి అర్హులైన లబ్దిదారుడికి నాణ్యతతోకూడిన ఇళ్ల నిర్మాణం పూర్తిచేసి అందించడమే తమప్రభుత్వధ్యేయమన్నారు. ఊర్కొండ మండలానికి ఇప్పటివరకు రూ.15కోట్ల విలువైన సిసిరోడ్ల పనులకు నిధులు కేటాయించామని గుర్తుచేశారు. త్వరలోనే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసి ఊర్కొండ మండలానికి ఇంటిగ్రేటేడ్‌భవనం మంజూరు చేయించేలా కృషి చేస్తానని తెలిపారు. గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి భూమిపూజ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## పిల్లలు చదువుతో పాటు ఇతర రంగాల పట్ల ఆసక్తి చూపాలి




ప్రజాపక్షం/కల్వకుర్తి : పిల్లలు చదువుతోపాటు ఆటలు, డ్యాన్స్, డ్రాయింగ్‌లాంటి కలలపైదృష్టి సారించాలని మాజీమంత్రి చిత్తరంజన్‌దాస్, మాజీసర్పంచ్ ఆనంద్‌కుమార్‌లు కోరారు. జెఎస్‌డ్యాన్స్ అకాడమీ శేఖర్‌మాస్టర్ ఆధ్వర్యంలో మంగళవారం పట్టణంలోని శుభంఫంక్షన్‌హాల్లో వేసవిడ్యాన్స్ శిక్షణ ముగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైవారు మాట్లాడుతూ విద్యార్థులు కేవలం చదువులకే పరిమితంకాకుండా కలలపట్ల ఆసక్తిని పెంచుకోవాలని సూచించారు. చిన్నప్పటి నుండి కలలను గుర్తించి తల్లిదండ్రులు ప్రోత్సహించాలని కోరారు.

### వండర్‌బుక్ ఆఫ్ రికార్డు అవార్డు అందుకున్న శేఖర్‌మాస్టర్

కల్వకుర్తి పట్టణానికిచెందిన డ్యాన్స్‌మాస్టర్ శేఖర్ 2005 వండర్‌బుక్‌ఆఫ్‌రికార్డును సాధించారు. 39 నిమిషాలలో 24పాటలతో నాన్‌స్టాప్‌గా చిన్నారుల భరతనాట్యం, పేరణి, జానపద,భక్తి, దేశభక్తిపాటలపై చక్కటి అభినయం ప్రదర్శించినందుకుగాను వండర్‌బుక్‌ఆఫ్‌రికార్డు సాధించారు.

## తడి, పొడి చెత్తపై అవగాహన




ప్రజాపక్షం/జడ్చర్ల : జడ్చర్ల పురపాలక పరిధి 13వ వార్డులో నేడు ఒక మార్పు అభివృద్ధికి మలుపు అనే నినాదంతో వందరోజుల ప్రణాళికలో భాగంగా నేడు చైతన్య నగర్‌లో కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పరిసరాల పరిశుభ్రత, ప్లాస్టిక్ నివారణ గురించి చైర్‌పర్సన్ కోనేటి పుష్పలత కాలనీవాసులకు వివరించారు. ప్రతి ఒక్కరూ పరిశుభ్రతను పాటించాలని కోరారు. స్థానిక కౌన్సిలర్ నందకిశోర్ గౌడ్, కోనేటి నరసింహులు, సాయిరాం, మున్సిపల్ ఆఫీసర్ అశోక్, మహిళా సంఘాల ఆర్పీలు, మహిళలు , కాలనీవాసులు పాల్గొన్నారు.

## పోలీస్ జాగిలాల నూతన గదులు పరిశీలన



ప్రజపక్షం/ నారాయణపేట్ : మంగళవారం రోజు జిల్లా ఎస్‌పి యోగేష్ గౌతమ్ నారాయణపేట జిల్లా కేంద్రం సుభాష్ రోడ్, పత్తి బజార్‌లోని పాత పోలీస్ స్టేషన్ క్వార్టర్స్ స్థలంలో ఏర్పాటు చేస్తున్న పోలీస్ జాగిలాల నూతన గదులను ఎస్పీ పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్‌పి 04 పోలీస్ జాగిలాలు సపరేటుగా వాటి సౌకర్యార్థం అధునాతనంగా నూతన గదులను నిర్మించడం జరుగుతుందని తెలిపారు. ముఖ్యంగా పోలీస్ జాగిలాల ఆరోగ్యం, భద్రత, శుభ్రతను దృష్టిలో ఉంచుకొని సపరేట్గా గదుల నిర్మాణం ఉండాలని అధికారులకు సూచించారు. గదుల నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేయాలని, వాటికి తగిన వెల్తురు ఉండాలే చూడాలని, డాగ్స్ వాషింగ్ కి సంబంధించిన అన్ని రకాల జాగ్రత్తలు తీసుకోవాలని, వాటికి సరైన డైట్ పాటిస్తూ, ప్రతిరోజు ఎక్ససైజ్ చేయించాలని పోలీసు అధికారులకు తెలిపారు. ఎస్పీ తో పాటు అదనపు ఎస్‌పి ఎండి, రియాజ్ హుల్ హక్, ఆర్‌ఐ, నరసింహ లకు, హెడ్ కానిస్టేబుల్ రాములు ఉన్నారు.

## ఫింగర్ ప్రింట్ డివైస్‌తో తనిఖీలు



ప్రజాపక్షం/ నారాయణపేట్ : జిల్లా ఎస్‌పి యోగేష్ గౌతమ్ ఆదేవాల మేర కు నారాయణపేట బస్టాండ్‌లో దొంగతనాలు నిర్మూలించడానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని పోలీసు కానిస్టేబుల్‌లు గోపాల్, సంతోష్ తెలిపారు. మంగళవారం నారాయణపేట బస్టాండ్‌లో, ప్రధాన చౌరస్తాలలో ఫిం గర్ ప్రింట్స్ డివైస్‌తో ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించడం జరిగిందని, బస్టాండ్‌లో ప్రయాణికుల మాటున కొంతమంది వ్యక్తులు రద్దీగా ఉన్న సమయంలో దింగతనాలకు పాల్పడుతున్నారని అలాంటి వాటికి చెక్ పెట్టడానికి ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ప్రజలు ప్రయాణికులు దొంగతనాల పట్ల అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. బస్టాండ్ లో ప్రయాణికులు బస్సు ఎక్కి దిగే సమయంలో జాగ్రత్తలు పాటించాలని ,సూచించారు. అనుమానాస్పదంగా ఎవరైనా కనిపిస్తే వెంటనే డయల్ 100 కి లేదా లోకల్ పోలీసులకు సమాచారం ఇవ్వాలని తెలిపారు.

## కూరగాయల పంట సాగుతో లాభాలు



ప్రజాపక్షం/ నారాయణపేట్ : రైతులకు లాభాలు చేకురే పంటలలో కూరగాయల పంట సాగు చాలా లాభాలు వస్తాయని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ రైతులకు సూచించారు. మంగళవారం కలెక్టర్ సిక్తా పట్నాయక్ దామరగిద్ద మండలంలో పర్యటించారు. మద్యల బిడ్ గ్రామ పంచాయతీ శివారులో శంకర్ అనే రైతు తన పొలంలో తీగపందిరి పంట అయిన కాకర కాయ, సోర, టమోటా పంటను పరిశీలించారు. రైతులకు ఇంకా మెరుగైన పంటలకు ప్రభుత్వం తరపునుండి హాని బాక్స్‌లపై అవగాహన కల్పించి రైతులకు హాని బాక్స్ లను అందిస్తామని కలెక్టెట్ రైతులకు తెలిపారు. ఈ పర్యటన భాగంగా గత్ప గ్రామంలో నిర్వహిస్తున్న భూ భారతి రైతు సదస్సు కేంద్రాన్ని సందర్శించారు. ఈ గ్రామంలో నిర్వహించిన సదస్సులో ఎన్ని ఫిర్యాదులు వచ్చాయి వాటి వివరాలను తెలుసుకున్నారు. ఎలాంటి ఫీర్యాదులు అందయి వచ్చిన ఫీర్యాదులను పరిశీలించి నోటిస్ ఇవ్వాలని, నోటిస్ కు 7 రోజుల సమయం ఉంటుంది. కాబట్టి పరిశీలించి పరుష్కరించాలన్నారు. ఇందిరమ్మ ఇండ్లు ఎన్ని శంసన్ అయినవి అందులో గ్రౌండింగ్ ఎంత అయిందని అడిగి తెలుసుకున్నారు. గత్ప గ్రామ పర్యటన కంటే ముందు దమర గిద్ద కేజిబివి పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులు తక్కువగా ఉండటం తో పాఠశాల ప్రారంభం అయి గత నాలుగు రోజులు అవుతున్న నేటకీ విద్యార్థులు రాకపోవడంతో విద్యార్థుల తల్లిదండ్రులకు ఫోన్ చేయాలని సూచించారు. రెండు రోజులలో అందరు విద్యార్థులు వచ్చేటట్లు చూడాలన్నారు. కానుకుర్తి, పిఎం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న 9వ సంవత్సర ఇంటర్నెషనల్ యోగ డే సందర్భంగా పాఠశాలలో ఆయుష్ హెల్త్ అండ్ వెల్నెస్ క్యాంప్‌ను కలెక్టర్ పరిశీలించారు. ఈనెల 21 వ తేదీ నాడు యోగ డే సందర్భంగా విద్యార్థులకు యోగ పై అవగాహన కల్పించాలన్నారు. నూతనంగా అడ్మిషన్ పొందిన విద్యార్థులు లతో పాఠశాల వసతుల పై ఆరా తీశారు.

## వసతిగృహాలు ఆహారం తయారీలో నాణ్యత, పరిశుభ్రతలు పాటించాలి



ప్రజాపక్షం/ నారాయణపేట్ : పాఠశాలలు వసతిగృహాల ఆహారం తయారీలో నాణ్యత పరిశుభ్రత లు పాటించాలని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ ఆదేశించారు. మంగళవారం విసీ హాల్లో ఫుడ్ సేఫ్టీ పై అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్ తో కలిసి అధికారులతో రివ్యూ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వంట సిబ్బందికి పరిశుభ్రతపై అవగాహన కల్పించాలన్నారు. యా క్షన్ ప్లాన్‌తో డిఇఒ తగు చర్యలు తీసుకోవాలన్నా రు. పిల్లలు సబ్బుతో చేతులు కడుక్కనేనా వారికి అ వగాహన కల్పించాలన్నారు. వసతి గృహాలను పర్యవేక్షించి రాత్రి బస వేయాలని ఆదేశించారు. గ్రామ పంచాయతీ అధికారులు తనకి చేసి క్లీన్ అండ్ గ్రీన్ చేయాలని స్కూల్స్ హాస్టల్లో నిర్వహించాలన్నారు. 300 కంప్యూటర్లు అన్ని స్కూళ్లలో అందుబాటులో ఉండాలని డిఇఒని ఆదేశించారు. స్కూల్స్ హాస్టల్లో హాజరు శాతం తెలుసుకున్నారు. ప్రతినెలా 15 రోజులకు ఒకసారి సమావేశం నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో ఆర్‌డిఒ రామచందర్, జడ్‌పి సిఇఒ శైలేష్, డిఇఒ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## చెంచుల అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు



ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్‌ప్రతినిధి : అణగారిన వర్గాల, పేదల అభ్యున్నతికోసం పనిచేయాలని సంకల్పించుకొని , నిజమైన పేదవారినే గుర్తించాలని బంగ్లాదేశ్ ప్రపంచ అభివృద్ధిసంస్థ, పేదరిక నిర్మూలన సాధికారత మిషన్ సభ్యులు ఉషారాణి అన్నారు. బంగ్లాదేశ్ ప్రపంచఅభివృద్ధిసంస్థ, పేదరిక నిర్మూలన సాధికారతమిషన్ సభ్యులు, కేంద్రప్రభుత్వ అధికారులు, తెలంగాణరాష్ట్ర గ్రామీణ పేదరికనిర్మూలన సంస్థ అమ్రాబాద్ , పదర మండలాల్లో అత్యత పేదరికంతో బాధపడుతున్న కుటుంబాల పరిస్థితిని పరిశీలించారు. నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట నియోజకవర్గం పదర, అమ్రాబాద్ మండలాల పరిధిలోని 15గ్రామాల్లో చేపట్టిన అత్యంత పేదరికాన్ని అనుభవిస్తున్న 440 కుటుంబాలగుర్తింపు ప్రక్రియను క్షేత్రస్థాయిలో మంగళవారం సందర్శించి పరిశీలించిన కేంద్రప్రభుత్వ అధికారులు, బంగ్లాదేశ్ ప్రపంచ అభివృద్ధి సంస్థ, పేదరిక నిర్మూలన సాధికారత మిషన్ సభ్యులు మంగళవారం నాగర్‌కర్నూల్ జిల్లాలో నిరుపేద కుటుంబాల గుర్తింపు ప్రక్రియను పరిశీలించారు. మల్లాపూర్‌పెంట, చౌట్టిగూడెం పెంట, అమ్రాబాద్, పదర మండలాల మహిళా సమైక్య సభ్యులతో స్మృతిశరణ్ గ్రామీణ అభివృద్ధి భారత మంత్రిత్వశాఖ జైన్‌జాయింట్‌డైరెక్టర్, జిల్లా కలెక్టర్ బదావత్‌సంతోష్,తెలంగాణరాష్ట్ర గ్రామీణ నిరుపేద నిర్మూలన సంస్థ డైరెక్టర్ దివ్య దేవరాజన్‌లతోకలిసి కేంద్రప్రభుత్వ అధికారులు, సంస్థ సభ్యులు మన్ననూరు రైతువేదికలో సమావేశమయ్యారు. ఈసందర్భంగా జిల్లా కలెక్టర్ బదావత్‌సంతోష్ మాట్లాడుతూ జిల్లాయంత్రాంగం నుండి జిల్లాలో గుర్తించిన నిరుపేదలకు అన్ని సంక్షేమ పథకాలను అమలుచేసి రానున్న రెండు సం వత్సరాల్లోనే వారి అభ్యున్నతికి జిల్లా యంత్రాం గం కృషి చేస్తుందన్నారు. నేడు పర్యటించిన మల్లాపూర్‌పెంట, చౌట్టిగూడెం పెంటల్లో గుర్తించిన సమస్యలను తక్షణమే పరిష్కరించేలా డిఆర్‌డిఎ, జిల్లా పౌరసరఫరాలశాఖల అధికారులను కలెక్టర్ ఆదేశించారు. రేషన్‌కార్డులేని కుటుంబాల వివరాలను సేకరించి నూతన రేషన్ కార్డుల నమోదు ప్రక్రియను మీసేవేలో కూడా రెవెన్యూ, పౌరసరఫరాల అధికారులే నమోదు చేసి వెంటనే మంజూరు చేయించాలని ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ దేవసహాయం, పిడిడిఆర్‌డిఎ చిన్న ఓ బులేసు, డిప్యూటి సిఇఓ గోపాల్‌నాయక్, అమ్రాబాద్ మండల ప్రత్యేకాధికారి డాక్టర్ రజని, వివిధశాఖల జిల్లా అధికారులు, మహిళా సంఘాల నాయకులు పాల్గొన్నారు.


## ఉర్దూతో పాటు తెలుగును మొదటి భాషగా చేర్చాలి

ఎఐఎస్‌ఎఫ్ మహబూబ్ నగర్ జిల్లా సమితి వినతి



ప్రజాపక్షం/ మహబూబ్ నగర్ ప్రతినిధి : స్థానిక ఏనుగొండ సమీపంలో గల కేజీబీవీలో కేవలం ఉర్దూ మొదటి భాషగా ఉండడం వలన తెలుగును మొదటి భాషగా ఎంచుకునే తెలుగు మీడియం విద్యార్థులు ప్రవేశం పొందడానికి నిరాకరిస్తున్నారు అని అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఎఐఎస్‌ఎఫ్) ఆధ్వర్యంలో డిఇఒ కార్యాలయంలో మంగళవారం నాడు సూపరిండెంట్‌కి వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఉర్దూతో పాటు తెలుగు కూడా మొదటి భాషగా లేనందు వలన పేద, మధ్యతరగతి విద్యార్థులు ప్రవేశం తీసుకోవడం ఇష్టం లేక చదువుకు దూరం అవుతున్నారు. ఉర్దూతో పాటు తెలుగుని కూడా మొదటి భాషగా ఆప్షన్ పెడితే తెలుగు మీడియం విద్యార్థులకు ప్రవేశం పొందడానికి అవకాశం లభిస్తుంది. ఉర్దూతో పాటు హిందీ, తెలుగును మొదటి ఆప్షనల్ సబ్జెక్టుగా ప్రవేశపెట్టి తెలుగు సబ్జెక్టుకు కూడా ఒక ఉపాధ్యాయురాలుని నియమిస్తే తెలుగు మీడియం విద్యార్థులు ప్రవేశం పొందడానికి ముందుకు వస్తారు. వెంటనే దీనిపై అధికారులు స్పందించి తెలుగును మొదటి భాషగా ప్రవేశపెట్టి తెలుగు ఉపాధ్యాయులు నియమిస్తే పేద మధ్యతరగతి విద్యార్థులకు మేలు జరుగుతుందని నాయకులు కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి సి. రాజు, ఏఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి లక్ష్మ ణ్, రాజేష్, బాలకృష్ణ, గోపాల్, తదితరులు పాల్గొన్నారు.

## రైతు నేస్తం కార్యక్రమంలో పాల్గొన్న రైతులు



ప్రజాపక్షం/ మక్తల్ : మంగళవారం మక్తల్ మండలంలోని పలు రైతు వేదికలు గడ్డంపల్లి, రుద్రసముద్రము, జక్లేరూ రైతు వేదిక నందు తెలంగాణ రాష్ట్ర వేదికలలో రైతు నేస్తం కార్యక్రమం ప్రారంభించడం జరిగింది. అదే విధంగా వానాకాలం 2025–26లో రైతు భరోసా పథకం కింద రైతు పెట్టుబడి కోసం నిధులు విడుదల చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి రుద్ర సముద్రం రైతు వేదిక నందు అడిషనల్ కలెక్టర్ , ఎంపీడీఓ సర్, జక్లేరు రైతు వేదికలో యమరో, గడ్డం పల్లి రైతు వేదిక లో యమరో వ్యవసాయ విస్తరణ అధికారులు , వివిధ గ్రామాల రైతులు పాల్గొన్నారు.

## కొండేడ్ సిసి రోడ్డుకు శంకుస్థాపన

ప్రజాపక్షం/జడ్చర్ల : జడ్చర్ల నియోజకవర్గంలోని మౌలిక సదుపాయాల అభివృద్ధికి కట్టుబడి ఉన్న ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి మంగళవారం జడ్చర్ల మండలంలోని కొండేడ్ గ్రామంలో రూ.35 లక్షల నిధులతో చేపట్టి న సీసీ రోడ్డు నిర్మాణపనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మె ల్యే మాట్లాడుతూ ప్రతి గ్రామానికి మౌలిక వసతుల కల్పన మా ప్రభుత్వానికి మొదటి ప్రాధాన్యత కొండేడ్ గ్రామ ప్రజలు చాలా కాలంగా ఎదురుచూస్తున్న రోడ్డు పనులకు నేడు శ్రీకారం చుట్టడం ఎంతో ఆనందంగా ఉంది. గ్రామాల సమగ్ర అభివృద్దే మా లక్ష్యం అని అన్నారు. అధికారులు కాంట్రాక్టర్లు పనుల నాణ్యతమై ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఆయన సూచించారు. గ్రామస్థులు ఈ కార్యక్రమానికి చెందిన సంఖ్యలో హాజరై ఎమ్మెలే కృతజ్ఞతలు తెలిపారు.


## రైతులు భూ సమస్యలపై రెవెన్యూ సదస్సులో దరఖాస్తు చేసుకోవాలి



ప్రజాపక్షం / కొత్తకోట : కొత్తకోట మండలంలోని నాటవెల్లి గ్రామంలో భూ సమస్యలను పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అంతే కాకుండా ఏవైనా భూ సమస్యలు ఉన్నట్లయితే రైతులు రెవెన్యూ సదస్సులో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. భూ సమస్యల పరిష్కారంలో భాగంగా చట్ట ప్రకారం వెసులుబాటు ఉంటే రైతులకు మేలు చేసేందుకు కృషి చేస్తామని ఈ సందర్భంగా తెలిపారు. రెవెన్యూ సదస్సులో భూములకు సంబంధించి అన్ని రకాల సమస్యలను పరిష్కరించడం జరుగుతుందని అన్నా రు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ , రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## రేమద్దులలో ఆరోగ్య శిబిరం

ప్రజాపక్షం / పాన్‌గల్ : ఆరోగ్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పిహెచ్‌సి డా. చంద్రశేఖర్ అన్నారు. మంగళవారం పాన్‌గల్ మండల పరిధిలోని రేమద్దుల గ్రామంలో ఏర్పాటు చేసిన సమగ్ర ఆరోగ్య శిబిరంను సందర్శించి రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. శిబిరంలో ప్రజలకు ఉచితంగా హెచ్‌ఐవి పరీక్షలు, టీబీ వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేశారు. ఆయుష్ మాన్ ఆరోగ్య మందిర్ వైద్యాధికారులు లారెన్స్ , తార శశాంక్ ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు నిర్వహించారు.



## అంగన్‌వాడీల్లో అనుకరణ ద్వారా విద్యాబోధన



ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ ప్రతినిధి : అంగన్‌వాడి కేంద్రాల్లో ఆట, పాటలు, అనుకరణ ద్వారా పిల్లలకు విద్యాబోధన చేస్తారని జిల్లా స్త్రీ, శిశ సంక్షేమ శాఖ అధికారి జరీనా బేగం అన్నారు. జిల్లా కేంద్రం క్రిస్టియన్ కాలనీలో గల కమ్యూనిటీహాల్‌లో మంగళవారం అమ్మ మాట అంగన్ వాడి బాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారుల చేత అక్షరాభ్యాసం చేయించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న డిడబ్ల్యు జరీనా బేగం మాట్లాడుతూ అమ్మ వడి తర్వాత మలి బడి అంగన్‌వాడి కేంద్రాలు అని అన్నారు. పిల్లలు ఐదేళ్లు నిండిన తర్వాత బడికి చేరే లోపు అంగన్ వాడి కేంద్రాల్లో చేర్పించాలని కోరారు. పిల్లలు కోరుకునే విధంగా సంభాషణ, ఆట, పాటలతో విద్యాబోధన చేస్తారన్నారు. అంగన్ వాడి కేంద్రాల్లో పిల్లలను చేర్పించాలని, త్వరలో ప్రభుత్వం నుంచి యూనిఫామ్‌లు వస్తాయని అన్నారు. కార్యక్రమంలో సిడిపిఓ రాధిక, సూపర్ వైజర్ వలీమ్ సుల్తానా, మహిళా కాంగ్రెస్ నాయకురాలు సీడి పూజిత, అంగన్ వాడి టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

## అమ్మమాట అంగన్‌వాడీబాట

ప్రజాపక్షం/కల్వకుర్తి : కల్వకుర్తి మున్సిపాలిటి పట్టణంలోని బాలరాంనగర్ 9వవార్డులో అంగన్‌వాడికేంద్రంలో అమ్మమాట అంగన్‌వాడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా తహసీల్దార్ ఇబ్రహీం, కల్వకుర్తి మున్సిపాలిటి మహ్మద్, సిడిపిఓ భాగ్యమ్మ, యుపిఎస్ ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్, కల్వకుర్తిబ్లాక్‌కాంగ్రెస్ ఎస్సిసెల్ అధ్యక్షులు పరుశపాకుల శేఖర్ మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం ప్రవేశపెడుతున్న అంగన్‌వాడికేంద్రంలో చిన్నారులకు ఎగ్‌బిర్యాని పెట్టాలని కాంగ్రెస్‌ప్రభుత్వం ఎన్నడూలేని విధంగా అంగన్‌వాడి కేంద్రం పండుగ వాతావరణంలాగా ఉండాలని సూచించారు. బాలామృతం, ఎగ్స్, మురుకులు చిన్నారులకు , గర్భిణీలకుకూడా అన్నివిధాల టాబ్లెట్స్ ఇంజక్షన్స్ టీకాలు అంగన్‌వాడి కేంద్రంలో ఇస్తున్నారు. ఈఅవకాశాన్ని అందరూ వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్స్, అంగన్‌వాడీటీచర్స్, ఆశవర్కర్స్, విద్యార్థులు పాల్గొన్నారు.



# స్థానికం
REGIONAL NEWS
నల్లగొండ, సూర్యాపేట యాదాద్రి, గద్వాల

## జోగులాంబను దర్శించిన డిప్యూటీ సిఎం సతీమణి



ప్రజాపక్షం/ఉండవెల్లి: దక్షిణాకాశీగా ప్రసిద్ధిగాంచిన జోగులాంబ బాల బ్రహ్మేశ్వర ఆలయాలను తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వంలో డిప్యూటీ సీఎం మల్లుబట్టి విక్రమార్క సతీమణి నందిని దర్శించినట్లు దేవాలయం కార్య నిర్వహణ అధికారి సురేందర్ కుమార్ ఒక ప్రకటనలో వారు తెలిపారు. జోగులాంబ బాల బ్రహ్మేశ్వర ఆలయంలో అభిషేకాలు కుంకు మార్చన కార్యక్రమాలు చేపట్టినట్లు వారు తెలిపారు. ఆమెను ప్రత్యేకంగా ఆహ్వానించి ఘనంగా దర్శించే కార్యక్రమంలో పాల్గొన్నట్లు తెలిపారు.



## ప్రజా సమస్యలు పరిష్కరించాలి

సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు రామచంద్రం

ప్రజాపక్షం /మునుగోడు: ప్రజా సమస్యలను పరిష్కరించాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు గురజా రామచంద్రం రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం మండలంలోని కొంపెల్లి గ్రామంలో సిపిఐ గ్రామ శాఖ సమావేశాన్ని నిర్వహించారు ఈ సందర్భంగా ఆ గ్రామంలో సిపిఐ జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల ముందు ప్రజలకిచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. రైతులకు పెట్టుబడి సాయం రుణమాఫీ సంపూర్ణంగా అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి చాపల శ్రీను,జిల్లా కౌన్సిల్ సభ్యులు బొమ్మరబోయిన లాలు,సూరిగి చలపతి,మండల కార్యవర్గ సభ్యులు ఈ. కైలాస్, ఎఐవైఎఫ్ మండల కార్యదర్శి బి శంకర్,కట్ట దశరథ, వి వెంకటేశ్వరరావు, మోగుదాల యాదయ్య, పులకరం ఆంజనేయులు, గ్రామ శాఖ సభ్యులు పాల్గొన్నారు.

## సిపిఐ సంస్థాన్ నారాయణపురం 15వ మండల మహాసభ కరపత్రం ఆవిష్కరణ



ప్రజాపక్షం/సంస్థాన్ నారాయణపురం : మండల కేంద్రంలో భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ మండల 15వ మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ కరపత్రం ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బచ్చనగోని గాలయ్య మాట్లాడుతూ దేశంలో ఎన్డీఏ ప్రభుత్వం, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సమస్యలు తీర్చడంలో విఫలమయ్యాయని విమర్శించారు. ఆపరేషన్ కగార్ పేరుతో అమాయక ఆదివాసీలను కాల్చి చంపి మావోయిస్టులుగా చిత్రీకరించి అడవులలో ఖనిజ సంపదను కార్పొరేట్లకు అప్పజెప్పేందుకు అమిత్ షా పూనుకున్నారని మావోయిస్టులను అంతం చేయడం ఎవరి తరం కాదని సవాల్ విసిరారు. ఈనెల 27న జరిగే సిపిఐ 15వ మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి దుబ్బాక భాస్కర్, సిపిఐ మండల సహాయ కార్యదర్శులు చిలివేరు అంజయ్య, పొట్ట శంకరయ్య, కలకొండ సంజీవ, వీరమల్ల యాదయ్య, సుర్వి నరసింహా, మంచాల జంగయ్య, సింగిల్ విండో డైరెక్టర్ ముత్యాల అంజయ్య, రైతు సంఘం సీనియర్ నాయకులు తోకల రామిరెడ్డి, మొగుదాల సత్తయ్య పాల్గొన్నారు.

## గురువయ్య మృతి సిపిఐకి తీరని లోటు



ప్రజాపక్షం/నల్లగొండ (దామచర్ల): సిపిఐ సభ్యుడు పోలేపల్లి గురువయ్య గత కోతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందడం పార్టీకి తీరని లోటు అని పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు బంటు వెంకటేశ్వర్లు అన్నారు. దామచర్ల మండలం బొత్తలపాలెం గ్రామంలో గురువయ్య పార్థివ దేహానికి ఎర్రజెండా కప్పి పూలమాలలతో ఘనంగా నివాళులర్పించారు. అయన కుటుంబ సభ్యలకు ప్రగాఢ సంతాపం, సానుభూతిని వ్యక్తం చేశారు. నివాళులర్పించిన వారిలో ఎఐటియుసి జిల్లా ఉపాధ్యక్షులు ఎండి సయ్యద్, సిపిఐ మండల కార్యదర్శి లు ధీరావత్ లింగ నాయక్,అంజనపల్లి రామలింగం,జిల్లా యాదగిరి, మండలం సహాయ కార్యదర్శి ధానావత్ శాంతి, పోలేపల్లి ఉదయ్, జమ్ముల కోటయ్య, లక్ష్మయ్య,పార్టీ సభ్యులు ప్రజాసంఘాల నాయకులు తదితరులు ఉన్నారు.

## ఆర్‌టిసి కార్మిక సంఘాలపై ఆంక్షలు ఎత్తివేయాలి : బత్తుల సుధాకర్

ప్రజాపక్షం/సూర్యాపేటటౌన్: ఆర్టీసీ కార్మిక సంఘాలపై ఉన్న ఆంక్షలు ఎత్తివేసి, వారితో చర్చలు జరిపి సమస్యలు పరిష్కరించాలని, 2021/25 వేతనచటాన్ని సవరణ చేపట్టాలని టిఎస్ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ పెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి బత్తుల సుధాకర్ డిమాండ్ చేశారు. టిఎస్ఆర్టీసీ ఎస్‌డబ్ల్యూఎఫ్ రాష్ట్ర 4వ మహాసభలు ఈనెల 21, 22 తేదీలో ఖమ్మంలో జరిగే మహాసభ పోస్టర్‌ను ఆర్టీసీ డిపో ముందు ఆవిష్కరించి మాట్లాడారు. ఎస్‌డబ్ల్యూఎఫ్ నిబంధనవాళి ప్రకారం ప్రతిరెండు సంవత్సరాలకు ఒకసారి మహాసభలు జరుగుతాయని, రెండు మహాసభల మద్య కాలంలో ఆర్టీసీ పరిస్థితి, కార్మికుల పరిస్థితి, చేసిన ఆందోళనలు, వచ్చిన అనుభవాలను సమీక్షించుకొని, రాబోయే రెండు సంవత్సరాలకు కర్తవ్యాలు రూపొందించుకోంటామన్నారు. జూలై 9న జరగనున్న సార్వత్రిక సమ్మెను జయప్రదం, మహిళల అప్రెంటీస్, కాంట్రాక్ట్ ఉద్యోగుల, రిటైర్డ్ కార్మికుల సమస్య పరిష్కారంపై ప్రత్యేకంగా మహాసభ చర్చించనున్నదని అన్నారు. ఈ కార్యక్రమంలో డిపో అధ్యక్ష, కార్యదర్శులు దేగల రవి, ఉప్ప లక్ష్మయ్య, రీజియన్ కోశాధికారి బైరు శ్రీకంట్లం, డిపో నాయకులు రాములు, బర్పటి వెంకన్న, అక్బర్, చెన్నయ్య, ఖలీల్, జిఎస్‌రెడ్డి, ప్రవీణ్, కృష్ణవేణి పాల్గొన్నారు.

## రామకృష్ణకు గోదా పరామర్శ



ప్రజాపక్షం/యాదగిరిగుట్ట : రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి యాదగిరిగుట్ట మండల కేంద్రంలోని ప్రశాంత్ నర్సింగ్ హోమ్‌లో చికిత్స పొందుతున్న (ఉప ముఖ్యమంత్రి పిఆర్వో) ప్రజాపక్షం జిల్లా స్టాఫ్ రిపోర్టర్ దుడుక రామకృష్ణను మంగళవారం సిపిఐ జిల్లా కార్యదర్శి గోదా శ్రీరా ములు పార్టీ శ్రేణులతో కలిసి పరామర్శించారు. రోడ్డు ప్రమాద సంఘటన సంబంధించిన వివరాలు తెలుసుకొని వైద్యులు చిదిరాల ఉపేందర్‌తో ప్రస్తుత ఆరోగ్య పరిస్థితిలపై సమీక్షించారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఆయన వెంట సిపిఐ యాదగిరిగుట్ట మండల కార్యదర్శి కల్లెపల్లి మహేందర్, మండల సహాయ కార్యదర్శి పేరబోయిన మహేందర్ తదితరులు ఉన్నారు.

## అభివృద్ధి పనుల్లో నాణ్యత లేకుంటే

# రాజీపడేదే లేదు

రోడ్ల నిర్మాణ పనితీరుపై అధికారులు, కాంట్రాక్టర్లతో ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి సమీక్ష



ప్రజాపక్షం/మునుగోడు: మునుగోడు నియోజకవర్గంలో కొనసాగుతున్న రోడ్ల అభివృద్ధి పనుల్లో నాణ్యత లేకుంటే రాజీ పడేదే లేదని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి అన్నారు మంగళవారం మునుగోడు నియోజకవర్గం కేంద్రంలో ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో పంచాయతీరాజ్, ఆర్ అండ్ బి శాఖ ల ఆధ్వర్యంలో నిర్మిస్తున్న రోడ్ల పనుల పురోగతిపై పంచాయతీరాజ్, ఆర్ అండ్ బి అధికారులు, రోడ్డు నిర్మాణ కాంట్రాక్టర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. సాగర్ రోడ్డు నుండి ముష్టిపల్లి వరకు, ముష్టిపల్లి నుండి నాంపల్లి వరకు జరుగుతున్న ఆర్ అండ్ బి రోడ్ల పనులు ఎంతవరకు వచ్చాయని కాంట్రాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. వీటితోపాటు అంగడిపేట నుండి లెంకలపల్లి వరకు చేపట్టబోయే రోడ్డు పనులకు సంబంధించి టెండర్ ప్రొసీజర్ ఎంతవరకు వచ్చిందని ఆరా తీశారు.నాంపల్లి నుండి ఇడికుడ వరకు, ఇడికుడ నుండి కమ్మగూడెం(తెరట్ పల్లి) వరకు ఉన్న పంచాయతీరాజ్ రోడ్లను ఆర్ అండ్ బి రోడ్లుగా మార్చిన తర్వాత వాటి పనులకు సంబంధించి పురోగతి పై ఆరా తీశారు. వీటితోపాటు నియోజకవర్గంలో కింద ఎన్ని రోడ్లకు ప్రపోజల్స్ పంపించారనే విషయాలపై చర్చించారు. పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో నియోజకవర్గ వ్యాప్తంగా జరుగుతున్న పిఆర్ రోడ్ల పనుల పురోగతిపై అధికారులు, కాంట్రాక్టర్లతో చర్చించారు. ప్రస్తుతం జరుగుతున్న 57 రోడ్ల పనులు ఎంతవరకు వచ్చాయి ఎప్పటి వరకు పూర్తవుతాయని ఆరా తీశారు.ఇవే కాకుండా మరో 34 పిఆర్ రోడ్లు టెండరింగ్ ప్రక్రియ ఎంతవరకు వచ్చిందని అధికారులను అడిగి తెలుసుకున్నారు.ప్రస్తుతం జరుగుతున్న 89 రోడ్డు పనుల ప్రోగ్రెస్ పై ఫోకస్ పెట్టి ప్రతిరోడ్డు 5.5 మీటర్లు వెడల్పు తో నాణ్యతతో నిర్మించాలన్నారు.నియోజకవర్గం లోని ప్రతి పిఆర్ రోడ్డు 3.75 మీటర్ల నుండి 5.5 మీటర్ల వెడల్పుకి మార్చాలని అధికారులను ఆదేశించారు... నియోజకవర్గంలో ఏ రోడ్డును చూసినా కూడా 5.5 మీటర్ల వెడల్పుతో ఉండాలని సూచించారు.విడతల వారీగా నియోజకవర్గంలోని అన్ని రోడ్లను నిర్మాణం చేసుకోవాలన్నారు. మునుగోడు నియోజకవర్గ వ్యాప్తంగా నాణ్యతతో కూడిన రోడ్ల నిర్మాణం కోసం, ప్రభుత్వంతో మాట్లాడి నిధులు తెప్పించే బాధ్యత నాదని అన్నారు..ఈ సమీక్ష సమావేశంలో రోడ్డు నిర్మాణ కాంట్రాక్టర్లతోపాటు, పంచాయతీరాజ్ ఈ ఈ గిరిధర్, ఆర్ అండ్ బి మునుగోడు డి ఈ శరత్ చంద్ర, పి ఆర్ ఎ ఈ సతీష్ పాల్గొన్నారు.

# త్వరగా ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం

నిర్మాణంలో ఉన్న ఇండ్లను పరిశీలించిన నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి



ప్రజాపక్షం/దేవరకొండ : ఇందిరమ్మ ఇండ్లు వచ్చిన లబ్ధిదారులు త్వరగా ఇంటి నిర్మాణం పూర్తి చేసుకోవాలని నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి సూచించారు. ఇంటి నిర్మాణ దశల ఆధారంగా ప్రభుత్వం లబ్ధిదారులకు బిల్లులు చెల్లిస్తుందని తెలిపారు. మంగళవారం దేవరకొండ రెవెన్యూ డివిజన్ పరిధిలోని దేవరకొండ మండలం కొర్రతండాలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను కలెక్టర్ పరిశీలించి లబ్ధిదారులతో మాట్లాడారు. కొర్ర మౌనిక అనే లబ్ధిదారు ఇంటికి వెళ్ళి ఇందిరమ్మ ఇంటి నిర్మాణాన్ని పరిశీలించి ప్రభుత్వం నిర్దేశించిన ప్రకారం ఇంటి నిర్మాణం ఉందో లేదో పరిశీలించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ఇంటి నిర్మాణానికి సిమెంట్, ఇటుక, స్టీల్ ఎక్కడి నుండి తీసుకువస్తున్నారని అడిగారు. ఇంటి నిర్మాణంలో ఏమైన ఇబ్బందులు ఉన్నాయా అని అడిగగా దేవరకొండ నుండి ఇంటి నిర్మాణానికి అవసరమైయ్యే సామాగ్రిని తెస్తున్నామని, ఇంటి నిర్మాణంలో తమకు ఎలాంటి ఇబ్బంది లేదని మౌనిక జిల్లా కలెక్టర్‌కు బదులిచ్చారు. బేస్మెంట్ బిల్లు వచ్చిందా అని అడగగా రూ. లక్ష తన అకౌంట్లో జమ అయ్యాయని లబ్ధిదారు మౌనిక తెలిపారు. కాగా ఇంటి నిర్మాణం లేంటల్ స్థాయికి వచ్చినందున రెండో విడత బిల్లును వెంటనే మంజూరు చేయాలని గృహ నిర్మాణ శాఖ పిడి రాజ్‌కుమార్‌ను ఆదేశించారు. గతంలో ఎక్కడ ఉండేవారని జిల్లా కలెక్టర్ ప్రశ్నించగా ఇంతకు ముందు గుడిసె ఉండేదని, ఆ గుడిసెను తొలగించి దాని స్థానంలో ప్రస్తుతం ఇల్లు నిర్మించుకుంటున్నామని, తమకు ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చి చాలా సహాయం చేసిందని తెలిపారు. ఈకార్యక్రమంలో జిలాల కలెక్టర్ వెంట దేవరకొండ ఆర్డీవో రమణారెడ్డి, గృహ నిర్మాణ శాఖ పిడి రాజ్‌కుమార్, ఎంపిడివో డానియల్, సంబంధిత అధికారులు, మండల స్థాయి అధికారులు తదితరులు ఉన్నారు.

# ప్రైవేటు విద్యాసంస్థల్లో ఫీజులు తగ్గించాలి

విద్యా వ్యాపారాన్ని అరికట్టాలి : ఎఐవైఎఫ్



ప్రజాపక్షం/యాదగిరిగుట్ట : యాదగిరిగుట్ట మండలంలో ప్రైవేటు విద్యాసంస్థలలో ఫీజులు తగ్గించాలని, గుర్తింపు లేని పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ అఖిల భారత యువజన సమైక్య(ఎఐవైఎఫ్) ఆధ్వర్యంలో ఎంఈఓకి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి పేరబోయిన మహేందర్ మాట్లాడుతూ ప్రైవేట్ విద్యా సంస్థలు నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీ విద్యార్థులకే విద్యా సంవత్సరానికి దాదాపు 20 వేల ఫీజులు తీసుకోవడం దారుణం అన్నారు. విద్యాసంస్థలలో పాఠ్యపుస్తకాలు విక్రయించకూడదని నిబంధనలు ఉన్నా పట్టించుకోకుండా పాఠ్యపుస్తకాలు అధిక రేట్లకు అమ్ముతున్నారు. విద్యార్థులు వేసుకునే డ్రెస్సులను సైతం విక్రయిస్తున్నారు. పాఠశాలకు సంబంధించిన ఐడీ కార్డులను ఇతర సామాగ్రి సైతం అత్యధిక రేట్లకు అమ్మడంతో విద్యార్థుల తల్లిదండ్రులకు ఆర్థిక భారం అవుతుందన్నారు. ప్రైవేట్ విద్యా సంస్థలు చేస్తున్నటువంటి విద్యా వ్యాపారాన్ని అరికట్టాలని డిమాండ్ చేశారు. గుర్తింపు లేని పాఠశాలలపై వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ మండల కార్యదర్శి కంబాల వెంకటేష్, నాయకులు అనంతుల నరసింహ, పాకలపాటి రాజు, రావుల శీను, సంగీ అరవింద్, కంబాల రాజు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలి

ప్రజాపక్షం/మునుగోడు: రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించాలని ఏఐఎస్‌ఎఫ్ మండల అధ్యక్షులు గోపగోని ఉదయ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల 20 పైగా బస్ పాస్ ఛార్జీలను పెంచిన నిర్ణయాన్ని అఖిల భారత విద్యార్థి సంఘం ఖండిస్తుందన్నారు. బస్ పాస్ ఛార్జీలు పెంపు ఉపసంహరించకపోతే ఎఐఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగ నిరసనలు ,ర్యాలీలు చేపట్టి పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

## ఇంటిగ్రేటెడ్ పాఠశాలకు స్థల పరిశీలన



ప్రజా పక్షం/ హాలియా: సాగర్ నియోజకవర్గంలో ఉన్నత విద్యను మరింత అందుబాటులోకి తెచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొని మంజూరు చేసిన ఇంటిగ్రేటెడ్ మోడల్ పాఠశాలను ఏర్పాటు చేసేందుకు ఇబ్రహీంపేటలో గల ప్రభుత్వ భూమిని సబ్ కలెక్టర్ అమిత్ నారాయణ మంగళవారం పరిశీలించారు. సాగర్ నియోజకవర్గానికి మంజూరైన ఇంటిగ్రేటెడ్ మోడల్ పాఠశాలను 20 ఎకరాల విస్తీర్ణంలో నిర్మించేందుకు అధికారులు స్థలాలను పరిశీలిస్తున్నారు. దీనిలో భాగంగానే ఇబ్రహీంపేటలో ఉన్న సుమారు 30 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంటుందని రెవెన్యూ అధికారులు జిల్లా అధికారులకు వివరించినట్లు తెలిసింది. దీనిలో భాగంగానే మంగళవారం మిర్యాలగూడ సబ్ కలెక్టర్ అమిత్ నారాయణ ఇబ్రహీంపేటలో ఉన్న ప్రభుత్వ భూమిని పరిశీలించారు. నాగార్జునసాగర్ నియోజకవర్గంలో 25 ఎకరాల ప్రభుత్వ భూమి ఒకే దగ్గర ఎక్కడ లేకపోవడంతో అధికారులు ఒకే ప్రాంతంలో ఉన్న ప్రభుత్వ భూమిని క్షేత్రస్థాయిలో పర్యవేక్షిస్తున్నారు. సబ్ కలెక్టర్ వెంట అనుముల తాసిల్దార్ రఘు, సర్వేయర్ విజయ్ కుమార్ తదితరులు ఉన్నారు.

## సాగర్‌ను సందర్శించిన ట్రైనీ ఐఎఎస్‌లు



ప్రజాపక్షం/నందికొండ: అంతర్జాతీయ పర్యాటక కేంద్రమైన నాగార్జునసాగర్‌ను మంగళవారం ట్రైనీ ఐఏఎస్ ల బృందం సందర్శించింది. తెలంగాణ దర్శనంలో భాగంగా మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థలో శిక్షణ పొందుతున్న తెలంగాణ రాష్ట్రానికి కేటాయించబడిన ట్రైనీ ఐఏఎస్ అధికారులు జిల్లా శిక్షణ కార్యక్రమంలో భాగంగా నాగార్జున సాగర్ ను సందర్శించారు. దీనిలో భాగంగా నాగార్జునసాగర్ బుద్ధవనం చేరుకున్న వీరు ఇంచార్జ్ అడిషనల్ కలెక్టర్ నారాయణ అమిత్‌తో సమావేశమైన అనంతరం బుద్ధ వనంలోని బుద్ధ పాదాల వద్ద పుష్పాంజలి ఘటించి బుద్ధ చరితవనం, జాతకవనం, ధ్యానవనం, స్థూప వనం లను సందర్శించి మహా స్తూపం లోని ధ్యాన మందిరంలో బుద్ధ జ్యోతిని వెలిగించారు. బుద్ధవనం ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ శాసన, ఎస్టేట్ మేనేజర్ రవిచంద్రలు ట్రైనీ ఐఏఎస్ లకు బుద్ధ వనం బ్రోచర్లతోపాటు, పంచశీల కండువాలను బహుకరించారు. ఈ సందర్భంగా ట్రైనీ ఐఏఎస్ లు మాట్లాడుతూ కృష్ణానది తీరాన నాగార్జునసాగర్ లాంటి ప్రశాంతమైన వాతావరణంలో బుద్ధవనం సందర్శన మరింత ప్రశాంతత కలగజేస్తుందని అభిప్రాయపడ్డారు. వీరికి స్థానిక టూరిజం గైడ్ సత్యనారాయణ బుద్ధవనం, నాగార్జునకొండ చారిత్రక విశేషాలను, నాగార్జునసాగర్ డ్యాం వివరాలను తెలియజేశారు. వీరితోపాటు తెలంగాణ దర్శన్ డిస్టిక్ ట్రైనింగ్ ప్రోగ్రాం నోడల్ ఆఫీసర్ శ్రీనివాస్, ప్రోటోకాల్ రెవెన్యూ ఇన్స్పెక్టర్ దండ శ్రీనివాస్ రెడ్డి, విజయ విహార్ మేనేజర్ కిరణ్ తదితరులు ఉన్నారు.

## సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన



ప్రజాపక్షం /నల్లగొండ టౌన్ : ఫోక్సో, గ్రేవ్ కేసుల్లో త్వరితగతిన ఇన్వెస్టిగేషన్ పూర్తి చేసి అసాంఘిక కార్యకలాపాలు గంజాయి, జూదం,పిడియస్ రైస్ అక్రమ రవాణా లాంటి వాటిపై ప్రత్యేక దృష్టి పెట్టిసైబర్ నేరాల పై ప్రజల్లో అవగాహన కల్పించాలని జిల్లా ఎస్పి శరత్ చంద్ర పవార్ ఆదేశించారు మంగళవారం నల్లగొండ జిల్లా పోలీస్ కార్యాలయంలో పోలీసు అధికారులతో నిర్వహించిన నెలవారి నేర సమీక్షా సమావేశంలో ఎస్పి పాల్గొని మాట్లాడుతూ పెండింగ్ లో ఉన్న అండర్ ఇన్వెస్టిగేషన్ కేసులలో గ్రేవ్, నాన్ గ్రేవ్ కేసుల గురించి అడిగి, గ్రేవ్ నాన్ గ్రేవ్ కేసులలో ఇన్వెస్టిగేషన్ చేసేటప్పుడు ప్రతి కేసులో క్వాలిటీ ఇన్వెస్టిగేషన్ తో పూర్తి పారదర్శకంగా చేయాలన్నారు. రోడ్డు ప్రమాదాలు జరగకుండా ప్రతీ రోజు డ్రంక్ అండ్ డ్రైవ్ లు నిర్వహించాలని,ఓవర్ స్పీడ్,ట్రిపుల్ డ్రైవింగ్,మైనర్లు వాహనాలు నడుపుట లాంటి వాటిపై ప్రత్యేక దృష్టి పెట్టి స్పెషల్ డ్రైవ్ లు నిర్వహించాలని అన్నారు.ఈ సమావేశంలో ఏఎస్పి మౌనిక ఐపీఎస్,అడిషనల్ ఎస్పీ రమేష్,డిఎస్పి లు శివరాం రెడ్డి,రాజశేఖర్ రాజు,సైబర్ క్రైమ్ డిఎస్పి లక్ష్మీ నారాయణ, సిఐ లు, ఎస్ఐ లు పాల్గొన్నారు.

## యూనిఫాం, బుక్స్ పంపిణీ చేశారా?

కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆకస్మిక తనిఖీ

ప్రజాపక్షం/చందంపేట: నల్గొండ జిల్లా చందంపేట మండలం చిత్రియాల గ్రామ చెంచుకాలనీ ప్రాథమిక పాఠశాలను మంగళవారం జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆకస్మిక తనిఖీ చేశారు. విద్యార్థులతో ముఖాముఖి మాట్లడి వారి విద్యా సామర్థ్యాలను పరిశీలించారు. పిల్లలను చదివిస్తే మంచి భవిష్యత్తు ఉంటుందని తల్లిదండ్రులకు సూచించారు. ఎంఈవో చందర్‌తో కలెక్టర్ మాట్లాడుతూ యూనిఫాం, బుక్స్ పంపిణీ చేశారా లేదా అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులకు కలెక్టర్ చాక్లెట్లు పంపిణి చేసి బాగా చదువుకోవాలని సూచించారు. అంతకు ముందు గ్రామ ప్రజలతో మాట్లాడి ఇందిరమ్మ ఇండ్లు, ఇతర వివరాలను అడిగి తెలుసుకున్నారు. చందంపేట ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రం డాక్టర్, వైద్య సిబ్బందితో మాట్లాడి మండలంలో మాతా శిశు మరణాల వివరాలను, మహిళలలో రక్త హీనత, వైద్య చికిత్సలు, ఇతర వివరాలను అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ వెంట ఆర్డీవో రమణారెడ్డి, గృహనిర్మాణ శాఖ పిడి రాజ్‌కుమార్, మండల ప్రత్యేకాధికారి, జిల్లా మైన్స్ సహాయ సంచాలకులు జాకబ్, జిల్లా మహిళా శిశు సంక్షేమ అధికారి కృష్ణవేణి, డిటిడివో చత్రునాయక్, ఎంఈవో చందర్, తహశీల్దార్ శ్రీధర్ బాబు, ఎంపిడివో లక్ష్మి తదితరులు ఉన్నారు.



# హ్యాండ్లూమ్ రిజర్వేషన్ యాక్ట్‌పై చేనేత కార్మికులకు అవగాహన సదస్సు




ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి : చేనేత మగ్గాలపై ఆధారపడి జీవిస్తూ జీవనోపాధి పొందుతున్న కార్మికుల పరిశ్రమను ఆదుకునేందుకు హ్యాండ్లూమ్ రిజర్వేషన్ యాక్ట్ 1985 అవగాహన సదస్సును నిర్వహించారు. హ్యాండ్లూమ్ ఆర్‌డిడి పద్మ ఆధ్వర్యంలో మంగళవారం పోచంపల్లి పట్టణ కేంద్రంలోని సహకార భవనంలో చేనేత కార్మికులు, చేనేత కార్మిక అనుబంధ సంఘాల నాయకులు, మాస్టర్ వీవర్స్, వ్యాపారస్తులు, ఉత్పత్తిదారులతో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి చెన్నై ఆర్డీసీహెచ్ అసిస్టెంట్ డైరెక్టర్ మంజునాథ లీగల్ అసిస్టెంట్ దీపక్ వంశీలు కార్మికులకు హ్యాండ్లూమ్ యాక్ట్ గురించి ఆర్టికల్స్ ను వివరిస్తూ పరిశ్రమలను కాపాడుకునేందుకు పొందుపరిచిన చట్టాలను పూర్తిగా వివరించారు. రిజర్వేషన్ ఆ యాక్ట్ ప్రకారం 11రకాల చేనేత ఉత్ప చేనేత ఉత్పత్తులను కేవలం మగ్గాల మీద మాత్రమే ఉత్పత్తులను తయారు చేయాలని మరమగలపై గాని ఇతర ఫ్యాక్టరీల నుండి గాని తయారు చేస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటారని అవగాహన కల్పించారు. స్పెసిఫికేషను కింద ఇతర మార్గాల ద్వారా చేనేత వస్త్రాలను ఉత్పత్తి చేస్తే చట్ట ప్రకారం నేరంగా పరిగణించబడుతుందని స్పష్టం చేశారు. జియోగ్రాఫికల్ ఇండికేషన్ గుర్తింపు ఉన్నందున ఇక్కత్ చేనేత వస్త్రాలను ప్రభుత్వం నిర్ణయించిన 110 కిలోమీటర్ల పరిధిలో ఉన్న కుటుంబాల నుండి ఉత్పత్తి అయిన వస్త్రాలను మాత్రమే ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని వ్యాపార క్రయవిక్రయాలు జరుపుకోవచ్చని పరిధిని దాటి వేరే ఇతర పట్టణాలలో గ్రామాలలో మర మగ్గాల, ఫ్యాక్టరీల ద్వారా చీరలు తయారు చేస్తే చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని యాక్ట్ లో పొందుపరిచారని తెలిపారు. ఈ కార్యక్రమంలో హ్యాండ్లూమ్ ఏడి శ్రీనివాస్, రాష్ట్ర చేనేత నాయకులు తడక రమేష్ టై అండ్ డై అధ్యక్షులు భారత లవకుమార్ చేనేత కార్మిక సంఘం అధ్యక్షులు అంకం పాండు గంజి బసవలింగం చింతకింది రమేష్ వివిధ చేనేత సంఘాల నాయకులు వ్యాపారస్తులు చేనేత కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

## బాల్యవివాహాలు అరికడదాం

ప్రజాపక్షం /నల్లగొండ(నకిరేకల్ ): బాల్యవివాహాలు అరికట్టి ఆడపిల్లల ఎదుగుదలకు సమాజం బాధ్యతతో సహకరించాలని ఆశ్రిత స్వచ్ఛంద సంస్థ కోఆర్డినేటర్ శోభారాణి అన్నారు. మంగళవారం తాటికల్ ఉన్నత పాఠశాలలో జరిగిన బాల్యవివాహాల నిషేధ అవగాహన సదస్సులో ఆమె ప్రసంగించారు. ఈ సందర్భంగా శోభారాణి మాట్లాడుతూ కిశోర బాలికలు సమతుల్య ఆహారం స్వీకరించకపోవడం వల్ల అనేక ఇబ్బందులు ఎదురవుతాయి అన్నారు. కమ్యూనిటీ సోషల్ వర్కర్ ఝాన్సీ మాట్లాడుతూ ఆడపిల్లలకు ఎదురయ్యే లైంగిక వేధింపుల నుండి కాపాడుకోవడానికి ఫోక్సో చట్టం రక్షణ కల్పిస్తుందన్నారు. ఐసిడిఎస్ సూపర్వైజర్ భవాని మాట్లాడుతూ సోషల్ మీడియాలో అమ్మాయిలు మోసపోతున్న విధానాన్ని, మానవ అక్రమ రవాణా గురించి అవగాహన కల్పించారు. జిల్లా బాలల రక్షణ విభాగం సూపర్వైజర్ రమణి మాట్లాడుతూ గుడ్ టచ్ బ్యాడ్ టచ్ గురించి పిల్లలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి టీచర్లు, ఇన్చార్జి ప్రధానోపాధ్యాయులు ప్రజ్ఞాపురం వెంకన్న ఉపాధ్యాయులు పండుగ తిరుమలయ్య, మోసంగి హరీష్ చంద్ర, మార్త రాములు, డాక్టర్ సాగర్ల సత్తయ్య, నర్రా వెంకటరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# రీల్

## పది గంటల పని అసాధ్యమేమీ కాదు



### ఆసక్తికర కామెంట్స్ చేసిన జెనీలియా

దీపికా పదుకొణే, సందీప్ రెడ్డి వంగాల మధ్య జరిగిన కోల్డ్ వార్ గురించి మనందరికి తెలిసిందే. ప్రభాస్ నటిస్తున్నస్పిరిట్ కోసం దీపికాని కథానాయికగా ఎంపిక్ చేయగా, ఆమె పెట్టిన డిమాండ్ల వలన సందీప్ తన ప్రాజెక్ట్ నుండి దీపికాని తప్పించి యానిమల్ హీరోయిన్ తృప్తి డిమ్రీని ఎంపిక చేశాడు. అయితే దీపికా పనివేళలతో పాటు రూ.25 కోట్ల పారితోషికం డిమాండ చేయడం వల్లనే ఆమెని తప్పించారనే ప్రచారం నడిచింది. దీపికా పెట్టిన కండీషన్స్ విషయంలో ఇప్పుడు ఇండస్ట్రీలో ఆసక్తికర చర్చ నడుస్తుంది. దీనిని కొందరు సపోర్ట్ చేస్తుండగా, మరి కొందరు వ్యతిరేఖిస్తున్నారు. ఆ మధ్య 'భజరంగీ భాయిజాన్', 'చందూ ఛాంపియన్' తదితర హిట్ సినిమాలను తెరకెక్కించిన దర్శకుడు కబీర్ ఖాన్.. దీపికా చేసిన డిమాండ్లు అసాధారణం కావని, న్యాయంగానే ఉన్నాయని వ్యాఖ్యానించారు. చిత్ర పరిశ్రమలో పని చేసే వారందరు కూడా వ్యక్తిగత జీవితం, ఆరోగ్యం కూడా చూసుకోవాలి. స్టార్ హీరోలైన ఆమిర్ ఖాన్, అక్షయ్ కుమార్ కూడా రోజుకు 8 గంటల షిఫ్ట్ ల్లోనే పని చేస్తారు. అలాంటప్పుడు దీపికా చెప్పిన పని గంటల విషయంలో విమర్శలు ఎందుకు చేస్తున్నారో నాకు అర్థం కావడం లేదంటూ ఆమెకి సపోర్ట్‌గా నిలిచాడు.

ఇక సుదీర్ఘ పని గంటల విషయంపై తాజాగా జెనీలియా స్పందించింది. 'సితారే జమీన్ పర్' సినిమా విడుదలకు సిద్ధమవుతున్న నేపథ్యంలో ఈ మూవీ ప్రమోషన్‌లో భాగంగా జెనీలియా ఒక ఇంటర్వ్యూలో మాట్లాడుతూ, పనిచేసే తల్లులకు ఎక్కువ సమయం పని చేయడం కష్టమే అయినా అసాధ్యం ఏమి కాదు. నేను రోజుకు 10 గంటలు పనిచేస్తాను. కొన్నిసార్లు దర్శకుడు పనిని 11 లేదా 12 గంటల వరకు పొడిగించమని అడిగినప్పుడు నేను దానిని వ్యతిరేఖించను. అయితే సర్దుబాట్లు చేసుకోవడానికి కొంత సమయం అవసరం అవుతుంది. ఒకటి రెండు రోజులు పని చేయాల్సి వచ్చినప్పుడు కాస్త అవగాహనతో పూర్తి చేసుకోవచ్చు అని పేర్కొంది. ఇప్పుడు జెనీలియా చేసిన కామెంట్స్ వైరల్‌గా మారాయి.

## రజనీకాంత్ ఆశీర్వాదం తీసుకున్న విష్ణు




మంచు విష్ణు టైటిల్ పాత్రను పోషించిన సినిమా కన్నప్ప. నెలాఖరులో విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో తమ కుటుంబానికి అత్యంత సన్నిహితుడైన సూపర్ స్టార్ రజనీకాంత్ ఆశీర్వాదం తీసుకున్నారు. మంచు మోహన్ బాబు, విష్ణు ఇద్దరు కలిసి రజనీకాంత్ దగ్గర కు వెళ్లి ఆశీర్వాదం తీసుకున్నారు. కన్నప్ప సినిమా పెద్ద హిట్ కావాలని రజనీకాంత్ ఆకాంక్షించారు. ఈ సినిమాలో ప్రభాస్, మోహన్ లాల్, అక్షయ్ కుమార్, కాజల్ అగర్వాల్ ప్రధాన పాత్రలో కనిపిస్తారు. ప్రభాస్ నటించిన సన్నివేశాలు అరగంటకు పైగా ఉన్నాయి.

## రవితేజ న్యూ లుక్ రిలీజ్

ఎస్ఎల్‌వి సినిమాస్ బ్యానర్‌పై రవితేజ హీరోగా కిషోర్ తిరుమల దర్శకుడిగా చెరుకూరి సుధాకర్ నిర్మిస్తున్న చిత్రం రెగ్యులర్ షూటింగ్ ప్రారంభమైంది. రవితేజ 76వ సినిమాగా తెరకెక్కుతున్న ఈ సినిమా కోసం హైదరాబాద్ శివారు ప్రాంతంలో భారీ సెట్ వేశారు. ఈ సెట్‌లోనే సినిమాలోని కీలకమైన సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారు. కామెడీ, యాక్షన్ నేపథ్యంలో సాగే ఫ్యామిలీ డ్రామాగా ఈ సినిమాను నిర్మిస్తున్నారు. రవితేజకు ధమాకా సినిమాలో సంగీతం అందించిన భీమ్స్ ఈ సినిమాకు సంగీత దర్శకుడిగా పని చేస్తున్నారు. భీమ్స్ ఇటీవల ఉత్తమ సంగీత దర్శకుడిగా తెలంగాణ గద్దర్ ఫిలిం అవార్డు అందుకున్న సంగతి తెలిసిందే. ప్రసాద్ మూరెళ్ళ సినిమాటోగ్రాఫర్‌గా, శ్రీకర్ ప్రసాద్ ఎడిటర్ గా పని చేస్తున్నారు. అన్ని పనులు పూర్తి చేసి వచ్చే ఏడాది సంక్రాంతికి ఈ సినిమాను విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నామని నిర్మాత చెరుకూరి సుధాకర్ తెలిపారు.



## పూరి కొత్త సినిమాలో సంయుక్త



తెలుగు సినిమా ఇండస్ట్రీలో తనకంటూ డైరెక్టర్‌గా ఓ సెపరేట్ శైలీని క్రియేట్ చేసుకున్న దర్శకుడు పూరి జగన్నాథ్. సూపర్ డూపర్ హిట్ సినిమాలు తీసిన పూరి అదే స్థాయిలో డిజాస్టర్ ఫ్లాపులు కూడా తీశాడు. కాని తన దైన శైలిలో రాజీ పడకుండా సినిమాలు తీస్తూనే ఉన్నారు. తమిళ, తెలుగు మార్కెట్‌లో మంచి పేరు సంపాదించుకున్న తమిళ నటుడు విజయ్ సేతుపతితో పూరి జగన్నాథ్ సినిమా చేస్తున్నారు. ఈ సినిమాలో విజయ్ సేతుపతి సరసన సంయుక్త ను హీరోయిన్‌గా ఎంపిక చేశారు. టబూ ఇందులో కీలక పాత్ర పోషిస్తోంది. పూరి కనెక్ట్ బ్యానర్ పై హీరోయిన్ చార్మి తో కలిసి పూరి జగన్నాథ్ ఈ సినిమాను నిర్మిస్తున్నారు. త్వరలోనే షూటింగ్ ప్రారంభం కానుంది.

## 'భూ అంటూ భూతం..' పాట రిలీజ్




శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ నిర్మాణంలో నితిన్ హీరోగా శ్రీరామ్ వేణు దర్శకత్వంలో రూపొందుతున్న తమ్ముడు. దిల్ రాజు, శిరీష్ నిర్మిస్తున్న ఈ చిత్రంలో లయ, వర్ష బొల్లమ్మ, సప్తమి గౌడ కీలక పాత్రలు పోషిస్తున్నారు. జూలై 4న 'తమ్ముడు' సినిమా ప్రపంచం వ్యాప్తంగా రిలీజ్ కు రెడీ అవుతోంది. ఈ సినిమా నుంచి 'భూ అంటూ భూతం..' అనే పాటను రిలీజ్ చేశారు. మేనకోడలు బేబి దిత్యకు మేనమామ నితిన్ ధైర్యం చెప్పే సందర్భంలో ఈ పాటను చిత్రీకరించారు. 'భూ అంటూ భూతం..' పాటను అజనీష్ లోకనాథ్ బ్యూటిఫుల్ గా కంపోజ్ చేయగా, అనురాగ్ కులకర్ణి, అక్షిత పోల ఆకట్టుకునేలా పాడారు. సింహాచలం మన్నేలా లిరిక్స్ రాశారు. ఈ సినిమా కు సినిమాటోగ్రఫీ మ కేవీ గుహన్, ఎడిటింగ్ ప్రవీణ్ పూడి, అజనీష్ లోకనాథ్ సంగీతం అందిస్తున్నారు.



## 'ఓభామ అయ్యో రామా' జూలై 11న విడుదల

సుహాస్ హీరోగా, మాళవిక హీరోయిన్‌గా తెరకెక్కుతున్న వైవిధ్యమైన ప్రేమకథా చిత్రం ఓ భామ అయ్యో రామా సినిమా విడుదలకు సిద్ధమవుతోంది. వైవిధ్యమైన కథలతో ప్రత్యేకతను చాటుకుంటున్న సుహాస్ ఇప్పుడు కూడా ఓ వెరైటీ ప్రేమ కథతో ప్రేక్షకుల ముందుకు వస్తున్నారు. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు శరవేగంగా జరుపుకుంటున్న ఈ సినిమాను జూలై 11వ తేదీన విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. విఏ ఆర్ట్ ఫిలింస్ పతాకంపై నిర్మిస్తున్న ఈ హరీష్ దర్శకత్వం వహిస్తున్నారు. ఆదిత్యా మ్యూజిక్ ద్వారా ఈ సినిమా పాటలు రిలీజ్ చేయనున్నారు.

## త్రినాథ రావు- హవిష్ కాంబినేషన్‌లో కొత్త సినిమా



నువ్విలా, జీనియస్, రామ్ లీలా, సెవెన్ వంటి చిత్రాలతో ప్రేక్షకుల్లో మంచి గుర్తింపు తెచ్చుకున్న యంగ్ టాలెంటెడ్ హీరో హవిష్, హీరోగా సినిమా చూపిస్త మావ, నేను లోకల్, ధమాకా, మజాక వంటి సూపర్ హిట్ చిత్రాల దర్శకుడు నక్కిన త్రినాథరావు కాంబినేషన్ లో రూపొందుతున్న సినిమా షూటింగ్ రెగ్యులర్ గా సాగుతోంది. ఈ సినిమాకు సంబంధించిన టైటిల్ గ్లింప్స్ ను ఈ నెల 19న రిలీజ్ చేయబోతున్నారు. నిఖిల కోనేరు నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. ఓ డిఫరెంట్ ఫ్యామిలీ ఎంటర్ టైనర్ గా తెరకెక్కుతున్న ఈ చిత్రానికి మిక్కీ జే మేయర్ సంగీతం అందిస్తున్నారు . నిజార్ షఫీ సినిమాటోగ్రాఫర్ గా పనిచేస్తున్నారు. తొలి షెడ్యూల్ ఇటీవలే పూర్తయింది. హార్నిక్స్ ఇండియా ఎల్ ఎల్ పి బ్యానర్ పై ఈ సినిమా నిర్మిస్తున్నారు.

## రాజా సాబ్ టీజర్ విడుదల

రాజా సాబ్ టీజర్ విడుదల రెబల్ స్టార్ ప్రభాస్, మారుతి దర్శకత్వంలో ప్రొడక్షన్ హౌస్ పీపుల్ మీడియా ఫ్యాక్టరీ కాంబినేషన్‌లో రూపొందుతున్న క్రేజీ మూవీ 'రాజా సాబ్'. ఈ చిత్రంలో నిధి అగర్వాల్, మాళవిక మోహనన్, రిద్ధి కుమార్ హీరోయిన్స్‌గా నటిస్తున్నారు. 'రాజా సాబ్' సినిమా డిసెంబర్ 5న వరల్డ్ వైడ్ గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ రాబోతోంది. సోమవారం హైదరాబాద్ లో ఐమ్యాక్స్‌లో టీజర్ విడుదల చేశారు.





## కేంద్రం కుల గణన చేయకపోతే యుద్ధం చేస్తాం

### టిపిసిసి హనుమంతరావు

**ప్రజాపక్షం / హైదరాబాద్:** జన గణన చేస్తామని కేంద్ర ప్రభుత్వం ప్రకటిస్తున్నదే తప్ప కుల గణన ప్రస్తావన చేయడంలేదని, కుల గణన చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ రోడ్లపైకి వచ్చి యుద్ధం చేస్తామని మాజీ ఎంపి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు వి.హనుమంతరావు అన్నారు. జన గణనతో సామాన్యులకు ఒరిగేదేమీ లేదన్నారు. గాంధీభవన్‌లో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ రాహుల్, రేవంత్ రెడ్డి అగ్రకులానికి చెందిన వారైనప్పటికీ బిసిల కోసం ఆలోచిస్తున్నారని, బిసి అని చెప్పుకునే ప్రధాని మోదీ మాత్రం బిసిల కోసం ఆలోచించడం లేదన్నారు. జన గణన వల్ల బిజెపికి లాభం తప్పా బిసిలకు లాభం లేదన్నారు. కుల గణన కోసం అన్ని రాజకీయ పార్టీలు మాట్లాడాలని ఆయన కోరారు.

## బనకచర్లతో ఎగువ రాష్ట్రాలకు నష్టం లేదు

### ఎపి జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామా నాయుడు



**అమరావతి :** వృథాగా సముద్రంలోకి పోయే వరద నీటిని మాత్రమే పోలవరం బనకచర్ల ప్రాజెక్టుకు తరలిస్తామని, దీని వల్ల ఎగువ రాష్ట్రాలకు ఎటువంటి నష్టం లేదని జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు స్పష్టం చేశారు. ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర సచివాలయంలో మంగళ వారం ఆయన ఈ ప్రాజెక్టుపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఈ సందర్భంగా మంత్రి రామానాయుడు మాట్లాడుతూ గోదావరి నదికి విభజిత ఆంధ్రప్రదేశ్ చివరి రాష్ట్రమన్నారు. ఏటా గోదావరి నుంచి 3వేల టిఎంసిలు వృథాగా సముద్రంలోకి పోతున్నాయని చెప్పారు. ప్రపంచంలోనే అత్యధికంగా ఒకేసారి 50లక్షల క్యూసెక్కుల వరద నీరు ప్రవహించే అవకాశం వున్న నది గోదావరి మాత్ర మేనని పేర్కొన్నారు. పోలవరం వద్ద లభ్యమయ్యే గోదావరి వరద జలాలను మాత్రమే వాడుకుంటామని తెలిపారు. ఎక్కడా నికర జలాలను వాడడం లేదని వివరించారు. గోదావరి, కృష్ణ బోర్డుల అనుమతి లేకుండా గత కెసిఆర్ ప్రభుత్వం ప్రాజెక్టులు చేపట్ట లేదా అని ప్రశ్నించారు. ఎపి పునర్విభజన చట్టానికి విరుద్ధంగా కట్టిన ఆ ప్రాజెక్టులకు ఇప్పటికీ అపెక్స్ కౌన్సిల్ అనుమతి లేదన్నది నిజం కాదా అని నిలదీశారు. అనుమతులు లేని చాలా ప్రాజెక్టులకు టెండర్లు పిలిచి పనులు చేపట్టడం లేదా అని ప్రశ్నించారు. కాళేశ్వరం సీతారామ ప్రాజెక్టు, పాలమూరు, రంగారెడ్డి, సమ్మక్క బ్యారేజ్ మొదలైన ప్రాజెక్టులను అను మతులు లేకుండా కడుతున్నారని ఆరోపించారు. గత 50 సంవత్సరాలలో, గోదావరి నది నుండి ఏటా సరాసరి 3వేల టిఎంసిల వరద నీరు సముద్రంలో కలుస్తుందన్నారు.

**మూడు సెగ్మెంట్లుగా ప్రాజెక్ట్ :** సెగ్మెంట్ 1లో పోలవరం నుండి ప్రకాశం బ్యారేజీకి తరలింపు, సెగ్మెంట్ 2లో ప్రకాశం బ్యారేజీ నుండి 173 టీఎంసీల సామర్థ్యం ఉన్న బొల్లాపల్లి రిజర్వాయరును 6 లిఫ్టుల ద్వారా నింపడం, సెగ్మెంట్ 3లో బొల్లాపల్లి రిజర్వాయర్ నుండి 3 లిఫ్టులు, 2 టన్నెల్స్ ద్వారా బనకచర్లకు తరలింపు చేస్తామన్నారు. ఇందులో 200 టిఎంసిలు మాత్రమే రోజుకి 2.00 టిఎంసిల చొప్పున బనకచర్లకు తరలించి రాయలసీమకు వినియోగించే విధంగా ఈ ప్రాజెక్టును రూపొందించబడిందని అన్నారు. బొల్లాపల్లి కృత్రిమ జలాశయం కాదని కొండల మధ్య సహజ సిద్ధంగా ఉన్న అమరిక, రిజర్వాయరు నిర్మాణానికి అనుకూలమన్నారు.

తెలంగాణ ప్రాజెక్టులకు అప్పుడు ఇప్పుడు సిఎం చంద్రబాబు సానుకూలంగా ఉన్నారని తెలిపారు. తెలంగాణలో తగిన మదింపు లేకుండా ఎగువన ప్రాజెక్టులు కడితే నష్టపోయేది ఎపి రైతులేనన్నారు. దిగువ పరివాహక ప్రాంతాల ప్రత్యేక హక్కులు మాత్రమే చంద్రబాబు మాట్లాడారని పేర్కొన్నారు. అంతే తప్ప తెలంగాణ ప్రాజెక్టులను ఆపాలనే ప్రయత్నం కాదన్నారు. గతంలో సీతమ్మ బ్యారేజీ, సీతారాం సాగర్ లిఫ్టును కూడా తాము వ్యతిరేకించ లేదన్నారు. గోదావరి నుంచి ఇతర రివర్ బేసిన్ లకునీటిని తరలించే హక్కు చట్టం ప్రకారం తమకు ఉందని స్పష్టం చేశారు. ఆ చట్టం ప్రకారమే తెలంగాణలో కాళేశ్వరం ప్రాజెక్టును కట్టారని, ఏపీలోనూ తాము బనకచర్ల ప్రాజెక్టును చేపడుతున్నట్లు మంత్రి నిమ్మల రామానాయుడు చెప్పారు.

## తొలిగించిన ఉద్యోగులను తిరిగి విధుల్లోకి తీసుకోవాలి

### సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని విజ్ఞప్తి



**ప్రజాపక్షం /హైదరాబాద్:** తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో కళాశాలలో అకారణంగా తొలగించిన 2500 మంది పార్ట్ టైమ్ పురుష ఉద్యోగులను రాష్ట్ర ప్రభుత్వం విధుల్లోకి తీసుకునే విధంగా చొరవ తీసుకోవాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎంఎల్‌ఏ కూనంనేని సాంబశివరావుకు రాష్ట్ర సాంఘిక సంక్షేమ గురుకుల పార్ట్ టైమ్ ఉద్యోగుల సంఘం విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు సిపిఐ మహబూబాబాద్ జిల్లా కార్యదర్శి బి.విజయసారధి రెడ్డి ఆధ్వర్యంలో ఉద్యోగుల సంఘం ప్రతినిధి బృందం మంగళవారం హైదరాబాద్‌లో కూనంనేని సాంబశివరావును కలిసి వినతిపత్రం సమర్పించింది. ఈ సందర్భంగా బి.విజయసారధిరెడ్డి మాట్లాడుతూ తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాలలలో 2500లకు పైగా ఉన్న ఉద్యోగులంతా పేద పిల్లల విద్య కోసం గత 15 ఏళ్లుగా చాలీచాలని జీతాలతో రాత్రింబవళ్లు విధులను నిర్వహిస్తున్నారని, ఈ ఏడాది నుండి బాలికల పాఠశాలలలో పురుషులు ఎవరు కూడా పనిచేయరాదనే అనాలోచిత నిబంధనలతో వారందరినీ విధుల నుంచి తొలగించారని వివరించారు. ఏ గురుకులంలో ఇలాంటి నిబంధనలు లేవని, కేవలం సాంఘిక సంక్షేమ గురుకుల సొసైటీలో మాత్రమే ఈ విధమైన నిబంధనలతో తమ జీవితాలను వీధి పాలు చేశారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి తమకు న్యాయం చేయాలని కూనంనేని సాంబశివరావును వారు కోరారు. కూనంనేని సాంబశివరావును కలిసిన ప్రతినిధి బృందంలో సంఘం నాయకులు ఈశ్వరయ్య, వెంకటస్వామి, ఉప్పలయ్య, వెంకటరెడ్డి, ప్రసాద్, సురేష్, మల్లయ్య తదితరులు ఉన్నారు.

## తెగదెంపులు చేసుకోవాలి

(మొదటి పేజీ తరువాయి)

సమైక్యంగా ఇచ్చిన ఈ సందేశాన్ని తక్షణం అమలు చేయాలని వక్తలు కోరారు. గాజాలో అంతులేకుండా కొనసాగుతున్న సామూహిక హత్యాకాండను తక్షణం ఆపాలని, ఇజ్రాయెల్ తన దురాక్రమణ కట్టిపెట్టాలని, పాలస్తీనాను సైనిక చెర నుండి విముక్తి చేయాలని వక్తలు డిమాండ్ చేశారు. సిపిఐ(ఎం) ప్రధాన కార్యదర్శి ఎం.ఎ.బేబీ, సిపిఐ(ఎంఎల్) ప్రధాన కార్యదర్శి దీపాంకర్ భట్టాచార్య, ఆర్ ఎస్ పి కార్యదర్శివర్గ సభ్యుడు ఆర్.ఎస్.దాగర్, ఫార్వర్డ్ బ్లాక్ నాయకుడు హరిశంకర్, సిజిపిఐ ఢిల్లీ నాయకుడు బిర్జూ నాయక్, సిపిఐ ఢిల్లీ రాష్ట్రసమితి కార్యదర్శి దినేశ్ వర్ష్ణి, సిపిఐ(ఎం) ఢిల్లీ రాష్ట్ర కార్యదర్శి అనురాగ్ సక్సేనా, సిపిఐ(ఎంఎల్) నాయకుడు బాలాజీ కూడా ప్రదర్శనను ఉద్దేశించి ప్రసంగించారు. సిపిఐ జాతీయ కార్యదర్శివర్గం నుండి పల్లబ్ సేన్ గుప్తా (ప్రపంచ శాంతి మండలి అధ్యక్షుడు కూడా), సయ్యద్ అజీజ్ పాషా, రామకృష్ణ పాండా, అన్నీరాజా ప్రదర్శనలో పాల్గొన్నారు. సిపిఐ(ఎం) పొలిట్‌బ్యూరో నుండి నీలోత్పల్ బసు, అరుణ్‌కుమార్, ఎఐకెఎస్ ప్రధాన కార్యదర్శి ఆర్.వెంకయ్య, ఎన్ఎఫ్ఐడబ్ల్యు అధ్యక్షురాలు సయేదా హమీద్ పాల్గొన్నారు. వారితోపాటు ప్రొఫెసర్ అజయ్ పట్నాయక్, నందితా నరైన్ లతోపాటు విద్యావేత్తలు, ఇతర కార్యకర్తలు పాల్గొన్నారు.




## నిలువు దోపిడీ

(మొదటి పేజీ తరువాయి)

వ్యాపారంగా మారడంతో చదువులు ఖరీదైపోయాయి. కార్పోరేట్, ప్రైవేటు విద్యా సంస్థల వారిదే రాజ్యమైపోయింది. ప్రైవేటు విద్యాసంస్థలు నేరుగా పుస్తకాలు అమ్మడంతో పాటు నోటు బుక్స్, స్కూల్ పేర్లతో ఉండే బ్యాగులు సైతం విక్రయిస్తున్నారు. అవసరం లేని కొన్ని రకాల పుస్తకాలను వేలాది రూపాయలు పెట్టి కొనిపిస్తున్నారు. ఇదిలా ఉండగా కార్పోరేట్ పాఠశాలలు అడ్మీషన్ల పేరుతో భారీ మొత్తాల్లో వసూళ్లు చేస్తున్నారు. ఎల్‌కేజి విద్యార్థిని చేర్పించాలంటే అడ్మీషన్ ఫీజు వేళల్లోనే ఏడాది ఫీజు రూ.25 వేల పైమాటే. ఎల్‌కేజి, యుకేజి పిల్లలకే రూ.20నుండి 30వేలు వసూళ్లు చేసే ప్రైవేటు విద్యాసంస్థలున్నాయి. ఇదిలా ఉండగా 1 నుండి 5 తరగతులకు రూ.30 వేలు ఆపైన, 6 నుండి 8 తరగతుల వారికి రూ.40 వేలు ఆ పైన, 9,10 తరగతుల వారికి సుమారు రూ.50 వేల వరకు వసూళ్లు చేస్తున్నట్లు తెలుస్తోంది. వీటితో పాటు పుస్తకాలు, యూనిఫాం, తదితరాలు కలిపి తడిసిమోపెడవుతోందని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రత్యేక మెటిరీయల్ పేరిట వేలాది రూపాయాలు కాజేస్తున్నారు. వారు అందించే మెటిరీయల్ కేవలం రూ.3 నుండి 4వేలు కూడా అండవని, వాటి పేరుతో అధిక మొత్తంలో గుంజుతున్నారని తల్లిదండ్రులు వాపోతున్నారు.

**అర్హత లేని టీచర్లు**

చాలాప్రైవేటు స్కూళ్లలో అర్హతలేని ఉపాధ్యాయులతో చదువులు చెప్పిస్తున్నారు. పిల్లలకు విద్యాబోధన చేయాలంటే డిఇడి, బిఇడి తప్పకుండా చేసి ఉండాలి. కానీ చాలా వరకు ప్రైవేటు స్కూళ్లలో ఇంటర్, డిగ్రీ చదివిన వారితో మమా అనిపిస్తున్నారు. ర్యాంకుల కోసం ప్రైవేటు స్కూళ్ల వారు బట్టీ పట్టే విధానానికి తెరలేపడంతో విద్యాప్రమాణాలు నానాటికీ దిగజారిపోతున్నాయి. విద్యాశాఖకు ఉపాధ్యాయులు జాబితా సమర్పించే సమయంలో అందరూ అర్హులైన వారే ఉన్నారంటూ చెప్పుకుంటున్నారు. జిల్లాలోని కొన్ని ప్రైవేటు స్కూళ్లకు ఆట స్థలాలే లేవంటే అతిశయోక్తి కాదు. పిల్లకు చదువులతో పాటు ఆటపాటలను సైతం నేర్పించాల్సి న అవసరం ఉందని విద్యాహక్కు చట్టం మొత్తుకుంటోంది. అయినప్పటికీ సరైన ఆటస్థలాలు లేక పిల్లలు ఆడుకునే పరిస్థితి లేదు.

**ముడుపులు మోత**

ప్రైవేటు స్కూళ్లను ప్రతీ ఏటా రెన్యూవల్ చేసుకోవాల్సి ఉంటుంది. ఇందుకు కోసం సంబంధిత ప్రైవేటు పాఠశాలల వారు ఆయా మండలాల పరిధిలో విద్యాధికారికి ఫైల్ సమర్పిస్తారు. ఆదే సమయంలో బరువైన ఒక కవర్ కూడా సమర్పిస్తున్నట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సమర్పించిన ఫైల్‌లో వారు క్రూడీకరించిన అన్ని అంశాలు ఉన్నాయా లేదా, విద్యాహక్కు చట్టం ప్రకారం అన్ని వసతులు ఏర్పాటు చేశారా, విద్యార్థుల రక్షణకు, వారి మానసిక వికాసానికి బడుల్లో జాగ్రత్తలు ఏంటీ. చదువులో ఒక భాగమైన ఆటలు ఆడించేందుకు మైదానాలు ఉన్నాయా, బోధన చేసే సిబ్బంది చట్టపరంగా అర్హులా కాదా ఆనేదానిని ఒకటికి పది సార్లు సరిచూసుకుని,క్షేత్రస్థాయికి స్వీయ పరిశీలన చేయాలి. కానీ కార్యాలయాల్లో కూర్చుని సంతకాలు పెట్టేసి అనుమతిని మంజూరీ చేస్తున్నారు. దీనిని బట్టి చూస్తే విద్యాధికారులు సైతం విద్యావ్యవస్థను నాశనం చేసే దిశలోనే పయణిస్తున్నట్లు తేటతెల్లమవుతోంది. బడులు తెరిస్తే విద్యార్థుల తల్లిదండ్రులకే ఆర్థిక భారం తప్పా, ఇటు ప్రైవేటు యాజమాన్యాలకు, ఇటు అనుమతులు ఇచ్చే వారికి కాసుల పంటే అంటూ పుకార్లు వినవస్తున్నాయి.

## నిజమైన ముగింపు కావాలి

(మొదటి పేజీ తరువాయి)

సంబంధించి నిజమైన ముగింపును తాను కోరుకుంటున్నానని చెప్పారు. ఇరాన్‌తో సంభాషణలకు ఇష్టపడటంలేదన్నారు. టెహ్రాన్‌లో తమ విద్యార్థులకు, పౌరులకు రక్షణ కరువైందంటూ చైనా,భారత్‌లు వారిని దేశం వదిలి సురక్షిత ప్రాంతాలకు వెళ్ళమని కోరుతున్నాయి. కానీ ట్రంప్ ఇలాంటి ప్రత్యేక కారణమేదీ చెప్పకుండా అందరూ టెహ్రాన్ వదిలివెళ్ళిపోవాలంటూ ఆన్‌లైన్‌లె పోస్టింగ్ పెట్టారు. మధ్యాప్రాచ్యంలో పరిస్థితులు విషమిస్తున్నందువల్లనే ట్రంప్ కెనడా జి–7 సదస్సు పర్యటనను కుదించుకున్నారని అమెరికా మీడియా ప్రకటించింది. ''నేను సంతకం పెట్టమన్న ఒప్పందంపై ఇరాన్ సంతకం పెట్టి ఉంటే బాగుండేది, కానీ ఇరాన్ అలా చేయలేదు, సమ్మతించలేదు, ఇప్పుడు ఇరాన్‌తో సంప్రదింపులు చేయడానికి నాకు ''మూడ్'' లేదు, ఏ విధంగా చూసినా ఇరాన్‌తో సంప్రదింపులకు అందుబాటులో ఉండలేను '' అని ట్రంప్ తన పోస్టింగ్‌లో పేర్కొన్నారు. అదేసమయంలో ఆయన మరో విషయం కూడా చెప్పారు. ఇరాన్ విదేశాంగమంత్రి అబ్బాస్ అరాఘ్చితో సంప్రదింపులు చేయడానికి, ఒప్పందంపై ఒప్పించేందుకు మధ్యప్రాచ్యానికి తన ప్రత్యేకదూత విట్‌కాఫ్, అమెరికా ఉపాధ్యక్షుడు జె.డి.వాన్స్‌లను పంపించాలని ఆలోచిస్తున్నానని పోస్టింగ్‌లో పేర్కొన్నారు. ఒప్పందం ప్రకారం ఇరాన్ వద్ద అణ్వాయుధాలు ఉండకూడదు, నేను పదే పదే ఈ విషయం ఇరాన్‌కు చెప్పాను'' అని పేర్కొన్నారు. ఇదిలా ఉండగా మధ్యప్రాచ్యంలో పరిస్థితులపై ట్రంప్‌తోపాటు జాతీయ భద్రతా అధికారితో సమీక్షించేందుకు అమెరికా రక్షణమంత్రి పీటర్ హెగ్సెత్ సిట్యుయేషన్ రూమ్‌కు వెళ్ళారు. గడచిన ఆదివారం అంటే జూన్ 15వ తేదీన మస్కట్‌లో నిర్ణీత ప్రకారం అమెరికా–ఇరాన్ మధ్య అణుఒప్పందానికి సంబంధించి ఆరో విడత పరోక్ష చర్చలు జరగాల్సి ఉండగా, దీనికి 48 గంటలు ముందే ఇరాన్‌పై ఇజ్రాయెల్ మెరుపు దాడులు చేయడంతో చర్చలు రద్దయ్యాయి.

**ఖమేనీని చంపాలన్న నేతన్యాహూ ప్రకటనే కారణమా?**

ఇరాన్ సర్వాధినేత ఆయెతుల్లా అలీ ఖమేనీని హత్యచేసినప్పుడే శాంతి ఏర్పడుతుందని, యుద్ధం ఆగిపోతుందని ఇజ్రాయెల్ ప్రధానమంత్రి నేతన్యాహూ ఎబిసి న్యూస్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో చెప్పిన విషయం సంచలనాత్మకంగా మారింది. ''మేం ఇరాన్‌లో యుద్ధాన్ని పెద్దదిచేసి విస్తరించడంలేదు, మేం ఇరాన్‌లో యుద్ధాన్ని ముగించేందుకు వెళుతున్నాం'' అని నేతన్యాహూ ప్రకటన తర్వాత ట్రంప్ హుటాహుటిన జి–7 సదస్సును వదిలిపెట్టి వాషింగ్టన్‌కు చేరుకున్నారు. ఖమేనీని హతమార్చేందుకు నేతన్యాహూ చేసిన ప్రణాళికను ట్రంప్ తిరస్కరించారని, దీనివల్ల యుద్ధం మరింత తీవ్ర ప్రమాదస్థితికి చేరుతుందని ట్రంప్ వ్యతిరేకత వ్యక్తం చేశారనీ వార్తలు వెలువడ్డాయి. మరోవైపు ఖమేనీ కూడా అండర్‌గ్రౌండ్‌లోకి వెళ్ళారని పాశ్చాత్యమీడియా ప్రకటించింది. ఐతే ఇమ్మాన్యుయేల్ మేక్రాన్ ఒక ప్రకటన చేస్తూ ట్రంప్ జి–7 నుండి బయలుదేరి వెళ్ళేటప్పుడు ఇరాన్ యుద్ధ పరిష్కారం గురించి సానుకూల సంకేతాలిచ్చారన్నారు. నిజంగా అలా జరిగితే ఒక ఒప్పందం కుదిరితే అదెంతో మంచి విషయమన్నారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at D.No 1- 6-75, Suravaram Venkataram Reddy Bhavan, Subhashnagar, Mahabubnagar - 509001, Telangana State, RNI TELTEL /2018/76758 **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com